

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 49

శనివారం 11-5-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మదర్స్ డే ప్రత్యేక ఆఫరు కలదు!
ఉచితం 1 టన్ను ఏసి రూ. 49,999/-* ఫర్నిచరు కొనుగోలుపై
ఉచితం 42" టివి రూ. 39,999/-* ఫర్నిచరు కొనుగోలుపై
అక్షయ తృతీయ ప్రత్యేక ఆఫర్లు
గోల్డ్ & సిల్వర్ కాయిన్లు తప్పనిసరిగా పొందండి
లోన్ & ఎక్ఛేంజ్ మేళా
10 శుక్ర, 11 శని మరియు 12 ఆదివారం
₹1 డౌన్ పేమెంట్
50 50 నెలల ఇఎంఐ
వరకు 60 % తగ్గింపు
వరకు 20 % తగ్గింపు ఎక్ఛేంజ్‌పై
సిబిల్ గురించి కంగారు వద్దు 600 సిబిల్ స్కోర్‌తో లోన్స్ / ఇఎంఐ
3+2 MRP ₹1,51,999 ₹69,999
3+2+1 MRP ₹1,89,999 ₹79,999
3+1+1 MRP ₹45,999 ₹21,999
3+2+1 దివాన్ MRP ₹59,499 ₹28,999
MRP ₹83,499 ₹42,999
MRP ₹67,499 ₹33,999
MRP ₹1,52,499 ₹69,999
MRP ₹82,999 ₹39,999
MRP ₹82,499 ₹39,999
MRP ₹2,16,999 ₹89,999
MRP ₹52,499 ₹23,999
MRP ₹66,499 ₹29,999
MRP ₹38,999 ₹15,999
MRP ₹54,499 ₹21,999
MRP ₹61,490 ₹29,999
MRP ₹82,999 ₹39,999
MRP ₹54,999 ₹26,999
MRP ₹38,499 ₹16,999
MRP ₹42,499 ₹18,999
MRP ₹43,999 ₹19,999
₹17,999
₹19,999
₹21,999
₹22,999
MRP ₹26,999 ₹11,999
MRP ₹15,999 ₹6,999
MRP ₹27,449 ₹10,999
MRP ₹39,990 ₹15,999
MRP ₹54,990 ₹21,999
MRP ₹19,499 ₹8,999
MRP ₹11,499 ₹4,999
MRP ₹15,499 ₹6,999
MRP ₹7,499 ₹3,999
MRP ₹9,499 ₹4999
MRP ₹10,999 ₹5999
MRP ₹7,499 ₹2,999
MRP ₹8,999 ₹3,999
GIFT TO MOM
79950 00930
040-27841562
79933 33351
An ISO-9001:2015 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
కార్పొరేట్ బుకింగ్స్ లేదా బల్క్ ఆర్డర్స్ కోసం ఇ-మెయిల్ చేయండి enquiry@bantia.in
www.bantia.in

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 49
శనివారం 11-5-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



కేజ్రీవాల్‌కు 'ప్రచార' బెయిల్

జూన్ 1 వరకూ బెయిల్.. 2న తిరిగి లొంగిపోవాలన్న సుప్రీంకోర్టు. - 6లో



రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు

ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వానలు కురిసే అవకాశం. - 3లో



అయ్యర్ వీడియో కలకలం..

'మన అణుబాంబును లాహోర్‌లో పేలిస్తే తిరిగి దాని రేడియోధార్మిక ప్రభావం 8 సెకన్లలోనే అమృత్‌సర్‌పై పడుతుంది' అని అయ్యర్ అన్నారు. - వివరాలు 6లో



జీన్స్, టీషర్ట్స్ వేసుకు రావొద్దు

ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఇక నుంచి జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు ధరించి విధులకు హాజరు కావొద్దని సంస్థ ఎండీ ఆదేశించారు. - వివరాలు 5లో

హిందువుల విభజనే కాంగ్రెస్ రణనీతి

ఓటు బ్యాంకును సంతోషపరచడంపైనే ఆ పార్టీ దృష్టి • ప్రధాని మోదీ ఫైర్

బీసీల రిజర్వేషన్లు ముస్లింలకు కట్టబెట్టే మోడల్‌ను దేశవ్యాప్తం చేయాలని చూస్తోంది

- నేడు భారత్ డిజిటల్ పవర్.. ఫిన్‌టెక్ పవర్.. స్టార్టప్ పవర్.. స్పేస్ పవర్
- ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ.. ఇది నా ట్రాక్ రికార్డ్
- లూటీ, లూటీ, లూటీ.. దోచుకోవడమే కాంగ్రెస్ ట్రాక్ రికార్డ్
- తెలంగాణకిచ్చిన రూ.లక్షల కోట్లు అవినీతి ఏటీఎంలోకి వెళ్లాయి
- నాడు బీఆర్ఎస్ చేసిన పనే నేడు కాంగ్రెస్ కూడా చేస్తోంది
- డబుల్ ఆర్‌కు మరో ఆర్.. రజాకార్ ట్యాక్స్ కూడా తోడైంది
- తెలంగాణ మూడ్ అంతా బీజేపీనే గెలిపిద్దాం అన్నట్టుగా ఉంది
- పాత రికార్డులు బద్ధలు కొట్టి 17కు 17 సీట్లలో గెలిపించబోతోందంటూ ధీమా.. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియం, నారాయణపేట సభల్లో మోదీ ప్రసంగం



హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మోదీ

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వెనుకబడిన వర్గాలకు దక్కాల్సిన రిజర్వేషన్లను లాక్కొని ముస్లింలకు కట్టబెట్టే మోడల్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. హిందువులను విభజించి తమ ఓటుబ్యాంక్‌ను సంతోషపరచడమే కాంగ్రెస్ రణనీతి అని ధ్వజమెత్తారు. తెలంగాణలోని జీహెచ్ఎంసీలో బీసీలకు దక్కాల్సిన మెజారిటీ సీట్లను మత రిజర్వేషన్ల పేరిట ముస్లింలకు కట్టబెట్టినట్టుగానే దేశమంతా చేయాలని కాంగ్రెస్ యోచిస్తోందని, ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను లాక్కొని మత ప్రాతిపదికన ముస్లింలకు ఇవ్వాలని రాహుల్‌గాంధీ చూస్తున్నారని విమర్శించారు. దీనికి ఇండియా కూటమికి చెందిన బెయిల్‌పై ఉన్న నేత (లాలూప్రసాద్ యాదవ్).. ముస్లింలకు రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో ఇవ్వాల్సిందేనంటూ వంతపాడుతున్నారని మండిపడ్డారు. 'ఎస్సీ, ఎస్టీ,

మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్, బీఆర్ఎస్ నక్కో అంటున్నారు..

'తెలంగాణ మూడ్ అంతా కాంగ్రెస్ నక్కో, బీఆర్ఎస్ నక్కో, ఎంఐఎం నక్కో.. బీజేపీ కో ఇచ్ ఓట్ దియెంగే.. జితాయేంగే (కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం వద్దు.. బీజేపీనే గెలిపిద్దాం)' అన్నట్టుగా ఉంది. (ఈ వాక్యాన్ని హైదరాబాదీ ఉర్దూ యాసలో పలికారు) తెలంగాణ వ్యాప్తంగా నేను జరిపిన పర్యటనల్లో ఇదే స్పష్టమైన విప్లవం కనిపిస్తోంది. తెలంగాణలో వచ్చే ఫలితాలు దేశవ్యాప్తంగా ఉత్సాహాన్ని తీసుకురాబోతున్నాయి. జూన్ 4న వెలువడే ఫలితాలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. 4న దేశం విజయం సాధిస్తుంది. 140 కోట్ల మంది ప్రజల సంకల్పం గెలుస్తుంది. భారత్ విరోధులు పరాజయం పాలవుతారు. ఆత్మనిర్భర్, సీఏఏ, యూసీసీ విరోధులు, ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించేవారు, అవినీతి, సంతుష్టీకరణ రాజకీయాలు నమ్మేవారు ఓడిపోతారు..' అని మోదీ అన్నారు.



బీజేపీ వైపే ప్రజలు

- వారి మూడ్ పార్టీకి, మోదీకి పూర్తి అనుకూలంగా కన్పిస్తోంది
- రాష్ట్రంలో 10 నుంచి 12 సీట్లలో గెలవబోతున్నాం
- కరీంనగర్‌లో నా గెలుపు కూడా పక్కా
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఓ ప్లాన్ ప్రకారం మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయి
- ప్రజల దృష్టిని మళ్లించేందుకే రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు ప్రచారం
- 'సాక్షి'తో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

- వివరాలు 4లో

బీజేపీ కేన్సర్ లాంటిది

- రాష్ట్రంలోనికి దాన్ని ఎంతమాత్రం అనుమతించకూడదు
- భావోద్వేగాలను రెచ్చగొట్టే పార్టీకి తెలంగాణలో చోటు లేదు
- రాజ్యాంగ మార్పు, రిజర్వేషన్లకు కోతే బీజేపీ ఎజెండా
- ఆ పార్టీని నిలువరించే శక్తి ఒక్క కాంగ్రెస్‌కే ఉంది
- 'మీట్ ద ప్రెస్'లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ కేన్సర్ లాంటిదని, దాన్ని రాష్ట్రంలోనికి ఎంతమాత్రం అనుమతించకూడదని సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆత్మబలిదానాలతో ఏర్పడ్డ తెలంగాణలో బీజేపీలాంటి భావోద్వేగాలను రెచ్చగొట్టే పార్టీకి చోటు లేదన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యాచరణ అమలుకే బీజేపీ పని చేస్తోందని ధ్వజమెత్తారు. రాజ్యాంగ మార్పు, రిజర్వేషన్లకు కోతే బీజేపీ ఎజెండా అని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 'మీట్ ద ప్రెస్' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

బీజేపీ మతాల పేరుతో చీలుస్తోంది

'ఎన్నికల్లో ఓడి బలహీనపడ్డ బీఆర్ఎస్ నిస్సహాయతతోనో, వ్యూహాత్మకమో తెలియదు గానీ.. బీజేపీకి రాష్ట్రాన్ని అప్పగించే ప్రయత్నం చేస్తోంది. ప్రమాదకరమైన భావజాలం గల బీజేపీని నిలువరించగల శక్తి ఒక్క కాంగ్రెస్‌కే ఉంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రతలు సరిగా లేవని పెట్టుబడులు రావడం లేదు. మరోవైపు హైదరాబాద్ అభివృద్ధి జరుగుతోంది. అందుకే పెట్టుబడులు వస్తున్నాయి. దేశంలోనే విశ్వనగరంగా పేరు తెచ్చుకుంది. పొరపాటున బీజేపీ చేతుల్లోకి అధికారం పోతే, నిట్ట నిలువునా మతాల పేరుతో

మిగతా 11వ పేజీలో ▶



'మీట్ ద ప్రెస్'లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నా గడ్డపైకొచ్చి, నన్నే అవమానిస్తావా?

- అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా.. లేదంటే ప్రజలకు మీరు క్షమాపణ చెబుతారా?
- ప్రధాని మోదీపై సీఎం రేవంత్ విసుర్లు
- మక్తల్, షాద్‌నగర్, బేగంబజార్‌లో ప్రచారం

- వివరాలు 11లో



వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాన్'ను ప్రజలకు చూపిస్తున్న సీఎం జగన్



శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన ఏపీ సీఎం జగన్ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం





జననేత, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవితంలోని వివిధ ఘట్టాలను ఆవిష్కరిస్తున్న భారీ కాన్వాస్‌పై రూపుదిద్దుకున్న అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్. (ఇన్‌సెట్‌లో) చిత్రకారుడు కందునూరి వెంకటేశ్

గ్రామ స్వరాజ్యం నుంచి సమసమాజం వరకు..

ఏపీ సీఎం వైఎస్ జగన్ వ్యక్తిగత, రాజకీయ జీవితం, పాలనపై అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్

జననేత జీవితాన్ని ఆవిష్కరించిన చిత్రరాజం

రెండు నెలలపాటు శ్రమించి రూపొందించిన ప్రముఖ చిత్రకారుడు కందునూరి వెంకటేశ్

పగిడిపాల ఆంజనేయులు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత, రాజకీయ జీవితాన్ని ఆవిష్కరిస్తూ మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట కొమ్ములవంచకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కందునూరి వెంకటేశ్ గీసిన అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ విశేషంగా ఆకట్టుకుంటోంది. వైఎస్ జగన్ బాల్యం, విద్యాభ్యాసం మొదలు వివాహం, వ్యాపారం, రాజకీయ ప్రస్థానం దాకా... తండ్రి వైఎస్సార్ అకాల మరణం మొదలుకొని నాటి ప్రభుత్వం అక్రమ కేసులు మోపడం, ఓదార్పు యాత్ర, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపన, సీఎంగా ఏపీని అభివృద్ధి, సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దిన తీరు వరకు అనేక అంశాలను ఒకే చిత్రంలో వెంకటేశ్ ఆవిష్కరించారు.

జగన్ పాలనను చిత్రిక పట్టి..

ఐదున్నర అడుగుల పొడవు, ఐదున్నర అడుగుల వెడల్పు ఉండే కాన్వాస్‌పై సుమారు 2 నెలలపాటు ఆయిల్ కలర్స్‌తో ఈ అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్‌కు వెంకటేశ్ ప్రాణప్రతిష్ట చేశారు. 'ధర్మాన్ని ఆచరించేవాళ్ల భయాన్ని ఎరుగరు. ధర్మమే ధైర్యంగా జగన్ పరిపాలిస్తున్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల ఆశయాలను, కలలను సాకారం చేసిన జననేత స్ఫూర్తిదాయక జీవితాన్ని ఆవిష్కరిస్తూ అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ గీయడం నాకు లభించిన గొప్ప అవకాశంగా భావిస్తా' అని వెంకటేశ్ చెప్పారు. గ్రామ స్వరాజ్యం నుంచి సమసమాజం దిశగా రాష్ట్రాన్ని నడిపించడమే ధ్యేయంగా సాగుతున్న వైఎస్ జగన్ పరిపాలనకు చిత్రిక పట్టినట్లు చెప్పారు.

సచివాలయ పల్లకీ.. సంక్షేమ బోయలు

'రాజకీయ రంగంలో మాట తప్పడం, మడమ తిప్పడం సహజంగా కనిస్తాయి. కానీ వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ ఫలాలను సామాన్యుల దరికి చేర్చారు. అందుకే ఈ చిత్రంలో గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా సచివాలయం అనే పల్లకీని మోసేందుకు సంక్షేమ పథకాల బోయలను ఏర్పాటు చేశా. ఈ ఫలాలను ప్రతి కుటుంబానికి చేరుస్తున్న వాలంటీర్లను పథకాలకు కాపలాగా ఉన్న సైనికుడికి ప్రతీకగా పెట్టా. గాంధీ మహాత్ముడి అడుగు జాడల్లో నడుస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించినట్లుగా సమసమాజం దిశగా ఆయన ముందుకు సాగుతున్నారు' అని వెంకటేశ్ చెప్పారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి జగన్ అందిస్తున్న పథకాల స్ఫూర్తితో..

'వై.ఎస్. జగన్ జీవితాన్ని ఆవిష్కరిస్తూ గీసిన చిత్రం నాకు ఎంతో ప్రత్యేకమైంది. ఎందుకంటే నేను ఒక అణగారిన వర్గానికి చెందిన వ్యక్తిని. ముఖ్యమంత్రిగా జగన్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న పథకాలు నేను ఈ చిత్రం గీసేందుకు స్ఫూర్తినిచ్చాయి.' అని సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టిస్ట్ వెంకటేశ్ జేఎన్‌టీయూలో ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మొదలుకొని వివిధ రంగాలకు చెందిన ఎందరో ప్రముఖుల చిత్రాలను గీశారు. అగ్ర హీరోలు అమితాబచ్చన్, రజనీ కాంత్, ప్రభాస్ వంటి వారి నుంచి ప్రశంసలు అందుకున్నారు. అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌లో జాతీయ స్థాయి గుర్తింపు పొందారు.

బాబు బార్ కోడ్ కుట్ర

'వుయ్' యాప్ పేరుతో ఎన్నికల అక్రమాలకు బరితెగింపు

రూ.20 వేల కోట్లతో ఓట్ల కొనుగోలుకు సిద్ధం

- అధికారంలో ఉండగా ప్రజా సాధికార సర్వే పేరుతో డేటా చౌర్యం
- ఇప్పుడు 'వుయ్' యాప్‌లో ఓటర్ల సమగ్ర సమాచారం.. ఓటర్ల స్లిప్పులతో ప్రత్యేక బార్‌కోడ్ ఉన్న కరపత్రాల పంపిణీ
- బార్‌కోడ్ స్కాన్ చేయగానే హైదరాబాద్ నుంచి డిజిటల్ చెల్లింపులు.. ఓటరుకు రూ.5 వేలు చెల్లిస్తున్నట్టు సమాచారం
- ఇందుకోసం మూడంచెల వ్యవస్థ ఏర్పాటు
- బూత్ కమిటీల ద్వారా ఇంటింటా స్లిప్పుల పంపిణీ.. దీని పర్యవేక్షణ, బార్‌కోడ్ స్కాన్‌కు మరో బృందం
- మొత్తం పర్యవేక్షణకు హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్.. నియోజకవర్గానికి రూ.87.50 కోట్ల చొప్పున డిజిటల్ చెల్లింపులు
- మూడంచెల వ్యవస్థలకు అదనపు చెల్లింపులు
- మాచర్ల, మైలవరం, ఒంగోలులో బయటపడ్డ వ్యవహారం.. చర్యలు తీసుకోవాలని ఈసీకి, డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

తారస్థాయికి టీడీపీ ఫేక్ ప్రచారం

తన పేరిట జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించిన చిరంజీవి

సాక్షి, అమరావతి: ఎన్నికల పోలింగ్ డే దగ్గరపడుతున్న కొద్దీ టీడీపీ ఫేక్ ప్రచారం తారస్థాయికి చేరుతోంది. మేం గెలిస్తే మీకు ఫలానా మేలు చేస్తామని ప్రజలకు చెప్పి, వారి నమ్మకం చూరగొనే సత్తాలేక కేవలం తప్పుడు ప్రచారాలపైనే ఆ పార్టీ ఆధార పడింది. ఇందుకు వారుచేస్తున్న తప్పుడు ప్రచారాలే నిదర్శనంగా ఉంటున్నాయి. ఈ క్రమంలో సినీనటుడు చిరంజీవితోపాటు అక్కినేని నాగార్జున, మరికొందరు నటులు, డైరెక్టర్లు, ఇతర ప్రముఖులు వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా మాట్లాడినట్టు వారి పేరిట సోషల్ మీడియాలో టీడీపీ ప్రచారం మొదలుపెట్టింది. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ ఇతర సామాజిక మాధ్యమాల్లో వీటిని టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు పోస్టుచేయడంతో పాటు ఇతరులకు షేర్ చేస్తున్నారు. తన పేరిట జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని చిరంజీవి ఖండించారు. ఆయన ఒక టీవీ చానల్‌తో మాట్లాడుతూ.. తాను రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని, తానెక్కడా రాజకీయంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఈ క్రమంలో టీడీపీ చేసిన తప్పుడు ప్రచారాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. గత ఐదేళ్లలో ప్రజల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఎదుర్కోలేకనే టీడీపీ ఇలా తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడుతున్నారు. టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారంపై వైఎస్సార్‌సీపీతో పాటు పలువురు ఈసీకి, పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.



జిల్లా జడ్జి నియామకాల్లో వర్టికల్ రిజర్వేషన్లు !

- 9 జిల్లా జడ్జి పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి
- మహిళలకు నాలుగు పోస్టులు రిజర్వు చేస్తూ సీఎస్ నోటిఫికేషన్
- ఈనెల 14 నుంచి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: జిల్లా జడ్జి పోస్టుల నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడింది. 9 జిల్లా జడ్జి పోస్టు (ఎంట్రీ లెవల్)లను వర్టికల్ పద్ధతిలో నియమించేందుకు చర్యలు మొదలుపెట్టింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వగా, పూర్తిస్థాయి(డిటెయిల్డ్) నోటిఫికేషన్ ఈనెల 14వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 9 ఉద్యోగాలకు సంబంధించి రోస్టర్ పాయింట్లను ప్రకటించింది. అయితే ఈ రోస్టర్ వర్టికల్ రిజర్వేషన్ల పద్ధతిలో ఉండడం గమనార్హం. రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. కానీ తాజాగా జిల్లాజడ్జి పోస్టుల భర్తీలో వర్టికల్ రిజర్వేషన్ విధానం ఉండడంతో అయోమయం నెలకొంది. జిల్లా జడ్జి పోస్టుల భర్తీలో భాగంగా ఈనెల 14వ తేదీ నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించనున్నట్టు అందులో వివరించారు. మే 13వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ పూర్తవుతుందని, ఈ ఏడాది ఆగస్టు 24, 25 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు ప్రాథమికంగా ప్రకటించారు. అయితే 9 జిల్లా జడ్జి పోస్టుల్లో మహిళలకు నాలుగు పోస్టులు రిజర్వు చేసింది. ఖాళీ పోస్టులు, రోస్టర్ పాయింట్ల వారీగా ఎలా ఉంటుందో ప్రభుత్వం వెల్లడించింది.

చంద్రబాబు–షర్మిల మిలాఖత్

- టీడీపీ–బీజేపీ–జనసేన కూటమికి ప్రయోజనం చేకూర్చేలా ఆమె ప్రచారం
- సీఎం జగన్‌పై చంద్రబాబు గ్యాంగ్ చిమ్ముతున్న విషాన్నే వెదజల్లుతున్న పీసీసీ చీఫ్
- చంద్రబాబు సూచించిన మేరకే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక
- ప్రతిఫలంగా కడప లోక్‌సభ స్థానంలో షర్మిలకు టీడీపీ–బీజేపీ ఓట్లు బదలాయించేలా లోపాయికారి ఒప్పందం
- అందులో భాగంగానే అక్కడ డమ్మీ అభ్యర్థిని బరిలోకి దించిన బాబు
- చింతలపూడిలోనూ మిలాఖత్.. టీడీపీ అభ్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి చెట్టాపట్టాల్
- కుప్పం, మంగళగిరి, పిఠాపురం నియోజకవర్గాల వైపు కన్నెత్తి కూడా చూడని షర్మిల

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోవడానికి బెంబేలెత్తిపోయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన, బీజేపీలతో జతకట్టి.. చివరికి పీసీసీ చీఫ్ షర్మిలతోనూ మిలాఖత్ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేసి, తాను సూచించిన అభ్యర్థులను కాంగ్రెస్ తరఫున బరిలోకి దించేలా బాబు స్కెచ్ వేశారు. ఇందుకు ప్రతిఫలంగా కడప లోక్‌సభ స్థానంలో షర్మిలకు టీడీపీ–బీజేపీ ఓట్లు బదలాయించేలా వారిద్దరి మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరింది. కడప లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా సీనియర్ నేతలు ఆర్. శ్రీనివాసులురెడ్డి, మల్లెల లింగారెడ్డి వంటి వారిని కాదని ఎవరికీ పెద్దగా తెలియని భూపేష్‌రెడ్డిని చంద్రబాబు బరిలోకి దించారు. నిజానికి.. భూపేష్‌రెడ్డి చిన్నాన్న ఆదినారాయణరెడ్డి అదే లోక్‌సభ స్థానం పరిధిలోని జమ్ములమడుగు అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తుండటం గమనార్హం. ముందస్తుగా కుదిరిన లోపాయికారి ఒప్పందం మేరకు కడప లోక్‌సభ అభ్యర్థిగా డమ్మీని బరిలోకి దించిన చంద్రబాబు.. ఇప్పుడు షర్మిలకు టీడీపీ–బీజేపీ ఓట్లను బదలాయించేలా కూటమి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు–షర్మిల మధ్య కుదిరిన ఈ రహస్య ఒప్పందం చింతలపూడి నియోజకవర్గంలోనూ ప్రతిబింబిస్తోంది. ఇక్కడ టీడీపీ అభ్యర్థి రోషన్, కాంగ్రెస్ అభ్యర్థి ఎలీజా ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని ప్రచారం చేస్తుండటమే అందుకు నిదర్శనం.



దారితప్పిన బాటసారి..

నిజానికి..తెలంగాణలో రాజకీయ శూన్యత లేకపోయినా వాస్తవాన్ని అంచనా వేయలేక.. రాజకీయంగా తనను తాను ఎక్కువగా ఊహించుకుని 2021, జూలై 8న వైఎస్సార్‌టీపీని షర్మిల స్థాపించారు. అదే సమయంలో.. షర్మిల, ఆమె భర్త అనిల్ వ్యక్తిత్వాలను హననం చేస్తూ గతంలో దుష్ప్రచారం చేసిన ఎల్లో మీడియా ఆమెకు అనుకూలంగా కథనాలు వండివార్చడం మొదలుపెట్టింది. వైఎస్సార్‌టీపీ స్థాపించడానికి కాస్త ముందు ఇడుపులపాయలో, పులివెందులలో ఏవేవో జరిగిపోతున్నట్లుగా ఎల్లో మీడియా రాసిన విషపు రాతలను షర్మిల ఖండించలేదు. ఈ పరిణామాలన్నీ పరిశీలిస్తే.. షర్మిల ఎల్లో మీడియాతోపాటు చంద్రబాబు డైరెక్షన్‌లోనే రాజకీయ ప్రయాణం మొదలైందని అప్పట్లో రాజకీయ పరిశీలకులు విశ్లేషించారు. 'తెలంగాణలోనే నా బతుకు.. చావు ఇక్కడే'.. అంటూ వైఎస్సార్‌టీపీ స్థాపించినప్పుడు శపథం చేసిన షర్మిల.. తాను పాలేరు, మరోచోట పోటీచేస్తానని.. మొత్తం 119 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించుతానని ప్రకటించారు. పైగా.. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటో పెట్టుకుని ఓట్లు అడగడానికి కాంగ్రెస్ నాయకులకు సిగ్గుండాలి' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీన్ కట్‌చేస్తే.. గతేడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే చంద్రబాబు డైరెక్షన్‌లో కాంగ్రెస్ పార్టీకి షర్మిల బేషరతుగా మద్దతు ప్రకటించారు. ఆ తర్వాత ఆయన ఆదేశాలతోనే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనంచేసి ఆమె ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ పదవిని దక్కించుకున్నారు.

'పచ్చ'మూక విషాన్నే వెదజల్లుతున్న షర్మిల..

ఇక పీసీసీ చీఫ్ పదవి దక్కించుకున్నాక.. హైదరాబాద్ నుంచి కడపకు.. కడప నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు చంద్రబాబు బినామీ సీఎం రమేష్ (ప్రస్తుత అనకాపల్లి బీజేపీ అభ్యర్థి) స్పెషల్ ఫ్లైట్లను షర్మిల వినియోగించుకున్నారు. షర్మిల భర్త అనిల్ అయితే ఏకంగా వైఎస్ రాజకీయ శత్రువులైన బీటెక్ రవి వంటి వారితో చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. మరోవైపు.. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ఇప్పటివరకు సీఎం జగన్‌పై చంద్రబాబు, పచ్చమూక చిమ్ముతున్న విషాన్నే షర్మిల కూడా వెదజల్లుతూ వస్తున్నారు. అలాగే, పొత్తులో భాగంగా సీపీఐ, సీపీఎంకు కేటాయించిన స్థానాలు మినహా మిగిలిన స్థానాల్లో చంద్రబాబు సూచించిన మేరకే షర్మిల అభ్యర్థులను ఎంపిక చేశారు. వైఎస్సార్‌సీపీ ఓట్లను చీల్చి.. టీడీపీ–బీజేపీ–జనసేన కూటమికి లబ్ధిచేకూర్చేందుకు సీఎం జగన్‌పై విషం చిమ్ముతూ రాష్ట్రవ్యాప్తంగా షర్మిల ప్రచారం చేశారు. కానీ, చంద్రబాబు పోటీచేస్తున్న కుప్పం, లోకేశ్ బరిలోకి దిగిన మంగళగిరి, పవన్ పోటీచేస్తున్న పిఠాపురంలలో అభ్యర్థులను బరిలోకి దించినా వారి తరఫున షర్మిల ప్రచారానికి వెళ్లకపోవడం కొసమెరుపు.

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 49

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



సిరిసిల్ల రోడ్ షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

మోదీ చలవే

చేనేతలపై జీఎస్టీ

బీజేపీ ఎజెండాలో కార్పొరేట్లే తప్ప పేదలుండరు: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- వేములవాడకు వచ్చిన ప్రధాని ఒక్క రూపాయి అయినా ఇస్తామని చెప్పలేదు
- బీజేపీ మళ్లీ గెలిస్తే ఆ పార్టీకి 400 సీట్లు రావడం కాదు.. పెట్రోల్ లీటర్ రూ. 400 అవుతుంది
- కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపి గద్దెనెక్కి హామీలను విస్మరించింది
- సీఎం సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలను రద్దు చేస్తానంటున్నాడు..

9లో

అబద్ధాల మోదీ..

- ఇప్పటివరకు ఇలాంటి ప్రధానిని చూసి ఉండరు
- తెలంగాణలో బీజేపీ ఏ అభివృద్ధీ చేయలేదు
- ప్రజలను విడదీసి లబ్ధి పొందాలని చూస్తున్నారు
- ఇప్పటికే తెలంగాణలో కొన్ని హామీలు అమలు చేశాం
- ఎన్నికల కోడ్ తర్వాత మిగతావి ప్రారంభిస్తాం
- మీడియా భేటీలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జునఖర్గే

- వివరాలు 4లో



నేటితో ప్రచారం బంద్

- సాయంత్రం 6 గంటలకు పార్టీల క్యాంపెయినింగ్‌కు తెర
- ఇంటింటి ప్రచారంపైనా నిషేధం.. దృశ్యరూపక ప్రకటనలకూ వీల్లేదు
- సోమవారం 17 లోక్‌సభ స్థానాలకు పోలింగ్.. కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం ఉపఎన్నికకు కూడా..

- వివరాలు 9లో


ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన సభకు హాజరైన బీజేపీ శ్రేణులు




నారాయణపేటలో జరిగిన సభలో అభివాదం చేస్తున్న మోదీ. చిత్రంలో డీకే అరుణ... సభకు హాజరైన ప్రజలు

ఓటర్ల మూడ్ ఎలా ఉంది!
ఎంపీ అభ్యర్థులను అడిగి తెలుసుకున్న ప్రధాని మోదీ

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో ఓటర్ల మూడ్ ఎలా ఉంది. ప్రచారానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన ఎలా ఉంది. పార్టీకి వివిధ వర్గాల మద్దతు ఎలా ఉంది'అంటూ బీజేపీ ఎంపీ అభ్యర్థులను ప్రధాని మోదీ ఆరా తీసినట్టు పార్టీవర్గాల సమాచారం. ఎల్‌బీస్టేడియంలో సభ ప్రారంభానికి ముందు సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థులు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, కొండావిశ్వేశ్వర్ రెడ్డి, సీనియర్‌నేత డా.కె.లక్ష్మణ్, తదితరులతో ఆయా అంశాలపై మోదీ మాట్లాడారు. ఆ తర్వాత సభ జరిగే సమయంలో మరో ఇద్దరు ఎంపీ అభ్యర్థులు మాధవీలత, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌తో విడివిడిగా మాట్లాడారు.

సభ విజయవంతంపై హ్యాపీ

ఎల్‌బీస్టేడియంలో జరిగిన బహిరంగసభకు పెద్దసంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనడం, మోదీ ప్రసంగానికి సభికుల్లో మంచి స్పందన వ్యక్తం కావడం పట్ల బీజేపీ నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం ముగియడానికి ఒకరోజు ముందు పార్టీలో, కేడర్‌లో జోష్ పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీజేపీపై తప్పుడు ప్రచారం
కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై కిషన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాజకీయంగా బీజేపీని ఎదుర్కో లేక, ప్రజల దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నేతలు పిరికిపందల మాదిరిగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. తాము ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల్లో ఏం అమలు చేశారో, మిగతావి ఏ రకంగా అమలు చేయబోతున్నారో చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందన్నారు. బీజేపీపై కాంగ్రెస్ ఎన్ని రకాలుగా తప్పుడు ప్రచారం చేసినా ప్రజలు నమ్మడం లేదన్నారు. శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మోదీ మరోసారి ప్రధాని కావాలని అన్ని వర్గాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారని కిషన్‌రెడ్డి చెప్పారు. దేశం కోసం, పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాల కోసం మోదీ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని అన్నారు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌ల సర్టిఫికెట్లు తమకు అవసరం లేదన్నారు. తమకు కావాల్సింది తెలంగాణ ప్రజల సర్టిఫికెట్ మాత్రమేనని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి మిడిమిడి జ్ఞానంతో బీజేపీని విమర్శిస్తున్నారని, తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం రూ.9 లక్షల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేస్తే.. ముఖ్యమంత్రి దాన్ని గాడిద గుడ్డుతో పోలుస్తున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్‌ఎస్ కుటుంబపాలనతో రాష్ట్రానికి, ప్రజలకు తీరనినష్టం జరిగితే బీజేపీ, మోదీ మాత్రమే ఆదుకున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీని ఆశీర్వదించాలన్నారు.

నేడు రాష్ట్రంలో అమిత్ షా ప్రచారం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు చేవెళ్ల లోక్‌సభ పరిధిలో పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా వికారాబాద్‌లో, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా వనపర్తిలో బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. సాయంత్రం 6 గంటలకు రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో బీజేపీ జాతీయ నాయకత్వం తరఫున అమిత్ షా చివరి ప్రచారసభల్లో ప్రసంగించనున్నారు.

హిందువుల విభజనే కాంగ్రెస్ రణనీతి

▶ మొదటి పేజీ తరువాయి

బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లను గుంజుకునేందుకు ప్రయత్నిస్తే మీరు ఊరుకుంటారా? అందుకే మీ హక్కులు, అధికారాలను కాపాడడానికి మోదీ చౌకీదార్‌లా ఉంటాడు..' అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డబుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తూ హైదరాబాద్, తెలంగాణలను తమ ఏటీఎంగా మార్చుకుందని ఆరోపించారు. వాస్తవానికి ఈ డబుల్ ఆర్‌కు మరో ఆర్.. రజాకార్ ట్యాక్స్ కూడా తోడయ్యిందని చెప్పారు. రజాకార్ ట్యాక్స్ హైదరాబాద్ పాతబస్తీ వారికి పూర్తిగా తెలుసునని అన్నారు. ఢిల్లీలో కూడా డబుల్ ఆర్ ట్యాక్స్‌పైనే చర్చ నడుస్తోందని చెప్పారు. వాస్తవానికి నేను ఎవరికోసం ట్యాక్స్ వసూలు చేస్తున్నారో చెప్పలేదు కానీ ఇక్కడి సీఎం భుజాలు తడుముకుంటున్నాడని, అవి ఎవరికి వెళ్తున్నాయో అర్థం చేసుకోవాలని అన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో బీజేపీ ఎంపీ అభ్యర్థులు జి.కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్), ఈటల రాజేందర్ (మల్కాజిగిరి, మాధవీలత (హైదరాబాద్), కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (చేవెళ్ల), బూర నర్సయ్యగౌడ్ (భువనగిరి), డీకే అరుణ (మహబూబ్‌నగర్)లకు మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభల్లో మోదీ మాట్లాడారు.

మీ ఓటుతోనే అన్నిటికీ పరిష్కారం

'హైదరాబాద్ సొల్యూషన్ సిటీ. ఇక్కడ ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అయితే భారత్ అవినీతి వంటి సమస్యతో ముందుకెళ్ల గలుగుతుందా? లక్షల కోట్ల స్కాములు చేసిన పార్టీలతో ముందుకెళ్లగలమా? ఇలాంటి పార్టీలు మీకు మేలు చేస్తాయా? దేశ భవిష్యత్తును మారుస్తాయా? ఇవన్నీ మోదీ కూడా చేయలేడు.. కానీ ఒక్క మీ ఓటు బలంతో ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుంది. బీజేపీ, ఎన్డీఏలకు ఓటేసి గెలిపిస్తే భారత్‌లో దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కారమవుతాయి..' అని ప్రధాని చెప్పారు.

కొత్త ఓటర్లు పదేళ్లలో జరిగింది తెలుసుకోవాలి

'నేడు భారత్ డిజిటల్ పవర్. ఫిన్‌టెక్ పవర్. స్టార్టప్ పవర్, స్పేస్ పవర్. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. ఇది మోదీ ట్రాక్ రికార్డ్. కానీ కాంగ్రెస్ ట్రాక్ రికార్డ్ ఏంటి? లూటీ లూటీ లూటీ.


ఎల్‌బీ స్టేడియంలో జరిగిన సభలో అభివాదం చేస్తున్న మోదీ. చిత్రంలో బూర నర్సయ్యగౌడ్, ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి, మాధవీలత, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్

దోచుకోవడమే కాంగ్రెస్ ట్రాక్ రికార్డ్. సంతుష్టీకరణ రాజకీయాలు, ఉగ్రవాదులను కాపాడుకోవడమే కాంగ్రెస్ ట్రాక్ రికార్డ్. మొదటిసారి ఓట్లు వేసే వారు ఒక్కసారి గత పది, పదిహేనేళ్లలో ఏమి జరిగిందో తెలుసుకోవాలి. గతంలో దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబు పేలుళ్లు జరిగాయనే విషయం వారు తెలుసుకోవాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో దేశవ్యాప్తంగా ఎప్పుడూ ఇలాంటి న్యూసే వినిపించేది. కానీ ఇప్పుడు ఇలాంటి న్యూస్ ఏదైనా మీకు విన్పిస్తోందా? ఈ బాంబు పేలుళ్లను మీ ఒక్క ఓటే ఆపింది. కేంద్రంలో మీరు బీజేపీకి అవకాశం ఇచ్చారు. అందువల్లే ఈ పేలుళ్లు ఆగాయి. కాంగ్రెస్‌కు ఓటు వేయడమంటే మళ్లీ పాత రోజులు వచ్చినట్లే..' అని మోదీ అన్నారు.

కాంగ్రెస్‌ది నరనరాన జాత్యహంకారమే..

'గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మధ్యతరగతి ప్రజలను అవమానించేలా మాట్లాడే వారు. కానీ ఇప్పుడు మిడిల్ క్లాస్ ప్రజల ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు మధ్యతరగతి ప్రజల ఆదాయం, సంపత్తిపై కన్నేసింది. మీ సంపత్తి మీ సంతానానికి, వారసులకు దక్కకుండా లాక్కోవడం మీకు అంగీకారమేనా? కాంగ్రెస్ నరానరాన జాత్యహంకారం నిండి ఉంది. యువరాజు రాహుల్‌గాంధీ గురువు దేశవాసుల శరీరరంగు ఆధారంగా చైనా, ఆఫ్రికాకు చెందినవారని అవమానిస్తున్నారు. అయోధ్య రామ మందిర నిర్మాణం జరగొద్దని, పూజలు జరగొద్దని చెప్పాడు. శ్రీరాముడికి పూజలు చేయడం దేశద్రోహమా? తప్పా? ' అని మోదీ నిలదీశారు.

కాంగ్రెస్ ఐడియా ఆఫ్ ఇండియాకే వ్యతిరేకం...

'దేశాన్ని విదేశీ కళ్లద్దాల్లో చూసే కాంగ్రెస్‌కు ఐడియా ఆఫ్ ఇండియా అనేదానిపై కనీసం అంచనా కూడా వేయలేదు. వెయ్యేళ్ల సంస్కృతి, సత్యమేవ జయతే, అహింస పరమోధర్మ, బుద్ధం శరణం గచ్ఛామీ, గాడ్ ఈజ్ గ్రేట్.. ఇవన్నీ.. ఐడియా ఆఫ్ ఇండియా.. నాకు జన్మనిచ్చిన భూమి స్వర్గం కంటే ఎక్కువ.. ఇది ఐడియా ఆఫ్ ఇండియా. కానీ కాంగ్రెస్ పార్టీ ఐడియా ఆఫ్ ఇండియాకే వ్యతిరేకం.. ' అని ప్రధాని విమర్శించారు.

మోదీ గ్యారంటీ అంటే అభివృద్ధికి గ్యారంటీ

'కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దశాబ్దాలుగా తప్పుడు వాగ్దానాలు ఇస్తూ వచ్చాయి. ఇప్పుడు దేశం మోదీ గ్యారంటీని నమ్ముతోంది. మోదీ గ్యారంటీ అంటే అభివృద్ధికి గ్యారంటీ. రాష్ట్ర, జాతీయ భద్రతకు గ్యారంటీ, ప్రపంచంలో భారత్ గౌరవం పెంపొందించే గ్యారంటీ, రానున్న ఐదేళ్లలో పేదలకు మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చే గ్యారంటీ..70 ఏళ్లో పైబడిన వృద్ధులకు ఉచితంగా వైద్య చికిత్స అందించే గ్యారంటీ. మోదీ గ్యారంటీ అంటేనే పక్కాగా పూర్తి చేసే గ్యారంటీ. తెలంగాణలో వేగవంతమైన అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. తెలంగాణ గ్లోబల్ స్థాయిలో నిలుస్తోంది. డిఫెన్స్ మొదలు బయో టెక్నాలజీ, ఏఐ, మేనేజ్‌మెంట్, సేవా రంగాల్లో రాబోయే ఐదేళ్లలో మరింత వేగవంతమైన అభివృద్ధిని సాధించబోతోంది. పదేళ్లలో తెలంగాణ అభివృద్ధికి లక్షల కోట్లు అందజేశాం. ఈ డబ్బులు అవినీతి ఏటీఎంలోకి వెళ్లగా.. బీఆర్‌ఎస్ జేబులో నింపుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పనిచేస్తోంది. అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ.. బీఆర్‌ఎస్‌కు జిరాక్స్ కాపీలా మారింది..' అని మోదీ ధ్వజమెత్తారు.

బీఆర్‌ఎస్‌కు వేసే ప్రతి ఓటూ కాంగ్రెస్‌కే..

'మీరు బీఆర్‌ఎస్‌కు వేసే ప్రతి ఓటూ కాంగ్రెస్‌కు మద్దతునిస్తుంది. కాంగ్రెస్‌కు వేసే ఓటుతో ఆ పార్టీ అధికారంలోకి రాదు. అందుకే కమలం పువ్వు గుర్తుపై భారీగా ఓట్లు వేసి గెలిపించాలి. నా తెలంగాణ ఎన్నికల ఫలితాల్లో పెద్దెత్తున ఓటింగ్ శాతం పెంచుకోవడం ద్వారా పాత రికార్డులను బద్దలు కొట్టి బీజేపీని 17కు 17 సీట్లలో గెలిపించబోతోంది. ఎన్నికల్లో ప్రతి పోలింగ్ బూత్‌లో బీజేపీని గెలిపించండి..' అని ప్రధాని విజ్ఞప్తి చేశారు. ప్రసంగానికి ముందు మోదీ అక్షయ తృతీయ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

సభికుల మధ్యలోనే రాజాసింగ్



బహిరంగ సభ వేదికపై గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కనిపించలేదు. సభకు ఆయన ఇరవై నిమిషాలు ముందే వచ్చినప్పటికీ వేదికపై ప్రధాని మోదీతో పాటు కూర్చునే బీజేపీ నాయకుల జాబితాలో పేరు లేకపోవడంతో ఆయన స్టేజీ పైకి వెళ్లేందుకు ఎస్పీజీ బలగాలు అనుమతించలేదు. దీంతో సాధారణ కార్యకర్తలాగా సభికుల మధ్యనే కూర్చుండిపోయారు.

దివ్యాంగ బాలికను ముందుకు పిలిచిన మోదీ

ప్రధాని ప్రసంగిస్తున్న సమయంలో ప్రజల మధ్య వీల్‌చైర్‌లో కూర్చున్న ఓ దివ్యాంగ బాలిక యాదగిరి అక్షిత సీతారాముల చిత్రపటాన్ని ప్రదర్శించింది. దీన్ని గమనించిన మోదీ ముందుకు తీసుకురమ్మని సూచించడంతో అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది అక్షితను వీల్‌చైర్‌తో సహా ముందుకు తీసుకొచ్చి ప్రధాని ముందు ఉన్న గ్యాలరీలో కూర్చోబెట్టారు.



హైకోర్టుకన్నా మీరే ఎక్కువా?

- ప్రజలు వారి సొమ్మును వారు పొందకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు?
- సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదు?
- మీ ఉత్తర్వులను అబయన్స్‌లో పెట్టిన తరువాత ప్రభుత్వాన్ని వివరణ కోరడం ఏమిటి?
- గతంలో ఏపీలో పసుపు కుంకుమకు, అన్నదాత సుఖీభవకు, తెలంగాణలో రైతుబంధుకు అనుమతినిచ్చారుగా?
- ఇప్పుడెందుకు అనుమతివ్వరు? ఇవీ పాత పథకాలేగా
- ఎన్నికల సంఘంపై నిప్పులు చెరిగిన ఏపీ సీజే ధర్మాసనం
- రిజిస్ట్రీని బెదిరించడంపై పిటిషనర్లపై మండిపడ్డ ధర్మాసనం



సాక్షి, అమరావతి: 'హైకోర్టుకన్నా మీరే ఎక్కువనుకుంటున్నారా? సంక్షేమ పథకాల నిధుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఎందుకు అమలు చేయలేదు'అంటూ ఎన్నికల సంఘం (ఈసీ)పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం నిప్పులు చెరిగింది. '2019లో పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధుల విడుదలకు అనుమతిచ్చారు. మొన్న తెలంగాణలో రైతు బంధు పథకానికి అనుమతించారు. ఇక్కడా అనుమతి కోరింది పాత పథకాలకే కదా! అప్పుడు పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవకు అనుమతిచ్చిన వాళ్లు ఇప్పుడెందుకు అనుమతి ఇవ్వరు 'అని గట్టిగా నిలదీసింది. సంక్షేమ పథకాల అమలుకు అనుమతినిచ్చే విషయంలో ఈసీ తీరు ఆందోళన కలిగిస్తోందని, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరించడం ఏమిటని వ్యాఖ్యానించింది. 'నిధుల పంపిణీకి బ్రేక్ వేస్తూ మీరు ఇచ్చిన ఉత్తర్వులను సింగిల్ జడ్జి అబయన్స్‌లో పెట్టిన తరువాత కూడా నిధుల పంపిణీకి ఎన్‌వోసీ ఇవ్వకుండా తిరిగి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలా వివరణ కోరతారని మండిపడింది. అసలు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఇలా నిధుల పంపిణీ చేయకూడదని చట్టం ఏదైనా ఉందా అని ధర్మాసనం ప్రశ్నించింది. 'సింగిల్ జడ్జి తీర్పుపై ఎన్నికల సంఘం అప్పీల్ చేసిందా? ఎన్నికల సంఘానికి లేని అభ్యంతరం మీకెందుకు'అని ధర్మాసనం పిటిషనర్‌ను ప్రశ్నించింది.

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై అప్పీల్

రాష్ట్రంలోని పేదల అభ్యున్నతికి వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాల్లో కొన్నింటికి నిధులు పంపిణీ చేయాల్సి ఉంది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఈ నిధుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఈసీ అనుమతి కోరింది. పోలింగ్ ముగిసే వరకు నిధుల పంపిణీ చేయవద్దని ఈసీ ఆదేశాలివ్వడంతో నిధుల పంపిణీ ఆగిపోయింది. ఈసీ నిర్ణయంపై పలువురు రైతులు, మహిళలు, విద్యార్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి ఈనెల 10 వరకు ఈసీ ఉత్తర్వులు అమలు చేయవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వానికి వెసులుబాటునిస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, వాటిని అమలు చేయకుండా, ఎన్‌వోసీ జారీ చేయకుండా ఈసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని మరిన్ని వివరాలు కోరింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ నవతరం పార్టీ ధర్మాసనం ముందు 4 అప్పీళ్లు దాఖలు చేసింది.

సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఎలా అసాధారణం?

ఈ అప్పీళ్ల గురించి నవతరం పార్టీ తరఫు సీనియర్ న్యాయవాదుల్లో ఒకరైన నాదకర్ణి సీజే ధర్మాసనం ముందు ప్రస్తావించారు. నిధుల పంపిణీకి అనుమతినిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై తక్షణమే స్టేటస్ కో ఇవ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. అందరి వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వబోమని తేల్చి చెప్పింది. సింగిల్ జడ్జి రాత్రి 10.35 గంటల సమయంలో అసాధారణ ఉత్తర్వులు జారీ చేశారని నాదకర్ణి అనగా.. ఎలా అసాధారణం అవుతాయని ధర్మాసనం గట్టిగా ప్రశ్నించింది. 'సంక్షేమ పథకాల నిధులనే కదా సింగిల్ జడ్జి పంపిణీ చేయవచ్చని చెప్పింది. అందులో తప్పేముంది? ఆ పథకాలు పాతవే కదా 'అని వ్యాఖ్యానించింది.

ఇవి రాష్ట్రంలో చాలా పాపులర్ పథకాలు..

ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా, సంక్షేమ పథకాల కింద నిధుల పంపిణీకి వీల్లేదని నాదకర్ణి అన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. 'నియమావళి అమల్లో ఉండగా, పథకాలు అమలుకు ఈసీ అనుమతులు తప్పనిసరా? ఏ చట్టంలో ఉందో చెప్పాలి'అనగా.. నాదకర్ణి ఎన్నికల నియమావళి గురించి చెప్పడం మొదలు పెట్టారు. ధర్మాసనం కల్పించుకొని.. 'ఈసీ ఏదైనా ఉత్తర్వులిస్తే కోర్టులు ఏమీ చేయకూడదంటారా? కోర్టులకన్నా ఈసీ ఎక్కువని భావిస్తున్నారా?'అంటూ నిలదీసింది. ప్రస్తుతం కోర్టు ముందున్న పథకాలు పాతవని, రాష్ట్రంలో చాలా పాపులర్ పథకాలని ధర్మాసనం గుర్తు చేసింది. తెలంగాణలో రైతుబంధుకు ఎన్నికల సంఘం అనుమతినిచ్చిన విషయాన్ని ధర్మాసనం ప్రముఖంగా ప్రస్తావించింది. తెలంగాణలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారానే నిధుల పంపిణీ జరిగిందని, ఇక్కడ మాత్రం ఎందుకు అనుమతించరని నిలదీసింది.

మా అధికారులనే బెదిరిస్తారా?

ఈ అప్పీల్ దాఖలులో నవతరం పార్టీ న్యాయవాదుల తీరుపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం తెలిపింది. 'సింగిల్ జడ్జి ఉత్తర్వులపై హౌస్ మోషన్ పిటిషన్ వేయాలంటూ ఫోన్ చేసి మా రిజిస్ట్రీని, మా అధికారులనే బెదిరిస్తారా? తీవ్ర పర్యవసానాలు ఉంటాయని హెచ్చరిస్తారా?'అంటూ గట్టిగా నిలదీసింది. 'మీ దెబ్బకు రిజిస్ట్రీ నాకు ఫోన్ చేసింది. ఉదయాన్ని లేచి చూస్తే రిజిస్ట్రీ నుంచి నా ఫోన్‌కు మెసేజ్‌లతో పాటు మిస్డ్ కాల్స్ ఉన్నాయి. మా రిజిస్ట్రీని మీరు ఉదయం 5 గంటలకే నిద్ర లేపుతారా? అంత ఉదయాన్నే నిద్ర లేచి మీ సేవలో ఉండాలని భావిస్తున్నారా? మేము ఆ సమయంలో నిద్ర లేచి మీ పిటిషన్‌ను హౌస్‌మోషన్ రూపంలో విచారించాలని భావిస్తున్నారా'అంటూ అసహనం వ్యక్తం చేసింది. ఇంకా నయం తనకు నేరుగా ఫోన్ చేయలేదని సీజే ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఐదేళ్లుగా అమలవుతున్న పథకాలను ఎందుకు అడ్డుకుంటున్నారు?

అనంతరం ధర్మాసనం కేంద్ర ఎన్నికల సంఘంపై నిప్పులు చెరిగింది. 'సింగిల్ జడ్జి ఉత్తర్వులపై మీరు అభ్యంతరం చెప్పలేదు. మీకు అభ్యంతరం ఉంటే మా ముందు అప్పీల్ చేసేవారు. అప్పీల్ చేయనప్పుడు సింగిల్ జడ్జి ఉత్తర్వులు అమలు చేయాలి. అప్పీల్ వేయకుండా సింగిల్ ఉత్తర్వులను అమలు చేయకుండా ఉండటం ఏమిటి? మీ తీరును ఎలా అర్థం చేసుకోవాలి? ప్రజలను వారి సొమ్ము వారు పొందకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు? గత ఐదేళ్లుగా అమలవుతున్న పథకాలను ఎందుకు అడ్డుకుంటున్నారు? ఎన్నికల బరిలో ఉన్న వారందరికీ సమాన అవకాశాలు (లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్) కల్పించేందుకే పథకాల అమలును ఆపామని మీరు చెబుతున్నారు. కానీ గతంలో పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవ, రైతు బంధు పథకాలకు అనుమతినిచ్చి, ఇప్పుడు ఇక్కడ పథకాలను ఆపడం ద్వారా లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్ లేదన్న విషయాన్ని మీరే రుజువు చేశారు. ఎన్నికలు జరుగుతున్న ప్రతి రాష్ట్రంలో మీరు ఇలాగే ప్రభుత్వ పథకాలను ఆపుతున్నారా'అంటూ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఒక్కో ప్రభుత్వం విషయంలో ఒక్కో రకంగా..

అసలు నిధుల పంపిణీ సంగతి ఏమిటని ధర్మాసనం రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. 10వ తేదీన నిధుల పంపిణీకి సింగిల్ జడ్జి అనుమతినిచ్చిన విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఎన్నికల సంఘానికి లేఖ ద్వారా తెలియజేశారన్నారు. నిధుల పంపిణీకి ఎన్‌వోసీ జారీ చేయాలని కోరారన్నారు. ఎన్‌వోసీ విషయాన్ని తేల్చని ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వాన్ని బడ్జెట్ కేటాయింపులు, పథకాలు అమలవుతున్న తేదీల వివరాలను అడుగుతూ సీఎస్‌కు లేఖ పంపిందని వివరించారు. ఎన్‌ఓవోసీ విషయాన్ని ఏం చేసిందో ఈసీనే అడగాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఎన్నికల సంఘం తీరు ఒక్కో ప్రభుత్వం విషయంలో ఒక్కోరకంగా ఉంటోందన్నారు. గతంలో పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవ పథకాలకు అనుమతిచ్చిందని, ఇందుకు పాత పథకాలన్న కారణం చెప్పిందన్నారు. ఇప్పుడు తాము కూడా పాత పథకాలనే అమలు చేస్తున్నప్పటికీ అభ్యంతరం చెబుతోందన్నారు.

ఈసీ పరిధి దాటి వ్యవహరిస్తోందా?

దీంతో ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వివరణను ధర్మాసనం కోరింది. నిధుల పంపిణీ వద్దంటూ సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో ఎక్కడా నిధులు పంపిణీ చేసుకోవచ్చని చెప్పలేదని అవినాష్ దేశాయ్ అనగా.. ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'మీ ఉత్తర్వులను సింగిల్ జడ్జి అబయన్స్‌లో పెట్టిన తరువాత ఆ ఉత్తర్వులు అమలు చేయడమే మీ పని. కానీ మీరేం చేశారు? కోర్టుకన్నా మీరు ఎక్కువని అనుకుంటున్నారా'అంటూ ప్రశ్నించింది. 'ఈసీ ఇలాగే ప్రతి పథకాన్ని అడ్డుకోవచ్చా? అది ఈ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కావొచ్చు, వేరే రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కావొచ్చు. ఈసీ పరిధి దాటి వ్యవహరిస్తోందా అన్నదే ఇక్కడ ముఖ్యమైన ప్రశ్న'అని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము ఈ అప్పీళ్లపై విచారణ జరిపి, సింగిల్ జడ్జి ఉత్తర్వులను పరిశీలించి, తాము నిర్ణయించిన మేరకు ఉత్తర్వులిచ్చి, ఆ ఉత్తర్వుల కాపీ అందుబాటులోకి వచ్చేసరికి రాత్రి అవుతుందని తెలిపింది. బ్యాంకుల పని వేళలు సాయంత్రంతో ముగుస్తాయని, అలాంటప్పుడు ఈ నెల 10న నిధుల పంపిణీ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. ఈ పరిస్థితుల్లో తాము ఈ అప్పీళ్లపై ఇప్పటికిప్పుడు తేల్చడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపింది.

ఎన్నికల సంఘం వల్లే నిధులు పంపిణీ చేసే పరిస్థితి లేదు

దీనిపై అడ్వొకేట్ జనరల్ అభిప్రాయాన్ని కోరింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఈసీ అమలు చేయకపోవడం వల్ల, ఎన్‌ఈవోసీ ఇవ్వకపోవడం వల్ల నిధులు పంపిణీ చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఏజీ శ్రీరామ్ వివరించారు. ఈ అప్పీళ్లను ఇప్పటికిప్పుడు తేల్చకపోయినా, ఈసీ తీరును మాత్రం ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సంఘం ఇష్టమొచ్చినట్టు వ్యవహరించవచ్చా అన్న విషయాన్ని తేల్చాలని ధర్మాసనాన్ని కోరారు. ఏజీ చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. '14వ తేదీ నుంచి నిధులు పంపిణీ చేసుకోవచ్చని మీరు (ఎన్నికల సంఘం) చెబుతున్నారు. అప్పుడైనా నిధుల పంపిణీకి అనుమతిస్తారా లేక ఇలాగే ఆ వివరాలు, ఈ వివరాలు కావాలని అడుగుతూ వెళ్తారా'అంటూ ఎన్నికల సంఘాన్ని నిలదీసింది. అలాంటిది ఏమీ లేదని, 14 నుంచి నిధులు పంపిణీ చేసుకోవచ్చని ఈసీ న్యాయవాది అవినాష్ దేశాయ్ చెప్పారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఈసీ అనుమతి ఇవ్వని నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు నిధులు పంపిణీ చేసే పరిస్థితి లేదని, అందువల్ల ఈ మొత్తం వ్యవహారంలో తదుపరి ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదంటూ ఉత్తర్వులిచ్చింది. ఈ అప్పీళ్లపై తదుపరి విచారణను సెప్టెంబర్ 2న చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

మోకాలడ్డింది చంద్రబాబే!

ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుకోవడంలో చంద్రబాబు నక్కజిత్తులు మరోసారి బయటపడ్డాయి. నవతరం పార్టీతో పిటిషన్లు దాఖలు చేయించడం ద్వారా రైతులు, మహిళలు, విద్యార్థులకు సంక్షేమ నిధులు అందకుండా టీడీపీ అధినేత నారా చంద్రబాబు మరోమారు మోకాలడ్డారు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల మేరకు వివిధ పథకాలకు సంబంధించి ప్రభుత్వం రూ.14,165 కోట్లు శుక్రవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై నేరుగా కోర్టును ఆశ్రయిస్తే ప్రజల్లో ఆగ్రహావేశాలకు గురికావాల్సి వస్తుందని భయపడిన చంద్రబాబు దొడ్డిదారిని వెతుక్కున్నారు. తనతో సన్నిహితంగా ఉండే గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నవతరం పార్టీ అనే అనామక పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యంతో హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేయించారు. అంతేకాక ఒక్క రోజు వాదనలకు రూ.20 లక్షల వరకు వసూలు చేసే మీనాక్షి అరోరా (రామోజీరావు తరఫున మార్గదర్శి కేసుల్లో హాజరయ్యే న్యాయవాది), దేవ్‌దత్ కామత్ (రాజధాని కేసులో న్యాయవాది), ఎస్.నాదకర్ణి నవతరం పార్టీ తరఫున వాదనలకు దించారు. ఇంత ఖరీదైన లాయర్లను పెట్టుకొనే స్తోమతు ఆ పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యంకు లేదు. ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగినప్పటికీ, వాదనలతో సాయంత్రం అయిపోయింది. దీంతో నిధుల విడుదలపై సింగిల్ జడ్జి ఇచ్చిన గడువు ముగిసిపోయింది. ఫలితంగా ప్రభుత్వం నగదు విడుదల చేసినప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయలేకపోయింది. చంద్రబాబు చేసిన ఈ పాపానికి సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు, లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ ఎన్నికల్లో రావు సుబ్రహ్మణ్యం నవతరం పార్టీకి రెండు చోట్ల గాజు గ్లాసు గుర్తు వచ్చింది. దీంతో ఆయన చంద్రబాబును కలిసి లోపాయికారీ ఒప్పందం ప్రకారం ఎన్నికల నుంచి తప్పుకున్నారు. పైగా టీడీపీ కేంద్ర కార్యాలయం కేంద్రంగా తన సంపూర్ణ మద్దతును టీడీపీకి ప్రకటించడం గమనార్హం.

ఇదం జగత్



వీక్షకులను ఇలా పెంచుకోవాలనుకోవడం కరెక్ట్ కాదేమో సార్!

మొలకలతో రైతుల కలవరం



కొల్చారం (నర్సాపూర్): తూకం వేసిన ధాన్యాన్ని బియ్యం మిల్లులకు తరలించేందుకు సకాలంలో లారీలు రాక.. వర్షాలకు ధాన్యం మొలకలు వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ధాన్యం బస్తాలు వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ మొలకెత్తుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇదే విషయమై సంఘం సీఈవో నవీన్‌ను వివరణ కోరగా ధాన్యం బస్తాలతో వెళ్లిన లారీలు సకాలంలో రాకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోందన్నారు.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: శని, ఆదివారాల్లో రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశమున్నట్టు వాతావరణశాఖ సూచించింది. మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రెండురోజులు ఉరుములు, మెరుపుల, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు చాలాచోట్ల కురిసే అవకాశముంది. శుక్రవారం ప్రధాన నగరాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే నిజామాబాద్‌లో 41.1 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 24 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. సోమవారం రాష్ట్రంలో చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, జీహెచ్‌ఎంసీ పరిధితోపాటు సమీప జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు సూచించింది. ఆ తర్వాత రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని తెలిపింది.

శుక్రవారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
నిజామాబాద్	41.1
ఆదిలాబాద్	40.3
రామగుండం	39.9
ఖమ్మం	39.6
నల్లగొండ	39.0
మహబూబ్‌నగర్	38.4
మెదక్	38.2
హైదరాబాద్	37.8
భద్రాచలం	37.8
దుండిగల్	37.5
హకీంపేట్	37.5
హన్మకొండ	37.0

ధాన్యం కుప్పపై కుప్పకూలిన రైతు

- గుండెపోటుతో మృతి.. సిద్దిపేట జిల్లాలో ఘటన



నేరండ్ల యాదా గౌడ్

మిరుదొడ్డి (దుబ్బాక): ధాన్యం కొనుగోలు కేంద్రంలో గుండెపోటుతో ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నేరండ్ల యాదాగౌడ్ (65) తనకున్న మూడెకరాల్లో సాగు చేసిన వరి ధాన్యాన్ని నాలుగు రోజుల క్రితం మిరుదొడ్డి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాడు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో మధ్యాహ్నం వరకు ఎండలోనే పనిచేస్తూ ఆరబెట్టాడు. దీంతో వడదెబ్బకు గురైన యాదాగౌడ్ అస్వస్థత గురయ్యాడు. ఉపశమనం కోసం ఇంటికి చేరుకున్నాడు. ఇంతలోనే వాతావరణం మారిపోవడంతో వర్షం వచ్చే అవకాశం ఉందని భావించి యాదాగౌడ్... అస్వస్థతోనే కొనుగోలు కేంద్రానికి చేరుకున్నాడు. ధాన్యాన్ని ఒక దగ్గరికి చేర్చాడు. వర్షం వస్తే వడ్లను కాపాడుకోవడానికి టార్పాలిన్ కవర్‌ను కప్పే ప్రయత్నంలోనే యాదాగౌడ్ ఒక్కసారిగా ధాన్యం కుప్పపై కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న తోటి రైతులు యాదాగౌడ్‌కు సపర్యలు చేసి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు యాదా గౌడ్ గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



స్తంభం పైనే వేలాడుతున్న మృతదేహం

సిరికొండ: విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి స్తంభం పైకి ఎక్కిన సమయంలోనే.. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేయడంతో విద్యుదాఘాతంతో ఒక రైతు మృతి చెందాడు. వర్జన్ తండా జీపీ పరిధిలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాలివి. సాజు తండాకు చెందిన బాదావత్ రవి (42) తన పొలంలో కొత్తగా బోరు వేయించాడు. బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి.. ఆయన ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసి స్తంభం పైకి ఎక్కాడు. అదే సమయంలో విద్యుత్ సరఫరా అవసరం ఉన్న అదే తండాకు చెందిన బానావత్ గణపతి అనే యువకుడు.. స్తంభంపై ఉన్న రైతును గమనించకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేశాడు. దీంతో రైతు రవి విద్యుదాఘాతానికి గురై స్తంభంపైనే ప్రాణాలు వదిలాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆగస్టు 15 కల్లా రైతు రుణమాఫీ అమలుచేసి తీరుతాం: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 కల్లా రైతు రుణమాఫీ అమలుచేసి తీరుతామని, రైతాంగ సంక్షేమం కోసం ఇతర పథకాల అమలుకు ప్రణాళిక చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. తిరిగి రైతు అప్పుల ఊబిలో పడిపోకుండా ప్రభుత్వం చూస్తుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి ప్రతి ఒక్కరికి రుణసహాయం అందేలా, వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడకుండా చేసేందుకు పటిష్ట ప్రణాళికలు రూపొందిస్తున్నామని తుమ్మల తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి, సకాలంలో ఎరువులు అందేలా చూస్తామన్నారు. పంట నష్టపోయిన సందర్భాల్లో రైతులను ఆదుకునేలా ప్రభుత్వమే పంట బీమా ప్రీమియం చెల్లించి ఈ వానాకాలం నుంచి అమలు చేస్తామని వెల్లడించారు. తెలంగాణ భౌగోళిక పరిస్థితులకు అనుకూలంగా ఉండి, రైతులకు అధిక ఆదాయం సమకూర్చే పంటల ఎంపిక దిశగా రైతులను ప్రోత్సహిస్తామన్నారు.

భారీ వర్షం.. తడిసిన ధాన్యం



దుబ్బాక మార్కెట్ యార్డులో తడిసిపోయిన ధాన్యం రాశులు

దుబ్బాక: సిద్దిపేట జిల్లా దుబ్బాకలో శుక్రవారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. గంటకుపైగా దంచికొట్టిన వానకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. దుబ్బాక, చెల్లాపూర్, రాజక్కపేట, దుంపలపల్లితోపాటు పలు గ్రామాల్లో కురిసిన వానకు ఆరబోసిన ధాన్యం రాశులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ధాన్యం కొట్టుకుపోకుండా రైతులు పడరాని పాట్లు పడ్డారు. దుబ్బాక మార్కెట్ యార్డులోనే సుమారు 4 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చేసిన కష్టమంతా నీటిపాలైందని వాపోయారు.

మోదీ మళ్లీ ప్రధానైతే..

దేశం ఉత్తర కొరియానే

రష్యా, పాకిస్తాన్‌లోలా అధ్యక్ష పాలనే..

మంత్రి ఉత్తమ్ ధ్వజం

పదేళ్లలో పార్లమెంట్ వ్యవస్థను ధ్వంసం చేశారు	ఎన్నికల తరువాత కొత్త రేషన్ కార్డులిస్తాం	వచ్చే సీజన్ నుంచి రైతులకు రూ.500 బోనస్	రాష్ట్రంలో 11 మందితో విన్నింగ్ క్రికెట్ టీమ్‌లా ఉన్నాం	'మీట్ ది ప్రెస్'లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పదేళ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పార్లమెంట్ వ్యవస్థను ధ్వంసం చేసిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మరోసారి మోదీ ప్రధానైతే ఉత్తర కొరియా, రష్యా, పాకిస్తాన్‌లా దేశం తయారవుతుందని, ప్రజాస్వామ్యం స్థానంలో నియంతృత్వ పాలన వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యుజే) ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో మంత్రితో 'మీట్ ది ప్రెస్' జరిగింది. ఉత్తమ్ మాట్లాడుతూ పదేళ్లలో మోదీ ఇచ్చిన ఒక్క హామీ నెరవేరలేదని విమర్శించారు. దేశంలో ఇండియా కూటమి గెలుస్తుందనీ రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

దేశ రక్షణకు అగ్నివీర్ మంచిది కాదు

అగ్నివీర్ దేశ రక్షణకు మంచిది కాదని సైన్యంలో పనిచేసిన అనుభవంతో చెపుతున్నానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మోదీ ప్రధాని అయిన తరువాత రక్షణ విషయంలో చాలా పొరపాట్లు జరిగాయని, దేశ భూ భాగంలోకి 2000 కిలోమీటర్లు లోపలికి చైనా చొరబడిందన్నారు. ఇప్పటికే చాలామంది భారత సైనికులు బలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్థిక వనరుల పెంపుపై కమిటీ: ఆర్థిక వనరులను పెంచడం కోసం తనతో పాటు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు కలిసి ఒక కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైందని, ఎన్నికల కోడ్ తరువాత ఆర్థిక వనరుల సమకూర్పుపై ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ చెప్పారు. రేవంత్ సీఎంగా, భట్టి ఉప ముఖ్యమంత్రిగా, ఇతర మంత్రులతో 11 మందితో పటిష్టమైన క్రికెట్ టీంగా ఉన్నామని, ప్రభుత్వాన్ని ఎలా కాపాడుకోవాలో తమకు తెలుసన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, ఆ పార్టీలో ఎవరూ ఉండదలచుకోవడం లేదని, ఎన్నికల తరువాత ఏం జరుగుతుందో అందరు చూస్తారని వ్యాఖ్యానించారు.

వచ్చే సీజన్ నుంచి రూ.500 బోనస్

అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి ఉత్తమ్ భరోసానిచ్చారు. వచ్చే వానాకాలం సీజన్ నుంచి రైతులకు క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్‌గా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల తర్వాత కొత్త రేషన్‌కార్డులు ఇచ్చే కార్యక్రమం మొదలుపెడతామని వెల్లడించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ పాల్గొన్నారు.

కాళేశ్వరంలో నీరు నింపొద్దన్న ఎన్‌ఎస్‌డీఏ

కాళేశ్వరం ప్రాజెక్టులోకి ఈ వర్షాకాలంలో కూడా నీరు నింపకూడదని ఎన్ఎస్‌డీఏ రెండు రోజుల క్రితం ఇచ్చిన మధ్యంతర నివేదికలో స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. నీటిపారుదల శాఖను సర్వనాశనం చేసిందే కేసీఆరేనని ధ్వజమెత్తారు.

---

4 సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

శనివారం మే, 11

బీజేపీ వైపే ప్రజలు



వారి మూడ్ పార్టీకి, మోదీకి పూర్తి అనుకూలంగా కన్పిస్తోంది

రాష్ట్రంలో 10 నుంచి 12 సీట్లలో గెలవబోతున్నాం	కరీంనగర్‌లో నా గెలుపు కూడా పక్కా	బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఓ ప్లాన్ ప్రకారం మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయి	ప్రజల దృష్టిని మళ్లించేందుకే రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు ప్రచారం	'సాక్షి'తో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

(కె.రాహుల్)

'కరీంనగర్‌లోనే కాదు, రాష్ట్రంలో దేశ వ్యాప్తంగా ప్రజల మూడ్ బీజేపీకి, మోదీకి పూర్తి అనుకూలంగా కనిపిస్తోంది. ప్రధానిగా మోదీ ఉండాలని, తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీలు అత్యధిక సంఖ్యలో గెలవాలని ప్రజలు డిసైడ్ అయ్యారు..' అని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ చెప్పారు. ప్రధాని మోదీ అభివృద్ధి ఎజెండాతో వివిధ వర్గాల ఓట్లు సాధించి లోక్‌సభ ఎన్నికల్లో తాను కూడా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వేములవాడలో 8న జరిగిన ప్రధాని మోదీ సభకు ఉదయం 9 గంటలకే వెల్లువలా వచ్చిన ప్రజలు సంజయ్‌దే విజయమని ప్రకటించేశారన్నారు. తనపై పోటీచేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు రెండోస్థానం కోసమే పోటీపడాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ నాన్ లోకల్ అయితే, కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా ప్రజలకు తెలియదన్నారు. 'నేను ఈ గడ్డమీదే పుట్టిన. నేను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు ఎన్నికల్లో గెలిచినా ఓడినా ఇక్కడే ఉన్నా. ప్రజల కష్టాల్లో అండగా ఉన్న. నాకు ఈ గడ్డతో ఉన్నది పేగు బంధం. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నడైనా ఈ గడ్డ ప్రజల కోసం పోరాటాలు చేశారా? మళ్లీ గెలిపిస్తే నాకున్న పరిచయాలు, ఢిల్లీ పెద్దలతో ఏర్పడ్డ సంబంధాలతో మరింత అభివృద్ధి చేస్తా..' అని చెప్పారు. కరీంనగర్‌తో పాటు రాష్ట్రంలో పరిస్థితి, కాంగ్రెస్ పాలన, అభివృద్ధి, పలు రాజకీయ అంశాలపై బండి సంజయ్ 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

నేనేం చేశానో గ్రామాల్లో కన్పిస్తోంది

మా పోరాటాల వల్లే కేసీఆర్ సర్కార్ పీడ విరగడైంది. తెలంగాణ ప్రజలను అరిగోస పెడుతున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గల్లిలోకి గుంజుకొచ్చి గడీల పాలనను బద్దలు కొట్టినం. ఏ ప్రభుత్వమైతే ధర్నాలు, నిరసనలను నిషేధించిందో అదే ప్రభుత్వాన్ని ధర్నా చౌక్‌కు గుంజుకొచ్చిన. కేసీఆర్ పాలనలో విసిగి, అన్యాయాలకు గురైన ప్రజలకు అండగా ఉంటూ పోరాటాలు చేసిన. కేసీఆర్ ప్రభుత్వం అన్నో ఇన్నో ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చింది అంటే నా పోరాటం వల్లనే. జిల్లాకు సంబంధించిన అనేక రోడ్ల పనులకు కేంద్రం నిధులు ఇచ్చేలా ఒప్పించి పనులు స్టార్ట్ చేయించిన. రూ.12 వేల కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చిన వివరాలు గ్రామ గ్రామాన కళ్లకు కన్పిస్తుంటే ఏమీ చేయలేదనే వాళ్లను ఏమనాలి ?

మేం పక్కా హిందుత్వవాదులం

హిందువులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేది ఎంఐఎం. ఆ పార్టీతో పదేళ్ల పాటు సంసారం చేసింది బీఆర్ఎస్. మనుగడ కోసం ఒవైసీతో అంటకాగుతోంది కాంగ్రెస్. హిందువుల ఆత్మ గౌరవం కోసం నేను కొట్లాడుతా. నేను ఎన్నడూ రాజకీయం కోసం హిందుత్వాన్ని వాడుకోను కానీ హిందూ ధర్మ పరిరక్షణ కోసం బరాబర్ రాజకీయం చేస్తా..దేవుడు పేరు చెప్పుకుని ఓట్లు అడుక్కునే బిచ్చగాళ్లు బీజేపోళ్లని రేవంత్‌రెడ్డి హేళన చేశారు. హామీల అమలుపై కాంగ్రెస్ మాటలు జనం నమ్మడం లేదని ఆ దేవుడి మీదే ఒట్టేసే పరిస్థితికి వచ్చిండు. రాముడి అక్షింతలను, తీర్థ ప్రసాదాలను హేళన చేసిన కేసీఆర్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో బొంద పెట్టారు. ఆ పార్టీని పాతాళంలోకి తొక్కడం ఖాయం.

నాకే బాధ్యత ఇవ్వాలో పార్టీ నిర్ణయిస్తుంది

రాష్ట్రవ్యాప్తంగా 10 నుంచి 12 సీట్లలో బీజేపీ గెలవబోతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. అంతకు మించి గెలిచినా ఆశ్చర్యపోవడానికి లేదు. నేను గెలిచిన తర్వాత కేంద్రమంత్రి పదవి ఇస్తారా? ఏ బాధ్యత అప్పగిస్తారనేది మోదీ నాయకత్వంలోని మా కేంద్ర పార్టీ నిర్ణయిస్తుంది. నేను బీజేపీ సైనికుడిని. కరీంనగర్ ప్రజల సేవకుడిని. పార్టీ అప్పగించిన పని వంద శాతం నిర్వహించడమే నా బాధ్యత.

ఫోన్ ట్యాపింగ్ డబ్బులు ఇక్కడ ఖర్చు చేస్తున్నారు

ఫోన్ ట్యాపింగ్ డబ్బులు తీసుకొచ్చి కరీంనగర్‌లో ఖర్చు చేస్తున్నారు. ఓటుకు వెయ్యి ఇచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి నాటకాలు ఆడుతున్నాయి. కాళేశ్వరం అవినీతిపై, ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు, ఆ పార్టీపై, ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై బీఆర్ఎస్ ప్రశ్నించడం లేదు. ఈ రెండు పార్టీలు ఓ ప్లాన్ ప్రకారం మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని పైకి డ్రామాలు ఆడుతున్నాయి.

రిజర్వేషన్లకు కాంగ్రెస్ తూట్లు

కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లకు తూట్లు పొడిచింది. ముస్లిం రిజర్వేషన్ల అమలు పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణ పేదలకు అన్యాయం చేసింది. అగ్రకులాల్లోని పేదలకు కూడా 10% రిజర్వేషన్లు కల్పించిన వ్యక్తి మోదీ. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తున్న నేత. అలాంటి నాయకుడు రిజర్వేషన్లను రద్దు చేస్తారంటే ఎవరూ నమ్మరు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, ఇతర హామీలు అమలు చేయకపోవడంతో మోసం చేసిందనే భావన ప్రజల్లో ఉంది. దీన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు, హైదరాబాద్‌ను యూటీ చేస్తారనే ప్రచారాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్నాయి.



ఆ పార్టీలకు మధ్యవర్తి ఎంఐఎం

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు మధ్యవర్తి ఎంఐఎం. ఈ పార్టీలన్నీ అవినీతి ఎలా చెయ్యాలి, ప్రజలను ఎలా మోసం చెయ్యాలి.. తిరిగి ఎన్నికలొస్తే డబ్బులతో ఓట్లు ఎలా కొనాలి? అనే చూస్తాయి. దేశాన్ని దోచుకోవడంలో కాంగ్రెస్, రాష్ట్రాన్ని దోచుకోవడంలో బీఆర్ఎస్ పార్టీలు పీహెచ్‌డీ చేశాయి. కేసీఆర్ కుటుంబం అవినీతిలో గుడిని మింగితే.. కాంగ్రెస్ ప్రభుత్వం గుడిలో లింగాన్ని కూడా వదలిపెట్టనట్లుగా అవినీతికి తెరదీస్తూ... ఆ డబ్బుతో ఢిల్లీకి కప్పం కడుతోంది. గ్యారెంటీలను నమ్మి గెలిపించిన ప్రజలకు పంగనామాలు పెట్టింది. వంద రోజుల పేరుతో 6 గ్యారంటీల్లో 5 హామీలను అమలు చేశామనడం పెద్ద అబద్ధం.



ఓటర్లు.. బస్సుల కోసం బారులు

సోమవారం ఏపీలో జరగనున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో సొంత ఊళ్లకు బయల్దేరారు. శుక్రవారం రాత్రి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు వద్ద కనిపించిన దృశ్యమిది.

సీఎం రేవంత్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌లపై చర్యలు తీసుకోండి

ఈసీకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విజయావకాశాలు దెబ్బ తీసేలా ఎన్నికల ప్రవర్తనా నియామావళిని ఉల్లంఘించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌లపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల కమిషన్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. ఆర్మూర్‌లో మాజీ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి మాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేసిన వెంటనే ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తన సిబ్బందిని మాల్‌కు పంపడం కక్ష సాధింపు రాజకీయాల్లో భాగమేనని ఫిర్యాదులో పేర్కొంది. జీవన్‌రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎన్నికల్లో గెలవకుండా చేయాలనే సీఎం ఆలోచనలో భాగంగానే సజ్జనార్ అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని ఆరోపించింది. మాల్‌పై సజ్జనార్ పోలీసులతో దాడి చేయించడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని ఈసీ దృష్టికి తీసుకెళ్లింది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన రేవంత్‌రెడ్డి ప్రచారంపై ఆంక్షలు విధించాలని, సజ్జనార్‌ను వెంటనే ఆర్టీసీ ఎండీగా తప్పించాలని కోరింది.

బీఆర్ఎస్‌కు క్రిస్టియన్ సంఘాల మద్దతు



మాట్లాడుతున్న సాల్మన్ రాజు

పంజగుట్ట (హైదరాబాద్): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ క్యాథలిక్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో క్రిస్టియన్‌లపై దాడులు జరగలేదని, కాంగ్రెస్ వచ్చిన 4 నెలల్లోనే 24 దాడులు, ఒక చోట 144 సెక్షన్ విధించారని గుర్తుచేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఎం.సాల్మాన్ రాజు, నాయకుడు డేవిడ్ దయాకర్, క్యాథలిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లియో లెవిస్‌లు మాట్లాడుతూ.. నిత్యం తమది సెక్యులర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ మంత్రివర్గంలో మైనారిటీలకు ఎందుకు చోటివ్వలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ఏ సీఎం చెయ్యని విధంగా క్రిస్మస్ పండగకు అందర్నీ పిలిపించుకుని విందు, కొత్త దుస్తులు ఇచ్చారన్నారు. గతంలో క్రిస్మస్‌కు ఉద్యోగులకు ఆప్షనల్ హాలీడే ఉండేదని, కాని కేసీఆర్ అధికారంలోకి రాగానే సెలవుదినంగా ప్రకటించి మరుసటి రోజు బాక్సింగ్‌డేకు సెలవు ఇచ్చారని తెలిపారు.

సీఎం రేవంత్‌కు ఎన్నికల సంఘం నోటీసులు

బీఆర్ఎస్ ఫిర్యాదుపై స్పందించిన ఈసీ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ చేసిన ఫిర్యాదుపై కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించింది. 48 గంటల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా రేవంత్‌రెడ్డిని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు తమ పార్టీ నేతలపై రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి ఈసీకి ఈ నెల 5న ఫిర్యాదు చేశారు. కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతూ, దుర్భాషలు ఆడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 48 గంటల్లో సమాధానం ఇవ్వాల్సిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశించింది.

తనిఖీలు చేయండి.. నిఘా పెంచండి

చివరి అంకంలో అప్రమత్తంగా ఉండండి

- ఎన్నికల అధికారులకు సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశాలు
- రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



సాక్షి, హైదరాబాద్: పోలింగ్ ప్రక్రియ చివరి అంకానికి చేరుకున్నందున పోలింగ్ అధికారులు, పోలీస్‌లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. ఓటర్లను ప్రలోభ పెట్టకుండా అడ్డుకట్ట వేయాలని, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. డబ్బు, మద్యం, డ్రగ్స్, బహుమతులు ఉచిత పంపిణీకి ఎక్కువ అవకాశం ఉన్న మురికివాడల్లో, బస్తీల్లో నిఘా పెంచాలని సూచించారు. మ్యారేజీ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లలో వీటి పంపిణీకి అవకాశం ఉన్నందున ఆ ప్రాంతాల్లో నిఘా పెంచాలన్నారు. ఎన్నికల సమాయత్తంపై సీఈఓ వికాస్‌రాజ్ శుక్రవారం రిటర్నింగ్ ఆఫీసర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 13న పోలింగ్ జరగనున్న రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలకు, ఒక అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు తుది దశలో ఉన్నట్టు తెలిపారు.

వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయండి

కేంద్ర ఎన్నికల సంఘం ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్) ప్రకారం అంతర్ జిల్లా సరిహద్దులు, అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్ పోస్టులలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఈఓ సూచించారు. వాహనాలను తనిఖీలు చేయాలన్నారు. కలెక్టర్లు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో శాంతిభద్రతల అంశాలకు సంబంధించి ఆయా జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల సమక్షంలో ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు.

సోషల్ మీడియాను మానిటర్ చేయాలి

సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వార్తలు ప్రచారం కాకుండా సోషల్ మీడియాను మానిటర్ చేయాలని వికాస్‌రాజ్ సూచించారు. పోలింగ్ రోజు ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు ఏర్పడినా పరిష్కరించేలా ఈసీఐఎల్ ఇంజినీర్లను ముందస్తుగా అందుబాటులో పెట్టుకోవాలని ఆదేశించారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తరలింపులో జరభద్రం

పోలింగ్ తర్వాత ఈవీఎంలు, వీవీప్యాట్లను స్ట్రాంగ్ రూంలకు తీసుకెళ్లే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయాలని వికాస్‌రాజ్ సూచించారు. ఈవీఎంలను పోలింగ్ స్టేషన్లకు తీసుకువచ్చేప్పుడు, తిరిగి వాటిని స్ట్రాంగ్ రూంలకు తెచ్చేటప్పుడు, భద్రపర్చినప్పుడు వీడియో తీయడంతోపాటు సీసీటీవీల ద్వారా రికార్డ్ చేయాలన్నారు. ఈ అన్ని సందర్భాల్లో అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధులు తప్పక ఉండేలా చూడాలన్నారు.

సాయంత్రం 6 గంటల వరకు అవకాశం

కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన ప్రకారం 17 లోక్‌సభ నియోజకవర్గాల్లోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటింగ్ సమయం గంట పెంచినట్టు సీఈఓ వికాస్‌రాజ్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు ఓటు వేసేందుకు అవకాశం ఉన్నట్టు తెలిపారు. సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం, కొత్త గూడెం, అశ్వరావుపేట అసెంబ్లీ నియోజ కవర్గాల పరిధిలో మాత్రం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే ఓటింగ్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలతో ప్రచారం ముగుస్తుందన్నారు.

అబద్ధాల మోదీ

ఇప్పటివరకు ఇలాంటి ప్రధానిని చూసి ఉండరు

- తెలంగాణలో బీజేపీ ఏ అభివృద్ధీ చేయలేదు
- ఇప్పటికే తెలంగాణలో కొన్ని హామీలు అమలు చేశాం
- మీడియా భేటీలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జునఖర్గే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జునఖర్గే. చిత్రంలో భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన 6 హామీల్లో ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు, 500 సిలిండర్, 200 ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ లాంటివి ఇప్పటికే ప్రారంభించాం. మిగిలిన ఒకటి కూడా త్వరలోనే ప్రారంభిస్తామని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జునఖర్గే ప్రకటించారు. ఎన్నికల కోడ్ కారణంగా హామీల అమలు తాత్కాలికంగా ఆగిందని, కోడ్ ముగియగానే అమలు చేస్తామని చెప్పారు. తాము తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తూ పోతున్నామని, బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో గురించి మాట్లాడకుండా, కాంగ్రెస్‌ను తిట్టడంపైనే ఫోకస్ చేసిందని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ వచ్చిన మల్లికార్జున ఖర్గే తాజ్‌కృష్ణలో విలేకరులతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే ఇబ్బంది లేదు. ఐదేళ్లపాటు అద్భుతపాలన అందిస్తాం.

మీ సీబీఐ ఏం చేస్తోంది..?

జనగణనను మోదీ బయటపెట్టడం లేదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మహిళలు, పిల్లలు ఎందరున్నారు? వారి స్థితిగతులేంటి? వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఏ సంక్షేమ పథకాలు చేపట్టాలి? విద్య, వైద్యం పరిస్థితి ఏంటి? అయితే మోదీ సర్కారు ఈ గణాంకాలను దాచిపెడుతోంది. మోదీ అబద్ధాలపై అబద్ధాలు చెబుతున్నారు. అదానీ, అంబానీలు రాహుల్‌గాంధీకి టెంపోలో డబ్బులు పంపిస్తున్నారని మోదీ ఆరోపిస్తున్నారు. మీ సీబీఐ ఏమైంది..ఈడీ, ఆదాయపు పన్నుశాఖ ఏం చేస్తోంది? కావాలంటే విచారణ జరిపించు. ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్న కేంద్రం.. అసలు అదానీ, అంబానీలపై ఈడీ, ఐటీ సంస్థల రైడింగ్ ఎందుకు జరపడం లేదో మోదీకే తెలియాలి. వారితో అమిత్‌షా ఎప్పుడూ కలిసే తిరుగుతారు. 50 కోట్ల మంది వద్ద ఎంత సంపద ఉందో ఆ ఇద్దరి వద్ద అంత ఉంది.

దేశాన్ని విడదీసే ప్రయత్నం చేస్తున్నారు

'మోదీ, అమిత్‌షా ఆందోళనలో ఉన్నారు. అభివృద్ధి చూసి ఓటు వేయమని మోదీ అడగం లేదు. మటన్, మందిర్, మంగళసూత్రం, మైనారిటీలు లాంటి అంశాలనే ప్రధాని మాట్లాడుతున్నారు. ఇలాంటి ప్రధానిని ఇంత వరకు ఎవరూ చూసి ఉండరు. కాంగ్రెస్‌ను చూసి బీజేపీ భయపడుతోంది. అందుకే మమల్ని టార్గెట్ చేసి మోదీ విమర్శలు చేస్తున్నారు.

అధికారంలోకి రాగానే పథకాలు..

'ఆలిండియా సర్వీసెస్ అధికారుల్లో ఎస్సీ, ఎస్టీలెందరో చెప్పడం లేదు. మేం అధికారంలోకి రాగానే రిజర్వేషన్ ప్రకారం పోస్టులిస్తాం. మహిళలకు 50%... జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తాం. మహాలక్ష్మీ యోజన కింద రూ.లక్ష ఆర్థిక సహాయం చేస్తాం. 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. రైతుకు కనీస మద్దతు ధర ఇస్తాం. పదేళ్లలో తెలంగాణకు బీజేపీ ఏమీ చేయలేదు. దేశరాజధాని స్థాయిలో హైదరాబాద్‌లో అభివృద్ధి జరగాల్సి ఉండగా, ఆ మేరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. హైదరాబాద్, బెంగళూరు, ముంబైలను పక్కకు పెట్టి అన్నీ ఒక్క గుజరాత్‌కే తరలిస్తే ఎంతవరకు సమంజసం. చేయిని తీసివేయడం ఎవరికీ సాధ్యం కాదు. మరోసారి నొక్కి చెబుతున్న హామీలన్నీ అమలు చేసి తీరుతాం' అని మల్లికార్జున ఖర్గే వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు గీతారెడ్డి, మధుయాష్కీగౌడ్, జబీర్ అహ్మద్ పాల్గొన్నారు.



మోదీ పాలనలో ప్రజలకు కష్టాలే మిగిలాయి

కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల మోదీ పాలనలో ప్రజలకు కష్టాలు, నష్టాలే మిగిలాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శశి థరూర్ అన్నారు. ప్రజలకు ఏమాత్రం మంచి చేయలేని మోదీ ప్రభుత్వం, ఈ ఎన్నికల్లో విద్వేషాలను రెచ్చగొట్టి లాభపడాలనుకుంటోందని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌లో పలు అంశాలను ప్రస్తావించారు. 2014 ఎన్నికల్లో సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో అధికారంలోకి వచ్చిన బీజేపీ, విదేశాలనుంచి నల్లధనాన్ని రప్పించి ప్రతి వ్యక్తి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తామని హామీ ఇచ్చిందని, కానీ తర్వాత చేతులెత్తేసిందని విమర్శించారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో పుల్వామా, బాలాకోట్ ఘటనలతో లబ్ధిపొందిందన్నారు. ఇండియా కూటమి ప్రజల కోసం ఏర్పాటైందని, పేదలు, రైతులు, నిరుద్యోగులు, మహిళల కోసం ప్రత్యేక కార్యాచరణతో ఈ ఎన్నికల్లో దిగామన్నారు. సామాజిక న్యాయం ఎజెండాగా మేనిఫెస్టో రూపొందించామని, ఇటీవల జరిగిన మూడు దశల ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఘోరంగా విఫలమైందని అన్నారు. తెలంగాణకు కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నింటినో ఎన్‌డీఏ ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. ఉత్తర, దక్షిణ భారతంలో ఐక్యతను చాటేందుకే రెండు చోట్ల రాహుల్ పోటీ చేస్తున్నారన్నారు. కేజ్రీవాల్‌కి ఆలస్యమైనా బెయిల్ రావడం శుభపరిణామమన్నారు.

జీన్స్, టీషర్ట్స్ వేసుకు రావొద్దు

ఆర్టీసీ ఉద్యోగులకు ఆదేశాలు

- వాటిని ధరించి విధులకు రావొద్దని స్పష్టీకరణ
- ఆ వస్త్రధారణ సంస్థ గౌరవానికి తగిన విధంగా లేదని నిర్ణయం
- ఇక కచ్చితంగా ఫార్మల్ డ్రెస్సుల్లోనే హాజరు కావాలని హుకుం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ అధికారులు, వారి పరిధిలో పనిచేసే సిబ్బంది ఇక నుంచి జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు ధరించి విధులకు హాజరు కావొద్దంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ తరహా వస్త్రధారణ సంస్థ గౌరవానికి భంగం కలిగించేలా ఉందంటూ సంస్థ ఎండీ సజ్జనార్ అభిప్రాయపడ్డారు. ఇక నుంచి విధుల్లో ఆ తరహా వస్త్రధారణ కూడదంటూ ఆదేశాలు జారీ చేశారు.

డ్రైవర్లు, కండక్టర్లకు 'ఖాకీ'.. మిగిలిన వాళ్లు ఇష్టమొచ్చినట్టుగా!

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఖాకీ డ్రెస్‌లో కనిపిస్తారు.. బస్టాపులు, బస్టాండ్లలో ఉండే సూపర్‌వైజర్లు తెల్లరంగు దుస్తుల్లో ఉంటారు.. కానీ, డిపోలు, ఇతర ఆర్టీసీ కార్యాలయాల్లో ఉండే అధికారులకు యూనిఫాం అంటూ లేదు. డ్రెస్ కోడ్ కూడా లేకపోవటంతో ఇంతకాలం క్యాజువల్ వస్త్రధారణతో విధులకు హాజరవుతున్నారు. దీన్ని పెద్దగా పట్టించుకునేవారు లేకపోవటంతో, రంగురంగుల డ్రెస్సులు, జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు ధరించి వస్తున్నారు. కొందరు ఉన్నతాధికారులు కూడా ఈ తరహా వస్త్రధారణతో విధుల్లో కనిపిస్తున్నారు. తాజాగా దీన్ని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తీవ్రంగా పరిగణించారు. ఇటీవల ఆయన తరచూ అధికారులతో గూగుల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో డిపో స్థాయి సిబ్బందితో కూడా ఆన్‌లైన్ సమావేశాల్లో ముచ్చటిస్తున్నారు. చాలా సందర్భాల్లో ఉన్నతాధికారులు మొదలు డిపో స్థాయి సిబ్బంది వరకు జీన్స్ ప్యాంట్లు, టీ షర్టుల్లో కనిపిస్తున్నారు. ఇది ఆయనకు చికాకు తెప్పించింది.

ఫార్మల్ డ్రెస్సుల్లోనే రావాలని ఆదేశాలు

దేశంలోనే పేరున్న రవాణా సంస్థలో ఇలా ఇష్టం వచ్చిన వస్త్రధారణతో అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొనటాన్ని ఆయన తప్పుపట్టారు. ఇదే విషయాన్ని ఆయన ఈడీ 'అడ్మిన్) దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు తాజాగా ఈడీ (అడ్మిన్) లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. సంస్థకు ఉన్న పేరు, డిపో కార్యాలయాల గౌరవానికి వారి డ్రెస్సింగ్ భంగంగా ఉందంటూ ఆయన అందులో అభిప్రాయపడ్డారు. ఇక నుంచి గౌరవప్రదంగా ఉండే ఫార్మల్ డ్రెస్సుల్లోనే అధికారులు విధుల్లో కనిపించాలని తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఆయా అధికారుల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా ఇది వర్తిస్తుందని అందులో పేర్కొన్నారు.

యూనిఫాంలో కనిపించని స్పష్టత

ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ఖాకీ యూనిఫాంలో కనిపిస్తారు. కొన్ని బస్సుల్లో నీలి రంగు యూనిఫాం ఉంటోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి సారించింది. ఆర్టీసీలో అతిపెద్ద సమ్మె విరమణ తర్వాత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో సిబ్బంది యూనిఫాంపై ప్రస్తావించారు. మహిళా కండక్టర్లకు యాప్రాన్ అందజేస్తామని చెప్పి.. ఆ యాప్రాన్ ఏ రంగులో ఉండాలో నిర్ధారించేందుకు ఓ కమిటీ వేశారు. రెండు మూడు సమావేశాలు నిర్వహించిన తర్వాత, మెరూన్ రంగులో ఉండే యాప్రాన్‌ను సిఫారసు చేశారు. ఆ మేరకు ఓ ప్రముఖ కంపెనీకి వస్త్రం కొనుగోలు ఆర్డర్ ఇచ్చారు. అయితే ఇప్పుడు ఆ యాప్రాన్ కూడా కనిపించటం లేదు. డ్రైవర్లు, కండక్టర్లకు యూనిఫాం కూడా కొన్నేళ్లపాటు సరఫరా కాలేదు. వారికి ఖాకీ బదులు మరో రంగు ఇవ్వాలన్న అంశం కూడా తెరమరుగైంది.

అమ్మో...ఆ డీఎంహెచ్ఓ

- లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఆరోగ్యశాఖ కార్యదర్శికి మహిళా మెడికల్ ఆఫీసర్ల ఫిర్యాదు
- 21 మంది సంతకాలతో పైఅధికారుల దృష్టికి...

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా వైద్యాధికారి తమను లైంగికంగా, అసభ్యకరంగా వేధింపులకు గురిచేస్తున్నాడని మహిళా మెడికల్ ఆఫీసర్లు ఆరోపించారు. మూడురోజుల క్రితం రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శితోపాటు, కలెక్టర్‌కు 21 మంది పీహెచ్‌సీల మహిళా మెడికల్ ఆఫీసర్లు సంతకాలు చేసి ఫిర్యాదు చేశారు. 'ఏడాదిన్నర కాలంగా తమతో అనుచితమైన పదాలతో మాట్లాడుతూ శరీర భాగాలను తాకుతున్నాడు. వ్యక్తిగత ఫోన్‌కాల్స్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నాడు. పీహెచ్‌సీలను సందర్శించినప్పుడు మహిళావైద్యులు, సిబ్బందిని పక్కన కూర్చోవాలని చెబుతున్నాడు. ప్రతిఘటిస్తే గట్టిగా అరిచి కక్ష పెట్టుకుంటున్నాడు. ఫోన్‌లో వైవాహిక స్థితిగతులను అడిగి మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. అంతేకాదు తన చాంబర్‌లో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడు. పురుష వైద్యాధికారుల ఎదుట తమ అందం గురించి మాట్లాడతాడని' ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీన జరిగిన విస్తృత సేవల శిక్షణ కార్యక్రమంలో అకస్మాత్తుగా వచ్చి మహిళావైద్యులు, సిబ్బంది వ్యభిచారిణులుగా పనిచేస్తున్నారని అని అరిచాడని వాపోయారు. వైద్యశాఖ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారిపై ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఓ మహిళా మెడికల్ ఆఫీసర్ కూడా సాక్ష్యాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. చాలాకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడని, అసభ్యకమైన సందేశాలతో వాట్సాప్ చాటింగ్ చేస్తున్నా డని బాధితురాలు కలెక్టర్‌కు చెప్పినట్టు సమాచారం.

డాక్టర్‌గా నమోదు చేసుకున్న

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎంబీబీఎస్, హౌస్ సర్జన్ కరీంనగర్‌లోని చల్మెడ మెడికల్ కాలేజీలో పూర్తి చేసిన తర్వాత శుక్రవారం తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో అధికారికంగా డాక్టర్‌గా నమోదు చేసుకున్నారు. 2021 సంవత్సరంలో తన ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజీవ్ ఎంబీబీఎస్, ఎండీ పల్మనాలజీ, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (కో ఆప్షన్) మెంబర్ తదితరులు వెంకట్‌కి స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

కేజ్రీవాల్‌కు 'ప్రచార' బెయిల్

పలు షరతులు విధించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

జూన్ 1 వరకూ బెయిల్.. 2న తిరిగి లొంగిపోవాలి	వచ్చే నెల 5వ తేదీదాకా బెయిల్ ఇవ్వాలన్న కేజ్రీవాల్ తరఫు న్యాయవాది	తిరస్కరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఆయనకు జూన్ 1వ తేదీ వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇందుకు పలు షరతులు విధించింది. జూన్ 2న తిరిగి తిహార్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. కేజ్రీవాల్‌కు వచ్చే నెల 5వ తేదీ వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరగా, ధర్మాసనం అంగీకరించలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేయడానికి మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఎన్నికల ప్రచారం అనేది ప్రాథమిక హక్కు లేదా రాజ్యాంగపరమైన హక్కు కాదని, మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన కేజ్రీవాల్‌కు ఎట్టిపరిస్థితుల్లోనూ మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చేసిన వాదనను ధర్మాసనం తిరస్కరించింది. మధ్యంతర బెయిల్ ఇవ్వడం లేదా జైలు నుంచి విడుదల చేయడం వంటి అంశాల్లో సదరు నిందితుడికి సంబంధించిన ప్రాధాన్యతలు, అతడి చుట్టూ ఉన్న పరిణామాలు, పరిస్థితులను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించింది. వాటిని విస్మరించడం పొరపాటే అవుతుందని ఉద్ఘాటించింది. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు ఈ సంవత్సరంలో చాలా ముఖ్యమైన కార్యక్రమం అని గుర్తుచేసింది.

కేజ్రీవాల్ దోషిగా నిర్ధారణ కాలేదు

కేజ్రీవాల్‌పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయనడంలో సందేహం లేదని.. కానీ, ఆయన ఇంకా దోషిగా నిర్ధారణ కాలేదని, ఆయనకు గతంలో నేర చరిత్ర లేదని, సమాజానికి ఆయన వల్ల ముప్పు సంభవించే పరిస్థితి కూడా లేదని వివరించింది. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం చట్టబద్ధమేనా? అది చెల్లుబాటు అవుతుందా? అని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైందని, దానిపై ఇంకా తుదితీర్పు వెలువడలేదని వెల్లడించింది. కేజ్రీవాల్ కేసు ఇప్పుడు న్యాయ వ్యవస్థ పరిధిలోనే ఉంది కాబట్టి అతడికి బెయిల్ ఇచ్చే అంశాన్ని సానుకూలంగా పరిశీలించామని తెలియజేసింది. నిందితులకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు తనకున్న అధికారాన్ని అత్యున్నత న్యాయస్థానం ఎన్నో సందర్భాల్లో ఉపయోగించుకుందని ధర్మాసనం గుర్తుచేసింది. ప్రతి కేసుకు సంబంధించిన వాస్తవాలను దృష్టిలో పెట్టుకొని కోర్టులు మధ్యంతర బెయిల్ ఇస్తుంటాయని పేర్కొంది.

21 రోజులు బెయిలిస్తే పెద్దగా తేడా ఉండదు

తన అరెస్టును సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌పై ఇప్పటికిప్పుడు విచారణ పూర్తిచేసి, తీర్పు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నామని ధర్మాసనం వివరించింది. కేజ్రీవాల్ అప్పీల్ తమవద్దే పెండింగ్‌లో ఉందని, ఈ పరిస్థితుల్లో మధ్యంతర బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలంటూ ఆయనను ఆదేశించడం సరైంది కాదని భావించామని పేర్కొంది. తొమ్మిది సార్లు సమన్లు ఇచ్చినా కేజ్రీవాల్ లెక్కచేయలేదని, అందుకే అరెస్టు చేశామంటూ ఈడీ లేవనెత్తిన వాదనపై ధర్మాసనం స్పందించింది. ఇందులో ఇతర కోణాలు కూడా చూడాలని, వాటిని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడింది. కేజ్రీవాల్ ఒక ముఖ్యమంత్రి, ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడు అని ప్రస్తావించింది. మద్యం కుంభకోణంలో దర్యాప్తు 2022 ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉందని, కేజ్రీవాల్‌ను ఈ ఏడాది మార్చి 21న అరెస్టు చేశారని, ఇప్పుడు 21 రోజులపాటు మధ్యంతర బెయిల్ ఇస్తే పెద్దగా తేడా ఏమీ ఉండదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోకేజ్రీవాల్‌కు వచ్చే నెల 1వ తేదీ దాకా మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. షరతులకు కట్టుబడి ఉండాలని ఆదేశించింది. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వడాన్ని ఈ కేసు మెరిట్‌పై అభిప్రాయాల వ్యక్తీకరణగా చూడొద్దని సూచించింది.


కార్యకర్తలకు కేజ్రీవాల్ అభివాదం

తిహార్ జైలు నుంచి విడుదల

సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం తిహార్ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు ఎదుట భారీ సంఖ్యలో గుమికూడిన ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కేజ్రీవాల్ తన కాన్వాయ్‌తో జైలు నుంచి ఇంటికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన వెంట భార్య సునీతా కేజ్రీవాల్, కుమార్తె హర్షితా, ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ఉన్నారు.

సుప్రీంకోర్టు షరతులివే..

1. రూ.50,000 బెయిల్ బాండు సమర్పించాలి, అంతే మొత్తం పూచీకత్తును తిహార్ జైలు సూపరింటెండెంట్‌కు అందజేయాలి.
2. బెయిల్‌పై బయట ఉన్నప్పుడు అధికారిక కార్యాలయంలో గానీ, ఢిల్లీ సచివాలయంలోని గానీ అడుగు పెట్టరాదు.
3. లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోకుండా అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయొద్దు
4. మద్యం కుంభకోణం కేసు గురించి బయట ఎక్కడా మాట్లాడొద్దని, సాక్షులతో భేటీ కావడం, సంప్రదింపులు జరపడం వంటివి చేయొద్దు.
5. మద్యం కేసుతో సంబంధం ఉన్న అధికారిక ఫైళ్లను చూడొద్దు.

పీవోకేలో భగ్గుమన్న నిరసనలు

మిర్పూర్: పన్నుల పెంపు, నిరసనకారుల అరెస్టులపై పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో శుక్రవారం నిరసనలు భగ్గుమన్నాయి. మిర్పూర్ జిల్లా దద్యాల్ తహశీల్ పరిధిలో నిరసనకారులు భద్రతా బలగాలపై రాళ్లు రువ్వడంతోపాటు వారితో తలపడ్డారు. బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించి వారిని చెదరగొట్టాయి. కొన్ని టియర్ గ్యాస్ తూటాలు సమీపంలోని పాఠశాల ఆవరణలో పడగా విద్యార్థినులు గాయపడ్డారు. . పెరుగుతున్న ధరలు, పన్ను భారం, విద్యుత్ కొరతకు సంబంధించి ఫిబ్రవరిలో కుదిరిన ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేయనందుకు ఆగ్రహిస్తూ జమ్మూకశ్మీర్ జాయింట్ ఆవామీ కమిటీ 10వ తేదీన శుక్రవారం బంద్‌కు, 11న లాంగ్ మార్చ్‌కి పిలుపునిచ్చింది. దీంతో, భద్రతా బలగాలు గురువారం కమిటీ నాయకులు సహా 70 మందిని అదుపులోకి తీసుకున్నాయి.

నేను వచ్చేశా...

నియంతృత్వం నుంచి దేశాన్ని కాపాడుకోవాలి ● కేజ్రీవాల్ పిలుపు

న్యూఢిల్లీ: త్వరలో తిరిగి వస్తానని చెప్పాను కదా! చెప్పినట్లే వచ్చేశా అని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. తనకు మధ్యంతర బెయిల్ ఇచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు, ఇన్నాళ్లూ తనకు అండగా నిలిచి ఆశీస్సులందించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం తిహార్ జైలు నుంచి విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నియంతృత్వం నుంచి మన దేశాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకోసం తన శక్తిమేరకు పోరాడుతానని, తనకు 140 కోట్ల మంది ప్రజల మద్దతు కావాలని కోరారు. ప్రజలంతా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. తాను ఎంతగానో విశ్వసించే హనుమంతుడి ఆశీర్వాదంతో జైలు నుంచి బయటకు వచ్చానని తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు ఢిల్లీ కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ ఆలయాన్ని దర్శించుకోబోతున్నానని, తనను చూడాలంటే ప్రజలు అక్కడికి రావాలని కేజ్రీవాల్ సూచించారు. ఆయన శనివారం మధ్యాహ్నం ఆప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతారు. రోడ్ షోలో పాల్గొంటారు.

'ఇండియా' కూటమిలో హర్షాతిరేకాలు

అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో మధ్యంతర బెయిల్ మంజూరు కావడంతో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. మరో నాలుగు దశల పోలింగ్ మిగిలి ఉన్న నేపథ్యంలో కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం తమ కూటమికి లాభిస్తుందని వారు చెప్పారు. సత్యమేవ జయతే అని ఆప్ నేతలు నినదించారు.

''సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ లభించిన ఈ విజయం మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది. కేజ్రీవాల్ విడుదల న్యాయానికి ప్రతిబింబం. ఆయన రాకతో 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం అవుతుంది. ఈ ఎన్నికల్లో మా విజయావకాశాలు ఇంకా పెరుగుతాయి''
- ఎంకే స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

''హనుమాన్‌జీ కీ జై.. ఇది ప్రజాస్వామ్య విజయం. లక్షలాది మంది ప్రజల ప్రార్థనలు, ఆశీస్సులతో అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ లభించింది. వారందరికీ నా కృతజ్ఞతలు''
- సునీతా కేజ్రీవాల్, అరవింద్ కేజ్రీవాల్ భార్య

కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పొందడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ పరిణామం ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమి విజయానికి దోహదపడుతుందని భావిస్తున్నా''
- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

''కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇస్తూ సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వును స్వాగతిస్తున్నాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంలో మన దేశం దృఢంగా వ్యవహరిస్తోంది''
- శరద్ పవార్, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత

మా జోక్యం లేదు

రష్యా ఆరోపణలను ఖండించిన అమెరికా

వాషింగ్టన్: భారత ఎన్నికల్లో అమెరికా ప్రభుత్వ జోక్యం ఎంతమాత్రం లేదని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ స్పష్టంచేశారు. భారత అంశాల్లో అమెరికా ఉద్దేశపూర్వకంగా తలదూర్చుతోందని రష్యా సంచలన ఆరోపణ చేసిన నేపథ్యంలో అమెరికా అధికార ప్రతినిధి శుక్రవారం స్పందించారు. '' భారత్‌లోనేకాదు ప్రపంచంలో ఏ దేశానికి సంబంధించిన ఎన్నికల ప్రక్రియలు, దేశ పాలనా విధానాల్లో అమెరికా కలగజేసుకోదు. ఎన్నికల నిర్ణయాలన్నీ భారతీయ ప్రజలే తీసుకుంటారు'' అని అన్నారు. ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్వంత్‌సింగ్ పన్నూ గత ఏడాది భారత రీసెర్చ్ అండ్ అనాలసిస్ (రా) అధికారి, మరో భారతీయుడు కలిసి చంపేందుకు పన్నిన కుట్రను అమెరికా భగ్నం చేసిందని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జఖారోవా ఆరోపించారు. ఈ విషయాన్ని మిల్లర్ వద్ద మీడియా ప్రస్తావించగా.. '' అవన్నీ నిరాధార ఆరోపణలు. ప్రస్తుతం ఆ ఆరోపణలన్నీ జ్యూరీ వద్ద విచారణలో ఉన్నాయి. చట్టసంబంధ ఇలాంటి విషయంపై నేను ఇప్పుడే ఏమీ మాట్లాడలేను. అందుకే ఈ విషయాన్ని నేను ఇక్కడితో వదిలేస్తున్నా' అని మిల్లర్ వ్యాఖ్యానించారు.

రష్యా ఆరోపణలను భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి సైతం ఖండించారు. భారత్‌లో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ అమెరికాలో ఇటీవల ఒక నివేదిక వెలువడటం, దానిపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసిన తరుణంలో గార్సెట్టి శుక్రవారం భారత్‌ను పొగడ్తల్లో ముంచెత్తడం గమనార్హం. ''ఢిల్లీలో బంధాన్ని అమెరికా వందశాతం విశ్వసిస్తోంది. 21వ శతాబ్దిలో చక్కటి సత్సంబంధాల్లో ఒకటిగా భారత్–అమెరికా బంధం నిలుస్తుంది. అమెరికాలో రెండు కిలోమీటర్లు నడిచివెళ్లి ఓటేయడానికి బద్ధకిస్తారు. కానీ భారత్‌లో ఎక్కడో కొండల్లో ఉండే మతాధికారి సైతం రెండు రోజులు కాలినడకన వెళ్లి మరీ ఓటు వేస్తారు. ట్రక్కుల్లో అనధికార నగదు తరలింపులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు. ఇలాంటి అంశాల్లో అమెరికా కంటే భారత్ మెరుగ్గా పనిచేస్తోంది. కేంద్రప్రభుత్వం లాగే అక్కడి విపక్షాల పాలిత రాష్ట్ర ప్రభుత్వాలూ శక్తివంతమైనవే. భారత చరిత్ర చూస్తే అక్కడి అందరి హక్కులకు గౌరవం దక్కుతుంది. మనల్ని మనం ఇష్టపడేకంటే భారతీయులే మనల్ని ఎక్కువగా ఇష్టపడతారు. ఇప్పుడున్న ప్రపంచంలో ఇది నిజంగా అరుదైన విషయం' అని భారత్‌ను ప్రశంసించారు.



ప్రజలు నన్ను సమాధి కానివ్వరు

వారే నాకు రక్షణ కవచం: మోదీ

నందుర్బార్: తనను సజీవంగా సమాధి చేయాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని, కానీ, దేశ ప్రజలే తనకు రక్షణ కవచమని, తనకు ఎలాంటి హాని కలుగకుండా వారే కాపాడుకుంటారని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. మహారాష్ట్రలో ఓటు బ్యాంక్‌ను బుజ్జగించడానికి నకిలీ శివసేన తనను దూషిస్తోందని, బెదిరింపులకు దిగుతోందని శివసేన(ఉద్ధవ్)పై మండిపడ్డారు. శనివారం మహారాష్ట్రలోని నందుర్బార్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. విపక్షాలపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాలు ప్రజల మద్దతును, విశ్వాసాన్ని కోల్పోయాయని అన్నారు. తనను అంతం చేయడానికి సాగుతున్న కుట్రలు ఫలించబోవని తేల్చిచెప్పారు. తనను సజీవంగా గానీ, నిర్జీవంగా గానీ సమాధి చేయకుండా ప్రజలు అడ్డుకుంటారని పేర్కొన్నారు. మహారాష్ట్రలో మొఘల్ రాజు ఔరంగజేబును సమాధి చేసినట్లు మోదీని సైతం సమాధి చేయాలంటూ శివసేన(ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ ఇచ్చిన పిలుపును మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. మోదీకి సమాధి తవ్వుతామంటూ కాంగ్రెస్ బెదిరిస్తోందని ఆక్షేపించారు. శివసేన(ఉద్ధవ్) కూడా తనకు హెచ్చరికలు జారీ చేస్తోందని, బాల్‌థాక్రే బతికి ఉంటే చాలా బాధపడేవారని చెప్పారు.

లోక్‌సభ బరిలో ఖలిస్తాన్ మద్దతుదారులు

● జైలు నుంచే అమృత్‌పాల్ సింగ్ పోటీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఖలిస్తాన్ వేర్పాటువాదుల మద్దతుదారులు లోక్‌సభ ఎన్నికల్లో బరిలో దిగారు. పార్లమెంట్‌లో అడుగుపెట్టడంతో పాటు ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతు తెలిపే వారందరినీ ఏకం చేసేందుకు ఎన్నికలను ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. అకాలీదళ్‌కు చెందిన సిమ్రన్‌జీత్ సింగ్ మాన్, జైలులో ఉన్న 'వారిస్ పంజాబ్ దే' చీఫ్ అమృత్‌పాల్ సింగ్‌తో సహా ఎనిమిది మంది వేర్పాటువాదులు పంజాబ్ బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ రాజీనామాతో 2022లో జరిగిన సంగ్రూర్ ఉప ఎన్నికలో సిమ్రన్‌జీత్ సింగ్ మాన్ విజయం సాధించారు. ఇది ఖలిస్తానీ మద్దతుదారులకు ప్రేరణగా మారింది. సిమ్రన్‌జీత్ ఈసారి కూడా సంగ్రూర్ నుంచే పోటీ చేస్తున్నారు. ఆనంద్‌పూర్ సాహిబ్ నుంచి కుశాల్‌పాల్ సింగ్ మాన్, ఫరీద్‌కోట్ నుంచి బల్‌దేవ్ సింగ్ గాగ్రా, లుధియానా నుంచి అమృత్‌పాల్ సింగ్ చంద్ర, పటియాలా నుంచి మోనీందర్‌పాల్ సింగ్ పోటీ చేస్తున్నారు. కర్నాల్ నుంచి హర్జీత్ సింగ్ విర్క్, కురుక్షేత్ర స్థానం నుంచి ఖాజన్ సింగ్ బరిలోకి దిగారు. దిబ్రూగఢ్ జైల్లో ఉన్న ఖలిస్థానీ వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ ఖదూర్ సాహిబ్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.


అమృత్‌పాల్ సింగ్

బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు
నమోదు చేయండి

● పోలీసులకు ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపులు, ఇతర అభియోగాలను నమోదు చేయాల్సిందిగా ఢిల్లీ కోర్టు పోలీసులను ఆదేశించింది. తమను వేధించారంటూ ఐదుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఆరోపణల్లో బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా తగు ఆధారాలున్నట్లు కోర్టు తెలిపింది. కేసులు నమోదు చేయాల్సిందిగా అడిషనల్ చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్(ఏసీఎంఎం) ప్రియాంకా రాజ్‌పుత్ ఢిల్లీ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో సహ నిందితుడు, డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌పైనా అభియోగాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. బ్రిజ్ భూషణ్‌పై ఆరో మహిళా మైనర్ రెజ్లర్ చేసిన ఆరోపణలకు తగు ఆధారాలు లేనందున ఆమె పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపారు. కోర్టు ఈనెల 21న అధికారికంగా అభియోగాలను నమోదు చేయనుంది.

అయ్యర్ వీడియో కలకలం

న్యూఢిల్లీ: వరసబెట్టి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ నేతల జాబితాలో మణిశంకర్ అయ్యర్ చేరిపోయారు. దక్షిణభారత వాసులు ఆఫ్రికన్లలా ఉంటారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన శ్యామ్ పిట్రోడా వివాదం ముగిసేలోపే అయ్యర్ పాత వీడియో ప్రస్తుతం బీజేపీ ఎన్నికల ప్రచారాస్త్రంగా మారిపోయింది. పాక్ పట్ల కాంగ్రెస్ పక్షపాత ధోరణి మరోసారి బట్టబయలైందని బీజేపీ దుమ్మెత్తిపోయగా అవి అయ్యర్ వ్యక్తిగత అభిప్రాయాలని, పార్టీతో సంబంధం లేదని కాంగ్రెస్ ఖరాకండీగా చెప్పేసింది.

అయ్యర్ అన్నదేంటి?

ఏప్రిల్‌లో 'చిల్‌పిల్ మణిశంకర్' పేరిట జరిగిన ఒక ఇంటర్వ్యూలో అయ్యర్ చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. '' పొరుగుదేశమైన పాకిస్తాన్‌కు మనం గౌరవం ఇవ్వాల్సిందే. ఎందుకంటే అది కూడా సార్వభౌమ దేశమే. దాయాది దేశంతో తగాదాలకు పోతే భారత్‌పై అణుబాంబు వేయాలనే దుర్బుద్ధి పాక్ పాలకుల్లో ప్రబలుతుంది. పాక్‌తో కఠినంగా వ్యవహరించొచ్చు. కానీ చర్చలైతే జరపాలికదా. సరిహద్దుల్లో తుపాకీ పట్టుకుని తిరిగినంతమాత్రాన ఒరిగేదేమీ ఉండదు. ఉద్రిక్తతలు అలాగే కొనసాగుతాయి. పాక్‌లో పిచ్చోడు అధికారంలోకి వస్తే భారత్‌కు ప్రమాదమే కదా. పాక్ వద్ద కూడా అణుబాంబులు ఉన్నాయి. మన అణుబాంబును లాహోర్‌లో పేలిస్తే తిరిగి దాని రేడియోధార్మిక ప్రభావం కేవలం ఎనిమిది సెకన్లలోనే మన అమృత్‌సర్‌పై పడుతుంది. అందుకే పాక్‌తో చర్చల ప్రక్రియ మొదలెట్టాలి'' అని అన్నారు.

రఫా నుంచి 1.10 లక్షల పౌరుల వలస

రఫా: దక్షిణ గాజా స్ట్రిప్‌లోని రఫా నగర శివార్లలో ఇజ్రాయెల్ సైన్యం, హమాస్ మిలిటెంట్ల మధ్య పోరాటం ఆగట్లేదు. దాడులు, ప్రతిదాడులతో ఈ ప్రాంతం అట్టుడుకుతోంది. ఇతర ప్రాంతాల నుంచి ఆహార ధాన్యాలు, నిత్యావసరాల సరఫరా పూర్తిగా ఆగిపోయింది. దీంతో రఫా ప్రజలు ఆ ప్రాంతాన్ని వీడుతున్నారు. ఇప్పటిదాకా 1,10,000 మంది రఫా నుంచి బయటకు వెళ్లిపోయారని ఐక్యరాజ్యసమితి తెలిపింది.

దభోల్కర్ హత్యోదంతంలో
ఇద్దరికి జీవితఖైదు

పుణె: అంధవిశ్వాసాలను రూపుమాపేందుకు మహారాష్ట్రలో సామాజిక ఉద్యమం చేసిన హేతువాది డాక్టర్ నరేంద్ర దభోల్కర్ హత్యోదంతంలో ఇద్దరు నిందితులకు పుణె ప్రత్యేక న్యాయస్థానం జీవితఖైదు విధించింది. దభోల్కర్ హత్య జరిగిన 11 సంవత్సరాలకు తీర్పు వెలువడటం గమనార్హం. ఈ కేసులో ముగ్గురు నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. ఈ హత్యలో కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొన్న వీరేంద్రసిన్హా తావ్డేకు వ్యతిరేకంగా సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా నిర్దోషిగా ప్రకటిస్తూ అదనపు సెషన్స్ జడ్జి తీర్పు చెప్పారు. షూటర్లు సచిన్ అంధూరే, శరద్ కలాస్కర్‌లకు జీవితఖైదుతో పాటు చెరో రూ.5 లక్షల జరిమాన విధించారు. సరైన సాక్ష్యాలు లేని కారణంగా తావ్డే, సంజీవ్, విక్రమ్‌ను కోర్టు నిర్దోషులుగా విడిచిపెట్టింది. 67 ఏళ్ల దభోల్కర్ 2013 ఆగస్టు 20న పుణెలో ఉదయపు నడకకు వెళ్లినపుడు బైక్‌పై వచ్చిన ఆగంతకులు కాల్పులు జరిపి పారిపోయారు. తీవ్రగాయాలైన దభోల్కర్ ఆస్పత్రిలో చనిపోయారు.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్..
12 మంది నక్సల్స్ మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో శుక్రవారం మరో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గంగలూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిడియా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ సాగిస్తున్న భద్రతా బలగాలపై నక్సల్స్ కాల్పులకు దిగారు. ఇరువురి నడుమ ఎదురుకాల్పులు గంటలపాటు కొనసాగాయి. కాల్పుల అనంతరం ఘటనా ప్రాంతంలో 12 మంది మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఎం విష్ణుదేవ్ సాయ్ తెలిపారు. అదేసమయంలో, మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఒక బారెల్ గ్రెనేడ్ లాంచర్, 12 బోర్ గన్, దేశవాళీ రైఫిల్, భారీగా పేలుడు పదార్థాలు లభించాయన్నారు. ఏప్రిల్ 16, 30వ తేదీల్లో చోటుచేసుకున్న భారీ ఎన్‌కౌంటర్లలో 39 మంది మావోయిస్టులు చనిపోవడం తెల్సిందే. బస్తర్ ప్రాంతంలో ఈ ఏడాదిలో వివిధ ఎన్‌కౌంటర్లలో108 మంది నక్సల్స్ చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.



ఎన్నికల విచిత్రం

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో శుక్రవారం రాష్ట్రీయ సంవిధాన్ సమ్మేళన్ చర్చా కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. వేదిక పైనున్న ఆయన వద్దకు వచ్చి ఆప్యాయంగా పలకరిస్తున్న ఓ చిన్నారి.

ఎలక్షన్ బీట్

యూపీలో 'ఇండియా' తుపాను

మోదీ మరోసారి ప్రధాని కాలేరు: రాహుల్ గాంధీ

కనౌజ్/కాన్పూర్: విపక్షాల 'ఇండియా' కూటమి తుపాను ఉత్తరప్రదేశ్‌లోకి దూసుకొస్తోందని ఈ ధాటికి మరోసారి మోదీ ప్రధాని కాలేరని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. యూపీలో 80 స్థానాలకుగాను కనీసం 50 చోట్ల మా కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్, కాన్పూర్‌లలో ఎన్నికల ప్రచార ర్యాలీల్లో రాహుల్ మాట్లాడారు. '' దేశ ప్రధానిగా మోదీ మరోసారి పగ్గాలు చేపట్టలేరని లిఖితపూర్వక గ్యారెంటీగా భావించండి. ఇక అంతా అయిపోయింది. బీజేపీ ఓటమి ఖాయం. అందుకు అనుగుణంగానే విపక్షాల కూటమి చాన్నాళ్ల క్రితమే ఎన్నికల ప్రచార వ్యూహాలు రచించింది. విద్వేష బజార్లలో ప్రేమ దుకాణాలను తెరిచాం. భారత్ జోడో యాత్ర, న్యాయయాత్ర చేశాం. దేశవ్యాప్తంగా విపక్షాల సమావేశాలు నిర్వహించాం'' అని అన్నారు. పారిశ్రామికవేత్తలు అదానీ, అంబానీలతో కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం చేసుకుందన్న మోదీ ఆరోపణలపై రాహుల్ స్పందించారు. '' ఓటర్లు పదేళ్ల నుంచి చూస్తున్నారు. ఒక్కసారైనా మోదీ అదానీ, అంబానీల పేరెత్తలేదు. కానీ ఇప్పుడు ఓటమి సుడిగుండం నుంచి కాపాడతారేమోనని వాళ్ల పేర్లు తొలిసారిగా ప్రస్తావిస్తున్నారు. ఓడిపోతున్నాను.. కాపాడండి అదానీ, అంబానీజీ అంటూ మోదీ ప్రాథేయపడుతున్నారు'' అని రాహుల్ వెటకారంగా మాట్లాడారు.

మోదీకి టెంపో బాగా తెలుసు

టెంపోల నిండా అదానీ, అంబానీల నుంచి నగదు మూటలు వచ్చినందుకే కాంగ్రెస్ నోరుమూసుకుందని మోదీ అనడంపై రాహుల్.. '' అంటే మోదీకి తరచూ అదానీ డబ్బులను టెంపోలో పంపిస్తారన్నమాట. ఏ రకం టెంపోలో డబ్బులు పంపిస్తారో ఆయనకు బాగా తెలుసు. టెంపోల గురించి మోదీకి బాగా అవగాహన ఉన్నట్లుంది'' అని అన్నారు.

కాంగ్రెస్ 80 సవరణలు చేసింది: గడ్కరీ

ఛత్రపతి శంభాజీనగర్: బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ ప్రతిపక్షాలు ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నాయని పార్టీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా స్పందించారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా మజల్‌గావ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార ర్యాలీలో మంత్రి మాట్లాడారు. నిజం చెప్పాలంటే, దేశ రాజ్యాంగానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు 80 సవరణలు చేశాయన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి సవరణలు చేయగలవే తప్ప, మార్చలేవని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రచారంలో 'టెంపో' ప్రతిపక్షాలదే: థరూర్

న్యూఢిల్లీ: సగానికి పైగా లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల ప్రచారంలో పైచేయి(టెంపో) ప్రతిపక్షాలదేనని కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ పేర్కొన్నారు. 'అధికార బీజేపీ నేతలు ఎన్నో అసత్యాలు ప్రచారం చేస్తున్న వేళ, ఎన్నికల ప్రచారంలో టెంపో మాత్రం ప్రతిపక్షాల వైపే ఉందని చెప్పకుండా ఉండలేకపోతున్నా'అని ఆయన శుక్రవారం పేర్కొన్నారు. అణ్వస్త్రాలున్న పాక్ జోలికి పోవద్దంటూ కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అంటున్నట్లుగా ఉన్న పాత వీడియోను బీజేపీ తాజాగా బయటికి తెచ్చింది. అదేవిధంగా, బుధవారం ప్రధాని మోదీ అంబానీ, అదానీల నుంచి రాహుల్ గాంధీకి టెంపోల కొద్దీ నల్లధనం అందిందంటూ వ్యాఖ్యానించడం తెల్సిందే. ఈ రెండింటి నేపథ్యంలోనే శశి థరూర్ 'టెంపో' మాటను వాడటం గమనార్హం.

పీవోకేలో ప్రతి అంగుళమూ మనదే: షా

ఖూంటీ(జార్ఖండ్): పాకిస్తాన్ వద్ద అణుబాంబు ఉన్నందున, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) గురించి మాట్లాడొద్దంటున్న కాంగ్రెస్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. పీవోకేలోని ప్రతి అంగుళమూ భారత్‌దేనని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన జార్ఖండ్‌లో ఖూంటీలో బీజేపీ ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. 'అణుబాంబు కలిగిన పాకిస్తాన్‌ను గౌరవించాలని కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చెబుతున్నారు. అణుబాంబులు కలిగిన పాక్‌తో పీవోకే గురించి మాట్లాడొద్దని కొన్ని రోజుల క్రితం ఇండియా కూటమి నేత ఫరూక్ అబ్దుల్లా కూడా చెప్పారు. కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలకు నేను ఒక్కటే చెప్పదలుచుకున్నా..పీవోకే భారత్‌దే, దాన్నెవరూ లాక్కోలేరు'అని అమిత్ షా స్పష్టం చేశారు.

దేవుడి పేరుతో ఓట్లా: ప్రియాంక

అమేథీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఉద్యోగాల కల్పన, ద్రవ్యోల్బణం కట్టడి గురించి మాట్లాడకుండా దేవుడి పేరు చెప్పి ప్రజలను ఓట్లడుగుతోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. అమేథీలో శుక్రవారం ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. 'ఎన్నికల ప్రచారానికి వస్తున్న మీ ఎంపీ స్మృతీ ఇరానీ, బీజేపీ నేతలు దేశంలో ద్రవ్యోల్బణం కట్టడి, వ్యవసాయానికి ప్రోత్సాహం, ఉద్యోగాల కల్పన వంటి వాటిపై మాట్లాడటం లేదు. మీ ఇళ్ల వద్దకు వచ్చి దేవుడి పేరుతో తమకు ఓటేయాలని అడుగుతున్నారు. పదేళ్లలో చేసిన అభివృద్ధిని చూపి వాళ్లు ఓట్లెందుకు అడగరు? మతాన్ని రాజకీయాల కోసం వాడుకోవడం తప్పు'అని ఆమె అన్నారు.

భారత్‌లో ఎన్నికలుంటే పాక్ ప్రస్తావనెందుకు?

భారత్‌లో ఎన్నికలు జరుగుతుండగా మధ్యలో పాకిస్తాన్ ప్రస్తావనెందుకు వస్తోందని ప్రియాంక ప్రశ్నించారు. ఎన్నికల్లో వాస్తవ అంశాలపైనే మాట్లాడాలని బీజేపీని ఆమె కోరారు. పీటీఐ ప్రతినిధితో ప్రియాంక మాట్లాడుతూ.. 'మా పార్టీ సీనియర్ నేత మణి శంకర్ అయ్యర్ గతంలో పేర్కొన్నట్లుగా ఉన్న వీడియోపై బీజేపీ ఎన్నికల వేళ ఇప్పుడు చర్చకు పెట్టింది. అసలు ఎన్నికలు జరిగేది భారత్‌లోనా, లేక పాకిస్తాన్‌లోనా?' అని ప్రశ్నించారు.

ఖర్గే వ్యాఖ్యలపై ఈసీ కన్నెర్ర

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి దశలవారీగా జరుగుతున్న పోలింగ్‌కు సంబంధించిన వివరాలను ఆలస్యంగా విడుదలచేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం సందేహాలకు తావిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానాలపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా స్పందించింది. ఎన్నికల క్రతువులో ఈసీ సమయపాలన, నిబద్ధతను ఖర్గే ప్రశ్నించడాన్ని ఈసీ తప్పుబట్టింది. ' పోలింగ్ డేటాపై విమర్శలు చేస్తూ ఓటర్లలో పోలింగ్ వ్యవస్థపై అనవసర సందేహాలు లేవనెత్తుతున్నారు. ఓటర్లను గందరగోళపరుస్తున్నారు. తన ఆందోళనలను ఇతర విపక్ష పార్టీలతో పంచుకునే స్వేచ్ఛ ఖర్గేకు ఉంది. అంతేగానీ ఆ లేఖను బహిరంగపరిచి జనాల్లో కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. ఇలాంటి అసంబద్ధ ప్రకటనలకు ఖర్గే దూరంగా ఉంటే మంచిది' అని ఈసీ ఆగ్రహం వ్యక్తంచేసింది.





సాయంత్రం 4.40 నిమిషాలకు కడపలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

గొంతు నొక్కేస్తున్నారు

మంగళగిరి, పుత్తూరు, కడప ఎన్నికల సభల్లో సీఎం వైఎస్ జగన్

ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని 57 నెలలకే అంతం చేసే కుట్రలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- మీరు నులిమేది నా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, రైతన్నలు, విద్యార్థుల గొంతులనే
- ఇవేవో ఎన్నికల కోసం తెచ్చిన పథకాలు కావు..
- ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు తెచ్చినవి అంతకంటే కాదు.. ఐదేళ్లుగా కొనసాగుతున్న స్కీమ్‌లనూ అడ్డుకున్నారు
- అవ్వాతాతలకు ఇంటికే పెన్షన్లనూ అడ్డుకున్నారు
- వీటి కోసం మీ బిడ్డ కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి తెచ్చారు.. బాబువి ఊసరవెల్లి రాజకీయాలు



మధ్యాహ్నం 2.30 గంటలకు పుత్తూరులో ఏపీ సీఎం వైఎస్ జగన్ ఎన్నికల బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

మీ భూమి మీదే..

ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోనే లేదు • ఈ చట్టం గురించి చంద్రబాబు హీనాతిహీనంగా దుష్ప్రచారాలు చేస్తున్నాడు
• రాజకీయ లబ్ధికోసం భూముల పేరుతో ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నాడు
• అసత్య ప్రచారాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు
• ప్రజలు కన్నతల్లిలా భావించే భూమిపై కుట్రలు చేస్తున్నాడు • ఈ చట్టానికి, భూ సంబంధిత ఫిర్యాదులకు సంబంధం ఏమిటి?
• చట్టమే అమలుకానప్పుడు భూ సంబంధిత ఫిర్యాదులెలా వస్తాయి?

భూ ఆక్రమణల ఫిర్యాదులు లేనేలేవు • రీ సర్వేలో 40 వేలకు పైగా భూ వివాదాలు పరిష్కారమయ్యాయి



ల్యాండ్ టైట్లింగ్ చట్టం వాస్తవాలు..

- ప్రజల ఆస్తులను కాపాడ్డానికే ల్యాండ్ టైట్లింగ్ చట్టం
- దీన్ని ఇంకా అమలు చేయడంలేదు. అమల్లోకి తెస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన మాత్రమే ఇచ్చింది. అమలుకు నోటిఫికేషన్ ఇంకా ఇవ్వలేదు
- నోటిఫికేషన్ ఇవ్వకుండా ఏ చట్టం అమలుచేయలేరు
- రాష్ట్రమంతటా ఈ చట్టం ఒకేసారి అమల్లోకి రాదు. భూముల సర్వే తర్వాత అభ్యంతరాలన్నీ పరిష్కరమయ్యాక, గ్రామాల వారీగా భూముల తుది రిజిస్టర్ రూపొందించిన చోట్ల కాలానుగుణంగా చట్టం అమల్లోకి వస్తుంది.
- నోటిఫికేషన్ ఇవ్వాలంటే రీసర్వే పూర్తవ్వాలి. ఆరు వేల గ్రామాల్లోనే సర్వే పూర్తయింది. ఇంకా 11 వేల గ్రామాల్లో పూర్తవ్వాలి. అప్పుడే చట్టం అమలుచేసే అవకాశం ఉంటుంది.
- ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి, రిజిస్ట్రేషన్లకు సంబంధంలేదు
- భూపత్రాలు యాజమానుల వద్దే ఉంటాయి. జిరాక్సు కాపీలు ఇస్తారనేది దుర్మార్గపు ప్రచారం
- ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమలైనా కోర్టుకు నిస్సంకోచంగా వెళ్లవచ్చు.
- వారసత్వ ఆస్తులను మ్యుటేషన్ తరహాలోనే చేసుకోవచ్చు. టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ దాన్ని నిర్ణయించలేడు.
- ఈ చట్టం 90 దేశాల్లో అమల్లో ఉంది. మహారాష్ట్ర కూడా ల్యాండ్ టైట్లింగ్ మోడల్ చట్టం చేసింది.
- 2019లో నీతి అయోగ్ అన్ని రాష్ట్రాలు ఈ చట్టం చేసుకోవాలని చెప్పింది
- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు టీడీపీ మద్దతు తెలిపింది.

చట్టమే అమల్లోలేదు.. ఇక దుర్మార్గాలేంటి?

- మీ దస్తావేజులు మీకే ఇస్తారు. ప్రస్తుతం కూడా ఇస్తున్నారు. గత 3 నెలల్లో 10 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వారందరికీ ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇచ్చారు.
- చంద్రబాబు బావమరిది, వియ్యంకుడైన నందమూరి బాలకృష్ణ ఇటీవల రిజిస్ట్రేషన్ చేయించుకుని ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకున్నాడు.
- అలాగే, పవన్‌కళ్యాణ్ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఒరిజినల్స్ తీసుకున్నాడు. కానీ, ప్రజలను మాత్రం జిరాక్సు కాపీలని భయపెడుతున్నాడు.
- అధికారం, డబ్బు, కండబలంతో మీ భూముల్ని ఎవరూ కొట్టేయలేరు. అది అసాధ్యం
- మీ వారసుల్ని నిర్ణయించేది మీరే. అందులో అధికారుల ప్రమేయం ఉండనే ఉండదు
- జగన్ మీ స్థలాన్ని బ్యాంకులో తనఖా పెట్టవచ్చనేది చంద్రబాబు చేసే తప్పుడు ప్రచారం
- ప్రస్తుతం ల్యాండ్ టైట్లింగ్ చట్టమేలేదు. అలాంటప్పుడు ల్యాండ్ టైట్లింగ్ ఆఫీసర్‌ని ఎలా నియమిస్తారు?
- ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా కోర్టుకు వెళ్లొచ్చు.

చంద్రబాబు సృష్టించిన తప్పుడు ప్రచారాలు..

- మీ ఆస్తులకు జిరాక్సు కాపీలు ఇస్తారు. ఒరిజినల్ పత్రాలు ఇవ్వరు :
  - ఇది పచ్చి అబద్ధం
- మీ ఆస్తులకు గ్యారంటీ ఉండదు. మీ భూములు లాక్కుంటారు :
  - ప్రజల ఆస్తులకు ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుంది
- మీ ఇళ్ల స్థలాలు ఎత్తుకెళ్తారు. మీ యాజమాన్య హక్కులు నిరూపించుకోవాలి :
  - స్థలాలను ఎత్తుకెళ్తారనేది అపోహ
- కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదు :
  - నిరభ్యంతరంగా కోర్టుకు వెళ్లొచ్చు
- మీ వారసులకు భూములు దక్కవు :
  - మీ వారసులకే భూములు దక్కుతాయి
- ఇది కేంద్ర చట్టం కాదు. రాష్ట్రమే తెచ్చింది :
  - కేంద్రం అన్ని రాష్ట్రాలకు ఈ చట్టం గురించి సిఫారసు చేసింది
- మీ పాసు పుస్తకాలు మీ దగ్గర ఉండవు :
  - మీ పాస్ పుస్తకాలు మీ దగ్గరే ఉంటాయి

ప్రజలారా.. చంద్రబాబు మాటలు విని మోసపోవద్దు..

- భూముల్ని మింగిన చంద్రబాబు మీ భూముల్ని కాపాడతాడా?
- అమరావతిలో రూ.వేల కోట్ల విలువైన భూముల్ని దోచేసిన వాడు భూముల రక్షకుడా?
- విశాఖలో లక్ష ఎకరాల భూముల రికార్డుల్ని మాయం చేసిన మాయావి మీ భూములకు భద్రత కల్పిస్తాడా?
- వైఎస్ జగన్ హయాంలో ఒక్క భూకుంభకోణం జరగలేదు
- చంద్రబాబు హయాంలో అమరావతి భూముల కుంభకోణం, విశాఖ లక్ష ఎకరాల కుంభకోణం, సదావర్తి భూముల కుంభకోణం వంటివి ఎన్నో జరిగాయి
- వైఎస్ జగన్ హయాంలోనే భూములకు రక్షణ.
- చుక్కల భూములకూ విముక్తి కల్పించింది జగనే
- షరతుల గల పట్టా భూములకూ విముక్తి కల్పించింది జగన్
- అసైన్డ్ భూములకూ హక్కులు ఇచ్చిన వాడు జగన్
- చంద్రబాబు భూములు లాక్కుంటే.. జగన్ భూములు ఇచ్చాడు.

మీ దస్తావేజులు మీకే ఇస్తారు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏవీ జిరాక్సులు కాదు.. అన్నీ నిఖార్సైన ఒరిజినల్సే

- ఏడాదిగా 9.58 లక్షల రిజిస్ట్రేషన్లు చేసి ఒరిజినల్స్ ఇచ్చారు
- ఇ-స్టాంపింగ్ 2016లోనే మొదలైంది
- ఐదేళ్లలో 60 లక్షలకు పైగా డాక్యుమెంట్లు ఇ-స్టాంపింగ్ ద్వారా జారీ
- మీ ఆస్తి మీది కాదని టైటిల్ రిజిస్టర్ ఆఫీసర్ అనే అవకాశమేలేదు
- మీ వారసులను మీరే నిర్ణయిస్తారు
- సరైన కాగితాల్లేవని యజమానుల్ని జైల్లోపెట్టే పరిస్థితి ఉండనే ఉండదు
- ఇవన్నీ చంద్రబాబు చేసే తప్పుడు ప్రచారాలే
- వీటిపై ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆయనపై కేసు నమోదు చేయించింది
- ఎన్నికల్లో చెప్పుకునే అంశాలు లేక భూములపై దారుణ ప్రచారం
- భూములకు భద్రత పెరుగుతుందే తప్ప ఎలాంటి ముప్పు ఉండదు



పట్టాదారు పాస్ పుస్తకాలు చూపుతున్న బాధిత రైతులు

అటవీ అధికారులపై 'పోడు' రైతుల దాడి

- సాగు పనులు అడ్డుకోవడంపై ఆగ్రహం
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన
- 11 మంది రైతులు, ముగ్గురు అధికారులపై కేసు నమోదు



అటవీశాఖ అధికారులతో ఘర్షణ పడుతున్న రైతులు

రెబ్బెన(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం తుంగెడ బీట్ పరిధిలో పోడు సాగు పనులను అడ్డుకున్న అటవీశాఖ అధికారులపై శుక్రవారం రైతులు దాడికి దిగారు. తుంగెడ శివారులో గ్రామానికి చెందిన సుమారు 45 మంది రైతులకు 1986లో అప్పటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. స్థానికంగా ఉపాధి దొరకకపోవడంతో కొంతమంది వేరే ప్రాంతాలకు వలస వెళ్లారు. మిగిలిన వారు ఆ భూముల్లో వ్యవసా యం చేసుకుంటున్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ముగ్గురికి మాత్రమే ప్రభుత్వం కొత్త పట్టా పాస్‌పుస్తకాలు మంజూరు చేసింది. మిగతా రైతులకు జారీ చేయలేదు. గతంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న రైతులు కూడా గత సంవత్సరం నుంచి సాగు మొదలుపెట్టారు. కాగా, గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన భూమి తుంగెడ బీట్ పరిధిలోకి వస్తుందని, ఆ భూమి పూర్తిగా రిజర్వ్ ఫారెస్టుకు చెందిందని హెచ్చరిస్తూ అటవీశాఖ అధికారులు.. వ్యవసాయ పనులు చేపట్టకుండా రైతులను అడ్డుకుంటున్నారు. నెలరోజుల నుంచి రైతులు, అటవీశాఖ మధ్య వివాదం కొనసా గుతోంది. శుక్రవారం ఉదయం అధికారులు పోడు వ్యవసాయం చేస్తున్న ప్రాంతానికి వెళ్లగా.. రైతులు సైతం అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరు పక్షాల మధ్య వాగ్వావాదం జరిగింది. ఆగ్రహించిన రైతులు అధికారులపై దాడికి దిగారు. ప్రతి ఘటించిన ముగ్గురు సెక్షన్ అధికారులతోపాటు ఇద్దరు బీట్ అధికా రులకు గాయాలయ్యాయి. అధికారుల దాడిలో సుమారు పది మంది రైతులు గాయపడ్డారు. డీఎస్పీ సదయ్య, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తమపై దాడికి పాల్పడ్డారని 11 మంది రైతులపై అటవీశాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. అలాగే తమపై దాడి చేశారని రైతు లు.. ముగ్గురు ఫారెస్ట్ అధికారులపై రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 11 మంది రైతులు, ముగ్గు రు అటవీశాఖ అధికారులపై కేసు నమోదు చేశామని ఎస్సై చంద్రశేఖర్ వెల్లడించారు.

కాంగ్రెస్ పాలనలో 2014కు ముందు నాటి దుస్థితి

జానారెడ్డి వ్యాఖ్యలపై విరుచుకుపడ్డ జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: కాంగ్రెస్ ఆధ్వర్యంలోని రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణలో 2014కు ముందు నాటి దుస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. నాడు ప్రజలు ఎటువంటి నీళ్లు తాగేదో, సాగు నీరందక సూర్యాపేట, తుంగతుర్తి రైతాంగం ఏవిధంగా అల్లాడి పోయారో మీకు తెలియక పోవచ్చు కానీ, తెలంగాణ ఉద్యమకారుడిగా తనకు బాగా తెలుసని కాంగ్రెస్ నాయకుడు జానారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల జానారెడ్డి చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం సాయంత్రం జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలో ప్రత్యేక వీడియో విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచే చందాల దందా మొదలైందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల వ్యవధిలోనే సూర్యాపేటలో వర్తక వాణిజ్య వర్గాలు హడలిపోతున్నారని మండిపడ్డారు. సుభిక్షంగా ఉన్న రాష్ట్రంలో అబద్ధపు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన మీరు నాలుగు నెలల వ్యవధిలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పంటలు ఎండిపోయేలా చేసి 2014కు పూర్వ దుస్థితికి నెట్టేశారని ఆయన ధ్వజమెత్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు అండగా నిలబడాలని జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రధానిపై పాటకు ఆటోగ్రాఫ్..



బండారు దత్తాత్రేయ మనవరాలు జశోధరకు మోదీ అభినందన...

సాక్షి, హైదరాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ మనవరాలు జశోధర (6) తనపై ప్రత్యేకంగా పాడిన పాటను గుర్తుచేసుకుని ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నగరంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె తన కూతురు పాడిన పాటను మోదీ రీట్వీట్ చేసిన విషయాన్ని ప్రస్తావించగా..మోదీ స్పందించి త్వరలో జశోధరను కలుస్తానని తెలిపారు. అంతేకాకుండా మోదీ రీట్వీట్ చేసిన స్క్రీన్‌షాట్ ఫొటోగ్రాఫ్ పైన ఆటోగ్రాఫ్ ఇచ్చి ఆమెను అభినందించారు. తన ఇద్దరు కూతుర్లు జశోధర, వేదాన్షీ మోదీపైన ప్రత్యేకంగా పాటలు పాడారని విజయలక్ష్మి ప్రధానికి తెలిపారు.

అటు మోసం.. ఇటు నమ్మకం

అటు మాటపై నిలబడని చంద్రబాబు.. ఇటు మాటపై నిలబడే సీఎం జగన్

కూటమిది మాయఫెస్టో.. వైఎస్సార్‌సీపీది మేనిఫెస్టో



- మాటలతో మభ్యపెట్టి లబ్ధి పొందడమే చంద్రబాబు అజెండా
- మేనిఫెస్టో అంటే ఈయన దృష్టిలో చిత్తు కాగితం
- ఎన్నికలప్పుడు అలవికాని హామీలు.. ఆ తర్వాత చెత్తబుట్టలో వేయడం బాబు నైజం
- 2014 ఎన్నికల్లో జనసేన, బీజేపీతో జట్టుకట్టి 650 హామీలు
- అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా ముంచిన వైనం
- రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేయకుండా రైతులకు టోపీ
- రూ.25,570.90 కోట్ల డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా మహిళలకు మోసం
- ఇంటికో ఉద్యోగం.. లేదా నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి అంటూ యువతకు వంచన

2014 ఎన్నికల తరహాలోనే మళ్లీ జనసేన, బీజేపీలతో జట్టుకట్టి అలవికాని హామీలతో చంద్రబాబు మేనిఫెస్టో

కర్ణాటక, తెలంగాణల్లో విఫలమైన పథకాలకు సూపర్‌ సిక్స్‌ ముసుగు



- మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా చూస్తున్న సీఎం జగన్
- అమలు చేయగలిగిన హామీలు మాత్రమే ఇస్తున్న జననేత
- విశ్వసనీయత లేకపోతే రాజకీయాల్లో ఉండకూడదన్నది జగన్‌ సిద్ధాంతం
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం జగన్‌ విధానం
- 2019లో రెండే రెండు పేజీలతో మేనిఫెస్టో విడుదల చేసిన జగన్
- అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం.. ఇప్పటికి 99 శాతం హామీలు అమలు
- సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ
- నాన్‌ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనం
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంతో సీఎం జగన్‌ నాయకత్వంపై ప్రజల్లో మరింత పెరిగిన విశ్వసనీయత
- 2024 ఎన్నికల మేనిఫెస్టోను రెండు పేజీలతో విడుదల చేసిన సీఎం జగన్
- జగనన్న అమ్మ ఒడి కింద ఇస్తున్న సొమ్ము రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంపు
- వైఎస్సార్‌ రైతు భరోసా కింద చేస్తున్న సాయం రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంపు
- వృద్ధాప్య పెన్షన్‌ రూ.3 వేల నుంచి రెండు విడతల్లో రూ.3,500కు పెంచుతానని హామీ

చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం ఇదే తొలిసారి కాదు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి, 1995లో అధికారంలోకి వచ్చిన బాబు.. 94 ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలోనూ సంపూర్ణ మద్యపాన నిషేధం, రూ.2కే కిలో బియ్యం హామీలను తుంగలో తొక్కారు. మద్యపాన నిషేధాన్ని ఎత్తేసి, రూ.2 కే కిలో బియ్యాన్ని రూ.5.50కి పెంచి ప్రజలను మోసం చేశారు. 1999 ఎన్నికల్లోనూ అదే కథ. కోటి మందికి ఉపాధి కల్పిస్తానని, 30 లక్షల ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు.



దివాలాకోరు

బ్యాంకులకు రూ.5,700 కోట్లు కుచ్చు టోపీ

- సుజనా వ్యక్తిగత దివాలా ప్రక్రియకు ఎన్‌సీఎల్‌టీ అనుమతి
- ఎస్‌బీఐలో రూ.500 కోట్ల రుణానికి వ్యక్తిగత పూచీకత్తు
- తప్పుడు పత్రాలతో బ్యాంక్‌లను బురిడీ కొట్టించిన మోసగాడు

మరిన్ని పేజీల కోసం క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

టీడీపీ కూటమి 2014 మేనిఫెస్టో

హామీ: అధికారంలోకి రాగానే వ్యవసాయ రుణాల మాఫీపై తొలి సంతకం చేస్తా.

అమలు: రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీపై తొలి సంతకం చేయకుండా సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే 2014, జూన్‌ 8న చంద్రబాబు మోసం చేశారు. వ్యవసాయ రుణాల మాఫీపై కోటయ్య కమిటీని వేసి.. స్కేల్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌ పేరుతో కోతలు పెట్టి రూ.15,297 కోట్లను మాత్రమే మాఫీ చేశారు. మిగతా రూ.72,315 కోట్లు మాఫీ చేయకుండా రైతులకు చంద్రబాబు టోపీ పెట్టారు.

హామీ: డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తా.

అమలు: టీడీపీ సర్కార్‌ అధికారంలోకి వచ్చే నాటికి రూ.14,205 కోట్లు పొదుపు సంఘాల మహిళలు బకాయిపడ్డారు. ఆ రుణాల్లో ఒక్క పైసా కూడా మాఫీ చేయకుండా మహిళలను చంద్రబాబు వంచించారు.

హామీ: ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందజేస్తా.

అమలు: 2014, జూన్‌ 8 నుంచి 2019, మే 29 వరకూ కేవలం 32 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేశారు. రాష్ట్రంలోని కోటికిపైగా ఇళ్ల(కుటుంబాలు)కు ఉద్యోగాలు ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి కింద పైసా కూడా ఇవ్వలేదు. ఒక్కో ఇంటికి నెలకు రూ.2 వేల చొప్పున 60 నెలలకు రూ.1.20 లక్షలు ఇవ్వకుండా ఎగ్గొట్టి చంద్రబాబు మోసం చేశారు.

హామీ: ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్‌ చేస్తా.

అమలు: ఐదేళ్లలో పుట్టిన ఒక్క ఆడబిడ్డ పేరుతో ఒక్క పైసా కూడా డిపాజిట్‌ చేయకుండా చంద్రబాబు మోసం చేశారు.

హామీ: అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం ఇచ్చి.. పక్కా ఇళ్లు కట్టిస్తాం.

అమలు: మూడు సెంట్లు స్థలం మాట దేవుడెరుగు.. కనీసం ఏ ఒక్కరికీ సెంటు స్థలం కూడా ఇవ్వకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేశారు.

హామీ: ఏటా రూ.పది వేల కోట్లతో బీసీ సబ్‌ ప్లాన్‌ను అమలు చేస్తా.

అమలు: ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.పది వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేల కోట్లను బీసీ సబ్‌ ప్లాన్‌ కింద ఆ వర్గాల సంక్షేమం కోసం ఖర్చు చేయాలి. కానీ.. ఐదేళ్లలో రూ.36 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేసి, అందులోనూ అవినీతికి పాల్పడి బీసీలను మోసం చేశారు.

హామీ: చేనేత, పవర్‌లూమ్స్‌ రుణాలు మాఫీ చేస్తా.

అమలు: ఒక్క రూపాయి రుణాన్ని కూడా మాఫీ చేయకుండా చేనేత, పవర్‌లూమ్స్‌ కార్మికులకు చంద్రబాబు టోపీ పెట్టారు.

హామీ: సింగపూర్‌ను మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తా. ప్రతి నగరంలో, జిల్లా కేంద్రంలో హైటెక్‌ సిటీ నిర్మిస్తా.

అమలు: సింగపూర్‌ను మించి అభివృద్ధి మాటేమోగానీ అడ్డగోలు, అవినీతి, అక్రమాలకు పాల్పడి రాష్ట్రంలో చంద్రబాబు విధ్వంసం సృష్టించారు. జిల్లా కేంద్రాల మాట దేవుడెరుగు కనీసం ఏ ఒక్క నగరంలో కూడా హైటెక్‌ సిటీ నిర్మాణానికి పునాదిరాయి కూడా వేసిన పాపాన పోలేదు.

హామీ: మహిళల భద్రతకు ఉమెన్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తా. ఆపదలో ఉన్న మహిళలకు సెల‌ఫోన్ల ద్వారా 5 నిమిషాలలో సహాయం అందించే వ్యవస్థ ఏర్పాటుచేస్తా.

అమలు: ఉమెన్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ ఏర్పాటుకు చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. విజయవాడలో కాల్‌మనీ సెక్స్‌ రాకెట్‌ మహిళల మానప్రాణాలతో చెలగాటమాడటం రాష్ట్రాన్ని కుదిపేసింది. ఇసుక దోపిడీకి అడ్డుతగిలిన తహసీల్దార్‌ వనజాక్షిని అప్పటి టీడీపీ ఎమ్మెల్యే జుట్టుపట్టుకుని లాగి, దాడిచేసినా బాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

హామీ: పేద పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య, కాలేజీ విద్యార్థులకు ఐప్యాడ్, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు తెస్తా.

అమలు: విద్యా విధానంలో మార్పుల మాట దేవుడెరుగు కనీసం ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలను పెంచేందుకు చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాలేజీ విద్యార్థులకు ఐప్యాడ్‌లు ఇవ్వకుండా మోసం చేశారు. ఫీజు ఎంత ఉన్నా రూ.35 వేలు మాత్రమే ఫీజురీయింబర్స్‌మెంట్‌ కింద ఇవ్వడం వల్ల విద్యార్థుల తల్లితండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడింది.

హామీ: ఆరోగ్యశ్రీ కంటే మెరుగైన వైద్య సేవలు అందిస్తా.

అమలు: ఆరోగ్యశ్రీ పేరును ఎన్టీఆర్‌ వైద్య సేవగా మార్చిన చంద్రబాబు.. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేయడం వల్ల ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు చికిత్స అందించడానికి యాజమాన్యాలు నిరాకరించాయి. దాంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే ఆరోగ్యశ్రీని చంద్రబాబు నీరుగార్చారు. ఆరోగ్యశ్రీ కింద చంద్రబాబు పెట్టిన రూ.600 కోట్ల బకాయిలను సీఎం జగన్‌ చెల్లించారు.

హామీ: రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తా.. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్ట నివారణకు రైతుల వారీగా బీమా సౌకర్యం కల్పిస్తా.

అమలు: ధరల స్థిరీకరణ నిధి కింద ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గిట్టుబాటు ధరలు దక్కక ధాన్యం, అపరాలు, ఉల్లి, టమాటా, మామిడి, బత్తాయి తదితర రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను మోసం చేశారు.

హామీ: ప్రతి జిల్లాకూ, పట్టణానికి, మండలానికి, గ్రామానికి ఒక దార్శనిక పత్రం (విజన్‌ డాక్యుమెంట్‌)ను తయారుచేసి అభివృద్ధి చేస్తాం.

అమలు: ప్రతి జిల్లా, పట్టణం, మండలం, గ్రామం అభివృద్ధి మాటేమోగానీ.. అడ్డగోలుగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు బ్యాచ్‌ అధోగతిపాలు చేశాయి.

హామీ: అవినీతిరహిత సుపరిపాలన, పాలనలో పారదర్శకత తెస్తా. పెరుగుతున్న నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటా.

అమలు: అక్షర క్రమంలో ముందున్న ఆంధ్రప్రదేశ్‌ను అవినీతిలోనూ చంద్రబాబు అగ్రగామిగా నిలిపారు. చంద్రబాబు మానసపుత్రిక అయిన జన్మభూమి కమిటీల్లోని టీడీపీ నేతలు లంచాల కోసం ప్రజలను పీడించాయి.

హామీ: కొత్తగా కళింగపట్నం, నరసాపురం ఓడరేవు, నిజాంపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులను నిర్మించి, పాత పోర్టులతో అనుసంధానం చేస్తూ ఇండస్ట్రియల్‌ క్లస్టర్స్‌ను అభివృద్ధి చేస్తా.

అమలు: ఐదేళ్లలో కొత్తగా ఒక్కటంటే ఒక్క పోర్టు నిర్మాణ పనులు కూడా చంద్రబాబు ప్రారంభించలేదు. ఇండస్ట్రియల్‌ క్లస్టర్స్‌ను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

హామీ: వివిధ జిల్లాలను అనుసంధానం చేస్తూ బుల్లెట్‌ ట్రైన్స్‌ (ర్యాపిడ్‌ రైల్వే ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ)ను ప్రవేశపెడతాం.

అమలు: బుల్లెట్‌ ట్రైన్స్‌ పేరుతో ఎన్నికల్లో అరచేతిలో వైకుంఠం చూపిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఎన్నడూ ఆ మాట ఎత్తడానికి కూడా సాహసించలేదు.

హామీ: పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తా. గాలేరు-నగరి, హంద్రీ-నీవా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెలిగొండ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేస్తాం.

అమలు: కమీషన్ల కక్కుర్తితో జాతీయ పోలవరం ప్రాజెక్టులో చంద్రబాబు విధ్వంసం సృష్టించారు. పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కోసం చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారంటూ 2019, ఏప్రిల్‌ 1న రాజమహేంద్రవరంలో ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేయడమే అందుకు నిదర్శనం. గాలేరు-నగరి, హంద్రీ-నీవా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెలిగొండ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, భారీ ఎత్తున నిధులు దోచేశారు. దాంతో ఆ ప్రాజెక్టులు పూర్తి కాలేదు.

హామీ: కేంద్రం రాజధాని లేకుండా విభజించి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టింది. సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని రాజధానిగా ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మిస్తా.

అమలు: ప్రపంచస్థాయి నగరం మాటేమోగానీ.. ఆ ముసుగులో ఓత్‌ ఆఫ్‌ సీక్రసీని తుంగలో తొక్కి.. రాజధానిలో ఇన్‌సైడర్‌ ట్రేడింగ్‌కు పాల్పడి అంతర్జాతీయ స్థాయి భూ కుంభకోణానికి చంద్రబాబు పాల్పడ్డారు. అమరావతిలో ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క శాశ్వత భవనాన్ని నిర్మించలేకపోయారు. కనీసం రహదారి సౌకర్యాన్ని కూడా కల్పించలేకపోయారు.

మీ ఓటు

విశ్వసనీయతకా? మోసానికా?

వైఎస్సార్‌సీపీ 2019 మేనిఫెస్టో

హామీ: ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేసి.. అదే ఊరిలోని పది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తాం. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దకే ప్రజలకు అందిస్తాం. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం.

అమలు: రాష్ట్రంలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను సీఎం జగన్‌ ఏర్పాటు చేశారు. ఒకే నోటిఫికేషన్‌ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.35 లక్షల మంది ఉద్యోగులను నియమించారు. సగటున 50 నుంచి 75 ఇళ్లకు ఒకరు చొప్పున 2.65 లక్షల మంది వలంటీర్లను నియమించి.. ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి గుమ్మం వద్దకే అందించి.. గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్‌ ఆవిష్కరించారు. వివిధ శాఖల్లో 2.31 లక్షల ఉద్యోగులను నియమించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే.. ఈ 59 నెలల్లోనే 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం గమనార్హం. ప్రభుత్వ, ప్రైవేట్, ఎంఎస్‌ఎంఈలు, స్వయం ఉపాధితో కలిపి 58.22 లక్షల మందికి పైగా ఉద్యోగాలు, ఉపాధి కల్పించారు.

హామీ: వైఎస్సార్‌ ఉచిత పంటల బీమా, రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి గిట్టుబాటు కల్పించి.. రైతులకు దన్నుగా నిలుస్తాం

అమలు: రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్‌ ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఐదేళ్లలో పంటలు దెబ్బతిన్న 54.76 లక్షల మంది రైతులకు రూ.7,802.05 కోట్ల పరిహారాన్ని అందించారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటుచేసి.. మార్కెట్లో ధరలేని పంటల ఉత్పత్తులు 21.73 లక్షల టన్నులను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రూ.7,796 కోట్లను వెచ్చించి, రైతులకు అండగా నిలిచారు. పంట నష్టపోయిన 34.41 లక్షల మంది రైతులకు ఇన్‌పుట్‌ సబ్సిడీ కింద రూ.3,261.61 కోట్లు అందించారు.

హామీ: వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉన్న వారందరికీ వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీని వర్తింపజేస్తాం. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తాం. చికిత్సల అనంతరం వైఎస్సార్‌ ఆరోగ్య ఆసరాగా కింద ఆర్థిక సహాయం అందిస్తాం.

అమలు: ఆరోగ్యశ్రీ కింద చికిత్స విధానాలను 1059 నుంచి 3,257కు పెంచారు. చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటిన అందరికీ ఆరోగ్యశ్రీని వర్తింపజేశారు. ఐదేళ్లలో 45.10 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కింద చికిత్సల కోసం రూ.13,421 కోట్లు ఖర్చు చేశారు. విశ్రాంతి సమయంలో రోగులకు ఆరోగ్య ఆసరా కింద 24.59 లక్షల మందికి రూ.1,465 కోట్లను అందించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షల వరకూ పెంచారు. గతంలో ఇది రూ.5 లక్షల వరకే ఉండేది.

హామీ: పేద విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు వసతి, భోజనం కోసం అదనంగా ఏటా రూ.20 వేలు అందిస్తాం.

అమలు: ఇచ్చిన మాట మేరకు జగనన్న విద్యా దీవెన పథకం 29.65 లక్షల మంది విద్యార్థులకు రూ.12,609.68 కోట్లను ఫీజురీయింబర్స్‌మెంట్‌గా చెల్లించారు. 2017-19 మధ్య చంద్రబాబు 16.73 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు రూ.1,778 కోట్లను సీఎం జగన్‌ చెల్లించారు. జగనన్న వసతి దీవెన కింద 25.17 లక్షల మంది విద్యార్థులకు రూ.4,275.76 కోట్లను అందించారు.

హామీ: వైఎస్సార్‌ ఆసరా పథకం కింద ఎన్నికల రోజు వరకూ అక్క చెల్లెమ్మలకు ఉన్న పొదుపు సంఘాల రుణాల మొత్తం సొమ్మును నాలుగు దఫాలుగా వారి చేతికే అందిస్తాం. మళ్లీ సున్నా వడ్డీకే రుణాల విప్లవం తెస్తాం.

అమలు: 2019, ఏప్రిల్‌ 11 నాటికి పొదుపు సంఘాల మహిళలు 78.94 లక్షల మందికి ఉన్న రూ.25,570.90 కోట్లను నాలుగు విడతల్లో నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేశారు. సున్నా వడ్డీ కింద పొదుపు సంఘాల మహిళలకు రూ.4,969.04 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు.

హామీ: జలయజ్ఞం ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. పోలవరాన్ని పూర్తి చేస్తాం.

అమలు: కరోనా మహమ్మారి ప్రభావం వల్ల లాక్‌డౌన్‌తో రెండేళ్లు పనులు చేయలేని పరిస్థితి. మిగతా మూడేళ్లలో రూ.35,268.05 కోట్లతో ఆరు ప్రాజెక్టులు (సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్, లక్కవరం ఎత్తిపోతల, అవుకు సొరంగం, కుప్పం బ్రాంచ్‌ కెనాల్, వెలిగొండ జంట సొరంగాలు-తొలి దశ) పూర్తి చేశారు. పోలవరంలో చంద్రబాబు చేసిన తప్పులను సరిదిద్దుతూ.. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన స్పిల్‌ వే, స్పిల్‌ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్‌ డ్యామ్‌లు పూర్తి చేసి.. గోదావరి వరదను మళ్లించారు. చంద్రబాబు చారిత్రక తప్పిదం వల్లే దెబ్బతిన్న డయాఫ్రమ్‌ వాల్‌పై కేంద్రం నిర్ణయం వెల్లడించడమే తరువాయి.. ఈసీఆర్‌ఎఫ్‌ డ్యామ్‌ పనులు చేపట్టి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సీఎం జగన్‌ సిద్ధంగా ఉన్నారు.

హామీ: ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తాం. ఆ స్థలాలను అక్క చెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్‌ చేసి ఇస్తాం. ఇళ్లు కూడా కట్టిస్తాం.

అమలు: ఇచ్చిన మాట మేరకు 31 లక్షల మందికిపైగా అక్క చెల్లెమ్మలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసి.. వాటిపై సర్వహక్కులు కల్పిస్తూ వారి పేరుతోనే రిజిస్ట్రేషన్‌ చేసి ఇచ్చారు. ఈ స్థలాల మార్కెట్‌ విలువ రూ.76 వేల కోట్లకుపైగానే పలుకుతోంది. అంతే కాకుండా 22 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి.. 9 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇవ్వడంతోపాటు రూ.35 వేలు పావలా వడ్డీకే రుణంగా అందించారు. ఉచితంగా ఇసుక, సబ్సిడీపై ఇతర నిర్మాణ సామగ్రిని సరఫరా చేసి.. ఒక్కో లబ్ధిదారుకు రూ.55 వేల చొప్పున ప్రయోజనం చేకూర్చారు. ఒక్కో లబ్ధిదారుకు రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ స్థిరాస్తిని సమకూర్చారు.

హామీ: బీసీల అభ్యున్నతికి ఏడాదికి రూ.15 వేల కోట్లు చొప్పున 5 ఏళ్లలో రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తాం. బీసీల్లోని అన్ని ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, వైఎస్సార్‌ చేయూత ద్వారా ఎంత అవసరమైతే అన్ని నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి తోడుగా ఉంటాం. నామినేటెడ్‌ పదవులు, పనుల్లో 50 శాతం రిజర్వేషన్‌ కల్పిస్తూ చట్టం తెస్తాం. బీసీ జనగణన చేసి.. చట్టసభలో బీసీలకు రిజర్వేషన్‌ కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం. శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్‌ ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పిస్తాం.

అమలు: బీసీల అభ్యున్నతికి చెప్పిన దాని కంటే అధికంగా నిధులు ఖర్చు చేశారు. డీబీటీ రూపంలో రూ.1.28 లక్షల కోట్లను బీసీ లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమా చేశారు. నాన్‌ డీబీటీ రూపంలో రూ.52 వేల కోట్ల ప్రయోజనం చేకూర్చారు. డీబీటీ, నాన్‌డీబీటీ కలిపి మొత్తం రూ.1.80 లక్షల కోట్లను బీసీల అభ్యున్నతి కోసం ఖర్చు చేశారు. బీసీల్లోని ఉప కులాలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, ఆ వర్గాల వారినే చైర్మన్‌లు, డైరెక్టర్‌లుగా నియమించారు. నామినేటెడ్‌ పనుల్లో, పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్‌ చేస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు ప్రయోజనం చేకూర్చారు. బీసీ జనగణన చేయించి.. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్‌ కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంతోపాటు పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టారు. శాశ్వత బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించారు.

హామీ: షాపులు ఉన్న నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు ఏడాదికి రూ.పది వేలు ఆర్థిక సహాయం చేసి తోడుగా ఉంటాం.

అమలు: ఐదేళ్లలో 3.37 లక్షల మందికి జగనన్న చేదోడు పథకం కింద రూ.1,260.17 కోట్లను సహాయంగా అందించి, తోడుగా నిలిచారు.

హామీ: మగ్గం ఉన్న చేనేత కార్మికుల కుటుంబాలకు ఏడాదికి రూ.24 వేలను ప్రోత్సాహకంగా ఇస్తాం.

అమలు: వైఎస్సార్‌ నేతన్న నేస్తం పథకం కింద 82,130 మంది మగ్గం ఉన్న చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో రూ.982.98 కోట్లను అందించారు.

హామీ: కులవృత్తిదారులు, చిరు వ్యాపారులకు సున్నా వడ్డీకే రూ.పది వేలు ఇస్తాం.

అమలు: జగనన్న తోడు పథకం కింద 15.87 లక్షల మందికి సున్నా వడ్డీకే రుణాలు ఇచ్చారు. సున్నా వడ్డీ కింద వారికి రూ.88.33 కోట్లు ఇచ్చారు.

హామీ: వైఎస్సార్‌ చేయూత పథకం కింద 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్క చెల్లెమ్మలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ.75 వేలు ఇస్తాం.

అమలు: చెప్పిన మాట మేరకు 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కలు 33.15 లక్షల మందికి రూ.19,189.59 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు.

హామీ: పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకంగా ఇస్తున్న రాయితీల (భూమి, పన్ను, విద్యుత్‌)తో పాటు ఏపీఐడీసీని పునరుద్ధరించి.. నిరుద్యోగ యువతకు సబ్సిడీ అందించి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడతాం.

అమలు: అధికారం చేపట్టినప్పటి నుంచి పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక సంస్కరణల ద్వారా సులభతర వాణిజ్యం (ఈజ్‌ ఆఫ్‌ డూయింగ్‌ బిజినెస్‌)లో ఏటా రాష్ట్రాన్ని దేశంలో నంబర్‌ వన్‌గా నిలుపుతున్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఏటా సగటున రూ.14,896 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఏపీఐడీసీని పునరుద్ధరించారు. ప్రభుత్వం ఇచ్చిన తోడ్పాటుతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) 1.9 లక్షల నుంచి ఏడు లక్షలకు చేరుకున్నాయి. 22.07 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. పరిశ్రమల స్థాపనతో గత 59 నెలల్లోనే కొత్తగా 28.92 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. ప్రభుత్వ, ప్రైవేట్, కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ కలిపి ఏకంగా 6,48,087 మందికి ఉద్యోగాలు, ఉపాధి లభించింది.

హామీ: పార్లమెంటు నియోజకవర్గం యూనిట్‌గా ఒక జిల్లాను ఏర్పాటు చేసి.. జిల్లాకు ఒక మెడికల్‌ కాలేజీని ఏర్పాటు చేస్తా.

అమలు: 13 జిల్లాలను పునర్‌వ్యవస్థీకరించి 26 జిల్లాలను ఏర్పాటు చేశారు. కొత్తగా 17 మెడికల్‌ కాలేజీలు నిర్మిస్తున్నారు. 2023-24లో ఐదు మెడికల్‌ కాలేజీలను ప్రారంభించారు. 2024-25లో మరో ఐదు మెడికల్‌ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. మిగిలిన ఏడు 2025-26లో ప్రారంభించనున్నారు.

హామీ: పిల్లల చదువులకు ఏ పేదింటి తల్లీ భయపడొద్దు. పిల్లలను బడికి పంపితే చాలు ప్రతి తల్లికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తాం.

అమలు: జగనన్న అమ్మ ఒడి పథకం కింద 44.48 లక్షల మంది తల్లులకు రూ.26,067.30 కోట్లను జమ చేశారు.

హామీ: ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు కింద అభివృద్ధి చేస్తాం. విద్యా ప్రమాణాలు పెంచుతాం. ఇంగ్లిష్‌ మీడియం ప్రవేశపెడతాం. పుస్తకాలు, యూనిఫాంలు సరైన సమయానికి ఇస్తాం. మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచుతాం.

అమలు: నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌ స్థాయికి అభివృద్ధి చేసే పనులను రెండు దశల్లో చేపట్టారు. తొలి దశ ఇప్పటికే పూర్తయింది. రెండో దశ పనులు వేగంగా సాగుతున్నాయి. కోర్టులకు వెళ్లి టీడీపీ అడ్డుకున్నా సరే.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్‌ మీడియంను ప్రవేశపెట్టారు. పాఠశాలలు ప్రారంభమైన రోజే జగనన్న విద్యాకానుక పథకం కింద పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు సాక్స్‌లు అందిస్తున్నారు. జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్నం నాణ్యమైన భోజనం తోపాటు చిక్కీ ఇస్తున్నారు. సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఐబీ సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నారు. మూడో తరగతి నుంచే టోఫెల్‌ శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతున్న పిల్లలు ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్‌), వైట్‌హౌస్‌ వేదికలపై రాష్ట్రంలో అమలవుతున్న విద్యా విధానం, సంస్కరణలపై అనర్గళంగా ప్రసంగించడం దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసింది.

హామీ: వైఎస్సార్‌ రైతు భరోసా పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి కోసం ఏడాదికి రూ.12,500 అందిస్తాం.

అమలు: మేనిఫెస్టోలో చెప్పిన దాని కంటే అధికంగా.. ఏడాదికి ఒక్కో రైతు కుటుంబానికి రూ.13,500 రైతు భరోసా కింద ఇచ్చారు. ఐదేళ్లలో రూ.67,500 రైతు భరోసా కింద ఇచ్చారు. ఈ పథకం కింద ఐదేళ్లలో 53,58,366 మంది రైతులకు రూ.34,378.16 కోట్లను వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారు.

హామీ: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.4 వేల నుంచి రూ.పది వేలకు పెంచుతాం. మత్స్యకారులకు ఇచ్చే డీజిల్‌ సబ్సిడీని డెడికేటెడ్‌ పెట్రోల్‌ బంక్‌ల ద్వారా డీజిల్‌ పట్టుకునేటప్పుడు వారి చేతికి అందేటట్లు అమలు చేస్తాం. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.పది లక్షలను పరిహారంగా చెల్లిస్తాం.

అమలు: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.పది వేలకు పెంచారు. వైఎస్సార్‌ మత్స్యకార భరోసా పథకం కింద ఐదేళ్లలో 2.43 లక్షల మందికి రూ.538.06 కోట్లను అందించారు. డీజిల్‌ సబ్సిడీని అమలు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.పది లక్షలను పరిహారంగా అందిస్తున్నారు.

హామీ: అవ్వాతాతలకు పెన్షన్ల అర్హత వయసు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించి.. పెన్షన్‌ను రూ.3 వేల వరకూ పెంచుకుంటూపోతాం.

అమలు: ఇచ్చిన మాట మేరకు వైఎస్సార్‌ పెన్షన్‌ కానుక పథకం కింద వృద్ధాప్య పెన్షన్‌ను రూ.2,000 నుంచి రూ.2,250కు పెంచే ఫైలుపై 2019, మే 30న సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక జగన్‌ తొలి సంతకం చేశారు. దశలవారీగా పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచి వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దే వృద్ధులకు పంపిణీ చేస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా ఎలాంటి వివక్ష చూపకుండా 66.34 లక్షల మందికి పెన్షన్‌ పంపిణీ చేస్తున్నారు. గత 59 నెలల్లో పెన్షన్‌ రూపంలో రూ.90,590.6 కోట్లను పంపిణీ చేశారు.


సిద్దిపేట కార్నర్ మీటింగ్‌కు భారీగా హాజరైన జనం

చేనేతలపై జీఎస్టీ మోదీ చలవే

సిరిసిల్ల రోడ్ షో, సిద్దిపేట కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, సిద్దిపేట: 'నేతన్నల నడ్డి విరిచేలా చేనేతలపై జీఎస్టీ విధించిన తొలి ప్రధాని మోదీయే. నేత కార్మికులకు బీమాతోపాటు ఇతర సదుపాయాలు రద్దు చేశాడు. బీజేపీ ఎజెండాలో కార్పొరేట్లే తప్ప చేనేతలు, కార్మికులు, పేదలు ఉండరు. అబ్ కీ బార్ 400 పార్ కాదు.. బీజేపీ మళ్లీ గెలిస్తే పెట్రోల్ డీజిల్ ధరలు రూ. 400 అవుతాయి. అలవిగాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ వాటి అమల్లో విఫలమైంది' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ విమర్శించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం పాత బస్టాండ్ సమీపంలోని నేతన్న సర్కిల్‌లో రోడ్ షోతోపాటు సిద్దిపేట పాత బస్టాండ్ అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగించారు. ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..


సిద్దిపేటలో పార్టీశ్రేణులు బహూకరించిన గదతో కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు

ప్రధాని వేములవాడకు ఒక్క రూపాయి అయినా ఇస్తామన్నాడా?

లోక్‌సభ ఎన్నికల బరిలో మూడు పార్టీలు ఉన్నాయి. ఏ పార్టీ ఏం చేసిందో అందరికీ తెలుసు. నిన్న ప్రధాని వేములవాడకు వచ్చిండు. బండి సంజయ్ పక్కనే ఉన్నడు. దేశం కోసం ధర్మం కోసం అనే ప్రధాని... పొద్దున లేస్తే హిందూ జపం చేసే బండి సంజయ్ వేములవాడకు ఒక్క రూపాయి అయినా ఇస్తామని చెప్పారా? మోదీ వచ్చి గోదావరిని ఎత్తుకుపోతా అంటున్నారు. గోదావరిని ఎత్తుకుపోతే మనం ఎలా బతుకాలే? అందుకే ఆలోచించి ఓటేయండి. వినోద్‌కుమార్ పార్లమెంటులో మనకోసం కొట్లాడే వ్యక్తి. 2001 నుంచి తెలంగాణ సాధన ఉద్యమంలో ఉన్నాడు. సీఎం రేవంత్ ఈ జిల్లాను రద్దు చేస్తా అంటున్నాడు. సిరిసిల్ల జిల్లా ఉండాలంటే వినోద్‌కుమార్ గెలవాలి.

కాంగ్రెస్‌వి అలవికాని హామీలు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీల తోపాటు 420 హామీలు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఒక్కటీ అమలు చేయలేదు. అవి అమలు అవుతాయన్న ఆశ కూడా లేదు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపెట్టి గద్దెనెక్కింది. మహిళలకు రూ. 2500, రుణమాఫీ, రైతుబంధు రాలేదు. కరెంట్ లేదు. కరెంట్ కోతలు మళ్లీ మొదలయ్యాయి. రంగనాయక సాగర్‌ను ఎండబెట్టడం వల్ల రైతుల పంటలు కూడా ఎండిపోయాయి. ఉచిత బస్సు ఫెయిల్ అయింది.

సిద్దిపేటను మేం జిల్లా చేస్తే.. సీఎం రద్దు చేస్తా అంటున్నాడు

ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే సిద్దిపేట జిల్లా కావాలని అడిగా. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి నేను సీఎం అయ్యాక సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేశా. జిల్లాకు రైలు, నీళ్లు తెచ్చాం. కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వం సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తామంటోంది. ప్రజల చెంతకు పరిపాలన తీసుకురావాలని కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తే ఈ మూర్ఖ ముఖ్యమంత్రి, ప్రభుత్వం దాన్ని రద్దు చేస్తాం అంటున్నారు. సిద్దిపేట ప్రజలు ఎటువంటి పులులో నాకు తెలుసు. మీరు పట్టుబడితే.. జట్టుకడితే.. మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి లక్ష మెజారిటీ అందించడం మీకు లెక్కనే కాదు. వెంకట్రామిరెడ్డి గెలుపులోనే సిద్దిపేట జిల్లా గెలుపు ఉంది.

మా పాలనలో అందరినీ కాపాడాం..

బీఆర్ఎస్ పాలనలో రూ. 30 వేల కోట్లను రెండు దఫాలుగా రుణమాఫీ చేశాం. డిసెంబర్ 9న రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ ఇప్పటివరకు చేయలేదు. మేం అన్ని వర్గాల ప్రజలను కులమతాలకు అతీతంగా ముందుకు తీసుకెళ్లాం. అందరినీ కాపాడాం. పేదలు, వృద్ధులకు రూ. 2 వేల పెన్షన్ ఇచ్చాం. కాంగ్రెస్ నేతలు పెన్షన్‌ను రూ. 4 వేలు చేస్తామని చేయట్లేదు. అందుకే రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓటేయండి.


సిరిసిల్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, బోయినపల్లి వినోద్

రూ. 5.04 లక్షలు ఇప్పించండి

కొదురుపాకలో మిడ్‌మానేరు నిర్వాసితుల ప్లకార్డుల ప్రదర్శన



బోయినపల్లి (చొప్పదండి): ముంపు గ్రామాల బాధితులైన తమకు రూ. 5.04 లక్షల పరిహారం ఇప్పించాలని కోరుతూ మిడ్‌మానేరు భూ నిర్వాసితులు కేసీఆర్ బస్సు యాత్రలో ప్లకార్డులు ప్రదర్శించారు. తమ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ శుక్రవారం కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా కొదురుపాక వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. కేసీఆర్ బస్సు వెళ్లిపోయాక ప్లకార్డులు ప్రదర్శించిన నిర్వాసితులతో స్థానిక బీఆర్ఎస్ నేతలు వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు.



బజ్జీలు తిని.. చాయ్ తాగి..

బస్సులో వెళ్లే క్రమంలో కేసీఆర్ బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లిలోని ఓ హోటల్ వద్ద కాసేపు ఆగారు. హోటల్‌లో కూర్చొని మిర్చీ బజ్జీలు తిని, టీ తాగారు. అక్కడే ఉన్న స్థానికులతో కాసేపు మాట్లాడారు. పలువురు చిన్నారులు కేసీఆర్‌తో ఫొటోలు దిగారు. కాగా, కొదురుపాక చెక్‌పోస్టు వద్ద చెక్‌పోస్టు సిబ్బంది కేసీఆర్ వాహనాన్ని తనిఖీ చేశారు.

దేవుడి పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోంది

- మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతోంది
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



హుస్నాబాద్‌రూరల్: దేవుడి పేరుతో బీజేపీ ఓట్లు అడగడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం ఒక ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిందని, ప్రజలందరూ డబ్బులు ఇచ్చారని అన్నారు. తాను కూడా నెల జీతం ఇచ్చానన్నారు. దేవుడు అందరి వాడని, చిత్ర పటాలు ఇచ్చి బీజేపీ ఓట్లు అడుగుతోందని విమర్శించారు. మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టడం తప్ప బీజేపీ రైతులకు, మహిళలకు, దళితులకు, ఎస్టీలకు, ఇతర పేదలకు ఏం చేసిందని ప్రశ్నించారు. రూ.14 లక్షల కోట్ల బడా బాబుల రుణాలను మాఫీ చేసి, ధరలు పెంచి సామాన్యులపై ఆర్థిక భారం మోపిందని ధ్వజమెత్తారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లలో పైసా పని చేయలేదన్నారు. వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్నప్పుడు రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ తెచ్చారన్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ చదువుకున్న యువత కోసం అంతర్జాతీయ స్థాయి స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. వేములవాడకు ప్రధాన మంత్రి వస్తే ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధి కోసం ఏం అడిగారని ప్రశ్నించారు. కాగా, హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని నోరు జారడంతో జనం అవాక్కయ్యారు. మళ్లీ కారు గుర్తుకు ఓటు వేయాలని ఆయన ప్రజల చేత చెప్పించారు.

'నమో' అంటే నమ్మించి మోసమే

- ఊసరవెల్లి రంగులు మారిస్తే రేవంత్ తారీఖులు మారుస్తుండు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కమలాపూర్: నమో అంటే నరేంద్ర మోదీ కాదు.. నమ్మించి మోసం చేసేటోడు అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి.రామారావు(కేటీఆర్) విమర్శించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడారు. ఈ పదేళ్లలో మోదీ సామాన్యుడి నడ్డి విరిచి, ముక్కు పిండి రూ.30 లక్షల కోట్లు వసూలు చేసి దోచుకున్నారని ఆరోపించారు. 'నేను చెప్పేది అక్షర సత్యం నేను చెప్పేది అబద్ధమని బండి సంజయ్, కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఏ ఒక్క బీజేపీ నాయకుడైనా రుజువు చేస్తే నేను నా ఎమ్మెల్యే పదవికి రేపే రాజీనామా చేస్తా'అని సవాల్ చేశారు.. రూ.30 లక్షల కోట్లలో రూ.15 లక్షల కోట్లు తీసుకొని అదానీ, అంబానీలకు రుణమాఫీ చేశారని నిందించారు. మోదీ పాలనలో అన్ని నిత్యావసర వస్తువుల ధరలూ పెరిగిపోయాయని ఆరోపించిన కేటీఆర్.. మోదీ ప్రియమైన ప్రధానమంత్రి కాదు, పిరమైన ప్రధానమంత్రి అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయకుండా దాట వేస్తున్నాడని, ఊసరవెల్లి రంగులు మారిస్తే రేవంత్ తారీఖులు మారుస్తున్నాడని ఎద్దేవా చేశారు. ''ఉచిత్త బస్సుల్లో ఏమన్నా సుఖమున్నదా అంటే ఆడోళ్లు గుద్దుకొనుడు, పైసలు పెట్టి టికెట్లు కొనుక్కున్న మొగోళ్లు తిట్టుకొనుడు''అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీని 12 ఎంపీ స్థానాల్లో గెలించాలనీ అందులో కరీంనగర్ మొదటిదిగా ఉండాలని ఆకాంక్షించారు. కేసీఆరే మళ్లీ త్వరలోనే రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రోడ్ షోలో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన కేసీఆర్ బస్సు యాత్ర

16 రోజులపాటు 13 లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలో ప్రచారం

- చివరి రోజు సిరిసిల్ల, సిద్దిపేటలో రోడ్ షోలతో ముగింపు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, బీజేపీ విధానాలే టార్గెట్
- రోడ్ షోలతో పలు సెగ్మెంట్లలో కేసీఆర్, హరీశ్‌రావు ప్రచారం
- 8 నుంచి 12 సీట్లలో గెలుస్తామనే ధీమాలో బీఆర్ఎస్
- నేడు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ మీడియా సమావేశం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం ముగిసింది. గత నెల 24న ప్రారంభమైన బస్సు యాత్ర 16 రోజులపాటు 13 లోక్‌సభ సెగ్మెంట్ల మీదుగా సాగింది. హైదరాబాద్, సికింద్రాబాద్, ఆదిలాబాద్, చేవెళ్ల మినహా రాష్ట్రంలోని మిగతా లోక్‌సభ నియోజకవర్గాల్లో కేసీఆర్ రోడ్ షోలు నిర్వహించారు. మెదక్, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గాలపై ఎక్కువగా దృష్టిపెట్టేలా ఆయన రోడ్ షోలు జరిగాయి. ఏప్రిల్ 24న మిర్యాలగూడ నుంచి కేసీఆర్ రోడ్ షోల ద్వారా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. చివరి రోజు శుక్రవారం కరీంనగర్ నుంచి బయలుదేరిన కేసీఆర్... సిరిసిల్ల, సిద్దిపేటలో జరిగిన రోడ్ షోలలో పాల్గొని ప్రచారాన్ని ముగించారు. చివరి రోజు సిద్దిపేటలో భారీ బహిరంగ సభ అనంతరం ప్రచారాన్ని ముగించాలని భావించారు. అయితే వర్ష సూచన నేపథ్యంలో సిద్దిపేటలోనూ కేసీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఓవైపు బస్సు యాత్ర ముగియడం, మరోవైపు శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారానికి తెర పడుతుండటంతో కేసీఆర్ తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈసీ కొరడాతో 48 గంటలపాటు ప్రచారానికి దూరం..

బస్సు యాత్ర ఎనిమిదో రోజు మహబూబాబాద్ రోడ్ షోలో పాల్గొన్న సమయంలోనే కేసీఆర్ ప్రచారంపై 48 గంటల నిషేధం విధిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. మార్చి 5న సిరిసిల్లలో జరిగిన విలేకరుల సమావేశంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫిర్యాదు నేపథ్యంలో ఆయన ప్రచారంపై ఈసీ ఆంక్షలు విధించింది. దీంతో మే ఒకటో తేదీ రాత్రి 8 గంటల నుంచి మే 3న రాత్రి 8 గంటల వరకు కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఈసీ ఆదేశాల నేపథ్యంలో ప్రచార షెడ్యూల్‌లో కొద్దిపాటి సవరణలు చేసుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, బీజేపీ విధానాలపై వాక్బాణాలు

పక్షం రోజులకుపైగా సాగిన ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, సీఎం రేవంత్ భాష, పనితీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమల్లో వైఫల్యాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాలు, ప్రధానిగా మోదీ వైఫల్యాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బస్సు యాత్రలో కేసీఆర్ ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చారు.

ప్రచారంలో విశ్రమించని కేటీఆర్, హరీశ్

బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. హైదరాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, ఆదిలాబాద్, నాగర్‌కర్నూలు తదితర లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో కేటీఆర్ ప్రచారం చేపట్టారు. అలాగే హరీశ్‌రావు మెదక్, జహీరాబాద్, కరీంనగర్, నల్లగొండ, భువనగిరి, వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలో విస్తృతంగా ప్రచారం చేశారు. కాగా, బస్సు యాత్రకు భారీగా జనం తరలివచ్చారని, బీఆర్ఎస్ పట్ల ఓటరు సానుకూలతకు ఇది సంకేతమని పార్టీ భావిస్తోంది. కనీసం 8 నుంచి 12 సీట్లలో విజయం సాధిస్తామనే ధీమా బీఆర్ఎస్ శిబిరంలో కనిపిస్తోంది.

నేటితో ప్రచారం బంద్

- సోమవారం 17 లోక్‌సభ నియోజకవర్గాలకు జరగనున్న పోలింగ్
- కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం ఉపఎన్నికకు కూడా..
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్

సాయంత్రం 6 గంటలకు పార్టీల క్యాంపెయినింగ్‌కు తెర

ఇంటింటి ప్రచారంపైనా నిషేధం.. దృశ్యరూపక ప్రకటనలకూ వీల్లేదు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం ఆరు గంటలకు తెరపడనుంది. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ఇది సాయంత్రం 4 గంటలకే ముగియనుంది. ఆ సమయం దాటిన తరువాత నుంచి బహిరంగ సభలు, రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, ఇంటింటి ప్రచారం తదితర ప్రచారంపై నిషేధం కొనసాగనుంది. దృశ్యరూపకంగా ఉండే ఏ ప్రకటన కూడా ప్రచారం చేయడానికి వీల్లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి (ఉప ఎన్నిక) సోమవారం పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకా పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది..

బరిలో 525 మంది అభ్యర్థులు..

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నిక కోసం ఏప్రిల్ 18న కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ పర్వం కూడా ప్రారంభమైంది. లోక్‌సభకు మొత్తం 525 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం నుంచి 15 మంది పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అన్ని సీట్లలోనూ పోటీ చేస్తుండగా సీపీఎం, ఎంఐఎం ఒక్కోచోట బరిలో నిలిచాయి.

అగ్ర నేతల ప్రచారం..

నామినేషన్ల పర్వం నుంచి విస్తృత ప్రచారం ప్రారంభమవగా రాష్ట్ర, జాతీయ స్థాయిలోని ఆయా పార్టీల అగ్రనేతలు సుడిగాలి పర్యటనలు చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోపాటు పలువురు బీజేపీపాలిత రాష్ట్రాల సీఎంలు కూడా తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం సాగించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఇక బీఆర్ఎస్ తరపున ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రచార బాధ్యతనంతా మోశారు. ఈసారి భారీ బహిరంగ సభలు అతితక్కువగా జరగ్గా ప్రజలను కలుసుకొనేలా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లకు అన్ని పార్టీలు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాయి.

పరస్పరం దూషణలపర్వం..

ఈసారి ఎన్నికల ప్రచారంలో పార్టీల దూషణలపర్వం తారస్థాయికి చేరింది. ఆరు గ్యారంటీలంటూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చినా.. అమలు చేయలేదని బీఆర్ఎస్, బీజేపీలు తీవ్రంగా విమర్శించాయి. గత పదేళ్లలో తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని, కొత్త రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ విస్తృతంగా ప్రచారం చేసింది. మరోవైపు బీజేపీ తాము మతపరమైన రిజర్వేషన్లను మాత్రమే రద్దు చేస్తామని బదులిచ్చింది.

ప్రలోభాలను అడ్డుకోవడంపై ఈసీ నజర్..

నేటి సాయంత్రంతో ప్రచారానికి తెరపడనుండటంతో పోలింగ్ జరిగే లోగా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు జరిగే ప్రయత్నాలను అడ్డుకొనేందుకు ఈసీ కృతనిశ్చయంతో ఉంది. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎక్కడైనా ప్రలోభాలు కొనసాగుతుంటే సమాచారం ఇవ్వాలని, తక్షణమే స్పందిస్తామని ఎన్నికల సంఘం హామీ ఇస్తోంది. ఇప్పటివరకు 180 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, బంగారు, వెండి ఆభరణాలు, తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
11-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	260	72,664
నిఫ్టీ ▲	98	22,055

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,329	▼	18
డోజోన్స్	39,493	▲	105
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,434	▲	52
డాక్స్	18,773	▲	86
షాంఘై	3,155	▲	1
నికాయ్	38,229	▲	155

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	73,008 ▲ 1,506
బంగారం (99.5 స్వచ్ఛత)	72,716 ▲ 1,500
వెండి (కిలో)	84,215 ▲ 1,873

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఢాయిపాటక	81.67	85.35
£	బ్రిటన్ పౌండ్	ఢాయిపాటక	102.22	107.11
€	యూరో	ఢాయిపాటక	87.81	92.26
¥	జపాన్ ఎన్ (100)	ఢాయిపాటక	41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఢాయిపాటక	52.81	87.62
S$	సింగపూర్ డాలర్	ఢాయిపాటక	59.33	64.05
SAR	సౌదీ రియాల్	ఢాయిపాటక	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	ఢాయిపాటక	21.85	23.63
¥	చైనా యువాన్	ఢాయిపాటక	10.44	12.51

పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 5.8 శాతం

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో (2022-23తో పోల్చి) 5.8 శాతం పురోగమించింది. మార్చిలో 4.9 శాతంగా నమోదైంది. 2023 ఫిబ్రవరి (5.6 శాతం) కన్నా మార్చితో స్పీడ్ తగ్గినప్పటికీ, 2023 మార్చి కన్నా (1.9 శాతం) పురోగమించడం గమనార్హం. ఆర్థిక సంవత్సరం మొత్తంగా చూస్తే వృద్ధి స్వల్పంగా 5.2 శాతం నుంచి 5.8 శాతానికి పెరిగింది. భారత్ ఎకానమీలో వ్యవసాయ రంగం వాటా దాదాపు 18.4 శాతం. పారిశ్రామిక రంగం వాటా 28.3 శాతం. సేవల రంగం వాటా 53.3 శాతం. పారిశ్రామిక రంగంలో ఒక్క తయారీ రంగం వాటా దాదాపు 70 శాతం.

రంగాల వారీగా..(శాతాల్లో)

విభాగం	2024 మార్చి	2023 మార్చి
తయారీ	5.2	1.5
మైనింగ్	1.2	6.8
విద్యుత్ ఉత్పత్తి	8.6	-1.6
క్యాపిటల్ గూడ్స్	6.1	10
కన్జూమర్ డ్యూరబుల్స్	9.5	-8.0
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	4.9	-1.9
ఇన్‌ఫ్రా/నిర్మాణం	6.9	7.2
ప్రైమరీ గూడ్స్	2.5	3.3
ఇంటర్మీడియట్ గూడ్స్	5.1	1.8



వరుస నష్టాలకు బ్రేక్



ముంబై: స్టాక్ సూచీలు వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. ఎన్నికల అప్రమత్తత, విదేశీ ఇన్వెస్టర్ల వైఖరి, ద్రవ్యోల్బణం వంటి ప్రతికూలతలున్నా.., అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్ షేర్ల రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 260 పాయింట్లు లాభపడి 72,664 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98 పాయింట్లు పెరిగి 22,055 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఇటీవల మార్కెట్ పతనంతో కనిష్టాలకు దిగివచ్చిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. లండన్ మెటల్ ఎక్స్ఛేంజీలో బేస్ మెటల్ ధరలు అనూహ్యంగా పెరగడంతో మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొంది. అలాగే యుటిలిటీ, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీ, టెలికం, ఆటో షేర్లు రాణించాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 542 పాయింట్లు ఎగసి 72,947 వద్ద, నిఫ్టీ 174 పాయింట్లు బలపడి 22,131 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. మరోవైపు ఐటీ, బ్యాంకులు, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ఆర్థిక గణాంకాలు ఆర్థిక ఫలితాలపై ఆశావహ అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. కాగా, ప్రతి రెండు షేర్లకు ఒక షేరు బోనస్ ప్రకటించడంతో బీపీసీఎల్ షేరు 4.5% లాభపడి రూ.619 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 5% పెరిగి రూ.622 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

టాటా మోటార్స్ స్పీడ్

- క్యూ4 లాభం రూ. 17,529 కోట్లు
- షేరుకి రూ. 6 డివిడెండ్



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ గత ఆర్థిక సంవత్సరం (2023-24) చివరి త్రైమాసిక కన్సాలిడేటెడ్ నికర లాభం మూడు రెట్లు ఎగసి రూ. 17,529 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,05,932 కోట్ల నుంచి పెరిగి రూ. 1,19,986 కోట్లను అధిగమించింది. మరోసారి జేఎల్ఆర్ రికార్డులు బ్రేక్ చేస్తూ 7.9 బిలియన్ పౌండ్ల టర్నోవర్‌ను సాధించినట్లు టాటా మోటార్స్ పేర్కొంది. ఇది 11 శాతం వృద్ధికాగా.. నికర లాభం 1.4 బిలియన్ పౌండ్లకు జంప్‌చేసింది. వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. దీనిలో రూ. 3 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. పూర్తి ఏడాదికి టాటా మోటార్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 2,690 కోట్ల నుంచి రూ. 31,807 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,45,967 కోట్ల నుంచి రూ. 4,37,928 కోట్లకు ఎగసింది. వెరసి కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయంతోపాటు, నికర లాభాన్ని ఆర్జించినట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ తెలియజేశారు.

బీఎస్‌ఈలో టాటా మోటార్స్ షేరు 1.6% బలపడి రూ. 1,047 వద్ద ముగిసింది.

పసిడికి అక్షయ తృతీయ శోభ



ముంబై: అక్షయ తృతీయ పండుగ సందర్భంగా డిమాండ్ పెరగడంతో దేశవ్యాప్తంగా బంగారం ధరలు శుక్రవారం భారీగా పెరిగాయి. ముంబైలో పసిడి రూ.1,506 పెరిగి రూ.73,008 చేరింది. కిలో వెండి ధర రూ. 1873 ఎగసి రూ.84,215 కి చేరింది.

పసిడి దిగుమతులు 30 శాతం అప్

కాగా భారత్ పసిడి దిగుమతులు మార్చితో ముగిసిన గడచిన ఆర్థిక సంవత్సరంలో 30 శాతం పెరిగాయి. విలువలో 45.54 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దేశీయ పటిష్ట డిమాండ్ దీనికి కారణం. భారత్‌కు దిగుమతుల విషయంలో స్విట్జర్లాండ్ (40%) మొదటి స్థానంలో నిలుస్తుండగా, తరువాతి స్థానాల్లో యూఏఈ (16%), దక్షిణాఫ్రికా (10%) ఉన్నాయి. దేశం మొత్తం దిగుమతుల్లో పసిడి వాటా దాదాపు 5 శాతం. పసిడిపై ప్రస్తుతం 15శాతం దిగుమతుల సుంకం అమలవుతోంది. చైనా తర్వాత భారత్ అతిపెద్ద పసిడి వినియోగదారుగా ఉంది. కాగా, 2023-24లో వెండి దిగుమతుల విలువ 2.72 శాతం పెరిగి 5.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

టీవీఎస్ హోల్డింగ్స్ చేతికి హోమ్ క్రెడిట్ ఇండియా

81 శాతం వాటా కొనుగోలు • మిగతాది ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ తదితర సంస్థలకు..



న్యూఢిల్లీ: హోమ్ క్రెడిట్ ఇండియా ఫైనాన్స్‌లో (హెచ్‌సీఐఎఫ్‌పీఎల్) 80.74 శాతం వాటా కొనుగోలు చేస్తున్నట్లు టీవీఎస్ హోల్డింగ్స్ వెల్లడించింది. మిగతా 19.26 శాతం వాటాను ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, ఇతర అనుబంధ సంస్థలు కొనుగోలు చేయనున్నట్లు వివరించింది. మొత్తం డీల్ విలువ రూ. 696 కోట్లు. ఇందులో టీవీఎస్ హోల్డింగ్స్ రూ. 554.06 కోట్లు చెల్లించనుంది. ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌కు 11 శాతం వాటాలు ఉంటాయి. చెక్ రిపబ్లిక్‌కు చెందిన హోమ్ క్రెడిట్ ఇంటర్నేషనల్, నెదర్లాండ్స్‌కి చెందిన హోమ్ క్రెడిట్ ఇండియా బీవీ నుంచి హెచ్‌సీఐఎఫ్‌పీఎల్‌లో 80.74 వాటా కొనుగోలు చేస్తున్నట్లు టీవీఎస్ హోల్డింగ్స్ పేర్కొంది. టీవీఎస్ క్రెడిట్‌కి ఇది కూడా కలిస్తే మొత్తం గ్రూప్‌నకు రూ. 31,000 కోట్ల లోన్ బుక్ ఉంటుందని టీవీఎస్ హోల్డింగ్స్ ఎండీ సుదర్శన్ వేణు తెలిపారు.

బీపీసీఎల్ రూ.1.7 లక్షల కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) రూ.1.7 లక్షల కోట్ల పెట్టుబడి ప్రణాళికల్లో ఉంది. చమురు శుద్ధి సామర్థ్యం పెంపు, ఇంధన విక్రయాలు, పెట్రోకెమికల్ వ్యాపారం విస్తరణ, హైడ్రోజన్ విభాగాల్లో వచ్చే అయిదేళ్లలో ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్లు బీపీసీఎల్ చైర్మన్ జి.కృష్ణకుమార్ వెల్లడించారు. రిఫైనరీలు, పెట్రోకెమికల్స్‌కు రూ.75,000 కోట్లు, మార్కెటింగ్‌కు రూ.20,000 కోట్లు, వ్యూహాత్మక పైప్‌లైన్ ప్రాజెక్టుకు రూ.8,000 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. ప్రధానంగా మొజాంబిక్, బ్రెజిల్‌లో చమురు ఉత్పాదన పెంచేందుకు రూ.32,000 కోట్లు, సహజ వాయువు వ్యాపారంపై రూ.25,000 కోట్లు, స్వచ్ఛ ఇంధనంపై రూ.10,000 కోట్లు పెట్టుబడి చేయనున్నట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-5-2024 ఫామ్ ధర...

విశాఖ	550-00
చిత్తూరు	598-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

కల్యాణ్ జ్యుయలర్స్ మెరుపులు



ముంబై: కల్యాణ్ జ్యుయలర్స్ క్యూ4 నికర లాభం 97 శాతం పెరిగి రూ. 137 కోట్లకు (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) చేరింది. ఆదాయం 34 శాతం వృద్ధితో రూ. 3,382 కోట్ల నుంచి రూ. 4,535 కోట్లకు చేరింది. 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి షేరు ఒక్కింటిపై రూ. 1.2 చొప్పున తుది డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు సిఫార్సు చేసింది. గత ఆర్థిక సంవత్సరం పటిష్ట పనితీరు సాధించగలిగామని సంస్థ ఈడీ రమేష్ కల్యాణరామన్ తెలిపారు.

శుక్రవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు 3 శాతం పెరిగి రూ. 410.85 వద్ద క్లోజయ్యింది.

సిప్లా హైజంప్



న్యూఢిల్లీ: సిప్లా లిమిటెడ్ చివరి త్రైమాసిక కన్సాలిడేటెడ్ నికర లాభం 79 శాతం జంప్‌చేసి రూ. 932 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,739 కోట్ల నుంచి రూ. 6,163 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 4,946 కోట్ల నుంచి రూ. 5,153 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు షేరుకి రూ. 13 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి సిప్లా నికర లాభం రూ. 2,833 కోట్ల నుంచి రూ. 4,154 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 22,753 కోట్ల నుంచి రూ. 25,774 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో సిప్లా షేరు 1.4% క్షీణించి రూ. 1,339 వద్ద ముగిసింది.

బీవోబీ లాభం ఫ్లాట్



ముంబై: బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) చివరి త్రైమాసిక స్టాండెలోన్ నికర లాభం 2 శాతం వృద్ధితో రూ. 4,886 కోట్లను తాకింది. కన్సాలిడేటెడ్ లాభం మాత్రం స్వల్పంగా క్షీణించి రూ. 5,132 కోట్లకు పరిమితమైంది. ఇక పూర్తి ఏడాదికి మాత్రం బీవోబీ నికర లాభం రూ. 14,905 కోట్ల నుంచి రూ. 18,767 కోట్లకు ఎగసింది. కాగా.. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 2 శాతం బలపడి రూ. 11,793 కోట్లకు చేరింది. రుణాల్లో 12.5 శాతం వృద్ధి ఇందుకు సహకరించగా.. నికర వడ్డీ మార్జిన్లు 0.26 శాతం నీరసించి 3.27 శాతానికి పరిమితమయ్యాయి. వడ్డీయేతర ఆదాయం 21 శాతం ఎగసి రూ. 4,191 కోట్లయ్యింది. గోఫస్ట్ పేరును ప్రస్తావించనప్పటికీ ఈ కాలంలో రూ. 1,700 కోట్ల రుణాలు తీసుకున్న ఒక ఏవియేషన్ ఖాతాను మొండిబకాయిగా గుర్తించినట్లు బీవోబీ పేర్కొంది. దీంతో ప్రొవిజన్లు రూ. 320 కోట్ల నుంచి రూ. 1,485 కోట్లకు భారీగా పెరిగినట్లు వెల్లడించింది.

బీఎస్‌ఈలో బీవోబీ షేరు 2.7 శాతం నష్టంతో రూ. 256 వద్ద ముగిసింది.

బీవోఐ లాభం అప్

- క్యూ4లో రూ. 1,439 కోట్లు
- షేరుకి రూ. 2.8 డివిడెండ్



ముంబై: బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) క్యూ4 నికర లాభం 7 శాతం వృద్ధితో రూ. 1,439 కోట్లను తాకింది. వాటాదారులకు షేరుకి రూ. 2.8 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 16,549 కోట్ల నుంచి రూ. 17,913 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం రూ. 5,523 కోట్ల నుంచి రూ. 5,937 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 7.31 శాతం నుంచి 4.98 శాతానికి, నికర ఎన్‌పీఏలు సైతం 1.66 శాతం నుంచి 1.22 శాతానికి దిగివచ్చాయి. మొండి రుణాలకు కేటాయింపులు రూ. 546 కోట్ల నుంచి రూ. 2,043 కోట్లకు భారీగా పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి మాత్రం బీవోఐ నికర లాభం 57 శాతం జంప్‌చేసి రూ. 6,318 కోట్లయ్యింది. మొత్తం ఆదాయం రూ. 54,748 కోట్ల నుంచి రూ. 66,804 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ మార్జిన్లు 3.3 శాతానికి చేరాయి.

బీఎస్‌ఈలో బీవోఐ షేరు యథాతథంగా రూ. 139 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



రెజ్లింగ్‌లో భారత్‌కు ఐదో ఒలింపిక్ బెర్త్... 68 కేజీల విభాగంలో ఫైనల్లోకి నిషా

ఇస్తాంబుల్: ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో తొలిసారి మహిళల విభాగంలో భారత్ నుంచి అత్యధికంగా ఐదుగురు బరిలోకి దిగనున్నారు. వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో మహిళల 68 కేజీల విభాగంలో నిషా దహియా ఫైనల్‌కు చేరుకొని భారత్‌కు ఐదో ఒలింపిక్ బెర్త్‌ను ఖరారు చేసింది. సెమీఫైనల్లో నిషా 8-4తో అలెగ్జాండ్రా ఎంగెల్ (రొమేనియా)పై గెలిచింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన నిషా ప్రిక్వార్టర్ ఫైనల్లో 3-0తో అలీనా షొచుక్ (టర్కీ)పై, క్వార్టర్ ఫైనల్లో 7-4తో అడెలా హాంజ్లికోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది. 62 కేజీల విభాగంలో భారత రెజ్లర్ మాన్సి తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. నిషా కంటే ముందు అంతిమ్ పంఘాల్ (53 కేజీలు), వినేశ్ ఫొగాట్ (50 కేజీలు), అన్షు మలిక్ (57 కేజీలు), రీతిక హుడా (76 కేజీలు) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. నేడు పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్ నుంచి ఆరుగురు రెజ్లర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

ద్రవిడ్ మళ్లీ దరఖాస్తు చేయాల్సిందే!

- భారత జట్టు కొత్త హెడ్ కోచ్ ఎంపిక కోసం త్వరలో ప్రకటన
- బీసీసీఐ కార్యదర్శి జై షా స్పష్టీకరణ



ముంబై: టి20 వరల్డ్ కప్ ముగిసిన వెంటనే భారత క్రికెట్ జట్టుకు కొత్త హెడ్ కోచ్ బాధ్యతలు స్వీకరిస్తారని బీసీసీఐ కార్యదర్శి జై షా వెల్లడించారు. దాని కోసం మరికొద్ది రోజుల్లోనే దరఖాస్తులు కోరతామని కూడా ఆయన స్పష్టం చేశారు. భారత జట్టు వరల్డ్ కప్‌కు బయల్దేరే ముందే ఈ ప్రక్రియ మొదలవుతుందని కూడా జై షా చెప్పారు. గత ఏడాది రాహుల్ ద్రవిడ్ పదవీకాలం పూర్తయిన తర్వాతే కొత్త కోచ్‌పై చర్చ జరగడంతో కొంత గందరగోళం నెలకొంది. దాంతో ద్రవిడ్‌నే మరో ఏడాది కొనసాగించారు. ఈసారి అలాంటి స్థితి రాకుండా బోర్డు ముందే జాగ్రత్త పడుతోంది.

• ఒప్పందం ప్రకారం వచ్చే జూన్‌లో ద్రవిడ్ పదవీకాలం పూర్తవుతుంది. ద్రవిడ్ మళ్లీ కోచ్‌గా కొనసాగాలనుకుంటే మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుందని... కొన్ని ఇతర జట్ల తరహాలో వేర్వేరు ఫార్మాట్‌లకు వేర్వేరు కోచ్‌లను ఎంపిక చేసే ఆలోచన లేదని కూడా షా పేర్కొన్నారు. కొత్త హెడ్ కోచ్‌కు మూడేళ్ల పదవీ కాలం ఇస్తామని, 2027 వన్డే వరల్డ్ కప్ వరకు అతను కొనసాగుతాడని బోర్డు కార్యదర్శి ప్రకటించారు. కోచ్ ఎంపిక విషయంలో క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ)దే తుది నిర్ణయమన్న షా... విదేశీ కోచ్ అయినా అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు.

• ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు చేరని జట్లలో ఉన్న ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది కలిసి మే 24న తొలి బృందంగా టి20 వరల్డ్ కప్ కోసం అమెరికా బయలుదేరతారని జై షా వెల్లడించారు. ఐపీఎల్‌లో 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనను ప్రయోగాత్మకంగానే పెట్టామని, అవసరమైతే దీనిపై మళ్లీ చర్చించి కొనసాగించాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

• మరోవైపు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను బీసీసీఐ వార్షిక కాంట్రాక్ట్ జాబితాలో చేర్చకపోవడంలో తన పాత్ర ఏమీ లేదని... ఇది పూర్తిగా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నిర్ణయమని ఆయన సందేహ నివృత్తి చేశారు.

గిల్, సాయి శతకాల మోత

- తొలి వికెట్‌కు 210 పరుగుల భాగస్వామ్యం
- చెన్నైపై 35 పరుగులతో నెగ్గి ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన గుజరాత్
- మిచెల్, అలీ పోరాటం వృథా



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్



సాయి సుదర్శన్

అహ్మదాబాద్: గుజరాత్‌పై గెలిచి ప్లే ఆఫ్స్ రేసులో పడదామనుకున్న డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు టైటాన్స్ ఓపెనర్లు శుబ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ చుక్కలు చూపించారు. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న సూపర్‌కింగ్స్ ఊహించని ఉపద్రవంతో చేతులెత్తేసింది. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 35 పరుగుల తేడాతో చెన్నైపై విజయం సాధించింది. మొదట టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 231 పరుగులు చేసింది. గిల్ (55 బంతుల్లో 104; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు), సుదర్శన్ (51 బంతుల్లో 103; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) చెలరేగారు. తుషార్ దేశ్‌పాండేకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసి ఓడింది. డారిల్ మిచెల్ (34 బంతుల్లో 63; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), మొయిన్ అలీ (36 బంతుల్లో 56; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. మోహిత్ శర్మ 3, రషీద్ ఖాన్ 2 వికెట్లు తీశారు.

జోరు కాదు... ఓపెనర్ల హోరు...

పవర్ ప్లేలో 58/0 స్కోరు చేసిన టైటాన్స్ ఓపెనర్లు ఆ తర్వాత మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలో ముందుగా సాయి సుదర్శన్ 32 బంతుల్లో, గిల్ 25 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేశారు. పేస్, స్పిన్, స్లో మీడియం ఇలా ఆరుగురు చెన్నై బౌలర్లు 17 ఓవర్ల వరకు వైవిధ్యం చూపినా... వాళ్లిద్దరు మాత్రం అడ్డు అదుపు లేకుండా శరవేగంగా పరుగుల్ని రాబట్టారు. సెంచరీ మాత్రం ముందుగా శుబ్‌మన్ 50 బంతుల్లో పూర్తి చేయగా, తర్వాత సుదర్శన్ కూడా 50 బంతుల్లోనే శతక్కొట్టాడు. ఈ పరుగుల తుఫాన్‌ను ఎట్టకేలకు డెత్ ఓవర్లకు గానీ విడగొట్టలేకపోయారు. తుషార్ వేసిన 18వ ఓవర్లో భారీ షాట్‌కు యత్నించిన సాయి సుదర్శన్... శివమ్ దూబేకు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. దీంతో ఓపెనింగ్ వికెట్‌కు 210 పరుగుల భాగస్వామ్యానికి తెరపడటంతో చెన్నై శిబిరంలో తొలిసారి ఆనందం కనబడింది. అదే ఓవర్లో కెప్టెన్ గిల్ కూడా అవుట్ కావడంతో సూపర్‌కింగ్స్ ఊపిరి పీల్చుకుంది.

అన్ని ఫోర్లు, ఇన్ని సిక్సర్లు... ఇద్దరివే!

17.2 ఓవర్లు ఓపెనర్లే ఆడారు. దీంతో స్కోరు బోర్డు పరుగందుకుంది. మెరుపులతో జోరందుకుంది. ఓపెనింగ్‌కు ఇరువైపుల వేగం, వేగం కనిపించడంతో మోదీ స్టేడియం గుజరాత్ అభిమానుల కేరింతలతో మార్మోగింది. సుదర్శన్, గిల్ ఇద్దరు అదేపనిగా దంచేయడంతో ఫోర్లతో సిక్సర్లు కూడా పోటీపడ్డాయి. 14 ఫోర్లు, 13 సిక్స్‌లు బాదేయడంతో 210 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంలో 134 పరుగులు బౌండరీల రూపంలోనే వచ్చాయి. ఆరో ఓవర్లో 50కి చేరిన గుజరాత్ స్కోరు... 100 పరుగుల్ని పదో ఓవర్లో దాటింది. 150 పరుగుల్ని మరింత వేగంగా 13వ ఓవర్లోనే అధిగమించింది. 17వ ఓవర్లో 200 మైలురాయికి చేరింది.

ఆరంభంలోనే దెబ్బ

తొలి ఓవర్లో రచిన్ రవీంద్ర (1), రెండో ఓవర్లో రహానే (1), మూడో ఓవర్లో కెప్టెన్ రుతురాజ్ (0) వరుస కట్టడంతో కొండంత లక్ష్యఛేదన చెన్నైకి అసాధ్యంగా మారింది. మిచెల్, మొయిన్ అలీ అర్ధసెంచరీలతో చేసిన పోరాటం సూపర్‌కింగ్స్ ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే ఉపయోగపడింది తప్ప... లక్ష్యంవైపు నడిపించలేకపోయింది. హిట్టర్ శివమ్ దూబే (21; 2 ఫోర్లు, 1 సిక్స్), జడేజా (18; 2 ఫోర్లు, 1 సిక్స్) టైటాన్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తలొగ్గారు. ధోని (11 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఆఖర్లో సిక్సర్లతో అలరించాడు.

2 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో ఒకే జట్టుకు చెందిన ఇద్దరు ఓపెనర్లు సెంచరీలు సాధించడం ఇది రెండోసారి. 2019లో బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లు బెయిర్‌స్టో, వార్నర్ తొలుత ఈ ఘనత సాధించారు.

100 శుబ్‌మన్ గిల్ శతకం ఐపీఎల్ టోర్నీ చరిత్రలో 100వ సెంచరీ కావడం విశేషం. ఐపీఎల్ ప్రారంభమైన ఏడాది 2008 ఏప్రిల్ 18న జరిగిన తొలి మ్యాచ్‌లోనే కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటర్ బ్రెండన్ మెకల్లమ్ మొదటి సెంచరీ చేశాడు. మొత్తం 17 ఐపీఎల్ సీజన్‌లలో ఇప్పటి వరకు 1084 మ్యాచ్‌లు జరిగాయి.

2 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో తొలి వికెట్‌కు 200 అంతకంటే ఎక్కువ పరుగుల భాగస్వామ్యం నమోదు కావడం ఇది రెండోసారి మాత్రమే. 2022లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఓపెనర్లు కేఎల్ రాహుల్ (68 నాటౌట్), డికాక్ (140 నాటౌట్) తొలి వికెట్‌కు అజేయంగా 210 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) దూబే (బి) తుషార్ 103; శుబ్‌మన్ గిల్ (సి) జడేజా (బి) తుషార్ 104; మిల్లర్ (నాటౌట్) 16; షారుఖ్ ఖాన్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 231. వికెట్ల పతనం: 1-210, 2-213, 3-231. బౌలింగ్: సాన్‌ట్నర్ 2-0-31-0, తుషార్ 4-0-33-2, శార్దుల్ 4-0-25-0, సిమర్‌జీత్ 4-0-60-0, జడేజా 2-0-29-0, మిచెల్ 4-0-52-0.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి) తెవాటియా (బి) సందీప్ వారియర్ 1; రచిన్ (రనౌట్) 1; రుతురాజ్ (సి) రషీద్ ఖాన్ (బి) ఉమేశ్ 0; మిచెల్ (సి) షారుఖ్ (బి) మోహిత్ 63; అలీ (సి) నూర్ అహ్మద్ (బి) మోహిత్ 56; దూబే (సి) నూర్ (బి) మోహిత్ 21; జడేజా (సి) మిల్లర్ (బి) రషీద్ 18; ధోని (నాటౌట్) 26; సాన్‌ట్నర్ (బి) రషీద్ 0; శార్దుల్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 196. వికెట్ల పతనం: 1-2, 2-2, 3-10, 4-119, 5-135, 6-165, 7-169, 8-169. బౌలింగ్: ఉమేశ్ 3-0-20-1, సందీప్ వారియర్ 3-0-28-1, త్యాగి 4-0-51-0, నూర్ అహ్మద్ 2-0-25-0, రషీద్ ఖాన్ 4-0-38-2, మోహిత్ 4-0-31-3.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	16	1.453
రాజస్తాన్	11	8	3	16	0.476
హైదరాబాద్	12	7	5	14	0.406
చెన్నై	12	6	6	12	0.491
ఢిల్లీ	12	6	6	12	-0.316
లక్నో	12	6	6	12	-0.769
బెంగళూరు	12	5	7	10	0.217
గుజరాత్	12	5	7	10	-1.063
ముంబై	12	4	8	8	-0.212
పంజాబ్	12	4	8	8	-0.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X ముంబై
వేదిక: కోల్‌కతా
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

నీరజ్‌కు రెండో స్థానం



దోహా: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా కొత్త సీజన్‌లో శుభారంభం చేశాడు. శుక్రవారం జరిగిన దోహా డైమండ్ లీగ్ మీట్‌లో ప్రస్తుత ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ అయిన నీరజ్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. 10 మంది పోటీపడిన ఈ ఈవెంట్‌లో నీరజ్ చివరిదైన ఆరో ప్రయత్నంలో జావెలిన్‌ను 88.36 మీటర్ల దూరం విసిరి రెండో స్థానాన్ని పొందాడు. జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్; 88.38 మీటర్లు) తొలి స్థానంలో నిలువగా... పీటర్సన్ (గ్రెనెడా; 86.62 మీటర్లు) మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన కిశోర్ జేనా 76.31 మీటర్లతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు.

ప్రజ్ఞానందకు మూడో స్థానం

వార్సా: సూపర్‌బెట్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద నిర్ణీత 9 రౌండ్ల తర్వాత 10 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 8 పాయింట్లతో ఆరో స్థానంలో, గుకేశ్ 7 పాయింట్లతో పదో స్థానంలో నిలిచారు.



మక్తల్ సభకు హాజరైన జనం. (ఇన్‌సెట్‌లో) వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నా గడ్డపైకొచ్చి.. నన్నే అవమానిస్తావా?

- అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా
- లేదంటే తెలంగాణ ప్రజలకు మీరు క్షమాపణ చెబుతారా?
- ప్రధాని మోదీపై సీఎం రేవంత్ విసుర్లు
- మక్తల్‌లో జనజాతర సభ, షాద్‌నగర్, బేగంబజార్ చౌరస్తాల్లో రేవంత్ రోడ్‌షోలు
- బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని ధ్వజం

సాక్షి, రంగారెడ్డి జిల్లా, సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్, అబిడ్స్

'నల్లమల మట్టిలో పుట్టిపెరిగాను. సాధారణ కార్యకర్తగా, జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పని చేశా. ఒక్కో మెట్టు ఎదుగుతూ స్వశక్తితో నేడు ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నా. రాజకీయాల్లో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నా. ప్రధాని మోదీ నన్ను అభినందించాల్సింది పోయి అక్రమార్కులను, అవినీతి పరులను పక్కన పెట్టుకుని, నాపై అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారు. ఎవరు అవినీతి పరులో, అక్రమార్కులో చర్చకు సిద్ధమా? నేను అక్రమ వసూళ్లకు, అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే షాద్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ముక్కు నేలకు రాసేందుకు సిద్ధం. ఒక వేళ నిరూపించకపోతే.. ప్రధాని మోదీ నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పగలరా?' అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా రోడ్‌షో అనంతరం షాద్‌నగర్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో, నారాయణపేట జిల్లా మక్తల్‌లో నిర్వహించిన జనజాతర బహిరంగసభల్లో సీఎం మాట్లాడారు. అదేవిధంగా శుక్రవారం రాత్రి హైదరాబాద్ బేగంబజార్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగించారు. ఆయా సభల్లో రేవంత్ మాట్లాడుతూ.. "బీజేపీ అభ్యర్థి డీకే అరుణ కుటుంబం దొంగసార అమ్మింది. భూములు కొల్లగొట్టింది. కల్లు దుకాణాల నుంచి వసూళ్లకు పాల్పడింది. ఇసుకు దందా చేసింది. అలాంటి వ్యక్తిని పక్కన కూర్చోబెట్టుకుని, నా గడ్డకు వచ్చి నన్ను అవమానిస్తావా? ఎక్కడికి వచ్చి ఏం మాట్లాడుతున్నారు?" అని మోదీని నిలదీశారు.

బీజేపీ వస్తే వందేళ్లు వెనక్కి..

పొరపాటున బీజేపీకి ఓటేస్తే మతాల మధ్య చిచ్చు, మనుషుల మధ్య పంచాయితీలు పెట్టి రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తుందని, అభివృద్ధి వందేళ్లు వెనక్కి వెళుతుందని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'బీజేపీ గెలిస్తే ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో చిచ్చుపెట్టి పెట్టుబడులు రాకుండా చేస్తారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నా ఎందుకు పెట్టుబడులు పోతలేవు. నిత్యం పంచాయితీలు, విషం చిమ్ముతూ ఆ రాష్ట్రాన్ని నాశనం చేశారు. పార్లమెంట్ నుంచి 30 నిమిషాల దూరంలోనే నోయిడా సిటీ ఉన్నా బీజేపీ నేతలకు చిత్తశుద్ధి లేక అభివృద్ధికి నోచుకోలేదు. తప్పిపోయి బీజేపీ కేంద్రంలో మళ్లీ వస్తే అభివృద్ధి వందేళ్ల వెనక్కు పోతుంది.' అని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్‌కు ఎయిర్‌పోర్టు, ఐటీ కంపెనీలు, పరిశ్రమలు, గోదావరి జలాలు వచ్చాయని ఆయన గుర్తు చేశారు.

బీజేపీకి 400 సీట్లు కలే

కేంద్రంలో 400 సీట్లు రావాలని కలలు కంటున్న బీజేపీకి అవి పగటి కలలుగానే మిగిలిపోతాయని రేవంత్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ బీజేపీకి అమ్ముడు పోగా, బీజేపీ, మజ్లిస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో బీజేపీ, మజ్లిస్‌లు గొడవలకు దిగి హైదరాబాద్‌లో శాంతిభద్రతల సమస్యను సృష్టించాలని చూస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతల సమస్యలు ఏర్పడితే రాష్ట్రానికి వచ్చే మల్టీనేషనల్ కంపెనీలను గుజరాత్‌కు తరలించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని విమర్శించారు.



బీజేపీ కేన్సర్ లాంటిది

▶ మొదటి పేజీ తరువాయి

చీలుస్తుంది. మధ్యయుగ చరిత్రను గుర్తుకు తెస్తుంది..' అని రేవంత్ హెచ్చరించారు.

ప్రాంతీయ అసమానతలు సృష్టిస్తోంది

'భావోద్వేగాలను రెచ్చగొట్టడమే బీజేపీ ఎజెండా. రాజ్యాంగ మార్పు ద్వారా దేశానికి తీవ్ర నష్టం చేయాలని చూస్తోంది. కొన్ని వర్గాల రిజర్వేషన్లు ఎత్తేసేందుకు కుట్ర చేస్తోంది. ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోదీ ఎంతకైనా దిగ జారుతున్నారు. 2019లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఇప్పుడు రాహుల్ గాంధీపై విష ప్రచారం చేస్తున్నారు. ప్రాంతాల వారీగానూ బీజేపీ అసమానతలు సృష్టిస్తోంది. కేంద్ర మంత్రి పదవులన్నీ గుజరాత్, యూపీకే ఇస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని అన్యాయం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రధాని ఒక ప్రాంతానికి చెందిన వారుంటే, రాష్ట్రపతి మరో ప్రాంతం వారుండేవారు. గుజరాత్ పెత్తందారీ పోకడలకు చెక్ పెట్టకపోతే ప్రమాదం..' అని సీఎం వ్యాఖ్యానించారు.

బీజేపీ మోసాన్ని ప్రజలు గుర్తించాలి

'నియోజకవర్గాల పునర్విభజన పేరుతో బీజేపీ ఆడాలనుకుంటున్న నాటకం తెలంగాణకు నష్టం చేస్తుంది. జనాభా ప్రాతిపదికన విభజన చేపడితే తెలుగు రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. వన్ ఇండియా వన్ నేషన్ పేరుతో బీజేపీ చేయాలనుకునే మోసాన్ని ప్రజలు గుర్తించాలి. ఓటు వేయడం సామాజిక బాధ్యతగా ప్రజలు గుర్తించాలి. ప్రమాదకరమైన బీజేపీ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలి..' అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

బాండ్లపై విచారణకు సిద్ధం

'ఎన్నికల బాండ్లపై విచారణకు మేం సిద్ధం. ఎన్నికల ఖర్చు, పార్టీలకు వస్తున్న ఆదాయంపై ఓ కమిటీని నియమించి విచారణ జరిపించాలి. ఇందుకు మా పార్టీ సిద్ధం. ఏ సంస్థ దగ్గరా డబ్బులు తీసుకోకుండా, తమ జేబుల్లోంచి తెచ్చి ఎన్నికల ఖర్చు చేస్తున్నామని భద్రాచలం రాముల వారి దగ్గర నరేంద్రమోదీ గానీ, ఆ పార్టీ వాళ్ళుగానీ ప్రమాణం చేసి చెప్పగలరా? తన పక్కనే అవినీతి పరులను కూర్చోబెట్టుకుని అవినీతి గురించి మోదీ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశానికి ఆస్తులు కూడబెడితే, నరేంద్రమోదీ సర్కార్ బడా పారిశ్రామిక వేత్తలకు వాటిని ధారాదత్తం చేసింది. ఇన్ని చేసిన మోదీ నిజాయితీపరుడినని చెప్పుకోవడం హాస్యాస్పదం..' అని సీఎం విమర్శించారు.



'మీట్ ద ప్రెస్'లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు కొన్నిచోట్ల డిపాజిట్లు రావు

'ఒవైసీని గెలిపించేందుకే బీజేపీ ఓల్డ్ సిటీలో వివాదాస్పదమైన వ్యక్తిని పోటీలో పెట్టింది. నరేంద్రమోదీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోంది. కేసీఆర్ మానసిక ఒత్తిడితో నాపై విమర్శలు చేస్తున్నారు. ఆయన పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో కొన్నిచోట్ల డిపాజిట్లు కూడా రావు. కల్తీ కల్లు, డ్రగ్స్‌పై మా సర్కార్ ఉక్కుపాదం మోపుతుంది. బీసీ కులగణన చేపట్టడం, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్లు పెంచాలన్నదే మా విధానం ..' అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు కె.శ్రీకాంత్, పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

బీజేపీ వస్తే రాజ్యాంగం రద్దు

ప్రజాస్వామ్యానికి ముప్పు

- రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులు పోతాయి
- వాటిని కాపాడేందుకు కాంగ్రెస్ పోరాడుతుంది
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన చేస్తాం
- మోదీకి ధైర్యం ఉంటే అదానీ, అంబానీ మీద ఈడీ, ఇన్‌కంటాక్స్ దాడులు చేయించాలి
- ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ బందే
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



నకిరేకల్ బహిరంగ సభలో మాట్లాడుతున్న మల్లికార్జునఖర్గే, చిత్రంలో భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: "బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దవుతుంది.. ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుంది.. రిజర్వేషన్లు పోతాయి, ప్రజల ప్రాథమిక హక్కులనూ తొలగిస్తారు" అని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దేశంలో ప్రజల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పోరాడుతోందని చెప్పారు. తెలంగాణలో బీజేపీకి, మోదీకి ఒక్కసీటు కూడా రావద్దని, వస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినట్టేనన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో జరిగిన కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచార బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగం రక్షించే కాంగ్రెస్ పార్టీకి, రాజ్యాంగం రద్దు చేయాలని చూసే బీజేపీకి మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. పొరపాటున బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తొలగించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుతంత్రాలు పన్నుతాయని ధ్వజమెత్తారు.

అదానీ, అంబానీలపై ఐటీ దాడులు చేయించగలరా?

మోదీ దేశాన్ని ధనవంతులైన తన మిత్రులకు ప్రభుత్వరంగ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచి పెట్టి తిరిగి కాంగ్రెస్‌పైనే ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి అదానీ, అంబానీ ట్రక్కులు, టెంపోలలో డబ్బులు పంపుతున్నారని అమిత్‌షా, మోదీ మాట్లాడుతున్నారని, వారు డబ్బులు పంపిస్తుంటే మరి మోదీ, అమిత్‌షా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ధైర్యముంటే అదానీ, అంబానీలపై ఈడీ, ఐటీ దాడులు చేయించాలని ఖర్గే సవాల్ విసిరారు.

ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలిస్తాం

తెలంగాణలో కాంగ్రెస్ వంద రోజుల పాలనలో అన్ని గ్యారంటీలు అమలవుతున్నాయని ఖర్గే వెల్లడించారు. ఉచిత బస్‌ప్రయాణం, ఆరోగ్యశ్రీ, రూ.500కే గ్యాస్ సిలిండర్ అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారికి ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. ఆగస్టు 15వ తేదీన రూ.2 లక్షల రుణ మాఫీ చేసి తీరుతామన్నారు. ఆటో వారికి ఏటా రూ.12 వేలు ఇస్తామని స్పష్టం చేశారు. కులగణన తరువాత కుటుంబ యజమాని అయిన మహిళల ఖాతాలో ఏటా రూ.లక్ష జమ చేస్తామన్నారు. ఇవన్నీ నెరవేరాలంటే హస్తం గుర్తుకు ఓట్లు వేసి, కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. సభలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేలు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదు

ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ బంద్ కావడం ఖాయమని ఖర్గే జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పరోక్షంగా బీజేపీకి మద్దతు పలుకుతున్న విషయం ప్రజలకు అర్థమైందని, అందుకే ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదన్నారు. మోదీ రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పినా దానిపై కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని ఆయన నిలదీశారు.

ఆర్.కృష్ణయ్యపై దాడిని ఖండించిన బీసీ సంఘాలు

కాచిగూడ/అంబర్‌పేట (హైదరాబాద్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం మాట్లాడుతూ కృష్ణయ్యపై టీడీపీ దాడిని యావత్ 70 కోట్ల బీసీలపై దాడిగా పరిగణిస్తున్నామని, ఇలాంటి పిరికిపంద రాజకీయాలు చేస్తే ఎవరూ భయపడరని చెప్పారు. కృష్ణయ్యపై జరిగిన దాడిని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) తీవ్రంగా ఖండించింది. ఇలాంటి దాడులు చేయడమంటే ఆరోగ్యకర వాతావరణాన్ని విధ్వంసం చేయడమే అవుతుందని ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణయ్యపై దాడి యావత్తు బీసీ సమాజంపై జరిగిన దాడిగా బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గువ్వల భరత్‌కుమార్ అభివర్ణించారు. దాడికి నిరసనగా శుక్రవారం ఆలీకేఫ్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కృష్ణయ్యపై దాడి అమానుషం, హేయమైన చర్య అని జాతీయ బీసీ లిబరేషన్ టైగర్ ఫోర్స్ జాతీయ అధ్యక్షుడు రాంగోపాల్ యాదవ్ మండిపడ్డారు. కృష్ణయ్యపై దాడిని ఖండిస్తూ కూకట్‌పల్లి వై జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు తెల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిరికి చర్య: దాసు సురేశ్

ఏపీలో కృష్ణయ్యపై జరిగిన దాడి ప్రత్యర్థుల పిరికి చర్య అని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ పేర్కొన్నారు. కృష్ణయ్యను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితుల ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, కృష్ణయ్యకు వ్యక్తిగత భద్రతను పెంచాలన్నారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం: జాజుల

కృష్ణయ్యపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం దర్యాప్తు జరిపించి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం తరఫున కృష్ణయ్యకు ప్రత్యేక రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్రిశాంక్‌కు బెయిల్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ సోషల్‌మీడియా కన్వీనర్ క్రిశాంక్‌కు నాంపల్లి కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో నీరు, విద్యుత్ కొరత కారణంగా హాస్టళ్లు మూతపడు తున్నాయంటూ మార్ఫింగ్ చేసిన సర్క్యులర్ కేసులో క్రిశాంక్‌ను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. కొన్ని రోజులుగా చంచల్ గూడ జైల్లో ఉన్న క్రిశాంక్‌కు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, రోజూ పోలీసుల ముందు హాజరుకావాలని కోర్టు షరతులు విధించింది.

నవనీత్‌కౌర్‌పై కేసు నమోదు

షాద్‌నగర్ (హైదరాబాద్): బీజేపీ ఎంపీ, నటి నవనీతకౌర్‌పై షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా ఈనెల 8న పట్టణంలో నిర్వహించిన రోడ్ షోలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే నేరుగా పాకిస్తాన్‌కు ఓటు వేసినట్లేనని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ ఎండబెట్ల కృష్ణమోహన్ ఈనెల 9న షాద్‌నగర్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 171సీ, 171ఎఫ్, 171జీ, 188 ఐపీఎస్ సెక్షన్ల కింద నవనీత్‌కౌర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు.

27 రోజులు.. 57 సభలు, రోడ్ షోలు

లోక్‌సభ ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

- బీజేపీ, ప్రధాని మోదీ లక్ష్యంగా విమర్శలు
- 'గాడిద గుడ్డు' ప్రచారాన్ని సీఎం ప్రజల్లోకి తీసుకెళ్లారంటున్న కాంగ్రెస్ నేతలు
- 14 ఎంపీ స్థానాల్లో గెలుస్తామని ధీమా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తన భుజాలపై వేసుకొని తెలంగాణ అంతా చుట్టివచ్చారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ 6న తుక్కుగూడలో జరిగిన జనజాతర సభతో ఆ పార్టీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం మొదలవగా 27 రోజుల్లో 57 సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్ షోలలో రేవంత్ పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీతో కలిసి ముఖ్యమంత్రి పలు సభల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు కర్ణాటక, కేరళలలోనూ పర్యటించి బహిరంగ రోడ్ షోలలో ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారంలో సీఎం ప్రధానంగా బీజేపీని, ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకొని విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఆయన చేసిన ప్రసంగాలు జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు కలిసి వచ్చాయని ఆ పార్టీ భావిస్తోంది. రేవంత్ వ్యాఖ్యలపై మోదీ, అమిత్ షా మొదలు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వరకు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చిందని పార్టీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. అదేవిధంగా రాష్ట్రానికి బీజేపీ 'గాడిద గుడ్డు' తప్ప ఏమిచ్చిందనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సీఎం విజయం సాధించారని పేర్కొన్నారు. తమ ప్రచారానికి అనూహ్య రీతిలో ప్రజా స్పందన వచ్చిందని.. అందువల్ల 14 సీట్లలో గెలుస్తామన్న ధీమాలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

నేను మాట్లాడకుంటే హిందువులకు రక్షణ లేదు

- కేసీఆర్‌కు హిందువుల ఓట్లు అక్కర్లేదా? నన్ను ఓడించేందుకు ముస్లింలంతా ఒక్కటి కావాలంటారా?
- నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తా.. వినోద్ ఓడిపోతే.. బీఆర్ఎస్‌ను కేసీఆర్ మూసేస్తారా?
- సిరిసిల్లలో ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలు



సిరిసిల్లలో మాట్లాడుతున్న బండి సంజయ్

సిరిసిల్ల: ''నేను మాట్లాడకుంటే.. హిందువులకు రక్షణ లేదు.. నాకు రాజకీయాలు ముఖ్యం కాదు, హిందూ ధర్మమే ప్రధానం' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో ముస్లింలంతా ఒక్కటై బండి సంజయ్‌ని ఓడించాలంటూ మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. 20 శాతం ఓట్ల కోసం 80 శాతం హిందువులను అవమానిస్తున్న కేసీఆర్ పార్టీని ఓడించి హిందువుల సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. హిందూ సమాజమంతా నా వెనుకుంది. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తా. వినోద్‌కుమార్ ఓడిపోతే బీఆర్ఎస్‌ను మూసేసి రాజకీయాల నుంచి తప్పుకునేందుకు నువ్వు సిద్ధమా?' అంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు.

హిందువులు ఓటు బ్యాంకుగా మారాలి

అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించేందుకు ముస్లిం మత పెద్దలతో కేసీఆర్ కుమ్మక్కయ్యారని బండి సంజయ్ ఆరోపించారు. 'నీ కొడుకు జై శ్రీరామ్ అనొద్దంటాడు, నువ్వేమో ముస్లింలు అంతా ఒక్క టి కావాలంటావు.. మీకు హిందువుల ఓట్లు అక్కర్లేదా''అని ప్రశ్నించారు. హిందువులను హేళన చేయ డం కేసీఆర్‌కు పరిపాటిగా మారింది. కేసీఆర్ హిందూ సమాజానికి పక్కాగా క్షమాపణ చెప్పి తీరాలి. పార్టీల జెండాలను పక్కన పెట్టండి. హిందువులంతా ఏకం కావాలి. ఓటు బ్యాంకుగా మారాలి. బీజేపీ గొడుగు కిందకు రండి..'అని సంజయ్ కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్ల పరిశీలన పూర్తి

ఆరు నామినేషన్ల తిరస్కరణ..63 మంది నామినేషన్ల ఆమోదం

నల్లగొండ: నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. 69 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. ఆరుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 63 మంది అభ్యర్థుల నామినేషన్లు నిబంధనల ప్రకారం ఉండటంతో వాటిని ఎన్నికల అధికారులు ఆమోదించారు. తిరస్కరణకు గురైన వారిలో బహుజన ముక్తి పార్టీ అభ్యర్థి కందారపల్లి కాశయ్య, స్వతంత్ర అభ్యర్థులు అల్వాల కనకరాజు, రాథోడ్ రవీంద్రనాయక్, పున్న సుధాకర్, ఎస్.ఉపేందర్, మాదగోని వెంకటేశ్వర్లు నామినేషన్లు నిబంధనల ప్రకారం లేకపోవడంతో తిరస్కరించారు.

'పీఎస్ఎల్వీ' కొత్త ఇంజిన్ పరీక్ష సక్సెస్


సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు ఎంతో నమ్మకమైన రాకెట్‌గా గుర్తింపు పొందిన పీఎస్ఎల్వీ రాకెట్‌కు నాలుగో దశలో సరికొత్తగా ఒక ఇంజిన్‌ను డిజైన్ చేసి గురువారం పరీక్షించి శాస్త్రవేత్తలు విజయం సాధించారు. ఈ ఇంజిన్‌ను తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో డిజైన్ చేయగా తమిళనాడు లోని మహేంద్రగిరిలో ఇస్రో ప్రపల్షన్ కాంప్లెక్స్‌లో ఇంజిన్‌కు పరీక్ష నిర్వహించారు. ఈ ఇంజిన్‌ను 665 సెకన్లపాటు మండించి దాని సామర్థ్యాన్ని నిర్ధారించు కున్నారు. దీని వల్ల ప్రయోగానికి అయ్యే వ్యయం కూడా తగ్గుతుందని శాస్త్రవేత్తలు చెప్పారు. రాబోయే పీఎస్ఎల్వీ రాకెట్‌లో ఈ ఇంజిన్‌ను ఉపయోగించి ప్రయోగాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామన్నారు.



ఇంజిన్‌ను మండిస్తూ సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న దృశ్యం

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
కరీంనగర్
1
శనివారం, 11, మే, 2024



క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ర్యాంప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో ర్యాంప్‌లు, లైటింగ్, బాత్‌రూమ్‌లు, కుర్చీలు, టేబుళ్లు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఈ మహేందర్, డీఈలు లచ్చిరెడ్డి, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రజారోగ్య ఉద్యోగులు

కరీంనగర్‌టౌన్: ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్‌కు శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంచికట్ల రామనాథం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

కరీంనగర్: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. గాంధీ గుడి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య యాత్ర ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఇందిరానగర్ కాలనీలోని ప్రభుత్వ పెన్షనర్‌భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మధుసూదన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఓటు మనిషి అస్తిత్వానికి ప్రతీక అన్నారు. గాంధీ గుడి స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సి.రామరాజు, జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ సంపతి రమేశ్, ప్రభుత్వ పెన్షన్ దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య, జిల్లా కోశాధికారి దామెర మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజేందర్‌రావును గెలిపించాలి

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గణేశ్‌నగర్‌లో ఇండియా కూటమి అభ్యర్థి రాజేందర్ రావు గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

అమ్మనాన్నతో ఓటేయిస్తాం

- ఓటేసేందుకు పేరెంట్స్‌ను తీసుకెళ్తాం
- 13న జరిగే ఎన్నికల్లో తప్పకుండా పాల్గొనేలా చూస్తాం
- ఓటింగ్ శాతం పెంచేందుకు మేము సైతం భాగస్వాములమవుతామంటున్న చిన్నారులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్రంలో ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతిఒక్కరూ పాల్గొనాలని ఇటీవల ఎన్నికల కమిషన్ నుంచి మొదలుకొని ప్రతీఒక్క ప్రభుత్వ అధికారి కోరుతున్నారు. 'మేము భవిష్యత్ ఓటర్లం .. మాకు ఓటు విలువ అనేది ఎప్పుడో ఐదేళ్లకు వచ్చే ఎన్నికలతో కాదు.. ఏటా మా స్కూల్‌లో జరిగే స్టూడెంట్ ఎన్నికల్లో మాకు ఓటు విలువ తెలుస్తుంది.. ఇప్పుడు 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మా పేరెంట్స్ తప్పకుండా ఓటు వేసేలా



తెలంగాణ చౌక్‌లో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

మేం నడుం బిగిస్తాం.. సమాజాన్ని బాగుపరిచే వారికే ఓటేయాలని కోరుతాం.. నిస్వార్థ, నిజాయితీ పరులను ఎన్నుకోవాలని వేడుకుంటాం' అని అంటున్నారు మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పండించిన చిన్నారులు. శుక్రవారం కరీంనగర్‌లోని ధమ్మిక కాయ్ షిటో ర్యూ కరాటే డు అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. మన భవిష్యత్‌కు మనం వేసే ఓటు.. ఓటేద్దాం నవ సమాజాన్ని నిర్మిద్దాం.. ఓటు వజ్రాయుధం.. అంటూ నినాదాలు చేస్తూ ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. తమ పేరెంట్స్ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తామంటున్న పలువురు చిన్నారులను 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

మంచి నాయకున్ని ఎన్నుకోవాలని చెబుతా..



ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మంచి నాయకున్ని ఎన్నుకోవాలని పేరెంట్స్‌కు చెబుతా. నిజాయితీపరుడు ఎవరో తెలుసుకొని ఓటేయమంటా. ఎవరైతే విద్యావంతులై మంచి నాయకత్వ లక్షణాలు ఉంటాయో వారికే ఓటేయాలని మా పేరెంట్స్‌ను కోరుతా. ప్రతిఒక్కరూ ఓటు వేయాలి. – ఎస్.మధుశ్రీ

సొసైటీకి ఉపయోగపడే వారిని..



యువర్ ఓట్ ఈజ్ యువర్ ఫ్యూచర్. ఇది తెలుసుకోవాలి. సొసైటీకి ఉపయోగపడే వారిని, ప్రజలకు అందుబాటులో ఉండే వారిని ఎన్నుకోవాలని నేను మా పేరెంట్స్‌కు సలహా ఇస్తా. ప్రస్తుతం ఓటు వేసేందుకు దూరంగా ఉంటున్నారు. అలా కాకుండా నాలాంటి వారందరూ తమ పేరెంట్స్ ఓటు వేసేలా చూడాలి.

– వి.రాంచరణ్

ఓటు విలువ తెలుసు..



ఏటా మా స్కూల్‌లో స్టూడెంట్ ఎలక్షన్స్ జూన్‌లో నిర్వహిస్తారు. బ్యాలెట్ పేపర్, స్టాంపు, సిరా మార్క్ ఇలా అచ్చం ప్రభుత్వం నిర్వహించే ఎన్నికల మాదిరిగానే జరుగుతాయి. నాకు అప్పటి నుంచి ఓటు విలువ తెలుసు. మా పేరెంట్స్‌కు ఓటు విలువ చెప్పి ఓటేసేందుకు పంపిస్తా. – జి.శ్రీచరణ్

తప్పకుండా ఓటేయాలని చెబుతా..



పార్లమెంట్ ఎన్నికల్లో మా పేరెంట్స్ తప్పకుండా తమ ఓటును వినియోగించుకోవాలని చెబుతా. మా స్ట్రీట్‌లో ఉన్న వారందరికీ చెబుతా. ఓటింగ్‌లో ప్రతిఒక్కరూ పాల్గొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరుతా. ఇలాగే ప్రతి ఒక్కరూ చేస్తే ఓటింగ్ పర్సంటేజీ పెరుగుతుంది. – క్రితీజ్

నేనే దగ్గరుండి తీసుకెళ్తా..



ఈనెల 13న జరిగే ఎన్నికల్లో మా పేరెంట్స్ ఓటేసేందుకు నేను దగ్గరుండి తీసుకెళ్తా. ప్రతిఒక్కరూ వారి పేరెంట్స్‌ను ఓటేసేందుకు దగ్గరుండి తీసుకెళ్లాలి. అప్పుడే ఓటింగ్ శాతం పెరుగుతుంది. సమాజానికి మంచి నాయకుడిని అందించిన వారిలో మనం కూడా భాగస్వాములం అవుతాం.

– వి.అక్షర

ఓటుపై అవగాహన కల్పించేందుకు..



పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన కల్పించేందుకు చిన్నారులతో కార్యక్రమం నిర్వహించాం. తెలంగాణచౌక్‌లో చిన్నారులు చేసిన కరాటే విన్యాసాలు వారందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి.

– ఆర్.ప్రసన్నకృష్ణ, కరాటే అకాడమీ కార్యదర్శి

రాజకీయ లబ్ధి కోసమే రిజర్వేషన్ల రద్దు డ్రామాలు



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్: రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్, బీజేపీలు రిజర్వేషన్ల రద్దు డ్రామాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని దళిత సంఘాల నాయకులు శుక్రవారం వినోద్ కుమార్‌ను తన క్యాంపు కార్యాలయంలో కలిసి పూర్తి మద్దతు అందించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ 2001లో తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమం పుట్టి 14 ఏళ్ల పోరాటం తర్వాత అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్–3 ద్వారా తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, సీఎం రేవంత్‌లు ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు తీస్తారని అంటున్నారని, మరోవైపు బీజేపీ వారు కాంగ్రెస్ వస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు రద్దు చేసి ముస్లింలకు ఇస్తారని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. రిజర్వేషన్లు తీసే హక్కు ఎవరికీ లేదన్నారు. కాబట్టి దళితుల పక్షాన పోరాటం చేసేందుకు ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేష్, వంతడుపుల సంపత్, సొంబారి కొమురయ్య, ప్రభాకర్, బీమారపు సతీశ్, పారునంది జలపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా 24వ డివిజన్ శివాజీనగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ నయీమ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

గౌరవెల్లి భూ నిర్వాసితులకు అండగా ఉంటా



బొమ్మకల్‌లో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: గౌరవల్లి భూ నిర్వాసితులకు అండగా ఉంటానని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి నష్ట పరిహారం ఇప్పించే బాధ్యత తీసుకుంటానని కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం నగరంలోని తన నివాసంలో గౌరవల్లి భూనిర్వాసితులు రాజేందర్ రావును కలిసి కేసుల కారణంగా తమకు రావాల్సిన నష్టపరిహారం ఇంకా పెండింగ్‌లో ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన రాజేందర్ రావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిహారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బద్దం రాజిరెడ్డి, పిట్టల రమేష్, విరిపోయిన రాంబాబు, బైరి బిక్షపతి, శ్రీనివాస్ మహేష్, బుడిగ రాజయ్య, నూనె ఐలయ్య, చిన్న రాజయ్య, ధర్మయ్య తదితరులు ఉన్నారు.

వైద్యులు దేవుళ్లతో సమానం

ఆర్ఎంపీ వైద్యులు దేవుళ్లతో సమానమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. శుక్రవారం నగరంలోని పద్మనాయక కల్యాణమండపంలో జరిగిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో కూడా ఆరోగ్య సమస్య ఎదురుగానే మొదట గుర్తుకు వచ్చేది ఆర్ఎంపీ వైద్యులేనన్నారు. మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ, ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాసం రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకే నా జీవితం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ ప్రజలకు సేవ చేసేందుకు తన జీవితం అంకితమని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం బొమ్మకల్, నగునూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా శ్రీపురంకాలనీలో మైనార్టీ నాయకులతో సమావేశమై కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం బొమ్మకల్ రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి వాహనాల ర్యాలీతో గ్రామపంచాయతీ చౌరస్తాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ సింగిల్‌విండో మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు నల్ల శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా రాజేందర్‌రావు కండువా కప్పి ఆహ్వానించారు. బొమ్మకల్ ప్రజలతో తమ కుటుంబానికి మంచి సంబంధాలున్నాయని, తన తండ్రి జగపతిరావు ఆశయ సాధనకు గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు నరేశ్‌రెడ్డి, మల్లేశం, హుస్సేన్, సిరాజ్, సురేందర్‌రెడ్డి, కపిల్ మాధవ, నారాయణ, స్వామి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే దిశగా చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పాఠశాలల్లో నిర్దేశించిన మేరకు ఖచ్చితమైన ప్రణాళిక రూపొందించుకొని పనులన్నీ జూన్ 12లోగా పూర్తయ్యేలా చూడాలని అన్నారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, పట్టించుకోకుండా వ్యవహరించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, డిసిఓ రామానుజాచారి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సీపీవో కొమురయ్య, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయినపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 46వ డివిజన్ బీజేపీ నాయకుడు అక్కెనపల్లి రాజు తన అనుచరులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మేయర్ సునీల్‌రావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, నాయకులు మైకేల్ శ్రీనివాస్, మిడిదొడ్డి నవీన్, నేతి రవివర్మ, పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగత్ప్రసూతిక అలంకరణలో అమ్మవారు



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయ సప్తమ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మాధికారి, వేద పండితులు పురాణం మహేశ్వరశర్మ అమ్మవారికి సంపూర్ణ అభిషేకం నిర్వహించారు. అమ్మవారు జగత్ప్రసూతికాలంకరణలో (పసుపుతో అలంకరణ) భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక హారతులిచ్చారు. చండీహోమం నిర్వహించారు.

భగవంతుడితో అనుబంధాన్ని పెంచుతుంది

ఆలయ సప్తమ వార్షికోత్సవంలో భాగంగా వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ అధ్యాత్మిక ప్రసంగం చేస్తూ భగవన్నామ స్మరణ భగవంతుడితో అనుబంధాన్ని పెంచే అధ్యాత్మిక సాధనమన్నారు. ప్రశాంతత, సంతృప్తి ఉన్న జీవితం పరిపూర్ణమై ఆధ్యాత్మిక ఆనందం కలిగిస్తుందన్నారు. ఉత్తమమైన మానవ జన్మ కలిగినందుకు అందరికీ ఉపయుక్తమైన పనులు చేయడంలో శ్రద్ధ చూపాడన్నే బాధ్యతాయుత ఆధ్యాత్మికత అంటారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

రూ.18.75 లక్షలు పట్టివేత



పట్టుబడిన నగదును చూపిస్తున్న టూటౌన్ సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్‌క్రైం: నగరంలోని ఐబీ చౌరస్తా వద్ద శుక్రవారం టూటౌన్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సరైన ఆధారాలు చూపని రూ.18,75,651 పట్టుకున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. రామడుగు మండలం గుండికి చెందిన గుమ్మడి రమేశ్ వద్ద రూ.6లక్షలు, మానకొండూర్ మండలం ఊటూరుకు చెందిన హరీశ్ వద్ద రూ.12,75,651 స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు.

టవర్‌సర్కిల్ వద్ద రూ.88 వేలు..

నగరంలోని టవర్‌సర్కిల్ వద్ద శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.88వేలు పట్టుబడినట్లు సీఐ సరిలాల్ తెలిపారు. మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన అలగం కుమారస్వామి వద్ద సరైన ఆధారాలు లేని రూ.88 వేల నగదును పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మంచిర్యాల చౌరస్తాకు వెళ్లే మార్గంలో రూ.1.30 లక్షలు..

కరీంనగర్ కోర్టు నుంచి మంచిర్యాల చౌరస్తాకు వెళ్లే మార్గంలో త్రీటౌన్ పోలీసులు శుక్రవారం సాయంత్రం చేసిన తనిఖీల్లో నగరానికి చెందిన దీపక్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.30 లక్షలు పట్టుబడినట్లు సీఐ జాన్ రెడ్డి తెలిపారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు మతిభ్రమించింది



మాట్లాడుతున్న బాస సత్యనారాయణ

కరీంనగర్‌టౌన్: మాజీ సీఎం కేసీఆర్ కరీంనగర్‌లో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ సందర్భంగా బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌పై అవాకులు చివాకులు పేల్చారని, దీనిని పార్టీ పక్షాన ఖండిస్తున్నామని, ముఖ్యమంత్రి పదవి కోల్పోయిన కేసీఆర్‌కు మతిభ్రమించి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్‌కుమార్ దాదాపు 12,000 వేల కోట్ల నిధులు ప్రజా సంక్షేమం, ఇతర అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చారన్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా తెలియని పరిస్థితి పార్లమెంటు పరిధిలో ఉందన్నారు. కార్యక్రమంలో దురిశెట్టి సంపత్, కటకం లోకేష్, బొంతల కళ్యాణ్ చంద్ర, ఉప్పరపల్లి శ్రీనివాస్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకు పడిపోతోంది

బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లోని 39వ డివిజన్‌లో శుక్రవారం పార్లమెంట్ కన్వీనర్ బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బండి సంజయ్‌ని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకు పడిపోతుందని అన్నారు.బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

నగరంలోని 17, 18, 19, 39వ డివిజన్లలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి, నాయకులు రాములు, మల్లేశం, మహేశ్వర్ రెడ్డి, శంకర్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీరాజం, విష్ణు ప్రసాద్ రావ్, నరేశ్, రాహుల్, ఉపేందర్, కిరణ్, పుష్పలత, రజిత తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు అండగా నిలవాలి

విద్యానగర్(కరీంనగర్): బండి సంజయ్‌కి బీసీ సంఘాలు అండగా నిలవాలని మున్నూరుకాపు యూత్ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్‌ని రెండోసారి 2లక్షల మెజారిటీతో గెలిపించి, ఢిల్లీకి పంపించాలన్నారు. మున్నూరుకాపు యూత్ రాష్ట్ర కన్వీనర్ మహేందర్, ప్రధాన కార్యదర్శి రాజేశ్, నాయకులు మోహన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడండి

- నగరంలో బంజారుల భారీ ర్యాలీ



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న బంజారాలు

కరీంనగర్ కార్పొరేషన్: రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని ఆలిండియా గిరిజన బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్సావత్ భాస్కర్ నాయక్ కోరారు. శుక్రవారం బంజారాలతో కలిసి నగరంలో భారీర్యాలీ నిర్వహించారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలని, కాంగ్రెస్ పార్టీని గెలిపించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయక్ మాట్లాడుతూ దేశంలో ఉన్న పదికోట్ల మంది బంజారుల భాషాగోర్ బోలిని 8వ షెడ్యూల్ లో చేర్పించాలని, గిరిజనుల హక్కులను కాపాడాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, గిరిజన విశ్వవిద్యాలయంలో పూర్తి స్థాయిలో ప్రవేశాలు కల్పించాలన్నారు. ఐదో షెడ్యూల్లో కల్పించిన హక్కులను రక్షించాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్ రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ వీరన్న నాయక్, సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రనాయక్, ఎస్టీ సెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, సిరిసిల్ల జిల్లాశాఖ అధ్యక్షుడు హీరాలాల్ నాయక్, సేవా సంఘం నాయకులు రూప్ సింగ్, తిరుపతి, జవహర్, వినోద్, మహాలక్ష్మి, శంకర్, రామ్, గజన్‌లాల్, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'వినోద్‌కుమార్' గెలుపుతోనే అభివృద్ధి

కరీంనగర్: ఎంపీగా బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ అనిల్ కూర్మచలం అన్నారు. శుక్రవారం మీసేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వినోద్‌కుమార్ విద్యావేత్తగా, న్యాయవాదిగా విశేషమైన అనుభవం ఉందని అన్నారు. ఎంపీగా గెలిపించుకోవడం ద్వారా కరీంనగర్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్ఆర్ఐ సెల్ ప్రతినిధులు ప్రశాంత్‌రెడ్డి, రాజ్ కుమార్, వినయ్, ప్రశాంత్, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం

కరీంనగర్: బీజేపీ, బీఆర్ఎస్, మోదీ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు అన్నారు. ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా నగరంలోని 10వ డివిజన్ కట్టరాంపూర్‌లో సీపీఐ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు. కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు బత్తిని చంద్రయ్యగౌడ్, సీపీఐ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగం జోలికి వస్తే తరిమికొడతాం

కరీంనగర్: భారత రాజ్యాంగాన్ని మారుస్తానని, రిజర్వేషన్లను ఎత్తివేస్తామని కొన్ని రోజులుగా మాట్లాడుతున్న బీజేపీ నాయకులు రాజ్యాంగం జోలికి వస్తే తరిమికొట్టాల్సి వస్తుందని దళిత సంఘాల ఐక్యవేదిక సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శుక్రవారం కిసాన్‌నగర్‌లో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్ ఆధ్వర్యంలో దళిత సంఘాల ఐక్యవేదిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో దళితుల ఉనికికి ప్రమాదం పొంచి ఉందని, మనువాద బీజేపీ రిజర్వేషన్లను ఎత్తివేయాలని కుట్ర చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌కు దళితుల సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు. దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు క్యాదాసి ప్రభాకర్, సొంబారి కొమురయ్య, సతీశ్, అనిల్, సంపత్, శ్రీనివాస్, సోమయ్య, తాటిపల్లి ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

జనాదరణ కోల్పోయిన కేసీఆర్

కరీంనగర్‌టౌన్: కేసీఆర్ పరిస్థితి బహిరంగ సభల స్థాయి నుంచి వీధి సమావేశాలకు దిగజారిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొట్టె మురళీకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాంనగర్, శ్రీహరినగర్, కురుమవాడ, విద్యానగర్ ప్రాంతాల్లో బీజేపీ సోషల్ మీడియా పార్లమెంట్ కన్వీనర్ ఉప్పరపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో మాట్లాడారు.

ఇళ్ల ఘనత కాంగ్రెస్‌దే..

కరీంనగర్ కార్పొరేషన్: నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత ముమ్మాటికీ కాంగ్రెస్‌దేనని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ అన్నారు. శుక్రవారం సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, కాంగ్రెస్ హయాంలో దాదాపు 40 వేల ఇళ్లు నిర్మించారని తెలిపారు. కేసీఆర్ హయాంలో కేవలం 207 డబల్ బెడ్ రూమ్‌లు మాత్రమే ఇచ్చారన్నారు. మహమ్మద్ అమీర్, కీర్తి, శెహెన్షా, తిరుపతి పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

కరీంనగర్‌రూరల్: గోపాల్‌పూర్‌లో ఎంపీ బండి సంజయ్‌కు మద్దతుగా బీజేపీ కార్యకర్తలు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఊరడి శివారెడ్డి, మెండె పునేందర్, తిరుపతి, రాజ్‌కుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. దుర్శేడ్‌లో మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు ఆధ్వర్యంలో బి.వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఇరుకుల్ల, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్, చామనపల్లి త దితర గ్రామాల్లో వెలిచాల రాజేందర్ రావుకు ఓటేసి ఎంపీగా గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



కరీంనగర్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు బూస ప్రశాంత్, నౌండ్ల వెంకటేశ్, బూస సంపత్, కిషన్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ద ఎపిక్ న్యూ స్విఫ్ట్



విడుదల చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్: నగరంలోని ఆదర్శ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్ మారుతి ఎరీన షోరూంలో నూతన మార్పులతో వచ్చిన నాల్గో జనరేషన్ ద ఎపిక్ న్యూ స్విఫ్ట్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం విడుదల చేశారు. ఆదర్శ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బూరుగు సత్యనారాయణగౌడ్ స్విఫ్ట్ గురించి వివరించారు. దీనిలో కొత్తగా జెడ్ సిరీస్ ఇంజన్(జెడ్12ఈ) ఎక్కువ మైలేజీతో పరిచయం చేశారు. దీని మైలేజ్ మ్యాన్యువల్‌లో 24.80 కెఎంపీఎల్ ఆటోమోటిక్ ట్రాన్స్‌మిషన్‌లో 25.75 కెఎంపీఎల్‌గా ఉంది. ఆరు ఎయిర్ బ్యాగ్స్ స్టాండర్డ్ ఫీచర్‌గా, కొత్త తొమ్మిది ఇంచుల టచ్ స్క్రీన్, వైర్‌లెస్ చార్జర్ ఉన్నాయని తెలిపారు.

సాక్షి
కరీంనగర్
3
శనివారం । 11 । మే । 2024


సిరిసిల్లలో కేసీఆర్ రోడ్‌షోకు హాజరైన ప్రజలు

ప్రచారం ఇయ్యాల్టికే లాస్ట్



సాక్షిప్రతినిధి, కరీంనగర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం పరిసమాప్తం కానుంది. ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ ముగిసే 48 గంటల ముందే ప్రచారం నిలిపివేయాలి. దీంతో చివరి రోజు అభ్యర్థులు ప్రతీ నిమిషాన్ని వినియోగించుకోనున్నారు. గత నెల 29న నామినేషన్ల ప్రక్రియ పూర్తయినప్పటి నుంచి బరిలో ఉన్న అభ్యర్థులు తీరిక లేకుండా ప్రచారంలో గడిపేస్తున్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థులు, స్వతంత్రులు పోటా పోటీగా ప్రజల్లో తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఎండనకా.. వాననకా కలియదిరిగారు. ఒకర్ని మించి మరొకరు అన్నట్లుగా వాడీవేడిగా ప్రచారం సాగించారు. ప్రత్యర్థులపై మాటల తూటాలు పేల్చారు. విమర్శలు, ఆరోపణలు చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులతో బహిరంగ సభలు, బైక్ ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీల అభ్యర్థులు అభివృద్ధిలోటు పాట్లు, గెలిపిస్తే చేసే పనులు వివరించారు. అధికారంలో ఉన్న నాయకులు తాము చేసిన, చేస్తున్న పథకాలు, చేయబోయే కార్యక్రమాలు వివరించారు.

- గోదావరి నీళ్లు రావాలంటే.. వినోద్‌కుమార్‌ను గెలిపించాలె..
- మన హక్కులు కాపాడుకోవాలంటే.. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలె..
- వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఎందుకు ఇస్తలేరో చెప్పాలె..
- ఇంకా మూడు రోజుల సమయం ఉన్నది ఆలోచించి ఓట్లు వేయాలె..
- సిరిసిల్ల రోడ్ షోలో బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు
- నేతన్నచౌక్ గులాబీమయం ● గులాబీ బాస్‌కు నీరా'జనం'

సిరిసిల్ల జిల్లా ఉండాల్నా.. వద్దా?

సిరిసిల్ల: 'దేవుని పేరుమీద ఉండాలని రాజన్నసిరిసిల్ల జిల్లాను చేసుకున్నాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల జిల్లాను తీసేస్తా అంటుండూ.. జిల్లా ఉండాల్నా వద్దా..?' అని బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి నేతన్నచౌక్‌లో రోడ్‌షోలో ప్రసంగించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఉండాలంటే.. వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. గోదావరి నీళ్లు నర్మాల ఎగువమానేరుకు, మధ్య మానేరుకు రావాలన్నా.. మన హక్కులు కాపాడుకోవాలంటే.. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మొన్ననే ప్రధాని నరేంద్రమోదీ వేములవాడకు వచ్చిండు.. దేవస్థానాన్ని బాగుచేస్తానని, ఒక్క మాటనన్నా చెప్పిండా.. అని ప్రశ్నించారు. 'సిరిసిల్ల చేనేత కార్మికులకు రూ.371కోట్లు బకాయిలు ఉన్నాయి.. ఈ ప్రభుత్వం కట్టమంటే కట్టకుండా నేతకార్మికులను పాపడాలు, నిరోధ్‌లు అమ్ముకోండంటే.. కోపం వచ్చి నేనోటి అంటే.. నా మీద 48 గంటల నిషేధం పెట్టారు..' కేసీఆర్ వివరించారు. తెలంగాణ రాక ముందు సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు చూసి చలించి రూ.50లక్షలను తమ పార్టీ పరంగా ఇచ్చి ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. నేతన్నల బతుకులు మార్చేందుకు బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాల ఆర్డర్లు ఇచ్చినం.. మరీ ఇప్పుడు అవన్నీ ఎటుపాయే అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు ఎందుకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వదని అడిగారు. నేతకార్మికులు అంటే.. అంత అలుసా అని ప్రశ్నించారు. పని లేక కార్మికులు ఇబ్బందులు పడుతుంటే.. ఆర్డర్లు ఇవ్వకుండా.. బకాయిలు ఇవ్వకుండా కార్మికుల బతుకులతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చర్చించి ఓటు వేయాలె...

ఇది కీలక సమయమని, ఇంకా మూడు రోజుల సమయం ఉందని.. ఇంటికెళ్లి మీరంతా చర్చించి ఓటు వేయాలే.. అని కేసీఆర్ కోరారు. మరమగ్గాలు(పవర్‌లూమ్స్) బంద్ అయిపోయి, కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల కవులు, రచయితలు, మేధావులకు నిలయని, పెద్దింటి అశోక్‌కుమార్ లాంటి రచయితలు ఉన్నారని, అందరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. రైతుభరోసా ఎటుపాయే.. ధాన్యం కొంటలేరు.. మీరే చూస్తున్నారన్నారు. తెలంగాణ కోసం రాజీనామా చేస్తే.. రెండు లక్షల మెజార్టీ ఇచ్చి ఉద్యమాన్ని నిలబెట్టారని, ఈ కీలక సమయంలో అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు, ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, పుచ్చిడి మోహన్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా, వేములవాడ బీఆర్‌ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీ నర్సింహారావు, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థపు మాధవి, బీఆర్‌ఎస్ నాయకులు గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సింగిల్‌విండో చైర్మన్లు, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షో సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నిండింది. సిరిసిల్ల వీధుల్లో సాయంత్రం 5 గంటలకే గులాబీ కండువాలతో జనం నిండిపోయారు. బిల్డింగులపై జనం ఎక్కి కేసీఆర్ ప్రసంగాన్ని వినడం విశేషం.


భవనాల పైనుంచి కేసీఆర్ రోడ్ షోను తిలకిస్తున్న ప్రజలు


మాట్లాడుతున్న కేసీఆర్

గులాబీ బాస్‌కు నీరా'జనం'

సిరిసిల్ల కొత్త చెరువు కట్ట నుంచి జనం కేసీఆర్‌కు నీరాజనం పలికారు. బస్సుయాత్రలో భాగంగా శుక్రవారం 7 గంటలకు నేతన్న చౌక్‌కు కేసీఆర్ చేరుకున్నారు. కేసీఆర్ ప్రసంగిస్తుండగా.. జనం అరుపులు కేకలు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కట్టడి చేశారు. కేసీఆర్ ప్రసంగం ముగించే దశలో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కలుగజేసుకుని జిల్లాను రద్దు చేసే అంశాన్ని గుర్తు చేశారు. దీంతో కేసీఆర్ జిల్లా ఉండాలా.. వద్దా అంటూ.. జనాన్ని ప్రశ్నించగా.. ఉండాలే అని జనం నుంచి స్పందన వచ్చింది. మాట్ల తిరుపతి, శిరీష కళాకారుల పాటలు, ఆటలు ఆకట్టుకున్నాయి. వెయ్యి మంది కళాకారులు సిరిసిల్ల వీధుల్లో కవాతు నిర్వహించారు. కళాకారులు బోనాలు ఎత్తుకుని, బతుకమ్మలతో, డప్పు వాయిద్యాలతో ఆకట్టుకున్నారు.


మంగళహారతులతో మహిళలు


ఒగ్గుడోలు కళాకారుల నృత్యాలు

న్యూస్‌రీల్

జిల్లాలో 54 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు


నగరంలో కేంద్ర బలగాల కవాతు (ఫైల్)

కరీంనగర్‌క్రైం: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ తుది ఘట్టానికి చేరుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటినుంచి పోలీసులు జిల్లా సరిహద్దుల్లోని ఐదు చెక్‌పోస్టుల ద్వారా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలింగ్ సమయం సమీపిస్తుండడంతో సీపీ అభిషేక్ మహంతి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 547 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 54సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి వద్ద భద్రత పటిష్టం చేశారు. ఎన్నికల విధుల్లో మూడువేల మంది పోలీసు సిబ్బంది పాల్గొననున్నారు. ఇందులో 2,400 మంది స్థానిక పోలీసులు , 500 నుంచి 600వరకు కేంద్ర బలగాలు ఉన్నాయి.

'డీఈవోను విధుల నుంచి తొలగించాలి'


మాట్లాడుతున్న రాణా ప్రతాప్

హుజూరాబాద్: ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారిని విధుల్లోంచి తొలగించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూరాబాద్‌లో మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా పలు కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాల్సిన డీఈవో పట్టించుకోకుండా, సదరు యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అనంతరం పీడీఎస్‌యూ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా కెంసారపు రవితేజ, ఉపాధ్యక్షుడిగా కొయ్యడ రాకేశ్, ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి అజయ్, సహాయ కార్యదర్శిగా కొయ్యడ శ్రీజ, కోశాధికారిగా బొడిక బన్ని ఎన్నికయ్యారు.

'అనుమతి లేని ఆస్పత్రులపై చర్యలు చేపట్టండి'


మాట్లాడుతున్న రవినాయక్

కరీంనగర్‌టౌన్: జిల్లాలో అనుమతి, ఫైర్‌సేఫ్టీ లేకుండా నిర్వహిస్తున్న ఆస్పత్రులపై చర్యలు చేపట్టాలని పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ రవినాయక్ సూచించారు. శుక్రవారం కరీంనగర్‌కు వచ్చిన ఆయన మొదట తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. అనంతరం డీఎంహెచ్‌వో ఆఫీస్‌లో ప్రోగ్రాం ఆఫీసర్లతో ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. రవినాయక్ మాట్లాడుతూ అన్ని ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులు తప్పనిసరిగా డీఆర్‌ఏ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో సుజాత, కేవీ.రవీందర్‌రెడ్డి, సజీదా అతహరి, జువేరియా పాల్గొన్నారు.

ఎన్నికల్లో పౌరుషం చూపించాలె


గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్, పక్కన ఎంపీ అభ్యర్థి రాజేందర్ రావు

- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: లోక్‌సభ ఎన్నికల్లో ముదిరాజ్‌లు తమ పౌరుషాన్ని చూపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఒక్క ముదిరాజ్‌కు కూడా కేసీఆర్ టికెట్ ఇవ్వలేదని, బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు ఈటల రాజేందర్‌ను ఓడించేందుకు కౌశిక్‌రెడ్డితో కలిసి కేసీఆర్ కుట్ర పన్నారని ఆరోపించారు. శుక్రవారం నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ముదిరాజ్, గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనాలు జరిగాయి. ఈ సమ్మేళనాలకు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ ముదిరాజ్‌లను అవమానించిన కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో తమ రోషం చూపించాలన్నారు. 119 సీట్లలో ఒక్క సీటు కూడా ముదిరాజ్‌లకు ఇవ్వని బీఆర్‌ఎస్‌లో చీమునెత్తురు ఉన్న వాళ్లు ఎలా తిరుగుతారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, త్వరలో ముదిరాజ్ బిడ్డ మంత్రి అవుతున్నాడని తెలిపారు. కులాలు వేరైన బీసీలంతా ఒక్కటేనన్నారు. ఎల్లమ్మతల్లి, పెద్దమ్మతల్లి ఆశీర్వాదంతో హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిని అయ్యానన్నారు. గతంలో ఉన్న గౌడ హాస్టల్ కన్నా పెద్ద హాస్టల్‌ను నిర్మిస్తున్నామన్నారు. వేములవాడలో స్టార్‌హోటల్‌ను తలపించే స్థాయిలో వసతిగృహం నిర్మిస్తున్నామని తెలిపారు. నగరంలోని ఎల్లమ్మతల్లి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించాలని, అందుకు ఎంపీ సహకారం కూడా తీసుకోవాలన్నారు. రాజేందర్‌రావు గెలిస్తే తన గౌరవం పెరుగుతుందని, తనతో పాటు, అందరూ గెలిచినట్లేనన్నారు. చొక్కారావును ఓడించిన జగపతిరావు కుమారుడికి మద్దతిస్తున్నామని బండి సంజయ్ అనడాన్ని ఖండించారు. జగపతిరావు తెలంగాణ ఉద్యమకారుడని, రాజేందర్‌రావు చొక్కారావు మీద పోటీ చేయలేదన్నారు. పొరపాటున బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు ఉండవన్నారు.

పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు


మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: పార్లమెంట్ ఎన్నికలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఈసారి శిక్షణా కానిస్టేబుళ్లు సైతం విధులు నిర్వహిస్తారని సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. శుక్రవారం కరీంనగర్ రాంనగర్‌లోని పోలీస్ ట్రెనింగ్ కళాశాల, కరీంనగర్ బైపాస్‌లోని సీటీసీలో శిక్షణా కానిస్టేబుళ్లకు ఎన్నికల విధులపై పలు సూచనలు చేశారు. ఆదివారం ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు ఎట్టిపరిస్థితుల్లో పోలింగ్‌కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని సూచించారు. శాంతిభద్రతల సమస్య తలెత్తితే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 11వ తేదీ శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు కమిషనరేట్ పరిధిలో సీఆర్‌పీసీ 144 సెక్షన్ అమలు చేస్తామని సీపీ తెలిపారు.

మద్యం దుకాణాల మూసివేత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు గుణపాఠం చెప్పాలి



గన్నేరువరంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్, హాజరైన ప్రజలు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

గన్నేరువరం: మోసపూరితమైన వాగ్దానాలతో మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ సూచించారు. శుక్రవారం గన్నేరువరంలో స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. రాముడి పేరుతో రాజకీయాలంటూ ఇరుపార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని అన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మించడం తప్పా అని ప్రశ్నించారు. మైనార్టీ ఓట్లు పొందడానికి ఇరు పార్టీలు ఆరాటపడుతున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విద్వేష వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలే నరేంద్ర మోదీకి పెద్ద కుటుంబమని, ఆ కుటుంబం నుంచి ఎవరిని దూరం చేయలేరని అన్నారు. ఆరు గ్యారంటీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలం అయ్యారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఏం చేసిందని పదేపదే కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ప్రశ్నిస్తున్నాయని, కేంద్ర నిధులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు కనబడడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 120రోజులు కావస్తున్నా ఇంతవరకు రైతుల రుణ మాఫీ ఎందుకు చేయలేదని, మహిళలకు రూ.2500 ఎందుకు ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాన్ని బీజేపీ ప్రశ్నిస్తేనే, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారని, ఇప్పుడు మళ్లీ మోసపోవద్దన్నారు. వివిధ పార్టీలకు చెందినవారు బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం, కోమల ఆంజనేయులు, నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏలేటి చంద్రారెడ్డి, సొల్లు అజయ్‌వర్మ, అనిల్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలిక్కడే..

- నియోజకవర్గానికి ఐదు మహిళా, ఆదర్శ పోలింగ్ కేంద్రాలు
- ఒక దివ్యాంగ, యూత్ పోలింగ్ కేంద్రం
- ఏర్పాట్లలో ఎన్నికల యంత్రాంగం

కరీంనగర్ అర్బన్: ప్రత్యేక పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు కసరత్తు పూర్తి చేశారు. సిబ్బంది నియామకం చివరి దశకు చేరుకోగా అలాట్‌మెంట్ చేయడమే తరువాయి. నియోజకవర్గానికి ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలతో పాటు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. దివ్యాంగులు, యువ పోలింగ్ కేంద్రాలుండాలని స్పష్టం చేసింది. సదరు ఆదేశాల దరిమిలా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టగా ప్రత్యేక కేంద్రాలను ప్రకటించారు. దివ్యాంగుల పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, యువ పోలింగ్ కేంద్రంలో యువ ఉద్యోగులు, మహిళా పోలింగ్ కేంద్రంలో మహిళా ఉద్యోగులే విధులు నిర్వహించనున్నారు.

కరీంనగర్ నియోజకవర్గంలో ప్రత్యేక కేంద్రాలు...

నియోజకవర్గంలో దివ్యాంగుల పోలింగ్ కేంద్రం ముకరంపురలోని వాణినికేతన్ డిగ్రీ కళాశాలలో(పీఎస్ నంబరు 263) ఏర్పాటు చేశారు. కుమర్వాడిలోని ప్రభుత్వ హైస్కూల్ (పీఎస్ నం.226)లో యువ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. లయోలా బీఈడీ కాలేజీ రేకుర్తి(పీఎస్ నం.43), ఎంపీయూపీఎస్, గుంటూరుపల్లి(127), జెడ్పీహెచ్‌ఎస్, నగునూరు(80), సిద్ధార్థ హైస్కూల్, మంకమ్మతోట(354), మహిళా డిగ్రీ కాలేజీ, కశ్మీర్‌గడ్డ (284)లో మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రైమరీ స్కూల్, నాగులమల్యాల(3), ఎలగందుల(14), కరీంనగర్ (366), భగత్‌నగర్ (332), రాంనగర్ (361)లో మోడల్ పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేయనున్నారు.


పోలింగ్ కేంద్రం

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్ నియోజకవర్గంలో దివ్యాంగ పోలింగ్‌కేంద్రం జెడ్పీహెచ్‌ఎస్, సిర్సపల్లి(14)లో, యువ పోలింగ్ కేంద్రాన్ని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్(పీఎస్ నం.151), జమ్మికుంటలో ఏర్పాటు చేశారు. జెడ్పీహెచ్‌ఎస్, కందుగుల(పీఎస్‌నం.73), జీపీఆఫీస్, నర్సింగపూర్(112), ఎంపీయూపీఎస్, అంకుశాపూర్(211), జెడ్పీహెచ్‌ఎస్, సిరిసేడు(228), జెడ్పీహెచ్‌ఎస్, శనిగరం(275)లో మహిళా కేంద్రాలు సిద్ధం చేస్తున్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలు జెడ్పీహెచ్‌ఎస్, చెల్పూరు(4), జెడ్పీహెచ్‌ఎస్, బేతిగల్(129), ఓంపీయూపీఎస్, విలాసాగర్(136), ఎంపీపీఎస్, ఇల్లందకుంట(225), జెడ్పీహెచ్‌ఎస్, ఉప్పల్(296)లో ఏర్పాటు చేయనున్నారు.

మానకొండూరులో..

దివ్యాంగుల పోలింగ్‌కేంద్రాన్ని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్(150) పోరండ్లలో ఏర్పాటు చేయగా, యువ పోలింగ్ కేంద్రాన్ని జెడ్పీహెచ్‌ఎస్(94), మెట్‌పల్లిలో ఏర్పాటు చేశారు. మహిళా పోలింగ్ కేంద్రాలను యూపీఎస్, లింగాపూర్(1), జెడ్పీహెచ్‌ఎస్, కేశవపట్నం(108), ఎంపీయూపీఎస్(159), రామకృష్ణాకాలనీ, జెడ్పీహెచ్‌ఎస్(192) గన్నేరువరం, జెడ్పీహెచ్‌ఎస్(315) గుండారంలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రైమరీ స్కూల్,లలితాపూర్(58), జెడ్పీహెచ్‌ఎస్, తాడికల్(103), ఎంపీపీఎస్ పర్లపల్లి(184), జీపీ ఆఫీస్(205) జంగపల్లి, ఎంపీపీఎస్, రేగులపల్లి (233)లో మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

చొప్పదండిలో

నియోజకవర్గంలో ఎంపీడీవో ఆఫీస్, మల్యాల (307)లో దివ్యాంగుల పోలింగ్ కేంద్రం, యువ పోలింగ్ కేంద్రాన్ని పోలింగ్ బూత్ నంబర్.255 ఎంపీపీఎస్, కొడిమ్యాలలో నిర్ణయించారు. మహిళా కేంద్రాలను ఎంపీపీఎస్ లక్ష్మీదేవిపల్లి(22), మండల విద్యావనరుల కేంద్రం (85), జెడ్పీహెచ్‌ఎస్(120) రాగంపేట , ఎంపీయూపీఎస్(221), సూరంపేట, జెడ్పీహెచ్‌ఎస్(298), మల్యాలలో ఏర్పాటు చేస్తున్నారు. జెడ్పీహెచ్‌ఎస్(26) గంగాధర, జెడ్పీహెచ్‌ఎస్(34) కురిక్యాల, జెడ్పీహెచ్‌ఎస్(150) చొప్పదండి , జెడ్పీహెచ్‌ఎస్(148), చొప్పదండి, జెడ్పీహెచ్‌ఎస్, వెదిర(91)లో మోడల్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

అప్రమత్తంగా ఉండండి

- ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా స్పందించండి
- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

కరీంనగర్ అర్బన్: పోలింగ్‌కు ముందు 48 గంటలు పాటు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే అంశంలో ఎలాంటి ఫిర్యాదొచ్చినా వెంటనే స్పందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, సర్వే స్టాటిక్ టీమ్స్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, అవసరమైతే అదనంగా బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని పోలింగ్ స్టేషన్లో వసతులు కల్పించాలని సూచించారు. పోలింగ్ అధికారులు ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సందర్భంగా నిబంధన మేరకు అన్నీ చూసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు కలెక్టర్, సీపీలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

ప్రతీ పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రతీ పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు బాగుండాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తాగునీరు, నీడ వసతి, క్యూలైన్లు తదితర వసతులు పక్కాగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రతీ రెండు గంటలకు ఒకసారి పోలింగ్‌శాతంపై నివేదిక అందించాలని సూచించారు. ఉదయం 6 గంటలకే మాక్ పోలింగ్ అప్రమత్తంగా నిర్వహించాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.


వీసీలో ఎన్నికల అధికారి పమేలా సత్పతి

పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూం వద్ద పక్కా ఏర్పాట్లు

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్ పత్రాలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచేందుకు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం రాత్రి కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పత్రాలు భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. సెయింట్ అల్ఫోన్స్ స్కూల్లోని ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం నుంచి పోస్టల్ బ్యాలెట్ పత్రాలను తగిన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలని పేర్కొన్నారు. 24 గంటల పాటు స్ట్రాంగ్‌రూం వద్ద తగిన భద్రత ఉంటుందని చెప్పారు. అనంతరం కళాశాలలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌కు చేపట్టిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిశ్చయంగా ఆ దివ్యపురుషుడు (పరబ్రహ్మ) ఆకార రహితుడు.
సమస్త జగత్తు లోపల, వెలుపల కూడా వ్యాపించినవాడు.
పుట్టుక లేనివాడు, మనస్సు లేనివాడు. అందుచేత అత్యంత పరిశుద్ధుడు.
– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 11 మే 2024

చిక్కుల్లో హరియాణా సర్కారు!

రాష్ట్రాల్లో అవకాశం చిక్కినచోటల్లా విపక్ష ప్రభుత్వాలను అస్థిరపరిచి, అధికారాన్ని చేజిక్కించుకోవటం అలవాటైన బీజేపీకి తొలిసారి సంకటస్థితి వచ్చిపడింది. హస్తినకు కూతవేటు దూరంలోవున్న హరియాణాలో ఆ పార్టీ ప్రభుత్వం సమస్యల్లో చిక్కుకుంది. సార్వత్రిక ఎన్నికల వేళ... రోడ్ షోలతో హోరెత్తించాల్సిన సమయంలో బీజేపీకి ఇదేమంత మంచి శకునం కాదు. అసలే ఉత్తరాదిలో బీజేపీ బలహీనపడిందని విపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. కనుక హరియాణా మాత్రమే కాదు... ఎన్నికలు జరగాల్సిన వేరే రాష్ట్రాల్లో కూడా వోటర్లకు వేరే సంకేతాలు వెళ్తాయి. ఈ నెల 25న ఆ రాష్ట్రంలోని పది లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగబోతుండగా మంగళవారం ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకున్నారు. దాంతో 90 మంది సభ్యులున్న హరియాణా అసెంబ్లీలో బీజేపీ ప్రభుత్వం మైనారిటీలో పడింది. పైకి గంభీరంగా కనబడుతున్నా లోక్‌సభ ఎన్నికల హడావుడిలో తలమునకలైన బీజేపీకి దీంతో ఊపిరాడటం లేదు. ఎంపీలుగా పోటీ చేసేందుకు ఇద్దరు బీజేపీ సభ్యులు రాజీనామా చేయటంతో అసెంబ్లీలో ప్రస్తుతం 88 మంది సభ్యులున్నారు. ప్రభుత్వం సాగాలంటే బీజేపీకి 45 మంది మద్దతు అవసరం కాగా ఇద్దరు ఇండిపెండెంట్లు, హరియాణా లోక్‌హిత్ పార్టీ సభ్యుడు బీజేపీకి మద్దతునిస్తున్నారు. అంటే బీజేపీ బలం 43కి పడిపోయింది. రెండు నెలల క్రితం బీజేపీ–జేజేపీ కూటమి సర్కారుకు నాయకత్వం వహిస్తున్న ఖట్టర్‌ను తొలగించి ఆయన స్థానంలో బీజేపీ అధిష్టానం నయాబ్‌సింగ్ సైనీని తీసుకొచ్చింది. దాంతోపాటు పదిమంది ఎమ్మెల్యేలున్న జన్‌నాయక్ జనతాపార్టీ (జేజేపీ)తో తెగతెంపులు చేసుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వున్న పది స్థానాలూ గెల్చుకున్న బీజేపీ ఈసారి ఎన్నికల్లో జేజేపీకి ఒక్క సీటు కూడా ఇవ్వదల్చుకోలేదు. సహజంగానే అంతవరకూ ఉపముఖ్యమంత్రిగా వున్న జేజేపీ నేత దుష్యంత్ చౌతాలాకు ఇది ఆగ్రహం తెప్పించింది. కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హుడా చలవతోనే ముగ్గురు ఇండిపెండెంట్లు బీజేపీ సర్కారుకు మద్దతు ఉపసంహరించుకున్నారన్నది వాస్తవం. అయితే కాంగ్రెస్ గనుక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామంటే మద్దతిస్తామంటున్న జేజేపీ వాస్తవ బలమెంతో చెప్పలేం. ప్రస్తుత బేరసారాల్లో ఆ పార్టీకున్న పదిమంది ఎమ్మెల్యేల్లో ఎందరు మిగులుతారన్నది అనుమానమే. వారిలో నలుగురి మద్దతు తమకే వున్నదని సైనీ చెప్పుకుంటున్నారు. వారిని అనర్హులుగా ప్రకటించాలని జేజేపీ కోరినా అది బీజేపీకే తోడ్పడుతుంది. ఉన్న 88 మందిలో నలుగుర్ని అనర్హులను చేయగానే సభలో సభ్యుల సంఖ్య 84కి పడిపోతుంది. దాంతో 43 మంది మద్దతున్న బీజేపీ ప్రభుత్వం సునాయాసంగా బయటపడుతుంది.

లోక్‌సభ ఎన్నికల ప్రచారం హోరెత్తుతుండగా ప్రభుత్వ అస్తిత్వానికే ముప్పు ఏర్పడటం హరియాణా ప్రజానీకానికి మంచి సంకేతం పంపదు. ఎమ్మెల్యేల బేరసారాలు కళ్లముందు స్పష్టంగా కనబడుతుండగా సుదీర్ఘ క్యూ లైన్‌లలో ఓపిగ్గా నిలబడి వోటేసేంత ఉత్సాహం ఎందరికుంటుంది? వచ్చే అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా ఈ కుర్చీలాట మొదలుకావటం వింత. రాష్ట్రంలో బీజేపీకి ఎదురుగాలి వీస్తున్నదనటానికి ఈ సంక్షోభం సంకేతమని కాంగ్రెస్ నాయకుడు హుడా చెబుతున్నారు. నిజానికి జనం అలా అను కోవాలని, లోక్‌సభ ఎన్నికల్లో తమకే పట్టం కట్టాలని ఆయన ఆత్రుత పడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఫిరాయింపులకు ఎవరు పాల్పడినా తప్పే. వేరే రాష్ట్రాల్లో బీజేపీ చేసినప్పుడు విమర్శించిన కాంగ్రెస్ హరియాణాలో అదే పనికి పూనుకోవటం నైతికంగా సరైందేనా? రాష్ట్రపతి పాలన కాంగ్రెస్ ఉద్దేశమని కొందరంటున్నారు. అందుకే మద్దతిస్తామంటూ జేజేపీ ముందుకొచ్చినా హుడా సాను కూలత చూపలేదని వారి వాదన. లోక్‌సభ ఎన్నికల జంజాటం లేకపోతే కొన్ని గంటల్లోనే బీజేపీ సునాయాసంగా చక్కదిద్దగలిగేది. కేంద్రంలో తాముండగా హరియాణాలో సొంత ప్రభుత్వాన్ని దించి రాష్ట్రపతి పాలనకు బీజేపీ సిద్ధపడటం కల్ల.

ఈ పరిస్థితుల్లో అందరి దృష్టీ హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయపై పడింది. బీజేపీకి లబ్ధి చేకూరేందుకు వీలుగా ప్రస్తుత ఎన్నికలు ముగిసేవరకూ సంక్షోభాన్ని కొనసాగించటం మాత్రం మంచిది కాదు. పాలకపక్షం సత్తాపై సంశయం ఏర్పడినప్పుడు నేరుగా అసెంబ్లీలోనే బలపరీక్షకు సిద్ధపడాలని కోరటం అన్నివిధాలా శ్రేయస్కరం. సంక్షోభాన్ని కొనసాగనిస్తే అనారోగ్యకర పరిణామాలకు చోటిచ్చినట్టవుతుంది. ప్రభుత్వాల బలాబలాలు చట్టసభల్లో తేలాలి తప్ప రాజ్‌భవన్‌లలో కాదని చాన్నాళ్ల క్రితమే సుప్రీంకోర్టు చెప్పింది. ఒకవేళ వెంటనే బలపరీక్ష నిర్వహించటం సాధ్యం కాదనిపిస్తే కొంత వ్యవధి తీసుకోవచ్చు. అయితే ఈలోగా రాష్ట్రపతి పాలన విధించటమే ఉత్తమం. కేంద్రం తీసుకొచ్చిన సాగుచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పంజాబ్ రైతులతోపాటు హరియాణా రైతులు కీలక పాత్ర పోషించారు. ఇటీవలి రైతు ఉద్యమంలో కూడా వారి పాత్ర తక్కువేమీ కాదు. రిజర్వేషన్లు కావాలంటూ 2016లో జాట్‌లు సాగించిన ఉద్యమం హింసాత్మకంగా మారింది. అది కులాల మధ్య కుంపట్లు రాజేసింది. మరోపక్క ఉపాధి అవకాశాలు కరువై యువతలో తీవ్ర నిరాశా నిస్పృహలు అలుముకున్నాయి. ఖట్టర్‌ను సీఎం పదవి నుంచి తొలగించి సైనీని ప్రతిష్ఠించటం జాట్‌లకు ఆగ్రహం కలిగించిందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయపు టెత్తుల్లో అధికార, విపక్షాలు రెండూ తలమునకలైతే ఇప్పటికే ఉన్న సమస్యలు రెట్టింపవుతాయి. కనుక ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే కోణంలో కాకుండా సాధ్యమైనంత త్వరగా ఈ రాజకీయ సంక్షోభానికి ముగింపు పలకాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: శు.చవితి తె.4.45 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి పంచమి, నక్షత్రం: మృగశిర ప.12.30 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: రా.9.02 నుండి 10.40 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.34 నుండి 7.15 వరకు, అమృతఘడియలు: రా.2.44 నుండి 4.19 వరకు

సూర్యోదయం: 5.34
సూర్యాస్తమయం: 6.18
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

అందరివాడికే అందలం

తన వల్ల మేలు జరిగిందీ అంటేనే ఓటేయండి అని జగన్ అడిగిన తీరు ఎన్నడూ కననిదీ, విననిదీ. బహుశా దేశంలోనే ఏ నాయకుడు కూడా ఇంత ఆత్మవిశ్వాసంతో సూటిగా అడిగి ఉండరు. అన్ని వర్గాల ప్రజలూ వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులే అన్నది ఈ విశ్వాసానికి కారణం. దానికి రుజువే ఎన్నికల ప్రచారంలో ఆయనకు లభిస్తున్న అమితమైన ఆదరణ! ఆంధ్రప్రదేశ్ ఓటర్లు మరోసారి ఆయన్ని అధికార పీఠం ఎక్కించడానికి 'సిద్ధం'గా ఉన్నారని దీన్నిబట్టి అర్థమవుతోంది.

'కాణి' ముత్యాలు ఇంటికే – మళ్లీ పట్టం జగన్‌కే!

విశ్లేషణ



పి. విజయబాబు

ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరోమారు విస్పష్టంగా జగన్‌మోహన్ రెడ్డికి అధికారం ఇవ్వనున్నారు. ఇది తెలుసుకోవడానికి 'సర్వేశ్వరులను' అడగనవసరం లేదు. గతంలో సర్వేలన్నీ సుప్రసిద్ధ మీడియా సంస్థలు నిర్వహించేవి. ఇప్పుడు ఎవరికి నచ్చిన విధంగా వారు సర్వేలు చేయించుకుంటూ 'స్వింగ్' ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడిన దగ్గర నుంచి ఇటు వైసీపీ, అటు కూటమి ప్రచార సరళి, అభ్యర్థుల ఎంపిక, ప్రజాస్పందన నిశితంగా పరిశీలిస్తే, తీర్పు ఎలా ఉండబోతోందో మనకే అర్థమవుతుంది.

జగన్ అన్ని పార్టీల కంటే ముందుగానే విడతల వారీగా అభ్యర్థులను ప్రకటించారు. టీడీపీ, జనసేన అవగాహన కుదుర్చుకున్నా, చివరి వరకూ బీజేపీ జత కడుతుందో లేదో తెలియని సందిగ్ధం. అందుకే చాలాచోట్ల ముందుగానే అభ్యర్థుల్ని ప్రకటించేసుకున్నారు. తీరా బీజేపీ వచ్చి చేరాక, మళ్ళీ అభ్యర్థుల ప్రకటనలో కుస్తీ పట్టాల్సి వచ్చింది. ఆశించిన స్థాయిలో కాక అతి తక్కువ సీట్లు జనసేన తీసుకోవడం, బీజేపీ పూర్వ అధ్యక్షుడు సోము వీర్రాజుతో సహా సీనియర్ బీజేపీ వారికి టికెట్లు దక్కకపోవడం వంటివి లుకలుకలకు కారణమయ్యాయి. పేరుకే మూడు పార్టీల జెండాలు. జన శ్రేణులు మాత్రం కలిసి పనిచేసే పరిస్థితి చాలా చోట్ల లేకుండా పోయింది.

పోనీ నిలబెట్టిన టీడీపీ అభ్యర్థుల్లో ఆణిముత్యాల లాంటి వారు ఉన్నారా అంటే, అబ్బే! చాలావరకు కాణి ముత్యాలే! ఇంచుమించు చంద్రబాబు మహా దోపిడీలో భాగస్వాములు లేదా ఆ దోపిడీ నుంచి స్ఫూర్తి పొందినవారే. ఇటు బెజవాడ దుర్గమ్మ, అటు విశాఖ కనకమహాలక్ష్మి, ఆ పక్క అనకాపల్లి నూకాలమ్మ సాక్షిగా వీరంతా కాణి ముత్యాలు. ఇలాంటివాళ్లే చంద్రబాబుకు కావాలి. టిప్పర్ డ్రైవర్లు, కమతగాళ్లు అంటే ఆయనకు అసహ్యం. ఈ బాపతు కాణి ముత్యాల్ని జనం ఆదరించరని చరిత్ర చెబుతున్న సత్యం. అందుకే వీళ్ళు ఎక్కువగా 'బ్యాక్ డోర్ పాలిటిక్స్' నడుపుతుంటారు.

ఇక ప్రచార తీరు పరిశీలిస్తే, తన వల్ల మేలు జరిగిందీ అంటేనే ఓటేయండి అని జగన్ అడిగిన తీరు... బహుశా దేశంలోనే ఏ నాయకుడు ఇంత ఆత్మ విశ్వాసంతో సూటిగా అడిగి ఉండరు. ఆయన ప్రచారాస్త్రాలు కూడా విలక్షణంగా ఉన్నాయని చెప్పాలి. ఎక్కడా నిగ్రహం కోల్పోకుండా విమర్శలకే పరిమితమయ్యారు తప్ప స్థాయి మరచి తిట్లు లంకించుకోలేదు, హుందాతనాన్ని కోల్పోలేదు. మరి కూటమి విషయానికొస్తే– వెకిలితనం, బూతు పురాణం, కొట్టండి, చంపండి, నరకండి అని జనాల్ని ప్రేరేపించటం సభ్య సమాజాన్ని విస్తుపరిచాయి. జగన్‌పై విసిరిన రాయి దాడిని ఖండించాల్సింది పోయి 'గులక రాయి' అని వెకిలితనాన్ని ప్రదర్శించటం, వలంటరీ వ్యవస్థను కట్టడి చేయడం, పండుటాకుల, పండు రెక్కలపై ఆక్రోశం వెలిబుచ్చి వాళ్ళ చావుకి కారణం కావడం, లేని భూయాజమాన్య హక్కు చట్టంపై దుష్ప్రచారానికి పూనుకోవడం వంటివి అన్నీ బూమరాంగ్ అయ్యాయి. అయితే జగన్ పని అయిపోయింది, ఇక తామే అధికారంలోకి వస్తున్నామనే ఫేక్ సర్వేలలో మాత్రం ముందున్నారు.



రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4 కోట్ల 13 లక్షలు. ఇందులో అర్బన్ ఓటర్లు కేవలం 87 లక్షలు. జగన్‌కు పెట్టని కోటల వంటి గ్రామీణ ఓటర్ల సంఖ్య 3 కోట్ల 20 లక్షలు. అందులో సంక్షేమ పథకాల లబ్ధిదారులే అధికం. ఇక కులాల ప్రాతిపదికగా చూస్తే... ఎస్సీలు 35 లక్షల 46 వేల 748, ఎస్టీలు 25 లక్షల 85 వేల 726, ముస్లింలు 23 లక్షల 84 వేల 449, బీసీ యాదవులు 25 లక్షలు, మత్స్యకారులు 15 లక్షల 74 వేల 868, గౌడలు 19 లక్షల 78 వేల 866, చంద్రబాబు చేత తీవ్ర అవమానాలకు గురైన రజకులు, నాయీ బ్రాహ్మణులు 8 లక్షల 41 వేల 400+ 4 లక్షల 15 వేల 520, బ్రాహ్మణులు 7 లక్షల 4 వేల 165. క్రైస్తవులు 3 లక్షల 15 వేల 320... ఈ సామాజిక వర్గాలలో అత్యధికులు జగన్ వైపే ఉన్నారు.

అధిక శాతం ఉన్న మరొక వర్గం, గోదావరి జిల్లాల్లో నిర్ణయాత్మక శక్తి అని చెబుతున్న కాపులు, రాయలసీమలోని బలిజలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ప్రాంతాల్లో ప్రధానంగా, ఇంకా ఇతర ప్రాంతాల్లో ఉన్న తూర్పు కాపులు, ఒంటరులు మొత్తం 52 లక్షల 97 వేల 748 మంది. వీరిలో జనసేన వైపు ఆశగా చూసి భంగపడిన వారు, చంద్రబాబు సామాజిక వర్గంతో దశాబ్దాల వ్యతిరేకత ఉన్నవారు, వైసీపీలోని కాపు నాయకుల వెంట ఉన్నవారు... ఇలా భిన్నాభిప్రాయాలతో అటూ ఇటూ ఉంటారు. ఇక రెడ్డి వర్గంలోని 26 లక్షల 748 మందిలో అధికులు జగన్ వైపు ఉండగా, కమ్మ వర్గంలోని 26 లక్షల 46 వేల 748 మందిలో అత్యధికులు చంద్రబాబు వైపు ఉంటారు. ఇతర బీసీలు, 13 లక్షల పైచిలుకు ఉన్న వైశ్యులు ఆయా ప్రాంతాల పార్టీ అభ్యర్థుల ప్రాతిపదికన రెండు వైపులా చీలతారు. మొత్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలలో అధిక శాతం వైసీపీ వైపే ఉన్నారు. గెలుపును నిర్ణయించే మరో శక్తి, నారీ శక్తి. అలాంటి మహిళలు జగన్ వైపే ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. దీనిని బట్టి, 'మళ్లీ పట్టం జగన్‌కే – కాణి ముత్యాలు ఇంటికే!'

వ్యాసకర్త పూర్వ సంపాదకుడు

ముస్లింలు బీజేపీని ఓడించాలి – వైసీపీని గెలిపించాలి!

సందర్భం



ఏఎం ఖాన్ యజ్దానీ డానీ

ప్రధాని నరేంద్ర మోదీజీ, బీజేపీల నాయకత్వంలో పదేళ్ళుగా కేంద్రంలో అధికారంలో వున్న ఎన్డీయే ప్రభుత్వం దేశ సంపదను అస్మదీయ కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. ఒకవైపు భారతదేశాన్ని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తాననటూనే మరోవైపు దేశ ప్రజల్ని పేదరికం లోనికి నెట్టి వేస్తున్నది. దేశ ప్రజలంటే 80 శాతం హిందువులు, 14 శాతం ముస్లింలు, 6 శాతం క్రైస్తవులు, సిక్కులు, తదితరులు. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన హ్యాపీనెస్ రిపోర్టులో భారతదేశం 126వ స్థానంలో వుంది. భారత ప్రజలు సంతోషంగా లేరు. అణిచివేతకు గురవుతున్న ప్రతి ఆరుగురిలో ఒకరు మాత్రమే ముస్లిం, ఐదుగురు హిందువులు. దీని అర్థం ఏమంటే మోదీ పాలనకు ప్రధాన బాధితులు హిందువులు. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చడానికి, హిందూ–ముస్లింల మధ్య తగువుపెట్టి ఎన్నికల్ని ఒక మత యుద్ధంగా మార్చడానికి స్వయంగా మోదీజీ నడుం బిగించారు. 2019 లోక్ సభ ఎన్నికల్ని ఆ పార్టీ 1761 నాటి పానిపట్టు యుద్ధంతో పోల్చేది. ఆ యుద్ధంలో అహ్మద్ షా అబ్దాలీ దుర్రానీ చేతుల్లో పీష్వా బాలాజీ బాజీరావు ఓడిపోవడంతో హిందువులు 250 ఏళ్ళ అధికారాన్ని కోల్పోయారని గుర్తు చేసి, మళ్ళీ అలాంటి దుఃస్థితి వస్తుందని భయపెట్టింది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్ని ఔరంగజేబ్, శివాజీ మహారాజ్‌ల మధ్య పోరాటంగా ప్రచారం చేసింది. గతేడాది జరిగిన కర్నాటక ఎన్నికల్లో టిప్పూ సుల్తాన్‌కు ఓటేస్తారా? రాణి అబ్బక్కకు ఓటేస్తారా? అని అడిగింది.

వివిధ రాష్ట్రాలు విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లింలకు ఇస్తున్న రిజర్వేషన్లను రద్దు చేసి హిందూ సమాజంలోని కింది కులాలకు కేటాయిస్తామని బీజేపీ చెపుతున్నది. కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అంశాన్ని విస్తారంగా ప్రచారం చేశారు. ఆ రెండు రాష్ట్రాల ప్రజలూ ఈ మాటల్ని నమ్మలేదు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లను బీజేపీ ఆమోదించదని మరో బూటకపు ప్రచారాన్ని ప్రధాని సాగిస్తున్నారు. నిజానికి మత ప్రాతిపదికనే కులాలుంటాయి. భారత రాజ్యాంగం కొన్ని సమూహాలకు ఇచ్చిన రిజర్వేషన్లు వాస్తవానికి మత రిజర్వేషన్లే. మాల సామాజిక వర్గానికి చెందిన ఒక వ్యక్తి తాను హిందువుననిగానీ, సిక్కును అనిగానీ ప్రకటించుకుంటేనే ఎస్సీ రిజర్వేషను పొందుతాడు. క్రైస్తవుడినని ప్రకటించుకుంటే బీసీ రిజర్వేషను పొందుతాడు. ఏమిటి దీనర్థం?

బీజేపీ ముస్లిం రిజర్వేషన్‌గా ప్రచారం చేస్తున్నది కూడా నిజానికి ముస్లిం రిజర్వేషన్ కాదు. ముస్లిం సమాజంలో ఓసీలుగా పరిగణించే సయ్యద్, పఠాన్, మొఘల్, బేగ్‌లకు బీసీ రిజర్వేషన్ వర్తించదు. మహా అయితే వాళ్ళు ఆర్థికంగా వెనుకబడిన సమూహాల (ఇడబ్ల్యూఎస్) కోటాలో లబ్ధి పొందవచ్చు. ముస్లింలను సాంస్కృతిక రంగంలో వివక్షకు గురి చేయడం, ఆర్థిక రంగంలో అతి క్రూరంగా బుల్ డోజర్లతో కూల్చి వేయడం బీజేపీ విధానంగా మారింది.

ఏపీలో ప్రధాన పోటీదారులు అధికార వైఎస్సార్ కాంగ్రెస్, ప్రతిపక్ష తెలుగుదేశం. ఆంధ్రప్రదేశ్ మొదటి నుండీ మత సామరస్యవాదుల నేల, సామ్యవాదుల భూమి. మతవిద్వేషాన్ని రగిల్చితే తప్ప రాజకీయ మనుగడ సాగించలేని బీజేపీ ఈ నేల మీద తనంత తానుగా మొలకెత్తలేని విత్తనం. 2019 ఎన్నికల్లో విడిగా పోటీచేస్తే బీజేపీకి ఒక్క శాతం ఓట్లు కూడ రాలేదు. లోక్ సభ, అసెంబ్లీల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదు.

జాతీయ స్థాయిలో ఎన్డీయేకు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి మాత్రమే. ఏపీ ముస్లింలు ఈసారి ఒక లెక్క ప్రకారం కాంగ్రెస్‌కు మద్దతు పలకాలి. అయితే, కర్ణాటక, తెలంగాణాల్లా ఏపీలో కాంగ్రెస్ నిర్మాణం బలంగా లేదు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఎంచుకున్న ప్రాధాన్యతల్ని ఆ పార్టీ ఏపీ నాయకులు పట్టించుకుంటున్నట్టు లేదు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు బీజేపీని ఓడించాలనే పట్టుదల వున్నట్టు లేదు. కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిని గెలిపించాలా? బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమిని ఓడించాలా? అనేది ఏపీ ముస్లింల ముందున్న ప్రశ్న.

రాష్ట్ర ఆర్థిక అవసరాల కోసమో, మరో కారణాలతోనో వైసీపీ జగన్ ఇన్నాళ్ళు అధికారంలో ఉన్న ఎన్డీయేతో సఖ్యంగా వున్నారు. ఇప్పుడు ఆయనే ఏపీ నేల మీద బీజేపీని ఎదుర్కోవాల్సిన స్థితిలో పడ్డారు. ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసేలోగా బీజేపీ, జగన్‌ల మధ్య పోరు మరింత వుధృతం అవుతుంది. భారత జాతీయ కాంగ్రెస్సా? వైఎస్సార్ కాంగ్రెస్సా? అనే ప్రశ్న మళ్ళా ముస్లింల ముందుకు వచ్చి నిలిచింది. ఇది రాజకీయ సమస్య మాత్రమే కాదు. ఒక విధంగా నైతిక సమస్య కూడా. ఆంధ్రప్రదేశ్ భౌతిక రాజకీయ సమీకరణలు, కాంగ్రెస్ ఏపీ యూనిట్ వాస్తవిక బలాబలాలు, పనితీరుల్ని పరిగణన లోనికి తీసుకుంటే ముస్లింలు వైసీపీకి మద్దతు ఇవ్వడమే మెరుగైన నిర్ణయం అవుతుంది. అది అవసరం కూడా. ఇటీవల విజయవాడలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ (ముస్లిం జేఏసీ), ముస్లిం ఆలోచనాపరుల వేదిక (ఎంటీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన ముస్లిం ఉలేమాలు, ఆలోచనాపరులు, అడ్వకేట్లు, డాక్టర్లు, ప్రొఫెషనల్స్‌తో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం కూడా ఈ మేరకు ఒక తీర్మానం చేసింది.

వ్యాసకర్త ముస్లిం ఆలోచనాపరుల వేదిక (ఎంటీఎఫ్) కన్వీనర్

సోషల్ మీడియా

పరిస్థితి మారేనా?



చాలామంది విశ్లేషకులు, బ్యూరోక్రాట్లు, ఆఖరికి బీజేపీ జనాలతో కూడా మాట్లాడాను. బిహార్‌లో ఇండియా కూటమి కనీసం 10–12 స్థానాల్లో గెలవనుంది. అదే నిజమైతే ఇది అసలైన గేమ్ చేంజర్. (2019లో ఎన్డీయే 39/40 స్థానాలు గెలిచింది.) – అర్ఫా ఖానమ్ షేర్‌వానీ, జర్నలిస్ట్

హెచ్చరిక!



జర్మనీలో ర్యాలీని చూడండి. 'ఇస్లామిస్టుల నుంచి తప్పించు కోవడానికి జర్మనీకి వచ్చాం. మా పిల్లలు మళ్లీ ఎటు పారిపోవాలి?' అని చాలామంది ఇరానియన్లు అడుగుతున్నారు. ఇస్లామిస్టులు పాశ్చాత్య నాగరికతను ధ్వంసం చేసి, ప్రపంచాన్ని ఏలాలనుకుంటున్నారు. మేలుకోకపోతే యూరప్ చేజారిపోతుంది. – దర్యా సఫాయి, బెల్జియం ఎంపీ

అలా చేశారు!



ఈ భూమ్మీద ఉన్న అందరు యూదులకు ఇప్పుడు బెంజమిన్ నెతన్యాహూ ప్రాతినిధ్యం వహిస్తున్నారని గుర్తుంచుకోండి. గాజాలో ఆయన విధానాలను ఏమాత్రం విమర్శించినా అది యూదు వ్యతిరేకత అవుతుంది. – అలీ ఎ. రిజ్వీ, రచయిత

విజ్ఞతతో నడుచుకొని రాజ్యాంగాన్ని కాపాడాలి!

అభిప్రాయం



జాలకంటి రంగారెడ్డి

ఇప్పుడు జరుగుతున్న పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికలు భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో కీలకమైనవి. మనం రాజ్యాంగ వ్యవస్థకు ప్రమాద ఘంటికలు మోగుతున్న తరుణంలో ఉన్నాం. విభిన్న మతాలు, కులాలతో పరిఢవిల్లే భారత్‌లో బీజేపీ మతం పేరుతో ప్రజలను వేరుచేసి చూస్తోంది. ఈ దేశంలోని మైనారిటీలను దేశ ప్రజలుగానే భావించడం లేదని ప్రధాని వ్యాఖ్యలతో ప్రస్ఫుటమవుతోంది. దీన్ని బట్టి పాలక ప్రభుత్వం నాటి బ్రిటిష్ వారి 'విభజించు పాలించు' విధానాన్ని కొనసాగిస్తోందని అర్థమవుతోంది.

మోదీ ప్రధానమంత్రిగా ఈ పదేళ్లలో చెప్పుకోదగ్గ పని ఏదీ చేయలేదు కనుక ఎన్నికల ప్రచారంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. 'ఇండియా' కూటమిని గెలిపిస్తే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా హిందువుల ఆస్తులను, స్త్రీలపై ఉన్న పుస్తెలతో సహా ముస్లింలకు కట్టబెడతారని మోదీ ప్రచారం చేస్తున్నారు. ఇది ఎంతవరకు నిజమో ప్రజలే జాగ్రత్తగా ఆలోచించాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అనని దానిని మసిపూసి మారేడు కాయచేసి ఈ విధంగా ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం భారతదేశ ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తికి ఏమాత్రం తగనిది.

అధికారమే పరమావధిగా బీజేపీ కూటమి పావులు కదుపుతోంది. గత రెండు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో ఈ దేశానికి ఛాయ్‌వాలా వస్తే దేశంలో కోట్లాదిమంది పేద ప్రజల పేదరికం రూపుమాసిపోతుందనీ, అందరూ లక్షాధికారులు కావచ్చనీ కాకమ్మ కథలు చెప్పి గెలిచారు. కానీ ప్రజలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారు. అధికారంలోకి వచ్చిన 100 రోజులలో బ్లాక్ మనీని బయటకు తీసి ప్రతీ కుటుంబానికి రూ. పదిహేను లక్షలను వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామని అన్నారు.



ఇప్పటికీ ఒక్కరూపాయి కూడా జమ చేయలేదు. ప్రతియేటా 2 కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలు పోయే విధానాలు అనుసరించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ వారికి అనుకూలమైన విధానాలు చేపడ్తామని చెప్పి చివరికి రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలు తెచ్చారు. రైతులు వ్యతిరేకించి ఉద్యమించడంతో వాటిని వెనక్కి తీసుకున్నారు. నిత్యావసర ధరలు తగ్గిస్తామని తగ్గించకపోగా హద్దు, పద్దు లేకుండా ప్రజల మీద మోయలేని భారం మోపారు. కార్మికులకు మేలు చేస్తామని కార్మిక వ్యతిరేక చట్టాలు తెచ్చారు. ఇంకా అనేక సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెట్టి అరచేతిలో వైకుంఠం చూపి గద్దె నెక్కిన మోదీ ప్రభుత్వం ప్రజలకు మొండిచేయి చూపింది. తమ మనువాద సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా సమైక్యంగా అన్నదమ్ముల్లా జీవిస్తున్న ప్రజల మధ్య హిందూ– ముస్లిం మత చిచ్చును రగిలిస్తోంది.

2019లో రెండవ దఫా జరిగిన ఎన్నికలలో పుల్వామా దాడిని చూపించి, హిందూ ముస్లింల భావోద్వేగాలను రెచ్చగొట్టి 300 పైగా సీట్లను గెలుచుకొని అధికారాన్ని రెండవ దఫా చేజిక్కించుకున్నారు. ఈసారి మూడవ సారి ఎలాగైనా అధికారంలోకి రావడం కోసం ఎత్తులకు పైఎత్తులు వేస్తున్న బీజేపీ, మోదీ... అధికారమే పరమావధిగా దేశ ప్రజలనూ, దేశ సమైక్యతనూ, లౌకికవాదాన్నీ, సౌభ్రాతృత్వాన్నీ విధ్వంసం చేసే పథకానికి రచన చేస్తున్నారు. అందులో భాగంగానే అయోధ్యలోని బాల రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం హడావుడిగా చేపట్టారు. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని నిఘావ్యవస్థలను తమ చేతుల్లోకి తీసుకొని, వాటిని తమకు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్షాలపై, ఇతర పౌరహక్కుల కార్యకర్తలూ, పౌరులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. 1975 నాటి అత్యవసర పరిస్థితిని మించి తలపిస్తున్నది నేటి కేంద్ర ప్రభుత్వం.

ఈ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చే ప్రమాదం ఉంది. బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతూ రిజర్వేషన్లు రాకుండా ప్రభుత్వరంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నది. భారత రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. ఇప్పటి వరకు మూడు విడతలుగా జరిగిన పోలింగ్‌లో బీజేపీకి ఆశించిన విధంగా ప్రజలు ఓట్లు వేయలేదనే అనుమానంతో బరితెగించి మరింత రెచ్చగొట్టే ప్రసంగాలను మొదలుపెట్టింది. మైనారిటీలపై విద్వేషాన్ని వెళ్లగక్కుతూ ప్రధాని మోదీ చేసిన తీవ్రమైన వ్యాఖ్యలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి.

ఇలా పాలకుల విధానాలను కులపరంగాను, మత పరంగాను ఎదుర్కోవడం కాదు... సమష్టిగా వర్గ పరంగా ఎదుర్కోవాల్సిన అవసరాన్ని పాలక వర్గం కల్పించింది. మెలకువతో ప్రజలందరూ చైతన్యయుతంగా ఆలోచించి బీజేపీ– మోదీ మరొకసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలి. విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించడం ఇప్పుడు ప్రతి భారతీయుడి కర్తవ్యం.

వ్యాసకర్త మాజీ శాసనసభ్యులు

మూలంలోకి జీవుని చేర్చుటయే...

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఋషులను గూర్చి అలాగే వారు చేయు తపస్సును గూర్చి చాలామంది విని ఉంటారు. కాని వారికి 'తపస్సు' అర్థం తెలియదు. అడవిలోనికి వెళ్ళి గడ్డము, మీసములను పెంచుకొని, కళ్ళుమూసుకొని, శ్వాసను నియంత్రించుచు జపము చేయుటయే తపస్సు అని చాలామంది అనుకొంటారు. స్వార్థరహితంగా, ప్రశాంతంగా ఆలోచించి హృదయపూర్వకంగా లోకకల్యాణం కోసం చేసే సేవయే నిజమైన తపస్సు. ఏ రంగంలో ఉన్నవారైనా ప్రతి ఒక్కరూ కర్మలన్నిటినీ తపస్సుగా మార్చుకొని, భగవంతునికి సమర్పించుకోవటానికి ప్రయత్నించాలి.

ఏ సాధకుడు తన మార్గాన్ని కాని, గురువును కాని తరచుగా మారుస్తూ ఉంటాడో అటువంటి వాడికి లక్ష్యం సిద్ధించదు. ఆత్మాన్వేషణ మార్గాన్ని కాని లేక గురువును కాని ఎంచుకొనేటప్పుడు హృదయపూర్వకముగా ఎంచుకోవాలి. తర్వాత ఆయన్ని నమ్రతతో, వినయ విధేయతలతో అనుసరించాలి. ప్రమాదకరమైన లేక సందిగ్ధ పరిస్థితులన్నింటిలో భగవన్నామమే లంగరు వంటిది. కావున హృదయాంతరంగంలో భగవన్నామాన్నే నిలుపుకోవాలి.

ఆత్మసాధనలో ఆచరించు పద్ధతులన్నింటిలో రామ, కృష్ణ, గోవింద అని ఉచ్చరించుట సులభమైనది. కలియుగంలో భగవంతుని కృపను పొందటానికి భగవన్నామ స్మరణే సులభ మార్గం. దీనిని మించిన మార్గం లేదు.

మార్గములన్నీ సమానమైన ప్రాముఖ్యం కలిగినవీ, ప్రభావంతమైనవే. జీవాత్మను పరమాత్మునిలో చేర్చుటయే ఈ మార్గములన్నింటి లక్ష్యం. మంచితనం విషయంలో ఉత్తమ, మధ్యమ, అధమ అనేవి సాపేక్ష పదాలు మాత్రమే. ఏ వ్యక్తికి ఏ మార్గం సులభంగా, మనస్సుకు నచ్చుతుందో అదే అతనికి అత్యంత ఉత్తమ మార్గం.

అనేక నదులు వివిధ దిశల నుండి వేగంగా ప్రవహిస్తూ చివరగా సముద్రంలో కలసిపోయినట్లే... భక్తి, జ్ఞాన మార్గాల్లో పయనించే వారందరూ చివరిగా చేసే ప్రయత్నం ఒక్కటే. జీవుడు ఏ మూలం నుండి వచ్చాడో అదే మూలం లోకి జీవుని చేర్చుటయే భక్తి, జ్ఞాన మార్గముల లక్ష్యం.

ఓటరుగా నమోదు చేసుకోవాలంటే ఒకప్పుడు పెద్ద తతంగమే ఉండేది. సమీపంలోని రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత దాని పరిస్థితేమిటో తెలిసేది కాదు. ఓటర్ల జాబితా విడుదలైనప్పుడు అందులో పేరుంటే ఓటు హక్కు వచ్చినట్టు తెలిసేది! ఇదంతా గతం. ఇప్పుడు ఎన్నికల సంఘం టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగిస్తోంది. సేవలు, విధులను దాదాపుగా డిజిటలీకరించింది. తద్వారా పాదర్శకతను పెంచే దిశగా కృషి చేస్తోంది. ఓటరుగా నమోదు మొదలుకుని తప్పొప్పులు, చిరునామా సవరణలు, ఓటు బదిలీ దాకా ఇప్పుడన్నీ కూర్చున్న చోటినుంచి ఆన్‌లైన్‌లోనే చేసుకోవచ్చు. అంతేనా?! ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది, అక్కడికెలా వెళ్లాలి, అభ్యర్థులు, వారి ఆస్తులు, కేసుల వివరాల వంటివన్నీ స్మార్ట్ ఫోన్ నుంచే తెలుసుకోవచ్చు. ఎన్నికల్లో అవకతవకలపై ఫిర్యాదులు కూడా ఆన్‌లైన్‌లోనే చేసేయవచ్చు. ఇలా గడిచిన దశాబ్ద కాలంలో ఎన్నికల సంఘం తీసుకొచ్చిన డిజిటల్ మార్పులు అన్నీ ఇన్నీ కావు. వాటిని ఓసారి తెలుసుకుందాం...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎన్నికల సమాచారం సమస్తం... వేలి కొసలపైనే!

ఈసీ డిజిటల్ విప్లవం | అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే | ఓటర్ నమోదు నుంచి ఫిర్యాదు దాకా | అందుబాటులో డిజిటల్ ఓటర్ ఐడీ



నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌వీఎస్‌పీ) (2015)

ఈ పోర్టల్ (వెబ్‌సైట్) ద్వారా కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, నియోజకవర్గాలు, వాటి పరిధిలో పోలింగ్ కేంద్రాల సమచారం తెలుసుకోవచ్చు. బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల వివరాలు కూడా ఇక్కడే లభిస్తాయి.

ఎన్‌వీఎస్‌పీ ఆధునీకరణ (2019)

ఓటర్లకు కావాల్సిన సేవలన్నింటికీ ఏకీకృత పోర్టల్‌గా www.nvsp.in పేరుతో ఈసీ దీన్ని అభివృద్ధి చేసింది. తర్వాత voters.eci.gov.inకు అనుసంధానం చేసింది.

ఐటీ నెట్‌వర్క్ (2019)

దేశవ్యాప్తంగా నియోజకవర్గాల స్థాయిలో తాజా సమాచారం, ఓట్ల లెక్కింపు తాలూకు తాజా ఫలితాలు తెలుసుకునేందుకు ఎన్నికల సిబ్బంది కోసం తీసుకొచ్చిన నెట్‌వర్క్. 2019 ఎన్నికల కౌంటింగ్‌కు ముందు దీన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు ఈ ఐటీ సదుపాయం ద్వారా తాజా సమాచారం తెలుసుకుని డిజిటల్ తెరలపై ప్రదర్శించడానికి అవకాశం ఏర్పడింది.

ఆధార్‌తో అనుసంధానం (2022)

ఓటర్ జాబితాలో కచ్చితత్వానికి వీలుగా ఓటర్ల ఎపిక్‌లతో ఆధార్ అనుసంధాన కార్యక్రమాన్ని ఈసీ చేపట్టింది.

ఎలక్ట్రానిక్ పోస్టల్ బ్యాలెట్ (2016)



ఎన్నికల విధుల్లో ఉండే సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లను ఎలక్ట్రానిక్ రూపంలో పంపించేందుకు ఎన్నికల సంఘం దీన్ని ప్రవేశపెట్టింది. ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్‌గా పిలుస్తారు.

ఎరోనెట్ (2018)



ఎలక్టోరల్ రోల్ ఆఫీసర్స్ నెట్‌వర్క్ సంక్షిప్త రూపమే ఎరోనెట్. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉమ్మడి సదుపాయాలు వినియోగించుకునేందుకు వీలుగా డిజిటల్ నెట్‌వర్క్‌ను ఈసీ రూపొందించింది. ఎన్‌వీఎస్‌పీ లేదా ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా పౌరులు నమోదు చేసే డేటాకు ఇది బ్యాకప్‌గా పని చేస్తుంటుంది.

అబ్జర్వర్ యాప్ (2019)



ఎన్నికల పరిశీలకులు (సాధారణ, పోలీసు, వ్యయ) ఈ యాప్ ద్వారా తమ నివేదికలను ఫైల్ చేయవచ్చు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎక్కడ ఉందన్నది ఈ యాప్ ద్వారా ఎన్నికల అధికారులు చూడవచ్చు. అవసరమైతే స్క్వాడ్‌ను పిలవడం తదితర టాస్క్‌లను నిర్వహించుకోవచ్చు.

ఓటర్ టర్నౌట్ యాప్ (2019)

పోలింగ్ నాడు దేశవ్యాప్తంగా ఏయే ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ఎలా ఉందో ఈ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది.

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (2019)



తమ నియోజకవర్గంలో పోలింగ్ ఎప్పుడో ఈ యాప్‌తో తెలుసుకోవచ్చు. ఓటరు జాబితాలో తమ పేరునూ పరిశీలించుకోవచ్చు. అభ్యర్థుల సమాచారం కూడా తెలుసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ ఎంత ఉందన్నది ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఎన్నికల ఫలితాలు కూడా అందుబాటులో ఉంటాయి.

సి-విజిల్ యాప్ (2018)

ఎన్నికల నియమావళిని అభ్యర్థులు ఉల్లంఘించినా, అభ్యర్థులు పరిమితికి మించి ఖర్చు చేస్తున్నా; ఓటర్లను ధన, వస్తు రూపంలో ప్రలోభాలకు గురి చేస్తున్నా ఎవరైనా సరే ఈ యాప్ ద్వారా నేరుగా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఫొటో, వీడియో రుజువులను లొకేషన్ జియోట్యాగ్ చేసి అప్‌లోడ్ చేయవచ్చు.

గరుడ యాప్ (2020)

బూత్ స్థాయి అధికారుల కోసం తెచ్చిన యాప్. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, క్షేత్ర స్థాయి తనిఖీలు, డాక్యుమెంట్లు, ఫొటోల అప్‌లోడింగ్‌కు వీలు కల్పిస్తుంది.

క్యాండిడేట్ నామినేషన్ యాప్ (2020)

అభ్యర్థులు తమ నామినేషన్లను ఈ యాప్ ద్వారా డిజిటల్‌గానే దాఖలు చేయవచ్చు. అఫిడవిట్ డిజిటల్ కాపీని అప్‌లోడ్ చేసి, సెక్యూరిటీ డిపాజిట్ కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చు.

సక్షమ్ ఈసీఐ యాప్ (2023)

గతంలో దీన్ని పర్సన్స్ విత్ డిజెబుల్డ్ యాప్ (పీడబ్ల్యూడీ)గా పిలిచేవారు. దివ్యాంగులు ఇందులో అభ్యర్థుల సమాచారం, పోలింగ్ కేంద్రాలకు ఎలా వెళ్లాలి? ఫిర్యాదుల నమోదు, బూత్ వరకు వెళ్లేందుకు సాయం కోరడం తదితర సేవలను పొందవచ్చు.

నో యువర్ క్యాండిడేట్ (2022)

అభ్యర్థులకు సంబంధించిన అన్ని వివరాలు ఈ యాప్ ద్వారా ఓటర్లు తెలుసుకోవచ్చు. అభ్యర్థులు అఫిడవిట్లలో పేర్కొన్న ఆస్తులు, వారిపై క్రిమినల్ కేసులు తదితర పూర్తి సమాచారం లభిస్తుంది.

ఈ-ఎపిక్/డిజిటల్ ఓటర్ ఐడీ కార్డులు (2021)



ఎలక్షన్ ఫొటో ఐడీ కార్డ్ (ఎపిక్) ఎంతో ముఖ్యమైనది. భౌతిక కార్డు లేని వారు ఈ-ఎపిక్‌ను ఈసీ పోర్టల్ నుంచి మొబైల్ ఫోన్లోకి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీన్ని ప్రింట్ చూపించి కూడా ఓటు వేయవచ్చు.

ఓటింగ్ శాతం తగ్గినా.. ఓట్లు పెరిగాయ్!

సార్వత్రిక సమరంలో ఎన్నికల 'వేడి' పరాకాష్టకు చేరుతోంది. ఇప్పటికే 3 విడతల్లో పోలింగ్ పూర్తికాగా, మరో నాలుగు విడతలు మిగిలి ఉన్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే, ఈసారి తొలి మూడు విడతల్లో పోలింగ్ తగ్గడం అటు పార్టీలతో పాటు ఎన్నికల సంఘాన్ని కూడా కలవరపెడుతోంది. మండుటెండలు, పట్టణ ఓటర్ల నిరాసక్తత వంటివి ఇందుకు కారణమని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే ఓట్ల శాతం తగ్గినా, పోలైన మొత్తం ఓట్ల సంఖ్య మాత్రం 2019తో పోలిస్తే ఎక్కువగానే ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషకులు వెల్లడించారు. అంతేగాక రానున్న విడతల్లో పోలింగ్ శాతం కూడా పెరిగే అవకాశం ఉందని వారంటున్నారు. 2019లో తొలి దశలో 69.4 శాతం, రెండో దశలో 69.3 శాతం, మూడో దశలో 67.3 శాతం చొప్పున ఓటింగ్ నమోదైంది. ఈసారి మొదటి విడతలో 66.1 శాతం, రెండో దశలో 66.7 శాతం, మూడో విడత 65.7 శాతం ఓటింగ్ జరిగింది. శాతాల్లో చూస్తే 2019 కంటే తగ్గినట్టు కన్పిస్తున్నా వాస్తవానికి తొలి రెండు దశల్లో పోలైన ఓట్ల సంఖ్యలో 8.7 లక్షలు పెరుగుదల నమోదైంది. 2019లో తొలి రెండు విడతల్లో 20.61 కోట్ల మంది ఓటేయగా, 2024లో 20.7 కోట్లకు పెరిగింది. పెరిగిన ఓట్లలో మహిళ సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో ఓట్లు పెరగడం మరో కీలకాంశం.

రాష్ట్రాల్లో ఇలా...

రాష్ట్రాల విషయానికొస్తే ఈసారి తొలి రెండు దశల్లో కర్నాటకలో 12.9 లక్షల ఓట్లు అధికంగా పడ్డాయి. గత లోక్‌సభ ఎన్నికల్లోనూ పోలింగ్ ఏడు విడతల్లో జరిగింది. తొలి మూడు విడతల్లో ఓటింగ్ అధికంగా నమోదై ఆ తర్వాత విడతల్లో తగ్గింది. ఈసారి అందుకు భిన్నంగా తొలి మూడు విడతల్లో పోలింగ్ తగ్గింది. కనుక మిగతా నాలుగు విడతల్లో పోలింగ్ భారీగా పుంజుకుంటేనే కనీసం గత ఎన్నికల స్థాయిని అందుకోగలుగుతుంది. అయితే 2019లో మొత్తం ఓటర్ల సంఖ్య 91.2 కోట్లు కాగా 2024లో 96.9 కోట్లకు పెరిగింది. అందుకే ఈసారి ఓటింగ్ తొలి మూడు విడతల్లో శాతాల్లో తగ్గినా సంఖ్యాపరంగా పెరిగిందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

మహారాష్ట్రలో 'మహా' కూటముల కొట్లాట కాక రేపుతోంది. యూపీ తర్వాత అత్యధికంగా ఇక్కడ 48 లోక్‌సభ స్థానాలుండగా తొలి మూడు దశల్లో 24 సీట్లలో పార్టీల భవితవ్యం ఈవీఎంలలోకి చేరిపోయింది. నాలుగో అంకంలో 13న రాష్ట్రంలో మరో 11 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఎన్డీఏ (మహాయుతి), ఇండియా (మహా వికాస్ అగాడీ) కూటములు హోరాహోరీగా తలపడుతున్న కీలక నియోజకవర్గాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

పశ్చిమ కనుమల్లోని తమ్హినీ ఘాట్



నాలుగో విడతలోనూ... మహా వార్!

మహారాష్ట్రలో 11 స్థానాలకు 13న పోలింగ్

మహాయుతి, ఎంవీఏ కూటముల హోరాహోరీ



చంద్రకాంత్ ఖైరే




సయ్యద్ జలీల్

ఔరంగాబాద్... మజ్లిస్ మేజిక్!

కాంగ్రెస్, శివసేనలకు కంచుకోటగా నిలిచిన ఈ స్థానంలో గత లోక్‌సభ ఎన్నికల్లో సంచలనం నమోదైంది. శివసేన నుంచి వరుసగా నాలుగుసార్లు విక్టరీ కొట్టిన చంద్రకాంత్ ఖైరే మజ్లిస్ అభ్యర్థి సయ్యద్ ఇంతియాజ్ జలీల్ చేతిలో అనూహ్యంగా ఓటమి చవిచూశారు. 97 ఏళ్ల మజ్లిస్ చరిత్రలో తెలంగాణ వెలుపల ఇదే తొలి ఎంపీ స్థానం! 1980 తర్వాత ఔరంగాబాద్‌లో మైనారిటీ గెలుపొందడం అదే ప్రథమం. స్వతంత్ర అభ్యర్థి హర్షవర్ధన్ జాధవ్‌కు ఏకంగా 2.8 లక్షల ఓట్లు పోలవడం ఖైరే ఓటమికి ప్రధాన కారణం. మజ్లిస్ మళ్లీ జలీల్‌నే బరిలోకి దించింది. విపక్ష మహా వికాస్ అగాడీ తరఫున శివసేన (ఉద్ధవ్) అభ్యర్థిగా ఖైరే కూడా పోయిన చోటే వెతుక్కుంటున్నారు. ఇక అధికార మహాయుతి కూటమి తరఫున శివసేన (షిండే) అభ్యర్థి సందీపన్‌రావ్ భూమ్రే బరిలో ఉన్నారు. ఆయన బలమైన మరాఠ్వాడా నేత. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగానూ చేశారు. మరాఠా రిజర్వేషన్ల పోరుతో మరాఠ్వాడా ప్రాంతంలో ఎంతో పేరు సంపాదించిన హర్షవర్ధన్ ఈసారి కూడా ఇండిపెండెంట్‌గా ప్రధాన పార్టీలకు సవాలు విసురుతున్నారు. ప్రకాశ్ అంబేద్కర్ వంచిత బహుజన్ అగాడీ నుంచి అఫ్సర్ ఖాన్ పోటీలో ఉన్నారు. 32 శాతం ముస్లిం జనాభా ఉన్న ఔరంగాబాద్‌లో ఈసారి చతుర్ముఖ పోరులో ఎలాంటి సంచలనం నమోదవుతుందోనన్న ఆసక్తి నెలకొంది.

జాల్నా... రావ్‌సాహెబ్ డబుల్ హ్యాట్రిక్ గురి



రావ్‌సాహెబ్ దన్వే పాటిల్

ఇది బీజేపీకి మరో కంచుకోట. 1999 నుంచి వరుసగా ఐదుసార్లు విజయ ఢంకా మోగించిన రావ్‌సాహెబ్ దన్వే పాటిల్ డబుల్ హ్యాట్రిక్ లక్ష్యంగా మరోసారి బరిలో నిలిచారు. మోదీ రెండు విడతల్లోనూ కేంద్ర మంత్రి పదవి దక్కించుకున్న దన్వే గత ఎన్నికల్లో 3.3 లక్షల పైగా మెజారిటీతో గెలిచారు. గత రెండు పర్యాయాలూ బీజేపీని ఢీకొన్న విలాస్ ఔతాడేను కాంగ్రెస్ ఈసారి పక్కనపెట్టింది. 2009లో బీజేపీకి గట్టిపోటీ ఇచ్చి కేవలం 8,482 ఓట్ల తేడాతో ఓడిన కల్యాణ్ విజినాథ్ కాలేను రంగంలోకి దించింది.

పుణె.. మాజీ మేయర్ వర్సెస్ ఎమ్మెల్యే

ఇక్కడ గత రెండుసార్లూ బీజేపీదే విజయం. అయితే సిట్టింగ్ ఎంపీ గిరీశ్ బాపట్ గతేడాది మరణించడంతో పుణె మాజీ మేయర్ మురళీధర్ కిశాన్ మాహోల్‌కు ఈసారి బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రవీంద్ర ధంగేకర్‌ను బరిలో నిలిపింది. పుణె లోక్‌సభ స్థానం పరిధిలోని కస్బాపేట అసెంబ్లీ సెగ్మెంట్లో గతేడాది జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని ధంగేకర్ మట్టికరిపించడం విశేషం. 28 ఏళ్లుగా కాషాయ జెండా ఎగురుతున్న ఈ సీటు చేజారడం కమలనాథులకు భారీ షాకే. ఇదే జోరుతో పుణె లోక్‌సభ స్థానాన్నీ కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.



రవీంద్ర ధంగేకర్

షిర్డీ... శివసేన కుస్తీ



సదాశివ లోఖండే

2009లో ఉనికిలోకి వచ్చినప్పటి నుంచీ ఇది శివసేన ఖాతాలోనే పడుతోంది. గత రెండు ఎన్నికల్లో నెగ్గిన సదాశివ లోఖండే ఇప్పుడు శివసేన (షిండే) వర్గం నుంచి మహాయుతి అభ్యర్థిగా హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. షిర్డీ తొలి ఎంపీ, శివసేన (ఉద్ధవ్) నేత భావుసాహెబ్ రాజారామ్ వాక్చౌరే ఎంవీఏ కూటమి తరఫున పోటీ చేస్తున్నారు. రెండు శివసేన వర్గాలకు గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా చీఫ్, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఈ స్థానం కోసం పట్టుబట్టినా సీఎం షిండే మోకాలడ్డారు. అంబేడ్కర్ మనుమడు ప్రకాశ్ అంబేడ్కర్ పార్టీ వీబీఏ అభ్యర్థి ఉత్కర్ష్ రూపవతి ఎవరి ఓట్లకు గండి పెడతారన్నది ఆసక్తికరం!

బీడ్.. పంకజకు రిజర్వేషన్ సెగ



మనోహర్ సోన్వానే

ఈ స్థానం బీజేపీ దుర్గం. దివంగత గోపీనాథ్ ముండే కుటుంబానికి గట్టి పట్టున్న స్థానం. ఈసారి అదే కుటుంబం నుంచి సిట్టింగ్ ఎంపీ ప్రీతం ముండే బదులు అక్క, మాజీ మంత్రి పంకజా ముండేను బీజేపీ బరిలోకి దించింది. అయితే మారాఠా రిజర్వేషన్లపై అట్టుడుకుతున్న ఈ నియోజకవర్గంలో మహాయుతి కూటమిపై తీవ్ర వ్యతిరేకత ఉంది. దాంతో పంకజ ఎదురీదాల్సిన పరిస్థితి! అయితే 2019లో పర్లీ అసెంబ్లీ స్థానంలో పంకజను ఓడించిన సోదరుడు ఎన్సీపీ (అజిత్) నేత ధనంజయ్ ముండే దన్నుగా నిలవడం ఆమెకు కలిసొచ్చే అంశం. 2019లో 5 లక్షల పై చిలుకు ఓట్లతో ప్రీతం మెజారిటీకి భారీగా గండికొట్టిన భజరంగ్ మనోహర్ సోన్వానే ఎంవీఏ కూటమి నుంచి ఎన్సీపీ (శరద్) టికెట్‌పై బీజేపీకి మళ్లీ సవాలు విసురుతున్నారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న ధంగర్ సామాజిక వర్గం ఎప్పటి నుంచో ఎస్టీ రిజర్వేషన్లు డిమాండ్ చేస్తోంది. మరాఠా కోటా, ఈ ఎస్టీ హోదా డిమాండ్లు ఎవరిని ముంచుతాయన్నది ఆసక్తికరం.

జల్గావ్... టఫ్ ఫైట్



కరన్ పాటిల్

రెండు దశాబ్దాలకు పైగా ఇక్కడ పాతుకుపోయిన కమలనాథులకు ఈసారి మహా వికాస్ అగాడీ నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. గత ఎన్నికల్లో బీజేపీ నేత ఉన్మేశ్ పాటిల్ 4 లక్షల పైగా బంపర్ మెజారిటీతో విక్టరీ కొట్టారు. అయినా ఈసారి ఆయన్ను కాదని స్మితా వాఘ్‌కు బీజేపీ టికెటిచ్చింది. ఎంవీఏ నుంచి శివసేన (ఉద్ధవ్) నేత కరన్ బాలాసాహెబ్ పాటిల్ పోటీ చేస్తున్నారు. గతంలో గట్టి పోటీ ఇచ్చిన ఎన్సీపీ (శరద్) దన్నుండటం కరన్‌కు కలిసొచ్చే అంశం. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లూ మహాయుతి కూటమి చేతిలోనే ఉన్నాయి.





పశ్చిమబెంగాల్‌లోని బిష్ణుపూర్ లోక్‌సభ స్థానం మాజీ భార్యాభర్తల మధ్య రాజకీయ యుద్ధానికి వేదికగా మారింది! బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ సౌమిత్రఖాన్‌పై ఆయన మాజీ భార్య సుజాత మోండల్ బరిలో దిగారు. ఆమె టీఎంసీ తరఫున పోటీ చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో సౌమిత్ర విజయం కోసం అన్నీ తానై కష్టపడ్డ సుజాత, ఈసారి తన గెలుపు గ్యారంటీ అంటున్నారు. ఈ మాజీ దంపతుల దంగల్‌లో గెలుపెవరిదన్నది ఆసక్తికరంగా మారింది. బిష్ణుపూర్‌లో మే 25న ఆరో విడతలో పోలింగ్ జరగనుంది...

మాజీ దంపతుల దంగల్!

బిష్ణుపూర్ లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోటీ

కీలకం

రాజకీయ విడాకులు...!

సౌమిత్ర ఖాన్ 2014లో తృణమూల్ పార్టీ తరఫున విజయం సాధించి బిష్ణుపూర్‌పై వామపక్షాల పట్టును బద్దలు కొట్టారు. తరువాత బీజేపీలో చేరి 2019లోనూ గెలిచారు. అనంతరం ఆయన వ్యక్తిగత జీవితంలో ఆటుపోట్లు వచ్చాయి. ఉద్యోగాల ఆశ చూపి బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారంటూ 2019 లోక్‌సభ ఎన్నికల ముందు సౌమిత్రపై కేసు నమోదైంది. బీజేపీలోకి మారినందునే మమత సర్కారు తనను తప్పుడు కేసులో ఇరికించిందని ఆయన ఆరోపించారు. ఈ కేసు కారణంగా 2019 ఎన్నికలప్పుడు ఆయన బంకురా జిల్లాలోకి ప్రవేశించకుండా కలకత్తా హైకోర్టు నిషేధించింది. దాంతో భర్త కోసం సుజాత అన్నీ తానై బిష్ణుపూర్‌లో ప్రచారం చేశారు. ఆమె కారణంగానే 2019లో ఖాన్ విజయం సాధించారంటారు. అయితే బీజేపీ తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదంటూ సుజాత 2020లో పార్టీని వీడారు. ఈ విషయంలో భర్త తనకు మద్దతుగా నిలవడం లేదని ఆయనకూ దూరమయ్యారు! ఆమె టీఎంసీలో చేరి 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఆరంబాగ్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడంతో సౌమిత్ర విడాకులిచ్చారు. ఆ వెంటనే సుజాత తన పేరు నుంచి ఖాన్‌ను తొలగించుకున్నారు. స్థానిక ఎన్నికల బరిలో దిగి బంకురా జిల్లా పరిషత్ సభ్యురాలిగా గెలిచారు.

ఒకప్పుడు సీపీఎం కంచుకోట

బిష్ణుపూర్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. 2014 దాకా సీపీఎంకు కంచుకోట. దీని పరిధిలోకి వచ్చే ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదు స్థానాలు బీజేపీ ఖాతాలోనే ఉన్నాయి! తృణమూల్ రెండింట్లోనే గెలిచింది. ఈసారి సీపీఎం శీతల్ కైబర్తా అనే టీచర్‌ను బరిలో దింపింది. ఆమెకు కూడా నియోజకవర్గంలో మంచి ఆదరణ లభిస్తోంది. జిల్లాను గొప్ప పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడంతో పాటు నిరుద్యోగం, నీటి కొరత సమస్యలను పరిష్కరిస్తానన్న హామీలకు ప్రజలు బాగా స్పందిస్తున్నారు.

సౌమిత్రపై అసంతృప్తి...

తాగునీటి ఎద్దడి, రోడ్ల దుస్థితి బిష్ణుపూర్‌లో ప్రధాన సమస్యలు. ఎంపీగా ఇచ్చిన హామీలేవీ సౌమిత్రా నెరవేర్చలేదనే విమర్శ ఉంది. ఎన్నికల తర్వాత ఆయన కన్పించనే లేదన్నది స్థానికుల ఆరోపణ. రోడ్ల దుస్థితికి తోడు నేత కార్మికుల దుస్థితి కూడా ఈ చారిత్రాత్మక పట్టణంలో మరో పెద్ద సమస్య. బిష్ణుపూర్ పట్టు చీరలకు ప్రసిద్ధి. కానీ చేనేత ఉత్పత్తులను సేకరణకు ఏర్పాట్లే లేవని కార్మికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి గెలుపు తనదేనని సుజాత విశ్వాసంతో ఉన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రేపు మదర్స్ డే


ప్రతీకాత్మక చిత్రం

అమ్మ చిరునవ్వును చూద్దామా

ఆమెతో గడపాలి.
ఆమె తన పిల్లలకు
మనసులోది చెప్పుకునేలా చేయాలి.
ఆమె మురిసిపోయే కానుక ఇవ్వాలి.
ఎదురు చూస్తున్న విహారానికి
ఆమెను తీసుకెళ్లాలి.
అరె... ఆమెకు ఇష్టమైనది వండితే
ఎంత బాగుంటుంది.
మనమలు, మనమరాళ్లు
ఆమె కాళ్ల దగ్గర చేరితే మరింత బాగుంటుంది.
అమ్మకు ఏం కావాలి?
చిన్న చిరునవ్వు తప్ప.
మే 12 అంతర్జాతీయ మాతృదినోత్సవం.
అమ్మను సంతోషపెట్టేందుకు ఇదే సమయం.

అమ్మగా ప్రయాణం ప్రసవ వేదనతో మొదలవుతుంది. బిడ్డకు జన్మనివ్వడానికి వేదనకు సిద్ధమయ్యే అమృతమూర్తి అమ్మ. పుట్టాక బిడ్డ కేర్‌మన్నా, కేరింతలు కొట్టినా ఆమె పెదాల మీద చిర్నవ్వు. అంతవరకూ అనుభవించిన బాధను ఆమె మర్చిపోతుంది. ఆ తర్వాత ఆమె జీవితమంతా పిల్లల చుట్టే తిరుగుతుంది. వారు నవ్వితే నవ్వుతుంది. ఏడిస్తే ఏడుస్తుంది. సరిగా చదవకపోతే బాధ పడుతుంది. పూర్తిగా స్థిర పడకపోతే ఆందోళన పడుతుంది. వారి ఎదుగుదల, పెళ్ళిళ్లు, సంసారాలు, సంపాదనలు ఎప్పటికప్పుడు కనిపెట్టుకుంటూ ఉంటుంది. 'నా పిల్లలు చల్లగా ఉండాలి' అని ప్రార్థనలు చేస్తుంది. చల్లగా ఉంటే సంతోషపడుతుంది. కాని పిల్లలు పెద్దవాళ్లయ్యాక... తాము తల్లిదండ్రులయిన తర్వాత... తల్లి నుంచి పొందిన ప్రేమంతా తమ పిల్లలకు ఇస్తారు తప్ప తల్లికి ఇవ్వడానికి బద్ధకిస్తారు. 'అమ్మంటే ప్రేమ కదా మనకు' అనుకుంటారు తప్ప వ్యక్తీకరించరు. ఒకోసారి అమ్మనే మర్చిపోయేంత బిజీ అయిపోతారు. అలాంటి వారికి అమ్మను గుర్తు చేసేదే కదా 'మదర్స్ డే'.

■ **అమ్మ ఫోన్ ఎత్తుతున్నారా?**

లోకంలో ఎన్నో ఫోన్లు ఫస్ట్ కాల్‌కే ఎత్తుతారు చాలా మంది. కాని అమ్మ చేస్తుంటే 'అమ్మే కదా' అని ఎత్తరు. అమ్మ ఫోన్‌లో పెద్ద విశేషం లేకపోవచ్చు. రొటీన్ కాలే కావచ్చు. 'భోజనం చేశావా నాన్నా' అనే అదే ప్రశ్నను అడుగుతుండవచ్చు. కాని అమ్మ కదా. కొడుకు ఎంత పెద్దవాడైనా, కూతురు ఎంత పెద్ద సమర్థురాలైనా వారు క్షేమంగా ఇల్లు చేరి నిద్రకు ఉపక్రమిస్తున్నారని తెలుసుకుంటే తప్ప ఆమె నిద్ర పోదు. ఆ విషయం తెలిసీ ఫోన్ ఎత్తరు. ఒకోసారి విసుక్కుంటారు. పిల్లలే ఫోన్ చేసి 'అమ్మా అన్నం తిన్నావా?' అని అడగడం ఎందరు అమ్మల విషయంలో జరుగుతున్నదో.

అమ్మతో ప్రయాణం

సెలవులొస్తే అచ్చోటికి వెళ్దాం ఇచ్చోటికి వెళ్దాం అని ప్లాన్ చేసుకునే ఓ పిల్లలూ... మీ ప్రయాణంలో ఎన్నిసార్లు అమ్మను తీసుకెళ్లారు? జీవితం మొత్తం పిల్లల కోసం ఆమె ఇంటికే పరిమితమైంది. ఇప్పుడైనా లోకం చూడాలని అనుకుంటోంది. 'నువ్వు రాలేవు', 'నువ్వు తిరగలేవు', 'నిన్ను చూసుకోవడం కష్టం' అని ఆమెను ఇంటికే పరిమితం చేస్తే ఆమె మనసు ఆహ్లాదం పొందేదెప్పుడు. ఆమెకు ఆటవిడుపు లభించేదెప్పుడు. ఆమెకు ఏదైనా ఆధ్యాత్మిక యాత్ర చింత ఉంటే అది తీరేదెప్పుడు. శ్రావణ కుమారుడిలా కావడిలో మోయక్కర్లేదు... రెండు రోజులు సెలవు పెట్టి ఆమెతో రైలు ప్రయాణమే ఆమెకు ఇవ్వగల వీక్షణ దరహాసం.

పిల్లల పలకరింపే అమ్మకు అసలైన భోజనం.

■ **అమ్మను మాట్లాడనిస్తున్నారా?**

అమ్మ మనసులో ఎన్నో ఆలోచనలు. ఆమె ఎంతో జీవితం చూసి ఉంటుంది. అనుభవం ఉండి ఉంటుంది. పిల్లల జీవితాల్లో జరుగుతున్న విషయాలు ఆమె చెవిన పడి చూపుకు అందుతుంటాయి. ఏదో చెప్పాలని ఉంటుంది. తోబుట్టువుల ఫిర్యాదులు, పట్టింపులు ఒకరివి మరొకరికి చేరవేసి ప్రేమలు గట్టి పడాలని పరితపిస్తూ ఉంటుంది. భర్త గురించి కూడా పిల్లలకు ఏదో చెప్పుకోవాలని ఉంటుంది. పిల్లలు వింటున్నారా? నీ మనసులో ఏముందో చెప్పమ్మా అని తీరిగ్గా ఆమె పక్కన కూచుని అడుగుతున్నారా? ఆమెను అర్థం చేసుకుంటూ ఆమె చెప్పింది పాటిస్తున్నారా? పాటించడమే కదా ఆమెకు తెలుపగల కృతజ్ఞత. ఇవ్వగల గౌరవం.

■ **అమ్మకు కానుక**

అమ్మ డబ్బు దాచుకోదు. దాచుకున్నా పిల్లల కోసమే. అమ్మ తన కోసం ఏదీ కొనుక్కోదు. కొనుక్కున్నా పిల్లల కోసమే. తమకు పిల్లలు పుట్టాక తమ పిల్లలకు ఏమేమి కొని పెడదామా అనుకునే తల్లిదండ్రులు తమకు జన్మనిచ్చిన తల్లికి ఏదైనా కొని పెడదామా అనుకోరు. ఒక మంచి స్మార్ట్ వాచ్ (ఆమె ఆరోగ్యాన్ని సూచించేది), పాటల పెట్టె (సారెగమా కారవాన్ రేడియో), మంచి ఫోన్ హెడ్‌ఫోన్స్‌తో పాటుగా (ప్రవచనాలు వినడానికి), ఆమెకు నచ్చిన బంగారు ఆభరణం, ఆమెకు ఆసక్తి ఉన్న చానల్స్ సబ్‌స్క్రిప్షన్, ఓటీటీల సబ్‌స్క్రిప్షన్, ఏదైనా మంచి ప్రకృతి వైద్యశాలలో రెండు వారాలు ఉండటానికి కావలసిన ఏర్పాట్లు, ఆమె ప్రముఖంగా కనిపించేలా ఫ్యామిలీ ఫొటో... ఇవన్నీ ఆమె మళ్లీ మళ్లీ చూసుకుని ఆనందించే కానుకలు. చిరునవ్వుల మాలికలు. 'మా పిల్లలు కొనిచ్చారమ్మా' అని వారికీ వీరికి చెప్పుకునే ఘన విషయాలు.

■ **మనం తప్ప**

అమ్మకు పిల్లలు తప్ప వేరే ఏ ఆస్తిపాస్తులు పట్టవు. అమ్మకు నిత్యం కళ్ల ముందు పిల్లలు కనిపించాలి. ఆమె మీద ఫిర్యాదులు చేసి, సాకులు చూపి, లేదా తప్పనిసరయ్యి ఆమెకు దూరంగా ఉండాల్సి వస్తే ఆ దూరాన్ని దాని వల్ల వచ్చే లోటును పూర్తిగా పూడ్చేంతగా పిల్లలు అమ్మకు ఇవ్వాలి. 'అమ్మ' అని పిలుచుకునే అదృష్టంతో ఒక మనిషి మన కోసం ఉండటం వరం. ఆ వరం అపురూపం. అది గ్రహిస్తే చాలు–ఈ మదర్స్ డే రోజున.


శంకరి సుధార్

మాతృత్వం వరం! కెరీర్ రీ లాంచ్... అవసరం!

తైవాన్ మహిళల అక్షరాస్యత శాతం 99.99. ప్రపంచంలో ఆ దేశానిదే తొలి స్థానం. మనదేశంలో మహిళల అక్షరాస్యత శాతం 70 దగ్గరే ఉంది. కానీ ఆశ్చర్యంగా ఉన్నత చదువులు చదువుకుని కూడా గృహిణులుగానే ఉండిపోతున్న మహిళలు మన దేశంలోనే ఎక్కువ. కారణం మాతృత్వం. వీరిలో ఎక్కువ మంది కొంత కాలం ఉద్యోగం చేసి బిడ్డ పుట్టిన తర్వాత బిడ్డ సంరక్షణ కోసం ఉద్యోగాన్ని వదిలేస్తున్న వాళ్లే. వీరంతా ఉద్యోగం అవసరం లేని వాళ్లు కాదు. ఉద్యోగం అవసరం ఉండి కూడా తప్పని స్థితిలో ఉద్యోగం మానేస్తున్న వాళ్లే ఎక్కువ. వర్క్ ఫ్రమ్ హోమ్ చేయడానికి ఉన్న అవకాశాలు కూడా చెప్పుకోదగిన స్థాయిలో ఉండడం లేదు. దాంతో ఉన్నత చదువులు చదివినప్పటికీ గృహిణులుగా మిగిలిపోతున్న మహిళలు ఏడాదికేడాదికీ పెరుగుతున్నారు. చెన్నైకి చెందిన శంకరి సుధార్‌కు కూడా ఇలాంటి పరిస్థితి ఎదురయ్యింది. ''మా కంపెనీ వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం ఇచ్చి ఉంటే పాప నిద్ర పోయే సమయంలో ఆఫీస్ పని చేసుకునేదాన్ని. ఆ సౌకర్యం లేకపోవడంతో ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. నాలాంటి మహిళలను తిరిగి పని లోకి తీసుకురావడానికి నేనే ఒక వేదికను ఏర్పాటు చేశాను'' అంటున్నారు శంకరి.

ప్రపంచం ముందుకెళుతోంది!

''నేను మద్రాస్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేశాను. ఎనిమిదేళ్లపాటు ఉద్యోగం చేసిన తర్వాత 2020లో మాతృత్వం కారణంగా ఉద్యోగం వదిలేయాల్సి వచ్చింది. నాతోపాటు ఉద్యోగంలో చేరిన వాళ్లు ప్రమోషన్‌లతో పెద్ద పొజిషన్‌లకు వెళ్లారు. కొంతమంది విదేశాలకు వెళ్లారు. ప్రపంచం అంతా ముందుకెళ్తుంటే నేను మాత్రం నాలుగ్గోడల మధ్య చిక్కుకుపోయాననే భావన కలిగింది. నేను మాత్రమే కాదు ఇలా నాలాగ ఎందరో. మన దేశంలో 180 రోజులు ప్రసూతి సెలవులు, బిడ్డ సంరక్షణ కోసం మరో రెండేళ్ల సెలవులు ఇవ్వాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ వాటి ఆచరణ మాత్రం కష్టసాధ్యమే. చాలా కంపెనీలు రాజీనామా ఇచ్చి మళ్లీ చేరమని సూచిస్తుంటాయి. ఒకసారి రాజీనామా ఇచ్చిన తర్వాత మళ్లీ చేరడం అనేది ఎందుకో కానీ చాలామంది విషయంలో సాధ్యం కావడం లేదు. ఆయా కంపెనీల్లో సదరు పని నైపుణ్యానికి సంబంధించిన ఖాళీలు లేకపోవడం వంటి అనేకం ఇందుకు కారణాలు కావచ్చు. ఇలాంటి స్థితిలో చాలా మంది మహిళలు నిస్పృహలోకి జారిపోతున్నట్లు నా పరిశీలనలో అవగతమైంది.

73 శాతం మంది ప్రసవం సమయంలో, యాభై శాతం మంది బిడ్డ సంరక్షణ కోసం ఉద్యోగంలో విరామం తీసుకుంటున్నారు. వారిలో కొంతమంది బిడ్డ పెద్దయిన తర్వాత తిరిగి ఉద్యోగంలో చేరినప్పటికీ చేరిన ఆరు నెలల్లోనే మళ్లీ మానేస్తున్నారు. మరికొంతమంది అదే సంస్థలో ఉద్యోగంలో చేరినప్పటికీ తక్కువ వేతనానికి చేరాల్సి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. కొత్త సంస్థల్లో ఉద్యోగం కోసం ప్రయత్నించాలంటే వయసు అడ్డంకి అవుతోంది. మనదేశంలో మహిళల ఎదుగుదలకు కుటుంబం, పిల్లల బాధ్యతలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఇలాంటి మహిళల్లో తమకంటూ ఉనికి కోల్పోయామనే ఆవేదన ఉంటోంది. మొత్తంగా నాకు తెలిసిందేమిటంటే... ఆర్థిక అవసరాల రీత్యా కావచ్చు, చదువుకుని ఖాళీగా ఉండడం ఇష్టం లేక కావచ్చు అనేక మంది మహిళలు కెరీర్‌ని పునరుద్ధరించుకోవాలని ఆశిస్తున్నారు. స్టార్టప్‌ల వైపు వెళ్తున్న వాళ్లు చాలా కొద్దిమంది మాత్రమే. ఉద్యోగం కోసం చూస్తున్న వాళ్లకు సరైన మద్దతు అందడం లేదు. మాతృత్వం అనేది నిజంగా వరమే. అది మహిళ పురోభివృద్ధికి నిరోధకంగా మారకూడదనిపించింది. ఆ ఖాళీని నేనే ఎందుకు భర్తీ చేయకూడదు అని కూడా అనుకున్నాను. సమాజంలోని ఈ పరిస్థితికి అద్దం పట్టే విధంగా 'ఓవర్ క్వాలిఫైడ్ హవుస్ వైఫ్' అని నా స్టార్టప్‌కి పేరు పెట్టాను. పిక్ మై యాడ్, నౌ ఇన్ టెక్నాలజీస్ వంటి ఏడు వందల కంపెనీలతో మా కంపెనీని అనుసంధానం చేశాను. ఆ కంపెనీల్లో కంటెంట్ రైటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, వీడియో ఎడిటింగ్, డెవలపింగ్, టెస్టింగ్ వంటి ఉద్యోగాల అవసరం ఉంటుంది. ఆయా కంపెనీలకు అవసరమైన స్కిల్స్ ఉన్న మహిళల రెజ్యూమ్‌ను వారి దృష్టికి తీసుకురావడం మా కర్తవ్యం. మా దగ్గర ఎన్‌రోల్ అయిన మూడు వేల ఐదు వందల మందిలో ఇప్పటికి ఆరువందలకు పైగా మహిళలు ఉద్యోగంలో చేరారు. నేను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారింది 2022లో. ఈ సర్వీస్‌లో నేను కూడా గౌరవప్రదమైన రాబడిని అందుకోగలుగుతున్నాను'' అని తన రీ లాంచ్ జర్నీని వివరిస్తూ మహిళలు పని చేయడం తమ కోసం మాత్రమే కాదు దేశాభివృద్ధికి కూడా చాలా అవసరం అన్నారు శంకరి సుధార్.


కంపెనీల ప్రతినిధుల సమావేశంలో శంకరి

గోరువెచ్చని ఇల్లు


శిప్రా సింఘానియా


● శిప్రా ఇల్లు




● ఇంటి లోపల అధునాతన సౌకర్యాలతో...

బెల్లం, పసుపు, మెంతి ఆకు, వేప ఆకు... ఇదంతా ఇప్పుడు కిచెన్ మెటీరియల్ మాత్రమే కాదు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ కూడా. ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఇది నిజం. ఈ నిజానికి నిదర్శనం కోసం రాజస్థాన్‌కెళ్లాల్సిందే. రాజస్థాన్‌లోని అల్వార్‌కు చెందిన ఆర్కిటెక్ట్ శిప్రా సింఘానియా తన మేధను రంగరించి ఇల్లు కట్టుకుంది. అందరూ సిమెంట్, ఇసుక కలిపి ఇల్లు కడుతుంటే మీరెందుకిలా కట్టుకున్నారని అడిగితే ఆమె చెప్పే సమాధానమేమిటో చూద్దాం...

''మాది ఎడారి రాష్ట్రం. ఉష్ణోగ్రతలు వేసవిలో 41 డిగ్రీలకు చేరుతాయి, శీతాకాలంలో ఎనిమిది డిగ్రీలకు పడిపోతాయి. ఆ వేడిని భరించడమూ కష్టమే, అంత చలిని కూడా తట్టుకోలేం. ఇంటి నిర్మాణం ఈ ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించే విధంగా ఉండాలని కోరుకున్నాను. అందుకోసం బురదమట్టి, సున్నపురాయిలో వేపాకులు బెల్లం, పసుపు, మెంతి ఆకు వంటి అనేక పదార్థాలను సమ్మిళితం చేసి ఇల్లు కట్టుకున్నాను. నిజానికి ఈ ఫార్ములా నేను కొత్తగా కనిపెట్టినదేమీ కాదు. భవన నిర్మాణంలో సిమెంట్ ఉపయోగించడానికి ముందు మనదేశంలో పాటించిన విధానాన్నే పునరుద్ధరించాను. ఇది రెండువేల చదరపు అడుగుల నిర్మాణం. పైకప్పు కేంద్రభాగం 23 అడుగుల ఎత్తు ఉంది. ఇందుకోసం స్వయంగా నేనే డిజైన్ గీసుకున్నాను. వేపాకు చెద పురుగుల నుంచి రక్షణనిస్తుంది. బెల్లం, మెంతిలోని జిగురుకు నిర్మాణ ముడిసరుకులో ఇతర వస్తువులను గట్టిగా పట్టుకునేటంతటి సామర్థ్యం ఉంటుంది. ఈ నిర్మాణంలో గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరిస్తాయి. అలాగే రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, గ్రే వాటర్ సిస్టమ్‌లు కూడా ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే జీరో సిమెంట్ నిర్మాణం అన్నమాట'' అని చెప్పారు శిప్రా సింఘానియా. ఈ విధమైన నిర్మాణ శైలి ఇప్పుడిప్పుడే అందరి దృష్టిలో పడుతోంది. బహుశా ఇక నుంచి ఆ ఇంటిని 'శిప్రా సింఘానియా ఇల్లు' అని చెప్పుకుంటారేమో. ఇంతకీ ఈ ఇల్లు ఎండను, చలిని ఎంత మేర తగ్గిస్తుందంటే వేడిని కనీసంగా ఎనిమిది డిగ్రీలు తగ్గిస్తుంది. శీతాకాలంలో పదహారు డిగ్రీలకు తగ్గకుండా కాపాడుతుంది.

గెలుపు దారి

ఒకరోజు నిద్ర పట్టక రకరకాలుగా ఆలోచిస్తుంటే... 'నిద్ర'కు సంబంధించిన స్టార్టప్ ఐడియా తట్టింది ప్రియాంక సలోత్‌కు. ఆ రాత్రి వచ్చిన ఐడియా తనని 'ఉద్యోగి' స్థాయి నుంచి 'ది స్లీప్' కంపెనీ ద్వారా 'ఎంటర్‌ప్రెన్యూర్'గా మార్చింది. దిండు నుంచి పరుపుల వరకు పేటెంటెడ్ స్మార్ట్‌గ్రిడ్ టెక్నాలజీతో 'ది స్లీప్ కంపెనీ' రూపొందించిన ఉత్పత్తులు మార్కెట్‌లో ప్రత్యేకతను చాటుకున్నాయి.

నిదురించే తోటలోకి....


ప్రియాంక సలోత్

రాజస్థాన్‌లోని గంగానగర్ జిల్లాకు చెందిన ప్రియాంక సలోత్ స్కూల్ రోజుల్లో హిందీ మీడియం నుంచి ఇంగ్లిష్ మీడియంలోకి వచ్చింది. అంతా కొత్త కొత్తగా అనిపించింది. అయితే అదేమీ తనని భయపెట్టలేదు. ఉత్సాహాన్ని ఇచ్చింది. హిందీ మీడియంలో లాగే ఇంగ్లిష్ మీడియంలోనూ చదువులో దూసుకుపోయింది.

ఐఐఎం కోల్‌కత్తాలో చదువు పూర్తయిన తరువాత కార్పొరేట్ ప్రపంచంలోకి అడుగు పెట్టింది.

యంగ్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్ అయిన ప్రియాంక ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కంపెనీ జేపీ మోర్గాన్‌తో కెరీర్ ప్రారంభించింది. ఆ తరువాత సింగపూర్‌లో వేరే కంపెనీలో చేరింది. కొన్ని నెలల తరువాత... కన్సల్టింగ్ అండ్ ఇన్వెస్టింగ్ రోల్స్ తనకు సరికాదేమో అనిపించింది.

నిజానికి ఈ రియలైజేషన్ అనేది ప్రియాంకకు ఇదే మొదటిసారి కాదు.

దిల్లీలో ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు 'షూడాగ్' 'స్టీవ్ జాబ్స్' పుస్తకాల ప్రభావంతో 'సాంకేతిక రంగంలో ఉండాలనుకోలేదు. ఇంజినీర్ కావాలనుకోలేదు. మరి నేనెందుకు ఇంజినీరింగ్ చేస్తున్నాను?' అని తనని తాను ప్రశ్నించుకుంది. చాలామంది టాపర్స్‌లాగే 'ఇంజనీరింగ్ లేదా మెడిసిన్' అని ఆలోచించి ఇంజినీరింగ్ చేస్తుందే తప్ప ప్రత్యేక కారణం అంటూ లేదు. ఈ నేపథ్యంలోనే మేనేజ్‌మెంట్ విషయాలపై తనకు ఉన్న ఆసక్తితో మేనేజ్‌మెంట్ కోర్సు చేసింది.

సింగపూర్ నుంచి తిరిగివచ్చిన తరువాత ముంబైలోని కన్స్యూమర్ గూడ్స్ కంపెనీ 'పీ అండ్ జీ'లో చేరి కన్స్యూమర్ బ్రాండ్స్‌పై ఆసక్తిని పెంచుకుంది. ఏరియల్ డిటర్జంట్ బ్రాండ్‌లో పనిచేసిన తరువాత బేబీ డైపర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ 'పాంపర్స్' హెడ్‌గా నియామకం అయింది.

ఆ తరువాత... ప్రెగ్నెన్సీ వల్ల ప్రొఫెషనల్ లైఫ్ నుంచి విరామం తీసుకోవాల్సి వచ్చింది.

ఆ సమయంలో 'ఉద్యోగం కాదు సొంతంగా ఏదైనా వ్యాపారం చేయాలి' అనే ఆలోచన ఆమెలో పెరిగి పెద్దదైంది.

అదే సమయంలో చిన్న భయం కూడా మొదలైంది.

'పెద్ద జీతాన్ని కాదను కొని వ్యాపారం చేస్తే... ఎన్నో రిస్కులు ఎదురవుతాయి. వృత్తిజీవితంలో ముందుకు దూసుకుపోతున్నప్పుడు రిస్క్ చేయడం ఎందుకు?' అని పించింది. అయితే కొద్దిరోజుల్లోనే ఆమె కంఫర్ట్ జోన్ ఆలోచనల నుంచి బయటికి వచ్చింది.

ఒక బిడ్డకు జన్మనిచ్చిన ప్రియాంక ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపింది. అలాంటి ఒక రాత్రి వచ్చిన ఆలోచనే... ది స్లీప్ కంపెనీ. తనలాగే ఎంతో మంది నిద్రలేమితో సతమతమవుతున్నారు. దీనికి ఒక పరిష్కారం ఆలోచిస్తే 'స్లీప్ అండ్ కంఫర్ట్' బిజినెస్‌కు సంబంధించి మంచి అవకాశం ఉంది అనిపించింది.

తన స్టార్టప్ ఐడియా మిత్రులకు నచ్చలేదు. మళ్లీ 'రిస్క్' అనే భయం ముందుకు వచ్చింది. అయితే ఆ భయాన్ని వెనక్కి నెట్టి ఉద్యోగానికి రాజీనామా చేసి తన ఐడియాపై సంవత్సరానికి పైగా పని చేసింది.

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌లో పని చేసిన మాజీ ఉద్యోగి ఏకే త్రిపాఠీతో కలిసి హైటెక్–ప్రొడక్ట్ రూపకల్పన చేసింది. తరువాత భర్త హర్షిల్ సలోత్‌తో కలిసి 'ది స్లీప్ కంపెనీ' ప్రారంభించింది.

ప్రియాంక బిజినెస్ ఐడియా సక్సెస్ అవుతుందని నమ్మినవారి సంఖ్య తక్కువ. అయితే పేటెంటెడ్ స్మార్ట్‌గ్రిడ్ టెక్నాలజీతో వచ్చిన 'ది స్లీప్ కంపెనీ' మార్కెట్‌లో తనదైన ప్రత్యేకతను సృష్టించుకుంది. మొదట్లో రకరకాల సవాళ్లు ఎదురైనా కంపెనీకి సంబంధించిన ఫండింగ్ జర్నీ సాఫీగా సాగింది. పెద్ద సంస్థలు కంపెనీలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపించాయి.

మ్యాట్రస్ బ్రాండ్ నుంచి స్లీప్ అండ్ కంఫర్ట్ టెక్ సొల్యూషన్ కంపెనీగా ఎదిగింది ది స్లీప్ కంపెనీ.

వెయ్యి ఫెయిల్యూర్స్ తరువాత...

'ది స్లీప్ కంపెనీ' లాంచ్ చేయడానికి ముందు ప్రాడక్ట్స్‌కు సంబంధించి వెయ్యికి పైగా ప్రయోగాలు చేస్తే అన్నీ విఫలం అయ్యాయి. ఈ పరాజయాలు ఒక దశలో నన్ను నిరాశలోకి నెట్టి 'ఉద్యోగానికి రాజీనామా చేసి తప్పు చేశానా?' అని సందేహించేలా చేశాయి. ఫండ్ రైజింగ్ క్రమంలో 'మీ ప్రాడక్ట్‌లో కొత్త ఏం ఉంది' అంటూ రిజెక్షన్స్ మొదలయ్యాయి. 'ఇక వెనక్కి వెళదాం' అని ఆ సమయంలో అనుకొని ఉంటే ఎంటర్‌ప్రెన్యూర్‌గా నాకు పెద్ద విజయం దక్కేది కాదు.


–ప్రియాంక సలోత్,
కో–ఫౌండర్, ది స్లీప్ కంపెని

శరీరంలో ముఖ్యమైన భాగాల్లో మెదడు ఒకటి. మెదడు ఆదేశాల ప్రకారమే శరీరంలోని అన్ని భాగాలు పనిచేస్తాయి. మెదడు సరిగ్గా పని చేయకపోతే... మనిషి ఏ పనీ సరిగ్గా చేయలేడు. అలాంటి మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే.. మనం కొన్ని చెయ్యాలి... మరికొన్నింటిని తినాలి... అవేంటో చూద్దాం...

ఇలా చేస్తే మీ మెదడు పాదరసమే!

దేనినైనా సరే, సరిగ్గా పని చేయిస్తేనే అది సక్రమంగా పని చేస్తుంది. ఎన్ని వేలు పోసి కొన్న యంత్రాన్నైనా సరే, దానితో పని చేస్తేనే కదా అది సరిగ్గా పనిచేసేదీ లేనిదీ తెలిసేది! అందువల్ల మెదడు సరిగ్గా పని చేయాలంటే దానికి ఎప్పుడూ తగిన పని చెబుతూనే ఉండాలి. అదేవిధంగా మెదడు చురుగ్గా పని చేయాలంటే కొన్ని రకాలైన ఆహార పదార్థాలను తీసుకోవాలి.

- ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్: మెదడు సరిగ్గా పని చేయాలంటే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ తీసుకోవడం అవసరం. ఎందుకంటే ఈ ఫ్యాటీ యాసిడ్స్ మెదడు కణాల మధ్య కమ్యూనికేషన్‌ను ప్రోత్సహిస్తాయి. తృణ ధాన్యాలు కూడా మెదడును ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.



- యాంటీ ఆక్సిడెంట్లు: ఇవి కూడా మెదడు కణాలను ఒత్తిడి, వాపు నుంచి రక్షించడంలో సహకరిస్తాయి. విటమిన్ బి12 లోపిస్తే నరాల బలహీనతకు దారితీయవచ్చు. కాబట్టి మీ డైట్‌లో విటమిన్ బి12 ఉండేలా చూసుకోండి.
- అదే విధంగా అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మందగిస్తుంది. ఫలితంగా జ్ఞాపకశక్తి తగ్గి మతి మరపు పెరుగుతుంది. కాబట్టి షుగర్ తక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవడం ఉత్తమం. అదేవిధంగా హైడ్రేట్‌గా ఉండటం వల్ల మెదడు చురుగ్గా ఉంటుంది.
- అరోమా: కొన్ని రకాల మూలికలు, సుగంధ ద్రవ్యాలు మెదడు కణాలను పరిరక్షించే సమ్మేళనాలను కలిగి ఉంటాయి, ఇవి ఐక్యూని మెరుగుపరుస్తాయి. కాబట్టి మీ ఆహారంలో పసుపు, దాల్చిన చెక్క, రోజ్ మేరీ వంటివి ఉండేలా చూసుకోండి.
- ఇవిగాక మెదడును చురుగ్గా ఉంచేలా పదవినోదాలు, పదవిన్యాసాలు పూర్తి చేయడం, సుడోకు వంటివి ఆడటం, క్యారమ్స్, చదరంగం వంటి ఇన్‌డోర్ గేమ్స్ ఆడటం, రోజూ కొన్ని పదాలను గుర్తు పెట్టుకోవాలనే నియమాన్ని పెట్టుకుని దానిని సరిగ్గా అనుసరించడం వల్ల మెదడు చురుగ్గా ఉంటుంది.



అమ్మా.. బాగున్నావా?

ఇంట్లో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడుతూ, అందరి బాగోగులూ చూసే తల్లులు తమ ఆరోగ్యాన్ని మాత్రం పట్టించుకోరు. అమ్మ తనని తాను పట్టించుకోదని వదిలేసి ఊరుకోలేము, ఊరుకోకూడదు కూడా. మనకోసం అహరహం తపించే మన కన్నతల్లిని కంటికి రెప్ప లా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై కూడా ఉంది. అందుకోసం ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

రేపు అంతర్జాతీయ మాతృదినోత్సవం. ఈ నేపథ్యంలో అమ్మ గురించి, అమ్మ ఆరోగ్యం గురించి కాస్త శ్రద్ధ తీసుకోవడం చాలా మంచిది. రోజంతా రాత్రి, పగలు ఇంట్లోని వారందరి బాగోగులు చూసే తల్లులు తీరా తమ దగ్గరకొచ్చేసరికి అంతగా పట్టించుకోరు. దాంతో వారికి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. వాటిని దూరం చేయాలంటే ఏం చేయాలో, వారు ఆరోగ్యంగా... ఆనందంగా ఉండేందుకు ఏమేం చర్యలు తీసుకోవాలో చూద్దాం...

చురుగ్గా ఉండేలా...

ఎవరైనా సరే, ఉత్సాహంగా... ఉల్లాసంగా ఉండడం చాలా ముఖ్యం. అమ్మ ఉత్సాహంగా ఉల్లాసంగా లేకపోయినా కనీసం చురుగ్గా అయినా ఉంటోందో లేదో చూసుకోవాల్సిన బాధ్యత మనదే. ఇందుకోసం రోజుకి 30 నుంచి 40 నిమిషాల పాటు ఆమె వాకింగ్ చేసేలా చూడాలి. దాని వల్ల బరువు అదుపులో ఉంటుంది. ఏవిధమైన ఇన్ఫెక్షన్లూ సోకవు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. కాబట్టి, తల్లులు సులువుగా చేయగలిగే కనీస వ్యాయామాలు చేసేలా చూడాలి. అలా చేయాలంటే మనం కూడా మన బద్ధకాన్ని వదలగొట్టుకుని శరీరానికి కొద్దిపాటి శ్రమ కలిగించే వ్యాయామాలు చేయడం అవసరం. మనల్ని చూసి మన తల్లులూ, మన పిల్లలూ కూడా వ్యాయామాలు చేసి ఆరోగ్యంగా... సరైన ఆకృతిలో ఉండేందుకు తప్పక

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటోందా?

అమ్మలు మనం ఇష్టంగా తినేవాటిని ఎంతో శ్రమపడి వండి వారుస్తారు కానీ, వారి విషయానికొచ్చేసరికి సరిగా తినరు. అలా కాకుండా అమ్మ ఏమేం తింటోంది, ఎలా తింటోంది... అసలు సరిగ్గా తింటోందో లేదో పట్టించుకోవాలి. అమ్మ వండింది మనం కడుపునిండా తినడమే కాదు, అమ్మ ఏమైనా తింటోందో లేదో చూస్తూ, ఆమె ఇష్టాన్ని కనిపెట్టి వారికి నచ్చే ఆహారాన్ని బయటి నుంచి కొని తీసుకు రావడమో లేదా వీలయితే మీరే ఒకరోజు సరదాగా వండిపెట్టడమో చేయాలి. వారు ఆరోగ్యంగా ఉండేందుకు హెల్దీ ఫుడ్‌ని అందించండి. వారి డైట్‌లో పాలు, గుడ్లు, నట్స్, సోయా వంటి ప్రోటీన్ రిచ్ ఫుడ్స్‌ని యాడ్ చేసుకోండి. తాజా పండ్లు, కూరగాయలు తినే చూడండి. దీంతో పాటు హైడ్రేటెడ్‌గా ఉండేలా నీటితో పాటు, గ్రీన్ టీ, హెర్బల్ టీలను తాగించండి. వీటితో పాటు హోల్ గ్రైయిన్స్, బ్రౌన్ రైస్, ఓట్స్ వంటి ఫుడ్స్, అలానే కాల్షియం, ఫైబర్ రిచ్ ఫుడ్స్ తీసుకునేలా చూడడం తప్పనిసరి.

ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారా?

ఆరోగ్యమే మహా భాగ్యం అన్న సూక్తి చాలా పాతదే అయినప్పటికీ అది ఎల్లవేళలా అనుసరించవలసినదే. ఆరోగ్యాన్ని మించిన ధనం లేనే లేదు. అందువల్ల నేటి కాలంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. మనకెవరికైనా ఏమాత్రం ఆరోగ్యం బాగుండకపోయినా సరే, తల్లడిల్లిపోయే తల్లులు తమ ఆరోగ్యం విషయానికి వచ్చేసరికి పట్టించుకోరు. మీరు అలా అని వదిలేసి ఊరుకోవద్దు. అమ్మకి తప్పనిసరిగా హెల్త్ చెకప్స్ చేయించండి. థైరాయిడ్, హైబీపీ, షుగర్ వంటి సమస్యలేమైనా ఉంటే అవి ఏ మేరకు అదుపులో ఉన్నాయో ఈ టెస్ట్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ఇందుకోసం ప్రతి 3 నెలలకి ఓసారి చెకప్స్, ప్రతి సంవత్సరం బ్రెస్ట్ క్యాన్సర్ చెకప్స్, దీనికి సంబంధించిన సెల్ఫ్ టెస్ట్ ఇంట్లోనే 6 నెలలకి ఓసారి చేయించడం మంచిది.

ప్రేమ పూరితమైన పలకరింపు

అన్నిటినీ మించి అమ్మ దగ్గర రోజూ కాసేపు కూర్చుని అమ్మను ప్రేమగా పలకరించి, ఆమెతో కాసేపు కబుర్లు చెప్పడం వల్ల ఎంతో సంతోషపడుతుంది అమ్మ. అమ్మ ఏమైనా చెప్పడానికి ప్రయత్నించినప్పుడు వినుక్కోవడం, కసురుకోవడం అసలు పనికిరాదు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం.. ఇలా మదర్స్‌డే, ఫాదర్స్‌డే వంటివి జరుపుకునేది విదేశాలలోనే కానీ, మనకెందుకులే అని పట్టించుకోకుండా ఊరుకోకండి. ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా, సోషల్ మీడియా ద్వారా అమ్మలు కూడా అన్ని విషయాలూ తెలుసుకుంటున్నారనే విషయాన్ని గుర్తించండి. అమ్మకు తప్పనిసరిగా శుభాకాంక్షలు చెప్పి, ఆమె ఆశీర్వాదాన్ని అందుకోవడం మాత్రం మరచిపోవద్దు.

విష్ యు ఏ హ్యాపీ మదర్స్ డే

హెల్త్ టిప్



వంద గ్రాముల దానిమ్మ గింజలను ఎండబెట్టి, పొడిలా తయారు చేసుకోవాలి. అలాగే పుదీనా ఆకులను ఎండబెట్టి యాభై గ్రాముల పొడిని తయారు చేసుకోవాలి. వీటికి 25 గ్రాముల సైంధవ లవణం జత చేసి మూడింటినీ కలిపి జల్లించుకుని ఈ పొడిని గాజుసీసాలో నిల్వ చేసుకోవాలి. భోజనం తర్వాత ఈ పొడిని అరచెంచాడు చొప్పున కప్పు గోరువెచ్చని నీటిలో కలిపి తీసుకుంటే దీర్ఘకాలిక అజీర్ణ సమస్యల నుంచి, కడుపునొప్పి నుంచి విముక్తి లభిస్తుంది.

సరైన అలవాట్లుంటే విజయం మీదే!

జీవితంలో విజయాన్ని సాధించాలని, అన్నింటిలోనూ సక్సెస్ అనిపించుకోవాలని అందరికీ ఉంటుంది. అంతదాకా ఎందుకు, మీరు సక్సెస్ కోరుకుంటున్నారా అని అడిగితే ప్రతి ఒక్కరూ అవుననే అంటారు. అయితే మనం అనుకున్నంత సులువేం కాదు విజయాన్ని సాధించడం. ఇందుకోసం ఎంతో కృషి చేయాల్సి ఉంటుంది. ఎన్నో అలవాట్లు మార్చుకోవాల్సి ఉంటుందిజీవితంలో విజయం సాధించాలంటే కచ్చితంగా కొన్ని రకాల అలవాట్లను మార్చుకోవాల్సి ఉంటుంది. ఇంతకీ ఆ అలవాట్లు ఏంటో తెలుసుకుందాం... సక్సెస్‌ని చవిచూద్దాం...



విజయం సాధించిన ప్రతి ఒక్కరి వెనకాల ఎన్నో కష్టాలు, కన్నీళ్లు ఉండే ఉంటాయి. అయితే ఆ కష్టాలను ఇష్టాలుగా... ఆ కన్నీటిని పన్నీటిగా స్వీకరిస్తేనే వారు విజయాన్ని సొంతం చేసుకుని ఉంటారని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

సమయాన్ని సద్వినియోగం... అందరికీ రోజులో ఉండేది 24 గంటల మాత్రమే. అయితే ఎవరు ఎక్కువగా ఆ సమయాన్ని ఉపయోగించుకుంటారన్న సూత్రమే సాఫల్యాన్ని సూచిస్తుంది. అందుకోసం చేసుకోవాల్సిన మొదటి అలవాటు ఉదయాన్నే త్వరగా నిద్ర మేల్కొనడం. కనీసం ఉదయం ఐదింటికల్లా నిద్రలేవడాన్ని అలవాటు చేసుకుంటే... రోజంతా ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో, ఎంత సమయం మిగులుతుందో మనకే అనుభవంలోకి వస్తుంది.

బుక్ రీడింగ్

విజయం సాధించే వారిలో ఉండే మరో మంచి లక్షణం పుస్తక పఠనం. జీవితంలో గొప్ప స్థానంలో ఉన్న ప్రతి ఒక్కరికీ మంచి పుస్తకాలు చదివే అలవాటు ఉంటుంది. ముఖ్యంగా స్ఫూర్తిదాయకమైన పుస్తకాలను, గొప్పవారి జీవిత కథలను, ఆత్మకథలను చదవడం వల్ల మనసు పొరలు తెరుచుకుంటాయి. కొత్త ఉత్సాహం వస్తుంది. ఒక్కసారి పుస్తకం చదవడం అలవాటు చేసుకుంటే సరి... ఆ తర్వాత పుస్తకాలు చదవకుండా ఉండలేరు.

ఆరోగ్యం... ఆకృతి

జీవితంలో అనుకున్నది సాధించాలంటే ముందుగా మన ఆరోగ్యం బాగుండాలి. అందుకే సక్సెస్ అయిన ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తుంటారు. కచ్చితంగా ఉదయం వ్యాయామాలు చేస్తుంటారు. మంచి ఆహారం తీసుకుంటారు. రాత్రి సమయానికి నిద్రపోతారు. ఆరోగ్యం బాగున్న వారే అహరహం శ్రమించగలిగే శక్తిని కలిగి ఉంటారనే విషయాన్ని మరచి పోకూడదు.

సరైన స్నేహం

మనం ఎప్పుడూ మంచి స్నేహితులనే ఎంచుకోవాలి. శల్య సారథ్యం చేసేవారికి ఎప్పుడూ దూరంగా ఉండాలి. శల్య సారథ్యం అంటే నువ్వు ఆ పని చెయ్యలేవు, నీ వల్ల అది సాధ్యం కాదు అంటూ వెనక్కి లాగడం. అందువల్ల మన పక్కన సానుకూల దృక్పథంతో ఉండేవారే ఉంటే మనకు చాలా మంచిది. అందువల్ల అలా పాజిటివ్‌గా ఉండే వారినే ఎంచుకోవడం, అలాంటి వారితోనే స్నేహం చేయడం చాలా మంచిది. కొందరు నిత్యం నెగిటివ్ ఆలోచనతో, నెగిటివ్ మాటలతో విసిగిస్తుంటారు. అలాంటి వారితో స్నేహం చేస్తే మీరు కూడా నెగిటివ్ దారిలోనే వెళ్తారు.

వాదనలకు దూరంగా ఉండటం

జీవితంలో విజయం సాధించిన వారు ఎప్పుడైనా ఇతరులతో వాదనలకు దూరంగా ఉంటారు. వీలైనంత తక్కువ వాదిస్తుంటారు. ఎదుటి వ్యక్తితో వాదించే సందర్భంగా వచ్చినా మౌనంగా ఉంటారు తప్ప.. వాదనలకు దిగరు.



• అజిత్

గుడ్ బ్యాడ్ సెట్‌లో...

అజిత్ కుమార్ హీరోగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా షురూ అయింది. ఈ చిత్రానికి అదిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ తెలుగు–తమిళ భాషల్లో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. అజిత్ కుమార్‌తో తమ కొత్త ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో ప్రారంభమైంది. ఈ కీలక షెడ్యూల్ కోసం ఓ సెట్‌ని తీర్చిదిద్దారు. అజిత్‌తో పాటు కీలక పాత్రధారులు ఈ షూట్‌లో పాల్గొంటున్నారు. ''ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా రూపొందుతున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రానికి అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. 2025 సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: అభినందన్ రామానుజం.


ఇడియట్ ప్రేమకథ

హీరో రవితేజ సోదరుడు, నటుడు రఘు తనయుడు మాధవ్ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ ఇడియట్'. గౌరీ రోణంకి దర్శకత్వం వహించిన ఈ మూవీలో సిమ్రాన్ శర్మ హీరోయిన్. యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ రవిచంద్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో రవితేజ సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ''అల్లరిగా సాగే హీరో, హీరోయిన్ల స్నేహం ప్రేమగా ఎలా మారింది? హీరోయిన్‌ను న గుణింతంతో హీరో ఎందుకు పిలుస్తాడు? వంటి అంశాలు సినిమాలో ఉంటాయి. టీజర్ చూసినవాళ్లకు రవితేజలా మాధవ్ ఎనర్జిటిక్‌గా కనిపించిన విషయం అర్థమవుతుంది. నటనలోనూ ఆకట్టుకుంటాడు. త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.



• మాధవ్, సిమ్రాన్ శర్మ

మహిళా సాధికారత కోసం...




• భరత్ రాజ్

చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, భరత్ రాజ్, అషు రెడ్డి ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్ అభిరామ్‌గా కనిపించనున్న భరత్ రాజ్ లుక్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ దంతులూరి మాట్లాడుతూ– ''మహిళా సాధికారతను చాటి చెప్పే నేపథ్యంలో 'యేవమ్' ఉంటుంది. కొత్త కంటెంట్, డిఫరెంట్ నెరేషన్‌తో ఈ చిత్రకథ సాగుతుంది. ఇటీవల విడుదల చేసిన చాందినీ చౌదరి, అషు రెడ్డి పాత్రల లుక్స్‌కు మంచి స్పందన వచ్చింది. అభిరామ్ లుక్‌కి హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది'' అన్నారు.

రాముడిలా బతకాలి

'సింహ రాశి, శివ రామరాజు, టైగర్ హరిశ్చంద్ర ప్రసాద్' వంటి పలు హిట్ చిత్రాలు తీసిన దర్శకుడు వి. సముద్ర స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న తాజా చిత్రం 'రామ జన్మభూమి'. జై సిద్ధార్థ్ హీరోగా, శ్రీ రాధ, నాజర్, సుమన్, సునీల్, అనుపమ్ ఖేర్, అజయ్ ఘోష్ తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. సముద్ర మూవీస్ బ్యానర్‌పై రూపొందుతున్న 'రామ జన్మభూమి' టీజర్‌ని నటుడు మురళీ మోహన్, బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీ లత రిలీజ్ చేశారు. వి. సముద్ర మాట్లాడుతూ– ''ప్రతి పౌరుడు రాముడిలా బతకాలి, ధర్మంగా మెలగాలి. అలాగే యువత రాజకీయాల్లోకి రావాలి వంటి సందేశాలతో ఈ సినిమా చేస్తున్నాను'' అన్నారు.



కాన్స్ ఉత్సవాల్లో తొలిసారి భారత్ పర్వ్

ఎన్‌ఎఫ్‌డీసీ-ఎఫ్‌ఐసీసీఐ ఆధ్వర్యంలో వేడుకలు



• ఐశ్వర్యా రాయ్ • అదితీ రావ్ హైదరి • శోభిత

ఫ్రాన్స్‌లో ఈ నెల 14 నుంచి 25 వరకు జరగనున్న 77వ కాన్స్ చలన చిత్రోత్సవాల్లో భారతదేశం ప్రాతినిధ్యం ఉంటుందని భారత ప్రభుత్వ సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. భారతదేశంలోని విభిన్నమైన సంస్కృతులు–సంప్రదాయాలను సెలబ్రేట్ చేసేలా 'భారత్ పర్వ్' పేరిట భారత పర్యాటక శాఖ దేశంలో వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ వేడుకలను కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లోనూ నిర్వహించనున్నారు. 'భారత్ పర్వ్' పేరిట కాన్స్ చిత్రోత్సవాల్లో ఓ విభాగం ఏర్పాటు కావడం ఇదే తొలిసారి. ఈ చిత్రోత్సవాల్లో భారత్ పెవిలియన్ పేరిట ఓ స్టాల్‌ను ఏర్పాటు చేస్తారు. నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసీసీఐ) ఈ స్టాల్‌ను నిర్వహిస్తాయి. అలాగే ఈ ఏడాది గోవాలో నవంబరు 20 నుంచి నవంబరు 28 వరకు జరగనున్న 55వ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) విశేషాలు, ఈ వేడుకల్లో జరగనున్న వరల్డ్ ఆడియో–విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ గురించిన వివరాలను కూడా 'భారత పర్వ్' సెలబ్రేషన్స్‌లో భాగంగా వెల్లడించనున్నామని భారత ప్రభుత్వ సమాచార మరియు ప్రసార శాఖ పేర్కొంది. భారతదేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, సినీ రంగానికి సంబంధించిన అన్ని విభాగాల ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొనే అవకాశం ఉంది. దేశానికి చెందిన ప్రతిభ గల ఫిల్మ్ మేకర్స్ ఈ వేడుకలను ఓ వారధిగా చేసుకుని ప్రపంచ ఫిల్మ్ మేకర్స్‌కు 'భారత్ పర్వ్'లో తమ ప్రాజెక్ట్స్‌ను, తమను మార్కెటింగ్ చేసుకునే వీలు ఉంటుంది. ఇందుకోసం భారత పెవిలియన్ స్టాల్‌లో భారతీయ సినీ సమాఖ్య ప్రతినిధులు ఉంటారు.

కాన్స్ వేదికపై భారత్ హవా...

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ప్రతిష్ఠాత్మక విభాగం పామ్ డి ఓర్‌లో భారత్‌కు చెందిన పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన 'ఆల్ వుయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' పోటీ పడుతోంది. అలాగే అన్ సర్టైన్ విభాగంలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఫిల్మ్‌మేకర్ సంధ్యా సూరి తీసిన 'సంతోష్' పోటీలో ఉంది. డైరెక్టర్స్ ఫోర్ట్‌నైట్ విభాగంలో ఇండియన్ ఫిల్మ్ మేకర్ కరణ్ గంధారి తీసిన 'సిస్టర్ మిడ్‌నైట్', అసోసియేషన్ ఫర్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ ఇండియన్ సినిమా విభాగంలో మైసమ్ అలీ తీసిన 'ఇన్ రీట్రీట్' ఉన్నాయి. అలాగే 'ది ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' విద్యార్థులు తీసిన షార్ట్ ఫిల్మ్ 'సన్ ఫ్లవర్స్ వేర్ ది ఫస్ట్ వన్స్ టు నో' పోటీలో ఉంది. జాతీయ అవార్డుగ్రహీత, కెమెరామేన్ సంతోష్ శివన్ ఈ చిత్రోత్సవాల్లో 'పియర్ ఏంజెనీ' అవార్డు అందుకోనున్నారు. దివంగత ప్రముఖ ఫిల్మ్ మేకర్ శ్యామ్ బెనెగల్ తీసిన 'మంథన్' (1976) చిత్రం ప్రదర్శితం కానుంది. ఇలా ఈ ఏడాది కాన్స్ చలన చిత్రోత్సవాల్లో భారత్ హవా బాగానే ఉంది.

కాన్స్‌లో భారతీయ మెరుపులు... కాన్స్ చిత్రోత్సవాలంటే గుర్తొచ్చే విషయాల్లో 'రెడ్ కార్పెట్'పై తళుకులీనుతూ నటీమణులు అందంగా చేసే క్యాట్ వాక్ ఒకటి. భారతీయ చిత్రపరిశ్రమ నుంచి పలువురు కథానాయికలు ఈ వేడుకలకు హాజరవుతుంటారు. 2000వ సంవత్సరం నుంచి ఐశ్వర్యా రాయ్ హాజరవుతున్నారు. ఈసారి కూడా ఆమె కాన్స్ ఎర్ర తివాచీపై మెరవనున్నారు. అలాగే 2022లో జరిగిన చిత్రోత్సవాల్లో పాల్గొన్న అదితీ రావు హైదరి ఈసారీ హాజరవుతున్నారు. తెలుగు అమ్మాయి శోభితా దూళిపాళ కూడా పాల్గొంటారని టాక్. ఇటీవలే ఈ బ్యూటీ 'మంకీ మేన్' చిత్రం ద్వారా హాలీవుడ్‌కి పరిచయం అయిన విషయం తెలిసిందే. ఐశ్వర్య, అదితి, శోభిత... ఈ ముగ్గురూ కాకుండా ఇంకా ఏయే భారతీయ తారలు కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొననున్నారనే విషయం తెలియాల్సి ఉంది.

వాస్తవ ఘటనల నింద



• వరుణ్ సందేశ్

'హ్యాపీ డేస్, కొత్త బంగారు లోకం' చిత్రాల ఫేమ్ వరుణ్ సందేశ్ హీరోగా రూపొందిన చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' అన్నది ఉపశీర్షిక. ఆనీ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్యకుమార్, ఛత్రపతి శేఖర్ ఇతర పాత్రల్లో నటించారు. ది ఫర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్ రాజేష్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రం నుంచి వరుణ్ సందేశ్ పాత్ర ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాత రాజేష్ జగన్నాథం మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'నింద'. ఇప్పుడు ప్రేక్షకులు రెగ్యులర్ సినిమాల కంటే కంటెంట్, కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలనే ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఈ కోవలోనే మా 'నింద' రూపొందింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 15న మా సినిమా టీజర్‌ను విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతు ఓంకార్, కెమెరా: రమీజ్ నవీత్.

వార్ డేట్ ఫిక్స్



• సన్నీ డియోల్ • ఆయుష్మాన్ ఖురానా

సన్నీ డియోల్, సునీల్ శెట్టి, జాకీ ష్రాఫ్, అక్షయ్ ఖన్నా తదితరులు లీడ్ రోల్స్‌లో నటించిన సూపర్ హిట్ హిందీ ఫిల్మ్ 'బోర్డర్'ని అంత సులువుగా మరచిపోలేం. 1997లో విడుదలైన ఈ సినిమా 1971లో జరిగిన ఇండియా–పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో ఉంటుంది. పాతికేళ్ల తర్వాత 'బోర్డర్' సినిమాకు సీక్వెల్‌గా 'బోర్డర్ 2' తెరకెక్కనుంది. తొలి భాగంలో నటించిన సన్నీ డియోల్ సీక్వెల్‌లోనూ హీరోగా నటిస్తారు. యంగ్ హీరో ఆయుష్మాన్ ఖురానా మరో లీడ్ రోల్ చేస్తారు. కాగా 'బోర్డర్' సినిమాకు దర్శకత్వం వహించిన జ్యోతి ప్రకాశ్ దత్తా 'బోర్డర్ 2'కు ఓ నిర్మాతగా ఉండగా, అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమాను 2026 జనవరి 23న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్ సమాచారం. భారతదేశ సైనికుల త్యాగాలు, గొప్పతనం గురించి తెలిపేలా ఉండే ఈ సినిమాను రిపబ్లిక్ డే (గణతంత్ర దినోత్సవం) సందర్భంగా విడుదల చేస్తే బాగుంటుందని, జనవరి 23 పర్‌ఫెక్ట్ డేట్ అని యూనిట్ భావించిందట. ఇక ఈ సీక్వెల్‌లో వచ్చే వార్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఆడియన్స్‌కు విజువల్ ఫీస్ట్‌గా ఉండేలా ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. త్వరలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుంది.

ఇక ఆ ఇద్దరికీ రెడ్ కార్నర్ నోటీసులు

- ప్రభాకర్‌రావు, శ్రావణ్ కుమార్‌పై జారీకి నిర్ణయం
- ట్యాపింగ్ కేసులో కీలకంగా ఉన్న ఈ ఇద్దరు నిందితులు
- అరెస్టు వారెంట్లు కోరుతూ నాంపల్లి కోర్టులో పిటిషన్
- క్షుణ్ణంగా విచారించి ఇరువురిపై జారీ చేసిన న్యాయస్థానం
- వీటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్న పోలీసులు


ప్రభాకర్‌రావు


శ్రావణ్ కుమార్

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుతో పాటు ఓ మీడియా సంస్థ అధినేత శ్రావణ్‌కుమార్‌పై ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించడానికి మార్గం సుగమమైంది. ఈ ప్రక్రియతో తొలి మెట్టుగా భావించే నాన్–బెయిలబుల్ అరెస్టు వారెంట్లను ఆ ఇరువురిపై పంజగుట్ట పోలీసులు పొందారు. ఈ మేరకు నాంపల్లి న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యం పేరుతో అమెరికాలో తలదాచుకున్న ఈ ద్వయాన్ని తిరిగి రప్పించడం కోసం పోలీసులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ డి.ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు మేకల తిరుపతన్న, ఎన్.భుజంగరావు, టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు నిందితులుగా ఉండగా... ఈ నెల మొదటి వారంలో ప్రధాన నిందితుడిగా (ఏ–1) ప్రభాకర్‌రావు, ఆరో నిందితుడిగా (ఏ–6) ఓ మీడియా సంస్థ అధినేత శ్రావణ్ కుమార్ రావును చేర్చారు.

ట్యాపింగ్ వెలుగులోకి రావడంతో అమెరికా వెళ్లిన ఆ ఇద్దరు

అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి రావడంతోనే ప్రభాకర్‌రావు, శ్రావణ్ కుమార్‌కు అమెరికా వెళ్లిపోయారు. వీళ్లు ఇప్పట్లో వెనక్కు వచ్చే అవకాశం లేదని భావించిన దర్యాప్తు అధికారులు ఇంటర్‌పోల్ సాయంతో రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించాలని భావించారు. నోడల్ ఏజెన్సీగా ఉన్న సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్‌కు ఈ అభ్యర్థన పంపాలంటే సదరు వ్యక్తి ఇక్కడ నమోదైన కేసులో నిందితుడిగా ఉండటంతో పాటు పోలీసులకు వాంటెడ్‌గా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న పంజగుట్ట అధికారులు ప్రభాకర్‌రావుతో పాటు శ్రావణ్ కుమార్ రావును కేసులో నిందితులుగా చేరుస్తూ కోర్టులో మెమో దాఖలు చేశారు. వీరిద్దరూ విదేశాల్లో ఉండటంతో అరెస్టుకు అనుమతిస్తూ, వారెంట్ జారీ చేయాల్సిందిగా సీఆర్పీసీలోని సెక్షన్ 73 ప్రకారం కోర్టును అభ్యర్థించారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఇద్దరు నిందితులూ కోర్టులో అఫిడవిట్లు సమర్పించడంతో పాటు తమ న్యాయవాది ద్వారా వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ప్రాసిక్యూషన్ వాదనతో ఏకీభవిస్తూ ప్రభాకర్‌రావు, శ్రావణ్‌కుమార్‌పై అరెస్టు వారెంట్లు జారీ చేసింది. దీంతో వీళ్లు ఇక్కడి ఏజెన్సీలకు మోస్ట్ వాంటెడ్‌గా మారినట్లే అయింది.

అక్కడి నుంచి బలవంతంగా తిప్పి పంపేలా..

ఇక సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్‌కు లేఖ రాయడం ద్వారా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించే అవకాశం ఏర్పడింది. ఇప్పటికే వీరిద్దరిపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ అయ్యాయి. వీటి ప్రకారం వాళ్లు భారత్‌లో అడుగుపెట్టినప్పుడు మాత్రమే ఇమ్మిగ్రేషన్ అధికారుల సాయంతో పట్టుకునే అవకాశం ఉంటుంది. రెడ్ కార్నర్ నోటీసు ద్వారా ఇద్దరినీ అక్కడి నుంచి బలవంతంగా తిప్పి పంపేలా (డిపోర్టేషన్) ఆయా దేశాలను కోరవచ్చని అధికారులు చెప్తున్నారు.

జ్యుడీషియల్ సర్వీస్ రూల్స్ సమర్థనీయమే

తేల్చిచెప్పిన హైకోర్టు.. పలు పిటిషన్ల కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీస్ రూల్స్ 2023ను హైకోర్టు సమర్థించింది. 2024 ఏప్రిల్ 10న తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ జారీ చేసిన నోటిఫికేషన్ చట్టబద్ధమేనని తేల్చి చెప్పింది. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలు చేసిన ఆరు పిటిషన్లను కొట్టివేసింది. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసెస్ రూల్స్ 2023ను సవాల్ చేస్తూ టి.దీప్సికతో పాటు మరో ఐదుగురు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు వయోపరిమితిని నిర్దేశించిన రూల్ 2(కె), రూల్ 5.2(ఎ) చట్టబద్ధతతో పాటు తెలంగాణలో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులకే పోస్టులను పరిమితం చేయడం, స్థానిక బార్ కౌన్సిల్‌లో సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ) అందజేసి ఉండాలన్న నిబంధనలు సరికాదని పేర్కొన్నారు. తాము పరీక్ష రాసేందుకు అవకాశం ఇచ్చేలా రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టు తరఫున సీనియర్ న్యాయవాది హరేందర్ పరిషద్ వాదనలు వినిపిస్తూ.. న్యాయమూర్తుల ఎంపిక కోసం యోగ్యత, అనుకూలతను నిర్ధారించే లక్ష్యంతో నిబంధనలు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఇటీవల ఇదే హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం బడుగుల బ్రహ్మయ్య కేసులో రూల్ 2(కే)ను సమర్థించిందన్నారు. న్యాయవాదిగా లీగల్ ప్రాక్టీస్‌లో ఉన్నారని ధృవీకరించేందుకు ప్రాక్టీస్ సర్టిఫికెట్ ఆవశ్యకత ఉందని వెల్లడించారు. వాదనలు విన్న ధర్మాసనం.. రూల్స్‌ను సమర్థిస్తూ, పిటిషన్లను కొట్టివేసింది.

బిడ్డ లేదని.. రాదని తెలియక..

- విద్యుదాఘాతంతో లేగదూడ మృతి
- తట్టి లేపేందుకు తల్లి ఆవు ప్రయత్నం



పాల్వంచ రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బిక్కుతండా సమీపాన గాలివానకు తెగిపడిన విద్యుత్ తీగలను తాకడంతో శుక్రవారం ఓ ఆవు, లేగదూడ, ఎద్దు మృతి చెందాయి. గ్రామ రైతులు భూక్యా సాములు, భూక్యా వీరన్నకు చెందిన ఈ జీవాలు మేతకు వెళ్లిన సమయాన విద్యుత్ సరఫరా అవుతున్న తీగలను తాకినప్పుడు ఈ ప్రమాదం సంభవించింది. అయితే, సాములుకు చెందిన లేగదూడ, ఆవు మృతి చెందగా.. లేగదూడ తల్లి మాత్రం ఇంటి వద్దే ఉంది. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే రైతు కుటుంబసభ్యులు బయల్దేరారు. కాగా రోజూ పాలిచ్చే సమయమైనా లేగదూడ రాకపోవడంతో.. తల్లి ఆవు కూడా రైతు కుటుంబసభ్యుల వెంట పరుగులు తీసింది. విగతజీవిగా పడి ఉన్న బిడ్డ వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా.. ప్రమాదం జరుగుతుందేమోనని రైతులు అడ్డగించారు. అయినా ఆవు లేగదూడ వద్దకు వెళ్లి తడుముతూ లేపే ప్రయత్నం చేసింది. బిడ్డ చనిపోయిందని తెలియక ఆ మూగ జీవి చేస్తున్న ప్రయత్నం స్థానికులను కలచివేసింది.

కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- కౌంటర్ దాఖలుకు ఈడీకి నోటీసులు
- సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం విచారించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఈడీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. ఇదే కేసులో ఈ నెల 6న రౌజ్ అవెన్యూ కోర్టు కవితకు బెయిల్ నిరాకరించింది. దీంతో కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం విచారణ చేపట్టగా.. కవిత తరఫున న్యాయవాదులు విక్రమ్ చౌదరి, నితేష్ రాణా, మోహిత్‌రావులు, ఈడీ తరఫున న్యాయవాది జోహెబ్ హుస్సేన్ హాజరయ్యారు. సుప్రీంకోర్టు, ట్రయల్ కోర్టులో చోటు చేసుకున్న పరిణామాలను విక్రమ్ చౌదరి కోర్టుకు వివరించారు. పూర్తిస్థాయి వాదనలు వినిపించేందుకు వీలుగా తమకు సమయం ఇవ్వాలని, పిటిషన్‌ను వచ్చే వారం విచారించాలని కోర్టును కోరారు. దీనిపై ఈడీ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా రౌజ్ ఎవెన్యూ కోర్టులో ఇప్పటికే ఈడీ తన వైఖరిని తెలిపిందని చౌదరి ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కవితను ఈడీ మార్చి 15న అరెస్టు చేసిందని, ప్రస్తుతం ఆమె జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని, లిక్కర్ స్కామ్‌తో ఆమెకు ఎలాంటి సంబంధమూ లేదని న్యాయవాది నితీష్ రాణా తెలిపారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం జోక్యం చేసుకుని కౌంటర్ దాఖలుకు ఈడీకి నోటీసులు జారీ చేస్తామని తెలిపింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఇలావుండగా ఇదే కేసులో కవితను నిందితురాలిగా పేర్కొంటూ శుక్రవారం ఈడీ రౌజ్ అవెన్యూ కోర్టులో 224 పేజీల సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది.

దర్యాప్తు సంస్థల పేరిట ఫేక్ స్కైప్ ఖాతాలు

సాక్షి, హైదరాబాద్: దర్యాప్తు సంస్థల లోగోలు, ఫొటోలతో స్కైప్ యాప్‌లో సైబర్ నేరగాళ్లు నకిలీ ఖాతాలను తెరిచి మోసాలకు పాల్పడుతున్నట్టు కేంద్ర హోంశాఖ హెచ్చరించింది. ఈ తరహాలో స్కైప్ ఖాతాల నుంచి సందేశాలు పంపుతూ 'మీరు ఫలానా కేసులో ఉన్నారు.. కేసు నమోదు చేయకుండా ఉండాలంటే మేము చెప్పే బ్యాంకు ఖాతాలకు డబ్బులు పంపండి.. అంటూ బెదిరిస్తున్నట్టు పేర్కొంది. ఇటీవల ముంబై పోలీస్ పేరిట ఈ తరహా ఫేక్ స్కైప్ ఖాతాలు వెలుగులోకి వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల పేరిట ఇలాంటి సందేశాలు, కాల్స్ వస్తే నమ్మి మోసపోవద్దని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి సందేశాలు, లింక్‌లు వస్తే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో లేదా https://cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ట్రాక్టర్ ఎక్కించి చంపుతా

- పోలీసులపై చిందులు తొక్కిన డ్రైవర్
- అక్రమ ఇసుక తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- కరీంనగర్ జిల్లాలో ఘటన

వీణవంక(హుజూరాబాద్): 'ట్రాక్టర్‌ను ఆపే అధికారం మీకు ఎవరిచ్చారు. ట్రాక్టర్ ఎక్కించి చంపుతా'అంటూ ఓ డ్రైవర్ పోలీసులను బెదిరించిన ఘటన శుక్రవారం కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పోతిరెడ్డిపల్లికి చెందిన సంపత్ మానేర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అయితే తన ట్రాక్టర్‌నే పట్టుకుంటారా? ట్రాక్టర్ ఎక్కించి చంపుతా అంటూ పోలీసులను సంపత్ భయభ్రాంతులకు గురి చేశాడు. అక్కడే ఇసుకలోడ్ కుమ్మరించి ట్రాక్టర్‌తో పారిపోయాడు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

మూడు గంటలూ నీటిలోనే...

- ఆత్మహత్య చేసుకోవడానికి చెరువులో దూకిన మహిళ
- కుటుంబసభ్యుల రోదనలతో కదలిక
- సంగారెడ్డి జిల్లాలో ఘటన





వట్‌పల్లి(అందోల్): ఆత్మహత్య చేసుకోవడానికి ఓ మహిళ చెరువులో దూకింది. మూడు గంటలైనా ఆమె నీటిలో తేలియాడుతూనే ఉంది. అందరూ చనిపోయిందనుకున్నారు. కుటుంబ సభ్యులంతా అక్కడకు చేరుకొని రోదిస్తున్నారు. దీంతో చెరువు నీటిలో ఉన్న ఆమెలో ఒక్కసారిగా కదలిక వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోలు మండలం అన్నాసాగర్ చెరువు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామానికి రాణికి పెద్దశంకరంపేట మండలం జూలకంటి గ్రామానికి చెందిన బీరప్పతో 10 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. పిల్లలను తల్లిగారి ఇంటి వద్ద ఉంచి బతుకుదెరువుకు రాణి భర్తతో కలిసి రంగారెడ్డి జిల్లా చింతల్‌కు వెళ్లింది. ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ గురువారం సాయంత్రం భర్తతో గొడవ జరగడంతో పిల్లలను చూసి వస్తానని తల్లిగారి ఇంటికి బస్సులో బయలుదేరింది. బస్సులో ఉన్నప్పుడే అందోల్ మండలం ఎర్రారం గ్రామానికి చెందిన తన అక్క భర్త రవికి ఫోన్ చేసి 'నా భర్త వేధింపులు తట్టుకోలేకపోతున్నా. నా పిల్లలు జాగ్రత్త, అన్నాసాగర్ చెరువులో దూకి చనిపోతానంటూ' చెప్పి ఫోన్‌ను సైలెంట్ మోడ్‌లో పెట్టేసింది. బస్సు అన్నాసాగర్ వద్దకు రాగానే దిగి చెరువు వద్దకు వెళ్లింది. చెప్పులు, ఆధార్‌కార్డు, నగదు చెరువులో కట్టపై పెట్టి సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో చెరువులో దూకేసింది. రవి సుమారు గంట తర్వాత చెరువు వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ అరుణ్‌కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. అంతలోనే రాణి తల్లిదండ్రులు చెరువు వద్దకు వచ్చి ఏడవడంతో చెరువులో తేలియాడుతున్న ఆమెలో కదలికలు వచ్చాయి. గమనించిన పోలీసులు, కుటుంబ సభ్యులు జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నీళ్లలోనే మూడు గంటలపాటు ఉన్నా, బతికే ఉండటంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ విషయమై రాణి మాట్లాడుతూ.. 'చెరువులో దూకగానే రౌతు(రాయి) తాకి మూర్ఛ వచ్చినట్టు అయ్యింది. తర్వాత ఏం జరిగిందో ఏమో.. చెరువు ఒడ్డుకు ఎలా చేరానో తెలియదు. అందరి ఏడుపుతో కదలిక వచ్చిందని' చెప్పింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.